# శారదలేఖలు

(మొదటి సంపుటము)

కనుపర్తి వరలక్ష్మమ్మ.

శ్రీ ర స్తు.

శ్లో॥ వాగర్థావివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే ।
జగతః పితరౌవన్దే పార్వతీ పరమేశ్వరౌ ॥

# ఒక చిన్న మనవి

దేశాభ్యుదయావాప్తికి స్త్రీజనాభ్యుదయసాధనము, ప్రథమకర్తవ్యమను పూర్ణవిశ్వాసముతో శ్రీయుత డా॥ కే. యన్. కేసరిగారు, సం 1928 రపు మార్చిమాసము నుండియు, నాంధ్రభాషలో "గృహలక్ష్మి" యను సచిత్ర మాసపత్రిక నొకదానినిఁ బ్రచురించుచుండుట, లోకవిదితము, కదా! ప్రతిఫలాపేక్షా రహితమగు వీరి పరిశ్రమవలన నాంధ్ర దేశమున యువతీజనసమాజములయం దపూర్వమైన యుత్సాహము కలుగఁజొచ్చినది. పెక్కండ్రు, స్వయముగ వ్యాసరచయితలు, ఈ సంచిక తమకొరకే యుద్దేశింపఁబడియుండుట కెంతయు సంతోషపడి, దీనినిఁ బ్రాణపదిలముగాఁ గాపాడుకొనఁ జొచ్చిరి. ఇట్టి సోదరీలోకమున నగ్రగణ్యయనఁబడఁదగిన వ్యక్తియే యీ,

## శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు.

ఈధన్యజీవిని, తెనుఁగుసీమలయందున్న తనజాతివారికి వివిధవిషయపరిజ్ఞానముఁ గలిగించు నుద్దేశముతో వ్రాసిన వివిధవిషయిక వ్యాసములే యీ,

### శారదలేఖలు.

వీటినిఁ జదువుటకుముందీ సోదరీరత్నముయొక్క పూర్వవృత్తము నించుక యెరుగుట యప్రస్తుతము కాదు.

ఈ కవయిత్రి, పాలపర్తివారింటి యాఁడుపడుచు. తల్లి పేరు హనుమాయమ్మగారు; తండ్రిపేరు శేషయ్యగారు; బ్రాహ్మణులు, నార్వేలవారును భారద్వాజస గోత్రులు. వీరి కాపురస్థలము గుంటూరు మండలమందలి బాపట్ల. ఈ శేషయ్యగారు, బాపట్ల సబ్ రిజిస్ట్రారు కచ్చేరిలో నొక యుద్యోగిగా నుండి మంచివ్యవహారదక్షులను ప్రతీతిని గడించిరి. వీరికి రామమూర్తిగారు, నరసింహంగారు, భావనారాయణగారు, ఆంజనేయులుగారు, కృష్ణమూర్తిగారు నను వారు పుత్రులేవురును, సుబ్బలక్ష్మమ్మ, ఈవరలక్ష్మమ్మ, అనసూయమ్మగార్లను వారు పుత్రికలు మూవురును సన్తానము.

'జగమెఱిఁగినబాపనయ్య'లగు నీ రామమూర్తిగారు మొదలగు సహోదరవర్గమును గురించి విశేషముగాఁ జెప్పనవ

సరము లేదు. మొదటివారు, 'దర్బారు' పత్రికాధిపతులు; రెండవవారు, 'ధర్మసాధనీ' నేతలు; మూడవవారొక డి॥ బోర్డు హైస్కూలులో నుపాధ్యాయులు; నాలవవారు ప్రకృతి చికిత్సాయోగ సాధకులు: పూర్వము బందరు జాతీయకళాశాలలో నధ్యాపకులుగా నుండినవారు; ఐదవవారు ప్రస్తుతము బాపట్ల పోస్టుమాస్టరుగా నున్నారు. ఇంక నీ వరలక్ష్మమ్మగారియక్క, అచ్యుతుని వారికోడలు, స్వర్గస్థురాలైనది. ఆమె కిద్దరాడు పిల్లలు. చెల్లెలు, భీమరాజువారి కోడలు; తెనాలిలో నిపుడు మేజస్ట్రేటుగా నున్న శ్రీయుత శ్రీనివాసరావుగారి ధర్మపత్ని.

ఈ మనసహోదరి శ్రీమతి వరలక్ష్మమ్మగారు. 6-10-1896 తేదీని జన్మించెను. ఈయమకు సం 1909 రమునం బెండిలియైనది. అత్తవారు కనుపర్తివారు. ఆర్వేలవారు, కాశ్యపసగోత్రులు; బాపట్ల తాల్లూకా పందిళ్లపల్లి గ్రామస్థులును కరణీకోద్యోగులు. ఈమె యత్తగారిపేరు ఆదెమ్మగారు; మామగారిపేరు, రఘుపతిరావుగారు. ఈ రఘుపతిరాయదంపతులు, తమ బిడ్డల విద్యాభివృద్ధికొరకుం బూర్వాగతమైన యాగ్రామకరణీకమును మానుకొని బాపట్లకు వచ్చిరి. వీరికి నలుగురు పుత్రులును, నొకకొమార్తెయు గలిగిరి. వీరిలో హనుమంతరావుగారు మూడవ కొమారులు. ఈయనయే మన వరలక్ష్మమ్మగారి భర్త. వీ రారోగ్యశాఖ

(Sanitary dept.)లోఁ జాలాకాలము పనిచేసి యందున్నత పదవుల నొందగలయర్హత సంపాదింపఁగోరి యింగ్లండునకు వెళ్లివచ్చిరి (1929)

బాల్యమం దనఁగాఁ బెండిలిగాకమున్న ఈమె, బాపట్లలోనున్న మిషన్ బాలికాపాఠశాలయందు నాలవతరగతి వరకును జదివెను. ఆవెనుక సంఘాచారముచొప్పున బడి మానివేసినను, విద్యాసక్తిమాత్రము విడువకుంట, మన యదృష్టమే యనవచ్చును. ఇంటియందే తన రెండవయన్నగారగు శ్రీయుత నరసింహంగారి నిరంతరసహాయ ప్రోత్సాహముల వలన, నర్సాపురం పరీక్షలు, విజ్ఞానచంద్రికాపరిషత్పరీక్షలు, భక్తిప్రచారిణీ పరీక్షలు మున్నగు వాటియందు త్తీర్ణయై నర్సాపుర స్వర్ణపధకము, కేసరి స్వర్ణపదకము మొదలగు బహుమానములఁ బడసెను. సహజముగా స్త్రీవిద్యాభిమానులగు సహోదరులందరును జేయుచుండిన సహాయముచే నీయమ యొక వేయిపుస్తకములైననుఁ జదివెను; 'వసుమతి' యను నొక సాంఘికనవలను రచించి స్వర్గస్థురాలగు తనయక్క సుబ్బలక్ష్మమ్మగారి కంకితమిడి యంతటి చిన్నవయసుననే పేరువడెను. అప్పుడప్పుడే వెలువడసాగిన 'అనసూయ' ఈమెవ్రాతలఁ గండ్లనద్దుకొన్నది, అటుతరువాత 'నాంధ్ర పత్రిక,' 'భారతి,' 'ఆంధ్రలక్ష్మి,' 'గృహలక్ష్మి' మొదలగునవి యీామె వ్రాతల కగ్రస్థానముల నీయసాగినవి. "ప్రపే

దిశే ప్రాక్తనజన్మవిద్యా" యనుట సమంజసముకదా యిట్టి యెడల !

"గీ॥ బ్రాహ్మధర్మ ప్రవిష్టుఁడు బ్రహ్మవిదుఁడు
సత్యమార్గానువర్తి సుసౌమ్యమూర్తి
యాంధ్రసాహితి ననుజాతనైన నాకు
సాదరంబున నేర్పిన సజ్జనుండు
పరమపావనమైనట్టి పాలపర్తి
యన్వయసుధాబ్ధి సోముఁడై యవతరించి
ధరను నరసింహమను పేరఁ బరఁగినాఁడు
సోదరుండును గురుఁడునై సొరిదినొప్పు
మాన్యచరితుఁ డాతనికి నమస్కరింతు
వసుమతీసతి చరితముఁ బ్రాయువేళ ॥"

అని తనకింతయశము గల్గుటకు హేతుభూతుఁడగు నగ్రజన్మునియెడఁ గృతజ్ఞత దెలిపి యామహాశయుం డొసఁగిన శబ్దార్థచంద్రికయను నిఘంటువునే సారెకట్నముగా గ్రహించి యావల గృహిణీపదముఁ జొచ్చినది యీామె.

ఇంక నత్తవారింటఁబడి యీచదువంతయు 'గుంటఁ బెట్టి గంటకొట్టక' యుండునట్లే యువతీమతల్లికి భర్తగారి దన్నుదొరికినది. ఆవిషయమున మనసార నీమె యనిన మాటలే వ్రాయుటలెస్స.

"నా విద్యావిషయమున నేను స్వయంకృషిచే నలవర్చుకొన్నదాని కంటె, మాసోదరులు ప్రోత్సహించి నేర్పినదానికంటె, నాభర్తగారి సమ్మతియు సానుభూతియు ముఖ్యముగా ప్రస్తుతింపతగినవి. ఈవిషయమున వారిఋణము నేనేవిధముగను తీర్చుకొనంజాలను. చదువుటయందును వ్రాయుటయందును నాకెంత కుతూహలముండినన్నేమి! వారొక్కమాటతో నిరోధించినచో నాగిపోవలసినదే కదా! వారెప్పుడు నట్టిప్రాతికూల్యత నావిద్యావిషయమున చూపకపోవుటచేతనే నేను, గతపదునారు సంవత్సరములనుండి, వ్యాసములను, లేఖలను, కథలను విరచించి, వివిధపత్రికల కంపుటకును, సం 1931 రములో స్త్రీసమాజము నెలకొల్పి దాని యభివృద్ధికై నిరంతరకృషి చేయుటకును, నా పొత్తములను ముద్రించి యాంధ్రమహాజనుల కరకమలముల నర్పించుటకును అవకాశము గల్గినది. కావున పూజ్యులగు నాభర్తగారి సానుభూతి, యన్నిటికంటె మిన్నయైనదని నేను కృతజ్ఞతతో విన్నపము చేయుచున్నాను." అని.

ఔనుకదా మరి! "అస్త్రీనేదు–గస్త్రీనేదు పల్లకతొంగోయే'' యన్నయట్టి భర్తలే యధికముగా నుండిన యప్పటి పరిస్థితులయం దిట్టి నవోఢలకు భర్తృముఖమునఁ గల్గు నిట్టి విద్యాప్రోత్సాహము సామాన్యమా!!

ఈయమఁ గూర్చియుఁ దత్కృతములగు నీలేఖల గూర్చియు సం॥ 1930 రపు ఏప్రిల్ మాసమందును. సం॥ 1933 రపు సెప్టెంబరు మాసమందును వెలువడిన 'గృహలక్ష్మి' దిలకింత్రుగాక!

మరి యీామెవ్రాసిన 'విశ్వామిత్ర' మొదలగు నితర గ్రంథములఁ జదువుదుమేని "ఈమెశైలి రెండుమూడు రీతుల

నుండు"నని తెలియఁగలము. వాటిలో నీలేఖలయందున్నది "సొగసైన వాడుకభాష" ఔను—"సొగసైన వాడుకభాష"యే. ఇది సజీవము. సమలంకృతము. కాలము ననుసరించి నూతనముగ నొక తెనుఁగువ్యాకరణము రచియింపఁ గలఁచు వారికిది ప్రప్రథమాధారము. ఈమె పద్దెములనుగూడ వ్రాయఁగలదు కాని గద్యరచనయందే మక్కువ యెక్కువ. 'చచ్చిచెడి' యల్లిన "చేపలబుట్ట"కంటె శ్రమలేక యల్లిన చక్కని చిక్కనిచాప. బహుతరోపయోగకరమనుట సరసు లెరుగరా !!

ఇంక నిందలివిషయములు "హిస్టరీ జాగ్రఫీలూ యిండ్లలో గుట్లూ" గావు! ఈనాటి విద్యార్థికుల తీవ్రతర తర్కోపతర్కముల కాస్పదములై యొప్పుచున్న రాజకీయ సాంఘిక నైతిక మతాది మహత్తరవిషయములు. అవియు స్త్రీల కెంతవరకు సంబంధించియుండునో యంతవరకు నిష్పాక్షికముగ, నిర్వక్రముగఁ బరిశీలింపఁ బడి ప్రాగ్పశ్చిమములకుఁ గర్మసిద్ధాంత సమన్వయముఁ జేయుచున్నవి. ఐనదానికినిఁ గాని దానికిని బురుషనిందసేయుట యను నకార్యమిందు మందున కైనఁ గానరాదు.

ఆర్యావర్తమందు ఆనాడువలె నీనాడు నుండవలసిన గృహలక్ష్మిస్వరూప మిందు సమగ్రముగాఁ జిత్రితమైయున్నది. వివిధవర్ణనలతో సరసాలంకార శోభితమై వ్యంగ్యప్రధానమై

యొప్పుచున్న యీ లేఖాసమామ్నాయ మొక యుత్తమకావ్య మనుటకు సందేహములేదు.

నిజమైన హిందూమతము, నిజమైన హిందూగృహిణి, కల్పిత శారదాస్వరూపనామకమై 'గృహలక్ష్మి' ముఖమునఁ బల్కు నిట్టిముద్దుమాటల నాలించి యానందింపఁ జాలని వారుండఁజాలరనుట నిక్కువము. ప్రతితల్లియుఁ బ్రతిపిల్లయు నీపొత్తముఁ జదివి తీరవలయును.

ఇట్టి కవయిత్రికి సర్వేశ్వరుఁడు సమస్తవిభవములనిచ్చి సంరక్షించుఁగాత !!!

గృహలక్ష్మికార్యాలయం,
ఎగ్మూరు, మద్రాసు.
1—2—34

ఇట్లు, హరిదాసు
పసుమర్తి కృష్ణమూర్తి.

## "శారద లేఖల"ను గుఱించి నా యభిప్రాయము

(రాయసం వెంకటశివుఁడు, గుంటూరు.)

ఆంగ్లసారస్వతమున స్త్రీహృదయ మంతగ ప్రస్ఫుటమగుచుండ లేదని యొకశతాబ్దము క్రిందట ఇంగ్లీషురచయిత జాను స్టువర్టుమిల్లు మొఱపెట్టెను. ప్రస్తు తాంధ్రవాఙ్మయమున నట్లె స్త్రీ రచనావిషయిక మగు కఱవు మిక్కుటముగనున్నది. మనదేశమున నిదివఱకు పురుషుఁడే, స్త్రీ స్వభావమునుగుఱించి పుస్తకరచన చేసెను; స్త్రీల హక్కులను గూర్చి సభలలోఁ బ్రసంగించెను; వార్తాపత్రికలలో వ్యాసరాజములు వ్రాసెను. ఇపుడు స్త్రీలు ముందడుగువేసి, తమ సంగతులు తామె ప్రస్తావించుకొనుచున్నారు. శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు శారద లేఖలు తెనుఁగుసారస్వతమందలి యీకొఱఁతను గొంత తీర్చుచున్నవి. ఆంగ్లవిద్య నేర్చి పట్టపరీక్షలందు జయమందకున్నను, వరలక్ష్మమ్మగారు, పాశ్చాత్యవిద్యావిధానముల చొప్పుననె చదువుకొని, ఇంగ్లీషు నభ్యసించిన యువతులకు సామాన్యముగ సాధ్యముగాని పాండిత్యప్రకర్షయు వివేచనా శక్తియును సంపాదించి, తేటతెలుఁగున రమ్యగ్రంథరచన యలవఱచు కొనిన సాధ్వీమణి.

శారదాకల్పలతల మధ్య నడచిన లేఖలను పేరుతో, శ్రీమతి వరలక్ష్మమ్మగారు ప్రస్తుతకాలమందలి ముఖ్యవిషయములు చర్చించి లిఖించిన వ్యాసావళియె యిది. ఇవి స్వల్పసంగతులనియు, ఇవి మహద్విషయ ములనియు, శారద విచక్షణ చేయదు. సంక్రాంతి ముగ్గులవలెనే సరోజినీ

దేవి యుపన్యాసమును, కన్నప్పకథయు, గౌరవబిరుదములవలెనే శారదా
శాసన చర్చయు స్త్రీల నాటకరంగప్రవేశమును, శారదకు లేఖావిషయ
లగుచున్నవి! పుస్తకరచనమున ప్రాంతదారి త్రొక్కి పురుషుల యభి
ప్రాయములె చిలుకపలుకులవలె శారద, యేకరువుపెట్టునదికాదు. స్త్రీజన
సహజమగు సదయహృదయత, స్వభావసారళ్యమును, పుస్తకమందలి ప్రతి
పుటయందును ప్రతిబింబితమగుచున్నవి. ఆంధ్రవాఙ్మయమున నీపుస్తకమునకు
గౌరవస్థాన మొనఁగూర్చుట కిది యొకటియె చాలును. పరదేశ
మందున్నను, రెయిలుపయనము చేయుచున్నను, పుణ్యతీర్థసందర్శనమం
దున్నను స్త్రీసభలోఁ బాల్గొనుచున్నను, శారద యూహలు, పలుకులు
హిందూయువిదవియె! భావముననైగాక భాషయందును ఈ లేఖావళియం
దెల్లెడలను స్త్రీస్వభావము చిప్పిలుచున్నది! 'ఊరుగాయజాడీలకు పచ్చడి
బానలకు మాత్రమె రెయిలులో నొకపెట్టెయు, ఇంటియం దొకగదియు
మనకుఁ గావలయును! ఈమధ్య మన ప్రాంతములనుండి యొకరీ
గ్రామమున కుద్యోగసందర్భమున నేతెంచిరి. వారి సామాను నాలుగైదు
బండ్లు నిండియుండెను. ఐదారు మంచములుగూడ తెచ్చిరి. ఈ
ప్రాంతమున మంచములు వాడుకొను అభ్యాసములేదు!' అని శారద, తన
తెలుఁగు చెలికత్తెలను మెత్తని యెత్తిపొడుపుమాట లనుచున్నది! కాళ
హస్తిలో దొరకు కొయ్యదువ్వెనలు నల్లగాజులును శారదకు మిగుల
ప్రియము. ఈ దువ్వెనలను నిరాకరించి, విదేశపు మెఱుఁగు దువ్వెనల
కెగఁబడు తెలుగుమగువలమీఁద, స్వదేశవస్తుప్రియయగు శారద, కోపానల
మిట్లు కురియుచున్నది: 'మెఱుఁగే మన కనులలో కంపకొట్టుచున్నది.
దువ్వెనలకు మెఱుఁగు, గాజులకు మెఱుఁగు, గుడ్డలకు మెఱుఁగు, మొగ
ములకు మెఱుఁగు! ఈ విదేశపుమెఱుఁగులు మన మెఱుఁగును రూపుమాపు
చున్నవి!' 'సిగనిండ పువ్వులు దుఱుముకొని, యొడలినిండ నగలుపెట్టు
కొని, వన్నెవన్నెల విలువచీరలు ధరించి, ప్రతి చిన్నహరికథకును తండోప
తండములుగ వచ్చెడి బెజవాడపుర వనితలు' ఇటీవల నచట జరిగిన ఆంధ్ర

మహిళాసభపై 'శీత కన్ను వేయుటకు' శారద మిగుల కనలెను. అచట జరిగిన యింకొక సభలో స్త్రీలు నలువైపులదిరిగి గలగల మాటలాడుట చూచిన శారదను, 'ఆనాఁడు మన స్త్రీల అశిక్షితవ్యవహారము బాగుగ విశదమయ్యెను.' శారదాచట్టము చర్చకువచ్చినప్పుడు, 'ఇచ్చవచ్చినట్లు స్త్రీలు సభలో కేకలు పెట్టిరి. అంతతోఁబోక, వీధిపొడుగునను, నోటికి తాళముదీసి, బారలుసాచిరి !'

పూర్వాచారమను పేరుతో ప్రజానుమోదమునడసిన ప్రాఁత చెడుగులవలెనే, నవనాగరకపుమునుఁగుతో నిర్భయముగ నడయాడు నూతన దురభ్యాసములును, శారదకుఁగంటకసదృశములె! శారదాశాసన చర్చ సందర్భమున గ్రంథకర్త్రికిఁగల చక్కని స్వతంత్రబుద్ధి సునిశిత మేధాశక్తియు వ్యక్తమగుచున్నవి. దక్షిణాదినుండి తనతో రెయిలు ప్రయాణముచేసిన తరుణులనోటనే శారద యీచర్చ సాగించెను. బాల్య వివాహానర్థముల వాతఁబడిన ముగ్గురు ముదితలు చెప్పిన తమ దైన్యవృత్తాంత ములవలననె యచటి స్త్రీ జనమునకు శారదాచట్టము సమ్మతమయ్యెను. స్త్రీలు నాటకరంగ మెక్కవచ్చునను లక్ష్మీదేవమ్మగారి వాదనను, శారద తన దీర్ఘలేఖావాక్యములచే తుత్తునియలు చేసెను. 'తలిదండ్రు లెవరి కొసఁగిన వారినే పరదైవముగానెంచి ప్రేమించి గౌరవించెడి హిందూ స్త్రీలు, చిత్తమొకనికి శరీరమొకనికి నొసంగుచున్నారని నీవు వ్రాసిన వ్రాత మిక్కిలి యనుచితము * * నీమతమ్మే నిజమగుచో, మన తల్లులు, పుత్రికలు, * * వేయేల భారతమహిళలెల్లరు, చెడ్డవారే యనవలసి వచ్చును. సోదరీ! మన వివాహసంస్కారమునందు లోపములున్న సంస్క రింపనగును గాని, నీనాటకరంగప్రవేశోద్యమ సమర్థనముకొఱకు, స్త్రీల నెల్లర కట్టగట్టి, యిట్టి హేయమగు నిందకు గురిసేయుట కడుంగడు సాహసము, అక్రమము!'

శారదతీవ్రతర్కమునకు లొంగని ప్రతిస్పర్థులవాదమును బూత్రిగ ఖండింపఁగల చమత్కృతి యామె పరిహాసమునకుఁగలదు! 'ఆపద్ధర్మముగా ఈ సంస్కారమునకు (అతిబాల్య వివాహములకు) శాస్త్రమొప్పినదట! పాపము, మనశాస్త్రములు చాలమంచివి. ఎవరి కేవీలుకావలెనో దాని కనుగుణ్యమగు నుదాహరణ శ్లోకమునుజూపి పూర్వాచారపరాయణులను రక్షించును. ఆకల్పవృక్షముప్రాపున వారుచేయని సాహసములేదు. పసి బాలలను పరిణయముచేసిరి. కనుగందులను గూర్చుండబెట్టి గర్భాధాన మంత్రములు వల్లెవేయించిరి! * * రాళ్లు దేవుళ్లయిన రాసులు మ్రింగవా యని వేమన యోగీంద్రుడు సందేహించినట్టుగనే, యీశిశువివాహములలో దేవుళ్లు రాళ్ళయినారు. లేకున్న, ఆయాస్వాముల్లసన్నిధానమున తలి దండ్రు లిట్టి యక్రమవివాహములు జరుపఁగలిగియుందురా?' 'మగడు చావగనే మగువవాంఛ లేవిధముగా నడుగంటిపోవునో, మగువచావగనే మగవానికోరిక లావిధముగా నీరికలెత్తుచుండును. భర్తృవిహీన పసిదే యగుగాక యామె వాంఛ లడవిపువ్వులవలె నిరుపయోగముగ రాలిపో వలెను. * * అపసిదానిమోమున భస్మరేఖలును, ఈముసలివాని మోమున చాదుచుక్కయునా!'

మనుజులవర్ణనమునందు—ముఖ్యముగ స్త్రీస్వభావమును చిత్రించుట యందు—శారదకరము ప్రకృతి కద్దముచూపించుచుండును. 'శారద పెండ్లిండ్ల' సందర్భమున కొన్నియేండ్లక్రిందట దేశమున పెండ్లిండ్లమీఁద పెండ్లిండ్లు జరిగెనుకదా. ఒక యూరేగింపులో 'పెండ్లికూతురు మూడేండ్లు నిండియు నిండని పసికూన, కట్టుకొనిన క్రొత్తపరికిణి రొత్తియెత్తి దులుపు కొనుచును, తొడుగుకొనిన పట్టుచొక్కాను పట్టి పట్టి చూచుకొనుచును, బొమ్మలపెండ్లిండ్లలోని బొమ్మవలె కూర్చున్నది. పెండ్లికొడుకో పదేండ్ల వాడు, నిద్రచే తూగుచున్నాడు.' ఇంకొక యూరేగింపులో, 'పిల్లకొక పెద్దచీర చుట్టపెట్టి, పొడలకమ్మవలె కూర్చుండబెట్టినారు. ఆబాలిక యా

చీరలోఁపడి, చిక్కములోఁ పిట్టవలె గొట్టుకొనుచున్నది.' * * *
'మళయాళస్త్రీలు సాధారణముగా నగలు ధరింపరు. రంగువస్త్రములు కట్టరు. నారి కట్టుబట్ట యాఱుమూరలె * * కేరళకాంతలు చక్కఁగ జారుముడివైచుకొందురు. * సహజ దంతధవళిమయు నధరరక్తిమయు కేరళవనితల వదనారవిందములకు చెలువుగూర్చుచుండును. * దక్షిణ హిందూస్త్రీలలోఁ కేరళస్త్రీలే చక్కనివారు.'

ప్రకృతి సౌందర్యవర్ణనమందు శారద యసమానప్రజ్ఞయని చెప్ప నొప్పును. 'అప్పుడు మధ్యాహ్నమై, సూర్యుఁడు తీక్ష్ణముగా నెండగాయు చున్నను, మాబాటల కిరుప్రక్కలనున్న యెడతెగని వృక్షపంక్తుల ఛాయలచే, మే మెండకన్నెఱుఁగని శుద్ధాంతజనముల భాతినైతిమి ! * * కల్పలతా ! ఆపడపటికనుమలభాగ్య మేమని చెప్పుదును ? సమస్త పాదపములు, అఖిలలతావితానములు సర్వగుల్మములు, వానిసొత్తు. * కుంకుమరాసులు పోసిన ట్లొకచోటను, పసుపుకుప్పలుపోసిన ట్లొక చోటను, నీలాంబరముగప్పిన ట్లొకచోటను, వెల్లమునుఁగువేసిన ట్లొక చోటను, వివిధ వర్ణపర్ణ విరాజితమై, యాకనుమలయందలి వృక్షవల్లరులు సొంపునింపుచుండెను !'

కాంచీ మధురా రామేశ్వరాది పుణ్యక్షేత్రదర్శనము చేసి వచ్చిన శారదకు మంచిభక్తి చేకూరెనని మనము సంతసింపవచ్చును. కాని యందందు కానవచ్చిన పీడలు నక్రమములు నామె మనస్సునఁ గొంత కలవరము నసహ్యతయును బుట్టించెను. గుళ్లలోని యర్చకుల చర్యలు పొడ గాంచిన శారద, 'సంపత్తిగలవారికే స్వామిదర్శనముగదా !' యని యాశ్చర్యపడెను.' 'ఈవిధమున దేవతలు నేడు దౌర్జన్యపరులగు మానవుల చేతిలోఁజిక్కి, భక్తజనసులభులు గాకున్నారు !' అని యామె, వెత నందెను. ఐనను, ఆమె యాస్తిక్యబుద్ధిని దృఢపఱుచు ననుభవములును లేక

పోలేదు—నేపాళమునుండి సేతువుచూడవచ్చిన యొక వృద్ధాంగనయందు ద్యోతకమయిన మతవిశ్వాసము పుణ్యాకాంక్షయు శారద కద్భుతజనకము లయ్యెను—'మతసూత్రమె యావద్భారతీయులను ఐక్యపఱుచుచున్నది—మతము మానవునకు ప్రాణముకంటె నుత్కృష్టము!' అని శారద నిశ్చయము చేసికొనెను.

శారద సంతానవతియై, విద్యాభాగ్యములం దింకను వన్నెగాంచి యుండెనేని, ఆమెయనుభవము మఱింతవిస్తరించి యీరచయిత్రి, భాగ్యవతుల బాధ్యతలను, కనిపెంచెడి యిల్లాండ్ర కష్టసుఖములనుగూడ బాగుగ విమర్శించి యుండెడిదని పాఠకలోక మాశింపవచ్చును. కాని, యీపరిస్థితులలో మొదలు శారద గ్రంథరచనమునకె మోసము గలిగెడిదేమో! కావున చదువరులకును సంతృప్తియె శ్రేయోదాయకము. శారదముద్దు పలుకులు, శారద నిష్కపటహృదయము, శారద యవ్యాజసౌజన్యమును, పాఠకావళి హృదయములు రంజింపఁజేసి, వారినీ లేఖల ద్వితీయభాగమున కెదురుచూచునట్లు చేయఁజాలియున్నవి!

# విషయసూచిక

ప్రథమ లేఖ 1—5.

లేఖావసర ప్రస్తావన, సం॥ 1928 రపు రాష్ట్రీయ సంఘసంస్కరణ మహాసభా విషయవిచారణ; సుఖదేశాటనోపాయసూచన మొదలగునవి.

2-వ లేఖ 6—18.

భాషావిషయకము; శ్రీ కాళహస్తిక్షేత్రప్రశంస; ఏతత్పూర్వగాథా నిరూపణము; స్థలప్రాశస్త్యవిచారణ; దేశీయవస్తుప్రశంస;

3-వ లేఖ 19—24.

శ్రీమతి సరోజినీదేవీ దర్శన ప్రశంస. మదనపల్లియందు హిందూ స్త్రీ సమాజమువారి సభాప్రమేయము; ఏతదధ్యక్ష ప్రసంగసంగ్రహము; ఖద్దరుప్రశంస.

4-వ లేఖ 25—38.

తిరుపతినుండి యింటికి; శర్మిష్ఠాకళ్యాణము; శారదాచట్ట తర్కము; దుఃఖభాగినియగు నొక యువతీమణి కథ; శారదాశాసనావశ్యకతా నిరూపణము;

5-వ లేఖ 39—48.

పూర్వలేఖయందలి జెప్పఁబడిన మరియొక కష్టజీవినియొక్క వృత్తాంత సమాప్తి; శారదాశాసనవాదము ౹౦.

6-వ లేఖ 49—57.

గుంటూరునందలి శారదానికేతన ప్రశంస; ఏతద్వార్షికోత్సవాది వివరణము.

## 7-వ లేఖ 58—74.

దక్షిణదేశ యాత్రావివరములు; కాంచీపురవర్ణనము; దైవదర్శన లాభప్రకటనము; దేవాలయ వర్ణనము; దేశచరిత్రాలాపన; చిదంబరక్షేత్రము; నటరాజవర్ణన; క్షేత్రవిశేషములు; కుంభకోణము; ఆ క్షేత్రదేవతాదికవర్ణన; తంజావూరు; దేవాలయప్రశంస; రాజభవన ప్రస్తుతి; సరస్వతీమహాల్ పుస్తకభాండాగార దర్శనము; మధుర:—మీనాక్షి దేవాలయ వర్ణనము; మధురాపురవర్ణనము; పూర్వరాజమందిర ప్రశంస; రామేశ్వరము:—తీర్థవివరణ; సముద్రవర్ణన; ధనుష్కోటి; అర్చకులయత్యాచారములు; దేవాలయమర్యాదానాస్తికత; ముసలిభక్తురాలి మొఱ; యాత్రావిసులు; గంధమాదన పర్వతదర్శనము; హిందూమతప్రశంస.

## 8-వ లేఖ 75—99.

కుర్తాళం; స్థలవర్ణనము; జలవర్ణనము; తత్ప్రదేశ సౌభాగ్యవివరణ; మళయాళదేశ ప్రవేశము; పడమటికనుమల వర్ణనము; ప్రకృతిసౌందర్య విశేషవర్ణనము; దేశ్యప్రజలవృత్తి విచారణ; తిరువాన్కూరు రాజ్యము; జనార్దన తీర్థము; సముద్రస్నానము; పురాణవిచారణ; జనార్దనస్వామిసందర్శన వివరములు; మళయాళమహిళాజనాభివర్ణనము; (తిరుఅనంతపురము;) అనంతపద్మనాభదేవదర్శన వివరణము; రాజులపూర్వగాథ; విపరీతపూర్వభ్రాంతినివారణము; రాజ్యాధికారశాసనవివేచనము (కన్యాకుమారి;) దైవదర్శనము; సముద్రస్నానాదివివరణ; (శుచీంద్రక్షేత్రము) వర్ణనాదికము; పోస్టేజినిగూర్చి ప్రజలు పడుచున్న యిబ్బందులు; నాగర్కోయిల్ తిరునెల్వేలి బస్సుప్రయాణికుల కష్టములు; పోలీసుల యక్రమము; (తిరునెల్వేలి) తామ్రపర్ణీస్నానము; (శ్రీరంగక్షేత్రము) వైష్ణవ

స్వాముల దురాచారములు; యాత్రికుల యిబ్బందులు; ఏజంట్లు చేయునట్టి ప్రజాపీడనము; యాత్రాపరిసమాప్తి:

9-వ లేఖ 100—111.

స్త్రీలు నాటకరంగమునఁ బ్రవేశించుటను గూర్చిన సమగ్రవిచారణ.

10-వ లేఖ 112—116.

సమదర్శినీ సంవత్సరాది సంచికా ప్రశంస; అందు దుష్కథా నిరసనము,

11-వ లేఖ 117—124

స్త్రీపురుషులు పట్టుకొని ప్రాకులాడుచున్న గౌరవ బిరుదములం గూర్చిన విముఖత.

12-వ లేఖ 125—129.

సాంఘికోద్యమ ప్రవక్తృప్రచారకుల ధర్మాధర్మ వివేచనము; "సాంసారిక రంగస్థలమున కెక్కరాదు" అని సిద్ధాన్తీకరణము.

13-వ లేఖ 130—140.

సం॥ 1929 రం నవంబరులో బెజవాడయందు జరిగిన (ఆంధ్ర మహిళాసభలు) మన స్త్రీలలోనున్న లోపములు వివిధప్రసంగములు.

14-వ లేఖ 141—154.

ఆడువారి నాటకరంగ ప్రవేశముంగూర్చి సమ్మతిపడిన శ్రీమతి ధర్మవరం లక్ష్మీదేవమ్మగారి కిచ్చిన ప్రత్యుత్తరము.

15-వ లేఖ 155—160.

'శారదా' పెళ్లిళ్ల గడబిడ.

16-వ లేఖ 161—166.

విడాకులచట్టమునకు వ్యతిరేకాభిప్రాయము.

17-వ లేఖ 167—173.

స్వరాజ్యోద్యమప్రకర్ష.

18-వ లేఖ 174—185.

నూలు వడకుట; స్త్రీలు మద్యపాననిషేధమును ప్రచారము చేయుట.

19-వ లేఖ 186—191.

శారదా చట్టమునకు సవరణ లనవసరములు

20-వ లేఖ 192—200.

ధనుర్మాసము, సంక్రాన్తి, బాలికలగొబ్బి తట్టుట మొదలగు వాటి యందిమిడియున్న యుత్తమాశయములు మొదలగునవి.

# విజ్ఞప్తి

౧౯౨౧—౨౨ సంవత్సరముల ప్రాంతమున నాంధ్ర పత్రికలో చక్కని శైలితో రమణీయములగు భావములతో వసంతలేఖలు, ప్రచురింపబడుచుండెడివి. వానిని చదువుచుండ నిదేమాదిరిగా స్త్రీలకు సంబంధించిన విషయములను గూర్చి లేఖలు వ్రాయవలయునని నాకుగూడ కుతూహలము గలిగెను. వెంటనే యొక లేఖనువ్రాసి శ్రీమతి కళ్లేపల్లి వెంకటరమణమ్మగారి యాధిపత్యమున వెలువడిన 'ఆంధ్రలక్ష్మి' యను స్త్రీమాసపత్త్రికకు బంపితిని. ఆ పత్రిక నడచినంతకాలము నా శారదలేఖలు గూడ నందు క్రమముదప్పక ప్రచురింపబడుచుండెను. అది ఆగిపోవుటతో నా లేఖలును ఆగిపోయెను. తదుపరి శ్రీమతి వింజమూరి వెంకటరత్నమ్మగారి 'అనసూయ' పత్రిక పునరుద్ధరింపబడగా వారి కోర్కెపై నియందును రెండు మూడు లేఖలు వ్రాసితిని. తరువాత నదియు నాగిపోయెను.

తదుపరి ౧౯౨౮ వ సంవత్సరమునందు 'గృహలక్ష్మి' ప్రకటింపబడ నున్నపుడు పత్రికాధిపతులు నా వ్యాసములను కోరగా 'శారదలేఖ'లను వ్రాసెదనని తెల్పి యట్టులనే వ్రాసి పంపితిని. నాటినుండి నేటివఱకు నా లేఖలను నడపుభారము 'గృహలక్ష్మి'యే వహించియున్నది.

దేవతావల్లరియైన కల్పలతవలెనే నా లేఖలును చిరకాలము వర్ధిల్లవలయునను తలంపుతోడను, కల్పలతవలెనే నాలేఖలును స్త్రీలయభీష్టప్రదాయినులుగా నుండవలయునను తలంపుతోడను, నాలతకు నెల్లప్పుడు పూచినపూవులుగా నాలేఖలు

ప్రచురింపబడుచుండెడి తలంపుతోడను, నేను జాబులువ్రాసెడి కల్పిత వ్యక్తియైన నెచ్చెలికి కల్పలతయని యభిధేయమిడితిని. రచనాసౌకర్యముకొఱకు కొలదిమార్పులు చేయబడినను, వ్యక్తులయొక్కయు, ప్రదేశములయొక్కయు పేరులు మార్చబడినను నిందలి విషయములు మాత్రమఁ యథార్థములని నేను రూఢిగా చెప్పగలను. కన్నులార చూడనివియు, చెవులార విననివియు, చక్కగా మనస్సునకు నవగాహనము చేసికొనని వియు నగు విషయము లేవియు నిందు లిఖింపబడలేదు. కాన ప్రస్తుతము 'శారదలేఖ'ల ప్రచురణము వినోదతుల్యముగా భావింపబడి వాని ప్రయోజనము గుర్తింపబడకున్నను మును ముందు నిప్పటి దేశవ్యవహారములను సాంఘికపరిస్థితులను దెలిసికొనుటకు చారిత్రకముగ దోడ్పడి ప్రయోజనకరముగా నుండగలవని నా యాశయము.

'గృహలక్ష్మి' పత్రికను స్థాపించి యాంధ్రమహిళాప్రపంచమునకు జేయుచున్న యపారయుపకృతియే గాక మహౌదార్యముతో నా లేఖా సంపుటములను గూడ ప్రచురింపబూనిన మ, రా, శ్రీ. డాక్టరు కే. యన్. కేసరిగారికి నా మనఃపూర్వక నమస్కారము లర్పించుచున్నాను. పత్రికలలో ప్రచురింపబడిన నా శారదలేఖలపై జూపిన యాదరమునే యీ లేఖాసంపుటములపై గూడ జూపి యాంధ్రమహాజనులు ప్రోత్సహింపగలరని నమ్ముచున్నాను. భగవంతు డనుగ్రహించునుగాక!

బాపట్ల
**31-1-1934**

ఇట్లు సుజనవిధేయి,
కనుపర్తి వరలక్ష్మమ్మ.

# శారదలేఖలు

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ! నేడు చాల పుణ్యదినము. బహుకాలమునకు నీకు మరల నుత్తరము వ్రాయు భాగ్యము గల్గినది. అంతియే గాక స్త్రీజనాభ్యుదయమునకై నూతనముగా వెలువడిన మాస పత్రికయగు గృహలక్ష్మి మనయుత్తర ప్రత్యుత్తరముల నడిపెడు భారమును వహించినది. నిజముగా నిది మనకు మంచి సుదినము కాదా? సోదరి, మన జాబు లిక నిరంతరాయముగ నడువ గల వని తలంచినపుడు నాకు మిక్కిలి సంతసము గలుగుచున్నది. మరియు నేటి మన యీలేఖల ప్రారంభకాలము గూడ మిక్కిలి శుభావహముగనున్నది.

పూర్వము మనము జాబులు వ్రాసికొనెడు కాలమున కంటె నేడు మనస్త్రీలయందున్నతి యత్యధికముగ గాన్పించు చున్నది. మన భారతనారీమణు లంతర్జాతీయ సమావేశము లకు ఖండాంతరముల కేగివచ్చుటయు, శాసన సభలలో సభ్యు రాండ్రుగ జేరుటయు, అంతియగాక డిప్యూటీప్రెసిడెంటు మొద లగు ఉన్నతపదవుల వహించుటయు, స్థానిక సంఘముల యందును, విద్యా సంఘముల యందును సభ్యురాండ్రగుటయు, ఆనరరీ మేజస్ట్రీటు పదవులనందుటయు, దేశీయసభలలో దేశ స్వాతంత్ర్యమునకును, సంఘసంస్కరణ సభలలో సాంఘిక

స్వాతంత్ర్యమునకును, ప్రభుత్వ సభలలో స్త్రీలహక్కులకును ఆందోళనమును గావించుటయు స్త్రీలయందు గలిగిన తీవ్ర ప్రబోధమునకు దార్కాణములని చెప్పవచ్చును.

ఈసంవత్సరము మద్రాసునందు జరిగిన సంఘసంస్కార సభ కేవలము స్త్రీజనాభ్యుదయచింతనమునకై యేర్పడిన సభయనియే చెప్పిన చెప్పవచ్చును. దాని కధ్యక్షుడు సుప్రసిద్ధ సంఘ సంస్కర్తయగు నటరాజనుగారు. ఇక నాహ్వాన సంఘాధ్యక్షత నెవరు వహించిరనుకొంటివి? చెన్నపురి శాసనసభోపాధ్యక్షురాలును, నిరంతరము స్త్రీజనాభ్యుదయకరములగు తీర్మానములు సభయందుపపాదించి ప్రజలను ప్రభుత్వమును గూడ నొందరించుచున్న విదుషీమణియు పవిత్ర భారత వర్షమునకు కళంకదాయకమును భారతస్త్రీల సద్యశస్సును మలిన పఱచుచున్నట్టియు మిస్ మేయో మున్నగు రంధ్రాన్వేషకురాండ్రయాక్షేపణలకాస్పదమిచ్చుచున్నట్టియు కళావంతుల సంఘము, నుద్ధరింప కంకణము గట్టుకొనిన సాధ్వీమణియు అహర్నిశలు స్వజాత్యభివృద్ధికై కృషిచేయుచున్న పరోపకారపారీణయునైన శ్రీ డాక్టరు ముత్తులక్ష్మిరెడ్డిగారు. స్త్రీలయున్నతి మనః పూర్వకముగ నాశించు మహనీయుడు అధ్యక్షుడుగను, నిరంతరము స్వజాత్యభివృద్ధికే పాటుపడెడు నారీరత్నమాహ్వాన సంఘాధ్యక్షురాలుగను నేర్పడినప్పుడిక మన యభివృద్ధిని గూర్చిన విషయములే యందధికముగఁ జర్చకువచ్చెననిన అందాశ్చర్యమేమి? అందు స్త్రీవిద్యను గూర్చియు, ప్రౌఢ వివాహములను గూర్చియు, పునస్సంధాన వయోనిర్ణయమును

గూర్చియు, స్త్రీల వారసత్వపు హక్కులను గూర్చియు, బాల వితంతువులను గూర్చియు, వేశ్యా సంఘమును గూర్చియు ముత్తు లక్ష్మమ్మగారు చెప్పిన విషయము లెంతయు నొప్పిదములై యున్నవి. అధ్యక్షుఁడు గూడ స్త్రీల యున్నతిని గూర్చియే బహు దూరము చర్చించెను. మహోత్సాహముతో శంకర నాయరుగారు గావించిన హెచ్చరిక యెంతయు సంస్తవనీయమై స్త్రీల కర్తవ్యము నుద్బోధించుచున్నది. పెక్కుతీర్మానములలో స్త్రీలు పాల్గొని నిపుణముగ మాట్లాడిరి. ఆవిషయముల నెల్ల వివరింప నొక గ్రంథమగును. ఈచిన్న లేఖయందు వానినెల్ల వివరింప సాధ్యముగాదు. కాన ఆసభా విషయములఁ బ్రచురించిన వార్తాపత్రికలను దెప్పించి చదువుము. నీవు చదువుటయే గాదు—నీకు పరిచయముగల స్త్రీలకుఁగూడ చదివి వినిపించుము.

నెచ్చెలీ! నీ వదృష్టవంతురాలవు. నీపెనిమిటి న్యాయవాది యగుటచే నూరూరు దిరిగెడి యవస్థ నీకు లేదు. కడుపులో చల్ల కదలకుండ నుండవచ్చును. మా యుద్యోగమో అట్టిదికాదు. ఈ చెన్నరాజధాని యెల్లమాదే. క్రొత్తక్రొత్త ప్రాంతముల కేగుటయు అచ్చటి జనుల నడవడులను, ఆచారములను, వేష భాషలను ఆరయు చుండుటయు సంతోషకరముగనేయుండును. కాని మాటి మాటికి సామానులు సర్దుకొనుట—విప్పుకొనుట మాత్రము మిక్కిలి విసువును గలిగించుచుండును. అయినను నే నిప్పుడా పనికి చాల యలవాటుపడితిని. నెల కొక

యూరు వెళ్లవలసివచ్చినను తదనుగుణ్యముగ బ్రయాణ మగుట నేర్చుకొంటిని.

తఱుచు మార్పులు గలుగు చుండెడి యుద్యోగికి యిల్లాలైన స్త్రీ కొద్ది యుపకరణములతో గృహకృత్యములను పచనకార్యములను నెరవేర్చెడి నేర్పును గలిగియుండవలెనని నేనిప్పుడు నా యనుభవమువలన తెలిసికొనగలిగితిని. మన యాంధ్ర స్త్రీలు అందు ముఖ్యముగ నుత్తర సర్కారులకుం జెందిన మన మీ విషయమున అసమర్థులమని యొప్పుకొనక తప్పదు. ఊరుగాయ జాడీలకు, పచ్చడి బానలకు మాత్రమే రైలులో నొకపెట్టెయు యింటియందొక గదియు మనకుం గావలయును. కావుననే "తమిళ స్త్రీలవలె మీకు క్లుప్తత చేతగాదు. ప్రయాణమునకు మీరు పనికి రా"రని మగవా రనుట మనకు పరిపాటియైనది. ఈ మధ్య మన ప్రాంతమునుండి యొక రీగ్రామమున కుద్యోగసందర్భమున నేతెంచిరి. వారి సామాను నాలుగైదు బండ్లనిండ యుండెను. అయిదారు మంచములను గూడ దెచ్చిరి. ఈ ప్రాంతమున మంచముల వాడుకొను అభ్యాసములేదు. శిశువులు, వృద్ధులు, వ్యాధి గ్రస్తులు, నిండుచూలింతలు, పచ్చి బాలెంతలుగూడ క్రిందనే పడుకొందురు. కాన పైఁజెప్పిన వారి సామానులను ముఖ్య ముగా మంచములను బండ్లనుండి దింపుచుండగా నిచ్చటి వా రాబాలవృద్ధు లతిచోద్యముతో సర్కసు కంపినీవారి సామా నును చూచినట్లు మూగిమూగి చూడసాగిరి. నా కూరక

నవ్వువచ్చెను. ఇది తెలుఁగు దేశమే యైనను నీదత్తమండలములకును మన ప్రాంతమునకును ఎంతయో వ్యత్యాసము కలదు. ఇచ్చటి దేశ్యపదము లన్యభాషాపదములవలెనే అబోధకములై ప్రయత్నపూర్వకముగా నేర్చుకొనవలసివచ్చినది. ఆ విషయములనెల్ల మరియొక కమ్మయందు లిఖించెదను.

భావపురి

1928 సం॥ మార్చి

నీప్రియచెలి,

శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ,

నీవు వ్రాసిన యుత్తరమందినది. మనము పూర్వము జాబులు వ్రాసికొనెడి కాలమునకును నేటికిని సమస్త విషయములయందు నెంతయో మార్పుగలిగినదని వ్రాసితివి. సత్యమే. కాని భాషావిషయమునగూడ మిక్కిలి మార్పుగలిగినదే, ఆవిషయము నీవేల గమనింపలేదు? గమనించియు ననర్హమని యుజ్జగించితివా? భారతి మున్నగు మాసపత్రికలలో వాడుక భాషయందు వ్రాయబడెడి కథలు, నాటకములు, ప్రహసనములు, చదివినకొలది నాకు వాడుక భాషయందు మక్కువెక్కువగుచున్నది. 'కథగాదు, కావ్యముగాదు, ఈ యుత్తరములలో మధురమైన వ్యవహారభాష మనమేల యుపయోగింపరాదు? సొగసైన వాడుకభాషలో లేఖలు వ్రాసికొనుటకు నీకుగల సందేహమేమియో తెలుపగోరెదను' అని వ్యవహార భాషయందు నీకుగల మక్కువకొలది కడు దీర్ఘముగ వ్రాసితివి. వ్యవహార భాషయందు వ్రాయుట నీకు ప్రీతికరమగుచో నీవటులనే వ్రాయుము. కాని యాంధ్ర దేశమున నలువైపుల గ్రుమ్మరుచున్నకొలది వాడుకభాషయందు వ్రాయుట వలన గలిగెడి యిబ్బందు లధికముగ గన్పట్టుచున్నవి. ఆ విషయమై నాకుగల సందేహములను ననుభవములను రాగల లేఖలో విశదపఱచెదను. ఏటేటనందువా శ్రీకాళహస్తీ క్షేత్రమందు మహాశివరాత్రి సందర్భమున నేగాంచిన విశేషములు

నీకు సాకల్యముగఁ దెలుప మానసం బువ్విళ్లూరుచున్నది. కాన యొకటిగోర నొకటి వ్రాసితినని నాపైఁ గోపింపకుమా!

శ్రీకాళహస్తి పురాతన పుణ్యక్షేత్రములలో నొక్కటి. ఈ పుణ్యక్షేత్రమునకు దక్షిణ కైలాసమని గూడ మఱియొక నామధేయముగలదు. ఇచ్చట స్వామికి శ్రీకాళహస్తీశ్వరుఁడనియు, అమ్మవారికి జ్ఞానప్రసూనాంబిక యనియు పేర్లు. శ్రీ అనగా సాలెపురుగు. కాళమనఁ సర్పము. హస్తి యన నేనుగు. ఈ మూటికిని ఈశ్వరుఁడు మోక్షమిచ్చెనుగాన భక్తవాత్సల్య చిహ్నముగా నీశ్వరుఁడా మూఁడు జీవముల పేరఁబిలువబడుచున్నాడు. కాని ఈస్వామి నిజనామధేయము నాగలింగేశ్వరుఁడు. శివరాత్రి సందర్భమున నిచ్చట పదిదినములు గొప్ప యుత్సవము జరుగును. దూరస్థలముల నుండి గూడ చాలమంది యాత్రికు లేతెంతురు. మొదటి దినమున స్వామికిఁ గడుగూర్చిన భక్తుడగు కన్నప్ప ధ్వజారోహణము. మఱునాఁడు స్వామి ధ్వజారోహణము. ఆదినమునుండియు స్వామి, ప్రొద్దొక వాహనముపై రెండు పూటల పదిదినములూ రేగును. వాహనములలో పెక్కులు వెండివి. ఒకటి రెండు మాత్రమే లక్క, కొయ్య మున్నగువానితోఁ జేసినవి. నిత్యము స్వామితోఁబాటు విఘ్నేశ్వరుఁడు,కుమారస్వామి యను నిద్దరు కుమారులును, కన్నప్ప, చండికేశ్వరులను నిరువురు భక్తులును, గంగ, జ్ఞానప్రసూనాంబిక యను నిరువురు దేవేరులును గూడ నూరేగుదురు. గంగ స్వామికి ప్రక్కనేయుండును. కాని

జ్ఞానప్రసూనాంబికకు మాత్రము ప్రత్యేక వాహనము. స్వామికి, అమ్మణ్ణికిగూడ వెలలేని నగలున్నవి. విలువైన వాహనములున్నవి. దిన దినము స్వామియు నమ్మణ్ణియు నవనవాలంకార్యములతో నమూల్యాభరణములతో నవ్యంబులగు వాహనములపై వచ్చుట జూచుటకెంతయో నేత్రపర్వముగ నుండును. అన్నిటికంటె శివరాత్రికి పూర్వరాత్రి చొక్కంపు వెండితోఁ జేయబడిన శేష వాహనముపై నవరత్నములు తాపిన కంఠహారములు, కరకంకణములు, అంగుళీయకములు, కర్ణభూషలు, తురాయి కిరీటము మున్నగు, వెలలేని యాభరణములచే నలంకరింపఁబడి వేంచేసిన యా స్వామి సౌందర్యము ఆరంగురంగు మతాబుల వెలుగున నెంత శోభస్కరముగనుండెనో, ఎంత దర్శనీయముగ నుండెనో వివరింపజాల. నాడు దేవి యలంకారముగూడ నతిమనోహరముగ నుండెను. నాఁటి స్వామియొక్కయు అమ్మణ్ణియొక్కయు, రమణీయాకారములు నాకిప్పటికిని కనుల గట్టినట్లున్నవి. మిత్రమా! విష్ణుక్షేత్రములనే గాని శివక్షేత్రముల నిట్టియలంకారములను నుత్సవములను నిచ్చుటనేగాని మఱెచ్చటను గానము.

ఇచ్చటిజనులకు స్వామియందుకంటె నమ్మణ్ణియందు భక్తి యధికము. ప్రతిశుక్రవారమునను అమ్మణ్ణికి కుంకుమార్చన జరుగును. ఆనాడు పురుషులకంటె స్త్రీ లెక్కువగా వచ్చెదరు. దేవిని, వారు తల్లిని పిలిచినట్లెంతయో చనవుగ నెంతయో ప్రేమగ 'తాయీ, 'అమ్మణీ, అమ్మా, జ్ఞానప్రసూ

నాంబా' యని సంభోధించుచు లెంపలు వాయించుకొని సాష్టాంగ పడుదురు. చిన్నలుమొదలు పెద్దలవఱకు 'మా అమ్మణ్ణి మా అమ్మణ్ణి' యని బహుప్రేమతో మన్ననమీఱ చెప్పుచుందురు. ఊరిలో మెఱవడికి వచ్చినప్పుడుగూడ స్వామికి కంటె నమ్మణ్ణికి నమస్కరించువారే యధికము. అమ్మణ్ణి త్రోవ నెదురపడినచో రక్షకభటులు తమ యెఱ్ఱటోపీని దీసియు, నధికారులు తమ తలపాగ దీసియు నమ్మణ్ణికి నమస్కరించి యామె కుంకుమను నొసట బెట్టుకొనక నావలపోరు. ఇంక మన స్త్రీల విశ్వాసము వివరించుటకే సాధ్యముకాదు. ఆమె తమపాలిట కల్పతరువనియే మనవారిభావన. ఆమెను పూజించిన పత్ర పుష్పములేమి పసపు కుంకుమలేమి ఎంతమాత్రము లభించినను మహాద్భాగ్యముగ నెంతురు. ఆ పుష్పాదులను పసపు కుంకుమలను దాల్చినచో దమ మాంగల్యము చిరస్థాయిగ నుండగలదని మనవారి విశ్వాసము. మన స్త్రీల యభీష్టములలో నీ సువాసినీత్వవాంఛ ప్రముఖమైనదిగదా! అట్టి సువాసినీత్వము నమ్మణ్ణి పెంపొందించునను విశ్వాసముగల యప్పుడామెయందు మనస్త్రీలకుగల భక్తి నిరుపమాన మనుటలో నాశ్చర్యమేమి?

అచ్చటి ప్రభువుల కామె యిష్టదైవము. అచ్చటి ప్రజల కామె కన్నతల్లి. అచ్చటి జనులలో పెక్కుమంది యామె నామధేయము గలవారే. తండ్రియందుకంటె తల్లియందు ప్రేమ యగ్గలమై యుండుట మనుష్య సాధారణముగదా. శ్రీకాళ

హస్తీశ్వరుని యాలయము చాల గొప్పది. మన తెలుగుసీమలో నంత గొప్ప దేవాలయము వేఱొండు లేదని చెప్పుదురు. కడు చిన్నదియయ్యు స్వర్ణముఖీనది యాక్షేత్రమునకు శోభను గూర్చుచున్నది. ఆదేవాలయమునం దఱువదిమువ్వురు భక్తులు గలరు. వారిలో నగ్రేసరుఁడు కన్నప్ప. కన్నప్ప స్వామికి గడు గూర్చిన భక్తుడు. స్వామి విగ్రహ మెచ్చట ప్రతిష్ఠితమై యున్న నచ్చట కన్నప్పవిగ్రహము ప్రతిష్ఠితమై యుండితీరును. మొరవడిసమయమున స్వామి కభిముఖుడై కన్నప్ప వచ్చును. స్వామి యాలయమునకు సమీపముగనే కన్నప్పకొండ యున్నది. కన్నప్ప కొడియనగా ధ్వజారోహణమైన వెనుకనే స్వామి కొడి. ఈ కన్నప్ప యింతటి సత్కారమునకు భగవదనుగ్రహమునకు పాత్రుఁడెట్లయ్యెనన నాతని చరిత్ర మిట్లు చెప్పుదురు.

కన్నప్ప యొక యెఱుకరాజునకు లేకలేక బుట్టిన కొడుకు. ఆతడొకనాడు వేఁటకుబోవ నచ్చట నీ ఈశ్వరలింగము కనుపించెను. దానిని చూడగనే కన్నప్ప భక్తిభరితుడై యా నాగలింగేశ్వరునకు నమస్కరించి యదివఱ కర్చకు డర్పించి పోయిన పుష్పపత్రాదులు తొలగఁద్రోచి సమీపారణ్యమునకుఁబోయి యొక పందిపిల్లను వేటాడి చంపి తెచ్చి దానిని పక్వముచేసి రుచికరముగ నున్నదో లేదోయని నోట వేసికొని రుచిచూచి రుచ్యముగ నుండుటకు సంతసించి యా నంజుడొక చేత బట్టుకొని బిల్వపత్రము లొక కొన్ని కోసి నెత్తిపై నిడుకొని యొకచేత నంజు డొకచేత విల్లునంబు లుండుటంజేసి యభి

షేకజలము తెచ్చుటకు సాధ్యముకామి సువర్ణముఖిలోని యుదకమొకింత పుక్కిట నింపుకొనివచ్చి స్వామిపై నాజలము మిసి యభిషేకముచేసి తాఁదెచ్చిన పుష్పపత్రాదులఁ బూజించి తాఁదెచ్చిన నంజుడు నైవేద్యముపెట్టి భక్తిభరితుడై యా స్వామిని విడనాడజాలక యందే నిలిచియుండెను. ఆతని వెంటవచ్చిన వేటగాండ్రు ఇంటికి వెళ్లుదము రమ్మని కోరిరి. కాని కన్నప్ప బదులు చెప్పలేదు. వారును పలుమాఱులు పిలిచి పిలిచి వేసారి వీని కిచటనుండు దేవుడావేశించినట్లున్నదని తలంచి యా విషయమును బోయ రాజునకుఁ దెలుప వెడలిపోయిరి. కొమారుని వృత్తాంతమును వినుట తోడనే తలిదండ్రు లిరువురు మహాదుఃఖితులై కన్నప్ప వద్దకువచ్చి యాతని నింటికిఁ గొనిపోవ యత్నించిరి. కాని భగవద్ధ్యాన నిమగ్నుడై విశ్వము మఱచియున్న కన్నప్ప కాపలుకులు చెవిదూరలేదు. ఇంతలో ప్రొద్దు గ్రుంకెను. మేటి విలుకాడైన కన్నప్ప విల్లు నమ్ములు ధరించి స్వామిని కావలిగాయుచు నారాత్రిపుచ్చెను. ఉదయము కాగానే స్వామికి రుచ్యములైన నంజుడులు తెచ్చుటకు కన్నప్ప వెడలిపోయెను. తరువాత స్వామికి నిత్యము కైంకర్యము జేసెడు శివగోచరియను పూజారి సువర్ణముఖిలో స్నానముచేసి మడుఁగులుకట్టి విభూతి రుద్రాక్షలు ధరించి శిరమున నభిషేకజలమును హస్తముల పూజా ద్రవ్యములను బట్టుకొని యటకేతెంచి చూడగనే యాతని ఒడలు జల్లుమనెను. అయ్యో ఇదియేమి? స్వామి సన్నిధి మాంసపు

ముక్కలున్న వేమి? ఏక్రూరకిరాతకుడీ యమంగళము చేసిపోయె? పూజ్యుడగు స్వామికిట్టి యపచారముగావించినవాడు తప్పక వధ్యుడుగదా యని చింతించి యా మాంసపుముక్కలనెల్ల నెత్తి పాఱవైచి మరల స్నానముచేసి స్వామినర్చించి వెడలి పోయెను.

అట స్వామికి నంజుడు తే నేగిన కన్నప్ప పెక్కుమేలి మెకంబుల జంపి వానిని చక్కగా తేనెతో పక్వముగావించి తాను తినిచూచి మిక్కిలి రుచ్యముగా నున్నదని సంతసింపుచు నెప్పటివలె పుక్కిట నభిషేకజలమును శిరమున బిల్వపత్రములను చేత నంజుడును పట్టుకొనివచ్చి శివగోచరి యర్చించిన పుష్పపత్రాదులను దనచెప్పుకాలితో దొలఁగద్రోచి యెప్పటి వలెనే స్వామినర్చించి యా రాత్రి మరల నాస్వామి సన్నిధినే గడపి తెల్లవారగనే మరల నైవేద్యపు నంజుడుల కొఱకు నడవి కేగెను. ఇంతలో శివగోచరివచ్చి మరల స్వామి సాన్నిధ్య మమంగళమై యుండుటకుఁ దద్దయు దుఃఖించి మరల నన్నియు చక్కఁజేసి స్వామి నర్చించి వెడలిపోయెను. ఈ విధముగా నైదు దినములు గడచెను. శివగోచరి దుఃఖ మగ్గలమగుచుం డెను. కాన స్వామి యాతనిదుఃఖ ముడుపగోరి యా రాత్రి యాతని కలయందుగన్పడి భక్తశిరోమణీ! నిత్యము మాసాన్ని ధ్యమశుద్ధమై యున్నదని నీవేల వాపోయెదవు. ఆ మాంసపు ముక్కల మాకు నివేదించుచున్నవాడు పాపాత్ముడుగాడు. పాషండుడు గాడు. మాకుఁ గడుగూర్చిన భక్తుడు. అవి

యామిష ఖండములుగావు, యమృతపు ముక్కలు సుమా! నాయందు భక్తిభరితుఁడగువాఁడు నాకెట్టి హేయపదార్థ మిడినను నాకది రుచిరాన్నమే సుమా! కావుననే యాతని నంజుడులు నేనంత ప్రీతికరముగ స్వీకరింపుచున్నాను. అతఁడు మహా భక్తుఁడు కాన యతని హృదయమే నాకాలయము. వాని పలుకులే నాకు స్తుతివాక్యములు. ఆతని భక్తితత్పరత నెఱుంగ గోరుదువేని రేపుదయమునవచ్చి మఱుఁగుననుండి పరీక్షింపుమని చెప్పి యంతర్హితుఁడయ్యెను. వెంటనే శివగోచరి అదరిపడి లేచి యప్పటికి తెలతెల వాఱుచుండుటం దెలిసి కాలకృత్యములఁ దీర్చికొని సువర్ణముఖిలో మజ్జన మాడివచ్చి దేవాలయమునకేగి స్వామి చెప్పిన తెఱఁగున నొకమఱుఁగున నక్కియుండి కన్నప్పరాక ప్రతీక్షించు చుండెను. వాఁడుకమేరకు కన్నప్ప పూజాద్రవ్యాదులను నభిషేకజలమును నైవేద్యపు నంజుడులను గైకొని స్వామి సన్నిధి కేతెంచెను. కాని యేమి చిత్రము! నాఁడు స్వామి నిత్యమువలె సుఖముగలేఁడు. ఆతని కొక కంటినుండి ఘోరముగ రక్తము ప్రవహించుచున్నది. అది చూడగనే కన్నప్ప దుఃఖముజెంది హోరుహోరుననేడ్చుచు తెచ్చిన పదార్థము లక్కడనే పాఱవైచి "స్వామీ! నీకిట్టియాపద యెట్లుతటస్థించె? నా పగవారగు వేఁటకాండ్రు చేసిరా? లేక మృగములు చేసెనా? విశాల విశ్వమునంతను పరికించెదు నీ నేత్రమున రక్తము స్రవించిన నేదిమందు? అయ్యో! యేమిచేయుదు. నీకపకారము గావించిన యా

దుష్టులెవ్వరో కనుపించిన కత్తికి రెండు తుండ్లుగా నఱికి వేయునా? అయ్యో! ఏమిదారి! ఎట్లీరక్తస్రావము కట్టును? ఏదియైన మందాకుల రసము పిండిచూతునా యని చెంతనున్న యడవి కేగి ఒకరకముల మందాకులు తెచ్చి రసము పిండిచూచెను. కాని లాభములేదు. రక్తము కారుచునేయున్నది. కన్నప్ప చేయునదిలేక దిగులొంది కన్నీరు కాల్వలై పాఱుచుండ భ్రాన్పడినట్లు నిలిచెను. కొంతతడ విట్లునిలువ కండకు కండయను సామ్యము తోఁచెను. ఆహా! మంచిమందు తోఁచెను. స్వామి కంటికి నాకంటి నంటింతు ననుకొనెను. తోడనే కత్తితో తాటి కాయనుండి ముంజె నెత్తినట్లు తనకన్నునూడదీసి స్వామికంటి కంటించినాడు. అద్భుతముగాస్వామికన్ను చక్కఁబడిపోయినది. కన్నప్పకు పరమానందమైనది. స్వామిని కౌఁగలించుకొని నాడు. ముద్దు పెట్టుకొనినాఁడు. సాష్టాంగ పడినాఁడు. ఆడి నాడు. పాడినాడు. భగవంతుడు భక్తునిచేతి ముద్దుబిడ్డ. భక్తుడెన్నెన్ని విధముల నుపలాలించిన యన్నన్ని విధముల ప్రియము గూర్చుట యా మహామహునకు సంతోషప్రదము. ఈ విధముగా గొంతసే పానందనమగ్నుఁడై కన్నప్ప నృత్యము చేసి స్వామివంక చూచినాడు. ఆహా! ఏమిచెప్పుదు నాభీభత్సము! స్వామి రెండవకంటినుండి నెత్తురు కారుచున్నది. స్వామి నేత్రము చక్కఁబడుటకు దగిన యౌషధము తనవద్దనే యుండ కన్నప్ప కిక దిగులేమి? కాని తన రెండవకన్నుగూడ నూడబెఱికినచో దాని నంటించుటకు స్వామి కన్నెక్కడగలదో

తనకెట్లు తెలియును? కాన గుర్తుకొరకు కన్నప్ప నిశ్శంకము గా తన చెప్పుకాలినెత్తి స్వామికంటిపై నిడి చేతనున్న కత్తితో రెండవ కన్నును బెలుక సాహసించినాడు. ఆహా! కన్నప్పకు స్వామియందెంత ప్రేమ! ఎంత విశ్వాసము! ఎంత భక్తి! అద్భుతము! అసదృశము! కృపా సాగరుఁడగు పరమేశ్వరుఁడది చూచి సహించునా! మేలు కన్నప్పా! నీ యపూర్వ భక్తికి మెచ్చు వచ్చెనని చేయి పట్టుకొనినాఁడు. శివగోచరి యాశ్చర్య నిమగ్నుడై పోయినాడు. కన్నప్పా! నీకేమి కావలెనని నాఁడు స్వామి. నీసాన్నిధ్యము నీయనుగ్రహము నీకైంకర్యము అనినాఁడు కన్నప్ప. మూటికొక్కటే మాటగ నటులనే యనినాడు స్వామి. కన్నప్ప మొదటి పేరు తిన్నప్ప. కన్ను నొసఁగుటఁజేసి తిన్నప్ప కన్నప్పగా ప్రసిద్ధుఁడైనాఁడు. నెచ్చెలీ, కన్నప్ప కథ సత్యమా? అసత్యమా? అను విచారణ మనకువలదు. భగవంతుని యందు మనకుండవలసిన భక్తి విశ్వాసము లట్టివని గ్రహించుటకు కన్నప్ప చరిత్ర ముత్తమోత్తమోదాహరణ మనుటకు సందియము లేదుగదా!

ఇచ్చట చక్కని నాణెమైన కొయ్య దువ్వెనలు నల్ల గాజులు తయారగును. రంగురంగు విదేశపు గాజులు దేశమంతట వ్యాప్తమై యుండుటవలన గాజుల పరిశ్రమ చాల క్షీణించెను. కాని దువ్వెనల పరిశ్రమ మాత్ర మింకను కొంత వ్యాప్తిలోనే యున్నది. సాధారణముగా నొక దువ్వెన వెల యొక

కానీ యుండును. కాని యా దువ్వెనకే యొక రూపాయ వెల చేయు పనితనము చేయగల నిపుణులున్నారని వింటిని. కాని యా పనితన మరయు వారెవ్వరు? విదేశములనుండి దిగుమతియైన యా దువ్వెనల నిగనిగలరసి మోహపడువారేగాని మానుతో జేయఁబడిన యీమేలి దువ్వెనల జూచి మెచ్చువారెవ్వరు? చెక్క దువ్వెనయా! ఛీ ఛీ. ఎంత యవమానము. తలలో బెట్టగనే పుటుకు పుటుకున పండ్లు రాలుచున్ననుసరే, తల దూరక పోయిననుసరే, పేలు రాక పోయిననుసరే, మెఱుఁగున్న చాలును. మెఱుగే మన కన్నులలో కంపకొట్టుచున్నది. దువ్వెనలకు మెఱుగు, గాజులకు మెఱుగు, గుడ్డలకు మెఱుగు, మొగములకు మెఱుగు! అన్నిటను మెఱుగే నవనాగరికులకు కావలసినది. ఈ విదేశపు మెఱుఁగులు మన మెఱుగును రూపుమాపుచున్నవను మెలమెల యొక్కరికిని లేదు. అది యట్లుండె; మిత్రమా! నే నొక్క మేలు బడసితిని. స్వదేశపు వస్త్రములతోఁబాటు స్వదేశపు గాజులనుగూడ ధరింతునని వ్రతముపూనితినని నీకుఁ దెలియునుగదా! ఆగాజు లొక మాఱు దొరకియు నొకమారు దొరకకయు నేపడినశ్రమ వర్ణనాతీతము. ఈగాజులు లభ్యపడక వట్టి చేతులతోనుండ, గాజులు మానివైచితినని పెద్దవారలపోరు. అయ్యో! స్వదేశిగాజులు లభింపకపోయె. చూచి చూచి విదేశపు గాజులెట్లుధరింతునని నాకుచింత. ఈ స్థితియందొకానొకప్పుడుగాజుల గూర్చిన దీక్ష మిక్కిలి యవిచార్యముగ

బూనితినిగదా యని భావించితిని. కాని విదేశపు గాజులుతొడిగి కొనుటకు మాత్రము పాల్పడలేదు. ఒకానొక మహానీయుడొకానొక స్త్రీలసభలో "తల్లులారా, మీరు విదేశపు గాజులు ధరించుట వలన సంవత్సరమునకు కోటి రూప్యములు విదేశముల పాలై పోవుచున్నవి. కోటి రూప్యములన నెన్నియనుకొంటిరి? ఆ రూప్యములన్నియు సంచులు కట్టివేసిన ఈహాలంతయు నిండి పోవును. అన్ని రూపాయలు విదేశపు వన్నెగాజులకు ధార పోయుచున్నారు." అని చెప్పిన వాక్యము లహర్నిశలు నాహృదయమున ప్రతిధ్వనించుచుండును. అందువలననే నేను విదేశపు గాజులనుండి రక్షింపఁబడితిని. ఇప్పుడు శ్రీజ్ఞానప్రసూనాంబిక కృపవలన రెండువందల యేబదిగాజులు కాళహస్తిలో చేయించి తెచ్చుకొంటిని. నాకలవు తీరినది. గొల్ల పేరమ్మలాగున్నావని నీవు నవ్విన నవ్వుదువు గాక. చేతినిండ తొడిగికొనిన నల్లగాజులనుచూచుకొని నేను మహానందమున నుప్పొంగిపోవుచున్నాను. నా నల్లగాజులెంత చక్కఁగ నున్నవనుకొంటివి? బహు చక్కఁగ నున్నవి. సన్నమునకు నాబంగారుగాజులతో గలసిపోయినవి. మెఱుఁగునకు విదేశపుగాజులకు మించిపోయినవి. ఆ గాజులు వేసికొనగనే యానందముతో నా హృదయము నిండిపోయినది. కాని యా గాజులను చూడగనే నాకొక విధమైన విచారము గూడ గల్గినది. ఏలనందువా? ఇట్టి చక్కని గాజులు చేయగల

సామర్థ్యముగల పనివారుండియు నేటేట కోటిరూపాయలు విదేశములకు ధారపోయు చుంటిమిగదా యని.—కాని మన స్త్రీలకు వన్నెచిన్నెలపై వ్యామోహము నశింపనివఱకు మన దేశపు పరిశ్రమ లభివృద్ధి జెందవు. దేశీయపరిశ్రమ లభివృద్ధి జెందినగాని మనదేశ మభివృద్ధి జెందదు. ప్రియమిత్రమా! అట్టి కళ్యాణదినములు మన భారతభూమి కెప్పుడు వచ్చునోగదా!

భావపురి
1928 మే

ప్రేమంపుచెలి,
శారద

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ, ఒక శుభసమాచారము. ఏ కవయిత్రీమణి వాగమృతముల సెవులార గ్రోల ఖండ ఖండాంతరవాసులెల్ల రభిలాషతో నెదురుజూచుచుందురో, ఏవిదుషీమణి విమల వాగ్ఝరి ప్రవహించిన తమకష్టములెల్ల గొట్టుకొనిపోవునని వలస రాష్ట్రి భారతీయు లాసతో నాహ్వానింపుచుందురో ఏసాధ్వీమణి గంభీరోపన్యాస మాలింపవలెనని భారతీయులెల్ల రనిశ ముత్కంఠపడుచుందురో అట్టి సుప్రసిద్ధకవయిత్రియు, విదుషీమణియు నారీరత్నమునునగు శ్రీమతి సరోజినీదేవిగారి మహత్తరోపన్యాసమును ఈనెల ౨౮-౮-౨౮ తేదీని మదనపల్లియందు వింటిని. నీవు వినలేదని యనుకొంటిని. లేఖామూలముగా దెలుపవచ్చును గదా యని మరల తృప్తిగంటిని.

ఈ పురము నందలి హిందూ స్త్రీసమాజమువారి యాజమాన్యమున పై సభ జరుపఁబడినది. నెమలి పట్టాభిరామరావు పంతులుగారి కొమార్తెయగు శ్రీమతి పద్మాసనీదేవి (బి.ఏ.,) గారు నాటిసభ కగ్రాసనాధిపురాలు. సమావేశమైన స్త్రీలు కొద్దిమందియైనను, వచ్చిన స్త్రీలెల్లరు దాదాపుగా నాంగ్లభాషా పరిచయములేని తెలుగు స్త్రీలేయైనను, శ్రీమతి సరోజినీ దేవిగారు మిక్కిలి శాంతముతో స్త్రీలకు సంబంధించిన పెక్కు విషయములను గుఱించి యుపన్యసించిరి. దేవి చెప్పిన

ప్రతివాక్యమును నొక మహనీయుఁడు తెలుఁగుచేసి చెప్పెను. శ్రీ సరోజినీదేవిగారి యుపన్యాస సారాంశ మీవిధముగనుండెను.

"సోదరీమణులారా!

నేను నా కొమార్తె కనారోగ్యముగా నుండుటచే నిక్కడకువచ్చి యుంటిని. నేను వచ్చిన సందర్భము సంతాప కరమైనదే యైనను మిమ్ములనందఱను గలిసికొనుట సంభవించు టచే నాకు మిగుల సంతోషకరముగా నున్నది. నేను తెలుఁగు దేశపు స్త్రీని కాకపోయినను మీభాషా పరిచయము నాకు లేకపోయినను నేనుగూడ మీ స్త్రీజాతికిఁ జెందిన దాననగుటచే మీకును నాకును సన్నిహిత సంబంధముగలదు. మీ సమాజ స్థాపకురాలగు కజిన్సుదొరసానిగారు ఐరిషుదేశపు స్త్రీ. సర్వ విషయములను నామెకును మీకును నెంతయో భేదముగలదు. అయినను ఆమెవచ్చి మనదేశమున స్త్రీ సమాజమును స్థాపించి స్త్రీల యభివృద్ధికై పాటుబడుటకు గారణము ఆమెకును మీకునుగల స్త్రీత్వమే గదా. ఈమధ్య డిల్లీయందు భారత మహిళాసభ జరిగినది. దానికి అధ్యక్షురాలు భోపాలు బేగము గారు. ఆమె మహమ్మదీయ స్త్రీ. ఆసభకు పూర్వము జరిగిన సభ కధ్యక్షురాలు బరోడామహారాణిగారు. ఆమె హిందూ యువతి. చూడుడు. ఒకామె హిందువు. ఒకామె ముసల్మాను. అయినను సభా విషయములలో నెట్టి యసందర్భము గలుగ లేదు. కాన ఆశయ మొక్కటైనపుడు జాతి మత భేదము లేవియు నడ్డుకొనవు. పై డిల్లీ మహిళాసభవారు స్త్రీలకు సంబంధించిన పెక్కువిషయములనుగూర్చి చర్చించి

యున్నారు. బాలికలకు విధిగా విద్య నేర్పవలెననినారు. స్త్రీలకు నియోజక నియోజిత స్వాతంత్ర్యము కావలెననినారు. అతి బాల్య వివాహము లనర్థకమనినారు. ఇంకను పెక్కు తీర్మానములు గావించియున్నారు. పై విషయములను గూర్చి మన దేశమునందు తీవ్రమైన యాందోళన జరుగుచునేయున్నది. కొన్నిట మనకనుకూలములుగూడ జరుగుచునేయున్నవి. ఇతర విషయములలో మన దేశపుస్థితి యెట్లున్నను నియోజిత నియోజక స్వాతంత్ర్యము మాత్రము మన స్త్రీలకు శీఘ్రముగానే లభించినది. పాశ్చాత్య స్త్రీలు విశేష పరిశ్రమచే గాని బడయజాలక పోయిన ఎన్నిక హక్కులు మనదేశపు స్త్రీలకు సులభముగా లభించినవి. తత్ఫలితముగా మీా మదరాసు రాష్ట్రశాసనసభకు ఒకస్త్రీ డిప్యూటీప్రెసిడెంటుగా నెన్నుకొనబడియున్నది. తిరువాన్కూరులో నొకస్త్రీ మంత్రిణిగా నియమింపఁబడి సమర్థతతో నిర్వహింపుచున్నది. ఇంకను పెక్కు స్థానికసభలలోను విద్యా సంఘములలోను స్త్రీలు సభ్యురాండ్రుగా నియమింపఁబడుచున్నారు. కాని యీా స్వాతంత్ర్యపు హక్కులు సమర్థతతో నిర్వహింప గోరుచో స్త్రీలు మంచి విద్యావతులుగా నుండవలెను. మనదేశపు స్త్రీల విద్యాభివృద్ధికి బాల్యవివాహములు ప్రతిబంధకముగా నున్నవి. వానిని రూపుమాపవలెను. మీారు లక్ష్మీపూజచేయుదురు, సరస్వతీ పూజచేయుదురు. గాని మీా బిడ్డలకు లక్ష్మి ప్రసన్నతలేదు. సరస్వతీ ప్రసన్నత యసలేలేదు. లక్ష్మియన వేరేలేదు. సరస్వతి యన వేరేలేదు. స్త్రీ శక్తి స్వరూపము. కాన స్వశక్తిచే స్త్రీ,

లక్ష్మియు సరస్వతియు కావచ్చును. కాని యట్టిశక్తి యిప్పుడు మీలో స్తంభించిపోయినది. ఎట్టి సాహసకార్యములనైన చేయవలసిన మీ రిప్పుడు బిడియమునకును పిఱికిదనమునకును గుఱియై యశక్తలై పోయినారు. సీత, సావిత్రి మున్నగు విదుషీమణు లిట్టిబిడియమును పిఱికిదనమును గలిగియున్నచో నట్టి ప్రసిద్ధములైన కార్యముల చేయగలిగెడి వారేనా? కృష్ణుని వంటి బిడ్డలను కనగలిగెడివారేనా? ఇప్పుడు చూడుడు! కృష్ణుని వంటి కుమారు డెక్కడైన కన్పడునేమో?

మీరు కాశీ రామేశ్వరాది పుణ్యయాత్రల చేయతలంచుచుందురు. కాని యది చిన్నతనమున చేయవలసినది కాదనియు వార్ధక్యమే దానికర్హ సమయమనియు అప్పుడే దానధర్మాది పుణ్యకార్యముల చేయవలయుననియు మీతలంపు. కాని భూతదయాపశ్చాత్తాపములచేతను జాతిమత భేదములు లేని విశ్వమానవ భ్రాతృత్వముచేతను నకల్మష హృదయముచేతను మనతనువే పుణ్యక్షేత్రముగాఁ జేసికొనవచ్చును. జీవితమే యాత్ర. అన్నిటికిని మనస్సే ప్రధానము. చిత్తసంస్కారములేని యాత్రలవలన ఫలములేదు. తోడి మానవుల నస్పృశ్యులనుగా భావించుట తప్పు. మానవులంద ఱొకటె. స్త్రీ, ప్రేమకు స్థానము. ఒకజంతువును చూడుడు. దానిబిడ్డ నెవరైన నేమియైన చేయవచ్చిన నెట్లు పోరాడునో. అట్లే స్త్రీగూడ తన బిడ్డల కేమైన ప్రమాదము వచ్చినచో తన ప్రాణమునైన నర్పించుటకు సాహసించును. అట్టి ప్రేమను స్త్రీలొక్క తమ బిడ్డలమీదనే గాక తమ యిరుగు పొరుగువారి మీదను తమదేశము మీదను

అంతియేగాదు సర్వమతములవారి యెడలను సర్వ మానవుల యెడను సమస్తభూత జాలముల యెడలను గూడ గలిగి యుండ వలెను. స్త్రీలకు సౌందర్యభ్రమ యధికము. సౌందర్యము వెల లేని నగలు ధరించుటలో లేదు. విలువైన చీరలను ధరించు టలో లేదు. మొగమును పలుమారు సబ్బులతో గడుగుటలో లేదు. నిర్మలమును కరుణాభరితమును ప్రేమపూర్ణమునునగు హృదయమును గలిగియుండుటయే స్త్రీకి నిజమైన సౌందర్యము. అట్టి సౌందర్యమును మీరు బడయగోరెదను."

శ్రీమతి సరోజినీదేవి యుపన్యాసమును ముగింపగా ఖద్దరునుగూర్చి కొంచెము చెప్పుడని యొక సభ్యురాలడిగెను. దానినిగూర్చి యామె యిట్లు చెప్పెను.

"ఖద్దరనగా గాంధిగారి సందేశము. గాంధిగారి సందేశ మనగా ఖద్దరు. ఈమధ్య ఆఫ్గన్ స్థానపుప్రభువు బొంబాయికి వచ్చియుండెను. ఆయన సభలోనికిరాగనే యెక్కువ ముతుక చీరను గట్టియున్న మహాత్ముని భార్యనుచూచి "ఓ, యెక్కువ ముతుకచీరను గట్టియున్నదే యీయామెయే గాంధిగారి సతి"యని యామెను గుర్తుపట్టి ఆఫ్ఘన్ రాజు యెంతయో సత్కరించినాడు. ఆయన తన స్వతంత్రరాష్ట్రమునుండి తెచ్చిన సందేశమేమనగా "మా రాజ్యమునందు విదేశవస్త్రమునువాడు నలవాటులేదు. నారాష్ట్రివాసులెల్లరు తమ చేతులతో స్వయముగా వడుకబడి నేయబడిన గుడ్డలనే ధరింతురు. ఎంత శ్రీమంతులైననుగూడ ఆఫ్గనులు స్వదేశవస్త్రములనేగాని విదేశవస్త్రముల ధరింపరు. ఈవిషయమై మీకు సందేశ మీయగలిగినందులకు నేను చాల

సంతోషింపుచున్నా"నని చెప్పియున్నాడు. ఖద్దరు వస్త్రములను ధరించుటయనగా నిరుపేదలకన్నమిడుట యన్నమాట. మీశరీరములు స్వదేశీయములేగాని మీరు ధరించిన వస్త్రములు మాత్రము స్వదేశీయములుగా లేనట్లు కన్పట్టుచున్నది. కాన మీరందఱు నూలువడికి స్వదేశవస్త్రముల ధరింపవలెనని కోరుచున్నాను."

మిత్రమా, సరోజినీదేవి యుపన్యాసమునందలి ముఖ్యాంశము లివియని జ్ఞాపకము. వీనిలో నేదైన పొరపాటులున్న నవియేయని యెంచుము. మేము వేసవిని చల్లగఁ గడుపవలెనని యిచ్చట కేతెంచితిమి. ఇచ్చట యెండలు తక్కువ. వేడిగాడ్పులసలేలేవు. చెమట పోయుటయేకానము. ఈదినములలో మన ప్రాంతములనుండెడి మండుటెండలు, వేడిగాడ్పులు, చెమట స్నానములు, తనియని దాహములు తలఁచుకొని యీయూరి యెండలను తలంచినప్పుడు యేపుష్యమాఘమాసపు యెండలుగనో గాన్పించుచుండును కాని యీ యెండలకే అడలిపోవుచున్నా రిచ్చటివారు. చూచితివా చిత్రము!

భావపురి
1928 జూలై

స్త్రీప్రియమైన
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—
నెచ్చెలీ,

మాసము దినములనుండి నా కొకటే రైలుప్రయాణము. అందువలననే నీకు జాబు వ్రాయుటకుగూడ వీలైనది కాదు. నీవు రెండుత్తరములు వ్రాసినను ప్రత్యుత్తరము వ్రాయకపోతిని. ఏమనుకొనుచుంటివోయని పలుమా రను కొంటిని. కాని భుజించినచోట నిద్రింపక, నిద్రించినచోట భుజింపక నిరంతరప్రయాణము చేయుచున్న నేను నీకు జా బెట్లు వ్రాయుదును? కాన ఉత్తరము వ్రాయునప్పుడు నా యలసత్వ మునకు క్షమింప వేడుకొనవచ్చునని మిన్నకుంటిని. జాబునకు జవాబువ్రాయక స్వస్తివాచకములు చదువుచున్నదని మిత్ర మా, నాపై కినియకు. నీకు జాబు వ్రాయకపోయినను ఈ నెలదినముల రైలుప్రయాణములో నీకు పదిజాబులు వ్రాయ జాలు పదార్థమును సేకరించుకొని వచ్చితిని సుమా! దాదాపు పగలు ఒంటిగంటవేళ మేము గూడూరులో తిరుపతిబండి దిగి చెన్నపురినుండి వచ్చు ప్యాసింజెరు నెక్కితిమి. నేను కూర్చుం డిన స్త్రీలపెట్టెలో దాదాపు పదునాలుమంది స్త్రీ లుండిరి. వారంద ఱొక్క కులమునకుగాని మతమునకుగాని భాషకు గాని చెందినవారుకారు. ఒక్కవైపున వైష్ణవస్త్రీ లిద్దఱు కూర్చుండి అరవమున మాట్లాడుచుండిరి. మఱి యొక దిక్కున దత్తమండలమునుండి వచ్చు మధ్వస్త్రీ లిరు

వురు "హోకుబేకు" మనుచు కన్నడమున మాట్లాడుచుండిరి. మఱొక బల్లపై దేశస్థ బ్రాహ్మణస్త్రీలు ముప్వురు కూర్చుండి "హైస్ బైస్" యని మహారాష్ట్రమున మాట్లాడుచుండిరి. వేరొకదిక్కున మహమ్మదీయస్త్రీలు నల్వురు కుతకుత నుడికి పోవుచున్న యీ మధ్యాహ్నపుటెండలో తెగమాసిన యీ మేలిముసుగు దుప్పటులు కప్పుకొనజాలకయు తీసివేయజాలకయు కులస్థుడు కనపడగనే ముసుగును దిగదీసికొనుచు, వెళ్లగనే యెగదీసికొనుచు "కౌనుసీగామ్ గయే, కహాసే ఆతీహో" యని ఒకరినొకరు ప్రశ్నించుకొనుచు మాట్లాడుచుండిరి. తక్కినవారు మన తెలుఁగువారు. భాషాపరిచయము కాని యీ యపరిచితలతో నేటి ప్రసంగమని చేతిలోనున్న నాటి యాంధ్రపత్రికను తిరుగవేయుచు నేనుగూడ నొకవైపున గూర్చుంటిని. రైలు గూడూరు విడిచెను. బండిలోనివారెక్కడివా రక్కడ సర్దుకొని కూర్చుండి పరస్పర సంభాషణల కుపక్రమించిరి. ఒక మహమ్మదీయస్త్రీ హిందూస్థానీభాషలో మీ దేయూరని దేశస్థ బ్రాహ్మణస్త్రీల నడిగెను. మాది యిందోరు రాజ్యమని వారనిరి. ఇందూరుమాట వినగనే యీమధ్య జరిగిన శర్మిష్ఠాకల్యాణము జ్ఞాపకమువచ్చి వారితో ప్రసంగింపవలెనని నాకు కుతూహలము కలిగెను. అంత చదువుచున్న పత్రికను ముడిచి, వచ్చియు రాని హిందీముక్కలతో "ఈమధ్య దొరసానిని పెండ్లాడినది మీదేశపు ప్రభువేగదా" యని నేను వారి నడిగితిని. "అవున"ని వారనిరి. "చాల ఆశ్చర్యకరమైన సంగతి" యని నేనంటిని. "పదిరూపాయ

లాసచూపగనే పాశ్చాత్య కైస్తవస్త్రీ హిందూ మరాటా స్త్రీగా మారు టాశ్చర్యము గాదా" యని వారు నవ్విరి. "ఆయన కిదివఱ కిద్దఱు భార్యలున్నారట గాదా" యని నే నంటిని. "ఇద్దఱుగాదు ముగ్గుర"ని వారనిరి. ముగ్గురా అని నే నాశ్చర్యముతోడను సందేహముతోడను బ్రశ్నింప "మంత జుబేగ మొకభార్య యుండలేదా? దానితో ముగ్గురని" నవ్విరి. "సరిసరి అట్టిభార్య ఆమె యొక్కతేయని చెప్పుటెట్లు? ఎంద ఱున్నారో, దాని కేమిగాని మీరాజు రాజ్యచ్యుతుఁడు గదా" యని నే నంటిని. "అవును. ఆయన కిరువదేండ్ల వయ స్సుగల కొడుకున్నాడు, ఆయన యిప్పుడు రాజు" అని వా రనిరి. "తుకోజీ హోల్కారు కెంత వయస్సుండు"నని నే నంటిని. "సుమారు నలుబదై దేండ్లుండవచ్చు"నని వారనిరి. "అహో! కాంతా మోహ"మని, నే నాశ్చర్యముతో నవ్వి తిని. తెల్లపిల్లిని నల్లపిల్లిగా మార్చినందుకు స్వాములకిచ్చిన సంభావన తొంబదివేలనిగూడ వారే చెప్పిరి. అందు అతిశ యోక్తులుగూడ కొంత యుండెనేమో కాని కొంతయైన నిజమే యనుమాట మనము పత్రికలలో చదివిన విషయము లనుబట్టి నిశ్చయింపవచ్చును గదా యని నే ననుకొంటిని. మే మిట్లు ప్రసంగింపుచుండ నా ప్రక్కను గూర్చుండిన యొక స్త్రీ యేమి మాట్లాడుచున్నారని నన్నడిగెను. శర్మిష్ఠాకల్యాణ మునుగూర్చి నేను పత్రికలలోఁ జదివిన విషయముల నామెకు జెప్పితిని. అంత నొక వృద్ధురాలు నా దిక్కుమొగమై "పద్నాలుగేండ్లు నిండితేనెకాని ఆడపిల్లలకు పెండ్లి చేయరా

దని మన దేశంలోగూడ శాసనం వస్తున్నదట గాదా" అని నన్నడిగెను. అవునని నేనంటిని. "ఏమి కానికాలం వచ్చిం దమ్మ! అన్నేండ్లు పెంచితే పిల్ల పెద్దమనిషికాదా?" అని యామె యడిగెను. "కావచ్చు"నని నేనంటిని. "అయితే బ్రాహ్మణీకం బండలైపోయినట్లేగా, శూద్రులతోపాటే మన మూను?" అని ఆమె కోపముగా బలికెను. నేనేమియు మాట్లాడలేదు. ఇంతలో ఒక లేబ్రాయపు వితంతువు అందు కొని "పోతేపోనీ పదునాలుగేండ్లయినా రాని పిల్లకు పెం డ్లేమిటి? అయిదేండ్ల కుంకకు పెండ్లిచేశారు. ఇట్లా ముసుగేసు కొని యేడుస్తున్నాను. అయినదేమో అయినది. ఇక ముందు వాండ్లకైనా న్యాయం జరిగితే అంతేచాలు" అనెను. "పిచ్చి దానా, ఎవరికర్మము వారిది. ఎవరి నోసటివ్రాలు వారిది. పద్నాలుగేండ్లకు పెండ్లిచేస్తేమాత్రము విధవరికము తప్పు తుందా" అని వెనుక ప్రశ్నించి నామె పలికెను. "పదునాలు గేండ్లలోపు వైధవ్యమైన తప్పుతుంది గాదా? పెనిమిటిసంగతీ పెండ్లిసంగతీ కొంచెమైనా బోధపడుతుందిగాదా? ఇపుడు యే మట్టీలేదుగా, నామట్టుకు నాకు అయిదోయేట పెండ్లిచేశా రుట. ఆ తరువాత మూడునెలలకే ఆ పిల్లవాడు పోయినా డట. నాకు ఆ పెనిమిటిపోలికైనా గుర్తులేదు. ఇది న్యాయ మని మీరంటారా?" అని యా వితంతువు పలికెను. ముస లమ్మ నిరుత్తరయయ్యెను. ఇంతలో మఱొకస్త్రీ అందుకొని "దేవుని దయవల్ల ఆ శాసనము రావలసినదే; అపుడుగాని యీ తల్లిదండ్రుల ఆటలు కట్టుపడవు. రామ! రామ! తల్లి

దండ్రులు ఆడపిల్ల నెంత అన్యాయము చేస్తున్నారు? అమ్ముకోవడము, అప్రయోజకుడి కియ్యడము. బదులుకు బదులిచ్చి చేసుకోవడము. ఒకటా అకృత్యము? ఆడపిల్లంటే అమ్మానాయనలచేతి చెలామణి నాణెము; కాకపోతే పుచ్చినపక్క, చిల్లిగవ్వ, ఎంత నిస్సారం” ఇట్లనుచుండగా నామెకన్నుల నీళ్లు గిఱ్ఱునదిరిగినవి. పలుకులు గద్గదికమైనవి. ఆ స్థితినిజూడ తల్లిదండ్రులచే నామెగూడ నేదియో సంసారపు కష్టమునకు లోనైనట్లుగా నాకు దోఁచెను. ఆమె వృత్తాంతమును పూర్తిగా నెఱుగవలెనని యూహించితిని. కాని యాత్రె నెట్లడుగనగునో, ఏమడిగిన నేమనుకొనునో యని క్షణమాత్ర మాలోచించితిని. తుదకు యేమైన ననుకొననిమ్ము చెప్పిన విందును. చెప్పకున్న నూరకుందును. అడిగిన తప్పేమియని సాహసించి “అమ్మా మిమ్ములనుచూడ చాల కష్టపడిన వారుగా గన్పట్టుచున్నారు. తల్లిదండ్రు లనాలోచితముగా గావించిన వివాహమే మీ కష్టములకు కారణమని యూహ గలుగుచున్నది” అని నేను పిఱికిపిఱికిగా వ్యత్యస్తముగా నడిగితిని.

“తల్లికి నేను నోచుకొనలేదు. తండ్రిచేసిన యుపకారము వల్లనే యిట్లా అల్లాడుచున్నాను.” ఆమెకు మరల కన్నులనీళ్లు క్రమ్మెను. పైట చెఱగుతో నద్దుకొనెను. ఆమె యిచ్చిన జబాబువలన నాప్రశ్నకు సుముఖయైయున్నట్లు నాకుదోఁచెను. కాన “పాపము! మీకు తల్లి చిన్నతనముననే పోయినదా? ఆడఁది చేసికొనిన పాపములలో చిన్నతనముననే తల్లి కఱవగుటొక

పెద్దపాప"మని నేనంటిని. "అవును, మాతల్లిపోవునప్పటికి నావయస్సైదేండ్లు, మా పెద్దక్కయ్యకు పద్దెనిమిదేండ్లు, మా చిన్నఅక్కయ్యకు పదై దేండ్లు, మాపెద్దన్నయ్య పదిరెండేండ్లవాడు, మాచిన్నన్నయ్య యెనిమిదేండ్లవాడు. అప్పటికే మాఅక్క లిద్దఱు కాపురమునకు వెళ్ళినారు. మాపెద్దన్నకు వడుగైనది. తక్కిన పసికూనలమైన మమ్ము కష్టపరంపరలకు గుఱిచేసి మాతల్లి చనిపోయినది. మా నాయనకప్పటి కేబదేండ్లున్నవి. తల పులగము పదునుగా నెఱసియున్నది. అప్పటికి మా పెద్దక్క కొక కొడుకుగూడ పుట్టియుండుటచే తాత గూడనైనాడు. న్యాయమున కాయన వివాహమను మాట మనస్సునగూడ స్మరింపరాని సమయమది. అయిననేమి. పాపిష్ఠి లోకము పెండ్లము చావగనే మగవానిని పెండ్లికొడుకును జేయుచుండునుగదా. "నాయనా! వచ్చేది పెత్తనము. ఇంట్లో ఆడదిక్కు లేకపోతే ఎట్లాజరుగుతుంది? కోడళ్లు కూతుళ్లు ముప్పూగడుపుతారా? చేసుకున్నదానికంటే తప్పదు. ఏదో పదిరూపాయలు కర్చైనా ఒకచిన్నదాన్ని ముడిపెట్టుకుంటే సరిపోతుందిగదా." అని బంధువులలోను పరిచయులలోను పెద్ద పెద్దలందఱు పదే పదే సలహా చెప్పుట సాగించినారు. భార్యచావగనే పెండ్లాడుద మనెడి కోరిక మనదేశములో ప్రతివానికి, అందులో యేండ్లుచెల్లినవాని కుండుట సర్వసాధారణమే కదా! మగడు చావగనే మగువ వాంఛ లేవిధముగా నడుగంటిపోవునో మగువ చావగనే మగవాని కోరికలావిధముగా నీరికలెత్తుచుండును. భర్తృహీన పసిదేయగుగాక, యామెవాంఛ

లడవి పువ్వులవలె నిరుపయోగముగ రాలిపోవలెను. కళత్ర విహీనుడు వృద్ధుడేయగుగాక, వాని వాంఛలు మ్రోడు మ్రాకున చిరువులెత్తినట్లు చిగిరించవలెను. ఇది యెట్టి న్యాయము? బాలవిధవ వైరాగ్యమునకు సిద్ధపడవలెనా? నష్ట కళత్రుండగు వృద్ధుడు భోగలాలసతకు సిద్ధపడవలెనా? ఆ పసి దాని మోమున భస్మరేఖలును నీ ముసలివాని మోమున చాదుచుక్కయునా? అయ్యో! ధర్మాధర్మ విచక్షణ లోకములో నడుగంటినదనుట కీతార్కాణము చాలదా? వివరింప సాధ్యముగాని యీ దురన్యాయములనుగూర్చి మనలో మన మూహించుకొనిన చాలును. న్యాయము మనకే తెలియును. అదియట్లుండె. వెఱ్ఱిధోరణిలోబడి విషయము మఱచితిని. మా నాన్న పెండ్లికి సిద్ధమైనాడు. కన్యాన్వేషణ మారంభించినాడు. బహుయత్నముమీద, బహు ధనవ్యయముమీద, బహు దారుణపు టేర్పాటులమీద నొక కన్య లభించినది. తలిదండ్రు లాకన్యను మా నాన్నకిచ్చుటకు కొన్ని షరతులను కోరిరి. అవి యేవియనగా తమ కన్యను మా నాన్న కిచ్చుటకు నన్ను తమ కొమారునకు బదులియ్యవలెను. మఱియు తమకు వేయిరూపాయలు కన్యాశుల్కముగూడ నీయవలెను. ఈ యుభయవివాహములను తన కర్చుతో తన యింటనే మా తండ్రి జరుపుకొనవలెను. అంతియేగాక మా యిరువురకును వేయిరూపాయలకు తక్కువగాని నగలను మా నాన్న పెట్టవలెను. మా తండ్రి యన్నిటికిని యొప్పుకొనెను. వివాహము జరిగెను. మా తండ్రి యప్పటికి కొంచెము స్థితి

మంతుడేగాని యా వివాహములతో నతఃపాతాళమునకు క్రుంగి పోయెను. నిండు వార్ధక్యమున వివాహఫలముగా మానాయనకు మిగిలినవి యూరినిండ నప్పులు, భార్యతోడి తిప్పలు—యివి రెండే! ఇకతరువాత నప్పులు మెండై భార్యతోడి పోరాట మధికమై విద్యాబుద్ధులు చెప్పింపలేమి మా యన్నలిరువురు దేశద్రిమ్మరులైరి. రమ్ము పొమ్మనువారు లేమి మా యక్క లిద్ద టింటికి దూరమైరి. ఇక దిక్కుమాలి చిక్కిన మా చెల్లియు నేనును మా సవతితల్లి చేతిక్రింది బానిసీలమై పడ రాని బాధలుపడితిమి. ఇఁక నా దొక్కముక్క చెప్పి ముగించె దను. నా పెండ్లినాటికి నా పెనిమిటికి పదునాఱేండ్లున్నవి. ఆయన యప్పటికే జేనెడుచుట్ట నోటితో, మూరెడు కుచ్చు తలపాగతో, నూరియందలి కొంటె కోణంగులకు మొదలై విద్యాబుద్ధి సంపన్నులగు యోగ్యబాలకులకు వెలియై తిరుగు చుండెను. ఆయన కిక పెండ్లి గాదని యెంచియే తలిదండ్రు లావిధముగా తమ గాదిలి కుమార్తె సుఖమును పణముగానిడి నన్ను బదులుగాగొని పెండ్లిగావించిరి. కూతుండ్ర కాపురము కూలద్రోచియైన కొమరుని నొక యింటివానినిజేయు దురాచా రము మనదేశమున ననాదినుండి యున్నదేగదా! కొమరుడే వారిబిడ్డ, వానిక్షేమము విచారింప వలయుటే వారి ముఖ్య కర్తవ్యము. అందుకు కుమార్తెను బలిగావించుట వారి కొక తప్పుగాదోచదు; కడుపున బుట్టిన బిడ్డయైనను నాడుదియైనంత మాత్రమున నెంతనిర్దయయో కనుడు! చెప్పెడిదేమనగా నేను యుక్తవయస్కురాలనగు నప్పటికే నా పెనిమిటి సప్తవ్యసన

ములఁ జిక్కుకొని యున్న సొమ్మును పాడుజేసికొని చేత నెఱ్ఱని యేగానిలేక మోసములు, దొంగతనములు, దౌర్జన్యములు చేసి, శిక్షలపాలై పడరానిపాట్లు పడెను. నేను పెద్దదాననైన తరువాతగూడ నన్నొకమారైన తనవద్దకు తీసికొనిపోలేదు. పైగ రెండు మూడు మాఱులు మా యింటికేవచ్చి నన్ను తిట్టియు కొట్టియు, బెదరించియు, నా వంటిమీదనున్న నగలు నాల్గుగూడ నూడ్చుకొనిపోయెను. కష్టమో సుఖమో మీరున్నచోటనే నేనుగూడనుందును. తీసికొనిపొండని కాళ్ళు కడుపులు పట్టుకొని బ్రతిమలాడితిని. ఇదిగో నదిగోయని దినములు గడుపుటయేగాని తీసికొని పోవనేలేదు. ఇఁక నేమిచేయుదును? పుట్టినింటి బానిసత్వము స్థిరమైనది. దుఃఖము శాశ్వతమైనది. అల్లైపడియున్నాను. ఇప్పుడా బానిసత్వమునకు గూడ ప్రాప్తిదీరినది. ఏలనందురా మా తండ్రిగారు గతించి పదిమాసములైనది. ఋణదాతలు యిండ్లు భూములు కట్టుకొని పోయినారు. పోగా మిగిలిన దేకొంచెమో చేతబట్టుకొని "నా బిడ్డలిద్దఱకు నాకు రోజులు గడిస్తే అంతేచాలు. నీ కెక్కడ తెచ్చి పెట్టగలను? నీదారి నీవు చూచుకొమ్మ"ని నాసవతితల్లి నన్ను సాగనంపినది. ఆమె వృత్తిగూడ నుత్తమముగా నుండక పోవుటచే నాకుగూడ నక్కడ నుండుట దుస్సహముగానే యుండెను. ఆమె వెళ్ళిపొమ్మనుటయే యొకవిధముగా మేలనుకొంటిని. కాని యెక్కడకు వెళ్ళను? ఇప్పటికి ముప్పదేళ్ళు నిండినవి. తండ్రి యిల్లుదప్ప వేఱుయిల్లెఱుగను. నా సమస్తము

పోయినను పోక నిలచినదొక్క యభిమానము. ఆయభిమాన ముచేత నెట్టి నీచమునకు పాలు వడలేక నెవరియింటికిని బోలేక యీ విధముగా దుఃఖపడుచున్నాను. నా పెనిమిటి బొత్తిగా కనపడకుండపోయి రెండేండ్లయినది. మరల ఆయన జాడ తెలియలేదు. బైరాగులలో కలిసెనని కొందఱును, స్వాముల వారితో తిరుగుచుండెనని కొందఱును, సర్కసుకంపెనిలో చేరె నని కొందఱును, చెప్పుచున్నారు. ఎంతవఱకు నిజమో తెలి యదు. పదిరోజులనాడు తిరుపతిలో చూచితిమని మావూరిలో తిరుపతియాత్రకు వెళ్ళివచ్చిన వారొకరుచెప్ప నీవంటి తల్లివద్ద నాల్గురూపాయలు తీసికొని యిట్లుపరుగెత్తి వచ్చినాను. తిరు పతిలో కన్పడలేదు. కాళహస్తిలో గన్పడలేదు. మరల వెళ్ళి పోవుచున్నాను. కావలివద్ద పల్లెలో మా చెల్లెలున్నది. దాని పెనిమిటి కక్కడ పదైదురూపాయల మేష్టరీపని. వారికే పొట్ట గడవకున్నది. నాకేమి పెట్టగలరు? పెట్టెదరే యనుకొనుడు. యేమని వారింట నుందును? ఉండక నెక్కడకు వెళ్లను? ఆశ్ర యములేని తీఁగవలె" అనునప్పటికి ఆమెకు కన్నులనిండ నీళ్ళు వచ్చినవి. దుఃఖభారముచే మాటాడజాలక తలవంచుకొనినది. ఆమెస్థితి జూచుటచే ఆ బండిలోనున్న మా.కందఱకుగూడ కన్నులనీళ్ళు క్రమ్మినవి. కొంతసేపందఱము పరస్పరాలాప ములులేక నివ్వెఱ జెందినట్లుండిపోతిమి. అప్పుడామె దుఃఖము నుపశమింపఁజేసికొని కన్నీటిని పైఁటచెఱగుచే తుడుచుకొని "అమ్మా నాపాడుచరిత్ర మీకు చెప్పదగినదికాదు. మీ సం తోష ప్రపూర్ణ చిత్తములు నాకష్టగాథ నాలించుటచే శోక

భరితములగును. నా యేడుపు నాకు సర్వదానున్నదే. మిమ్ము గూడ నేల చింతింపఁజేయవలయును? కాని యీ వివాహ శాసనవృత్తాంతము కొంచెముగా వినియుండుటచే ప్రతికూలుర వాదనను ఖండించుటకే నా చరిత్రను జెప్పితిని. పిల్లకు యుక్త వయస్సు వచ్చువరకు పెండ్లిచేయకున్నచో పిల్లయనుమతిని పెండ్లిచేయవలసి వచ్చుననియు, అవ్యక్తురాలగుబాలిక చక్కని వాఁడు కావలెననియు చదువుకొనినవాఁడు కావలెననియు, తంటాలు పెట్టుననియు, పిల్లకు తెలిసియు దెవియని ప్రాయమగుటచే బాధ్యత నెఱుగక, స్థితినెఱుగక, కోరరాని కోరికల గోరుననియు, ఆవిధముగా కన్యను మెప్పింపగలవరుని దెచ్చుటసాధ్యమనియు, కాబట్టి ఆడుపిల్లల వివాహ బాధ్యత తలిదండ్రుల చేతిలోనే యుండుట యుక్తముకాని పిల్లల కొప్పగించుట ప్రమాదకరమనియు, పెక్కురు వాదించుచున్నారు. నా తండ్రి కాని నా పెనిమిటి తలిదండ్రులుగాని తా మేమాత్రము బాధ్యత నెఱిగి మా వివాహములు చేసిరో యోచింపుడు? నా యత్త మామలు అప్రయోజకుఁడగు కొమారునకు పెండ్లిసేయుటకు కడుపారగన్న కొమార్తెను ముసలివానికిచ్చిరి. కూతురుకాపురమటులయ్యె,కొమరుని కాపురమిటులయ్యె. ఇకమాతండ్రియో వార్ధక్యమున పెండ్లికాసపడి తనకాఁపురమును పాడుజేసికొనుటయేకాక నన్నుగూడ బలిబెట్టెను. మాకే యధికారమున్నచో నట్టి ముసలివానిని యామెగాని యిట్టియయోగ్యుని నేనుగాని వరించి యుందుమా? ఇది తలిదండ్రులు బాధ్యతనెఱుగకుండఁ జేసిన యక్రమకృత్యముగాదా? తల్లులారా! ఈదేశమున యిది

నాయొక్కరిత చరిత్రమేగాదు. ఇట్టి వివాహము లసంఖ్యాక ములుగా మనదేశమున నిత్యమును జరుగుచున్నవి. ఇట్టి యక్రమ వివాహ ప్రవాహమును నాపుటకే నేను హరవిలాసశారదాగారి బాల్యవివాహ నిషేధచట్టము నాహ్వానించు చున్నాను. నేనేగాదు. దయార్ద్రహృదయులగు స్త్రీ పురుషులెల్ల రిబిల్లు నాహ్వానించెదరుగాక యని కోరుచున్నాను. అంతియే గాక నలుబదేండ్లు మించిన పురుషుడు వివాహమాడ రాడనియు, అథవా చేసికొనినచో బాలికల జేసికొనరాదనియు గూడ నేమహనీయుండైన శాసనము దీసికొనివచ్చినచో స్త్రీలోక మామహనీయుని కలకాలము కృతజ్ఞయై స్మరింప గలదు. దీనిసంగతి యిట్లుండనిండు. ఇది భవిష్యద్విషయము. ఇప్పుడీ బాల్యవివాహ శాసనము విషయమై మనస్త్రీ లుపేక్షా భావముతోఁ జూడరాదు. స్వార్థచింతచే పురుషులు దీనికి ప్రతికూలురుగానుండ రజస్వలాభయముచే స్త్రీలు దీనికి వ్యతిరేకలగుట మనగోతిని మనము త్రవ్వుకొనుట సుమా. పిల్లలు పద్నాలుగేండ్ల వఱకుంచినచో ఈడేరరా? అని అవ్వగారు భయముతో అడిగినారు. తగిన వరులు లభింపక కన్నెలను పదునాలుగేండ్లవఱకుంచినచో నాపిల్ల లీడేరకుండిరా? చాటునకు సంఘపుతోడ్పాటును, బహిరంగమునకు బహిష్కారమునా? ఇంతకు మనకు మన శాస్త్రములు ప్రతికూలముగాలేవు. ప్రతికూలముగా నున్నది యాచార ఛాందస శ్రోత్రియ సం........

రైలు కూయని కూసినది. కావలి స్టేషను వచ్చినది. 'అమ్మా సెలవు' అని నమస్కరించి యామె దిగిపోయినది. చెప్పదలచిన విషయము పూర్తికాకపోయెనే యని నేను విచారించితిని. 'పాపము చాలా కష్టాలుపడిన మనిషి' అని యొకామె యనెను. 'ఎల్లకాలము దుఃఖపు బ్రతుకే కావడం వల్ల ఆమెబుద్ధి వైశద్యము వెల్లడి కాకున్నదిగాని చాల తెలివి గలది కూడాను' యని మఱియొక స్త్రీ యనెను. 'చదివిన దానివలెగూడ నున్నదని' వేఱొకామె బలికెను. 'ఏమిచదువుకుంటేనేమి ఎంత తెలివుంటేనేమి అటువంటి మొగుడు! అటువంటి పుట్టిల్లు! ఆమె తెలివితేటలేమి జేయను? అడవిని గాచిన వెన్నెల' అని వేరొక నారీమణి పలికెను. 'ఏదో భగవంతుండు ఒక్కొక్కళ్ల మొఖాన అటువంటి అగచాట్లవ్రాత వ్రాస్తూవుంటాడు.' అనిమఱియొక స్త్రీ విచారముదోఁ బలికెను. 'ఇంతకును మొగుడు చదువుకొన్నవాడు కాకపోవడ మొక గొప్ప కొఱత. ఏదో కొంచము అక్షరజ్ఞాన మున్నవాడైతే యిట్లా చేయడని' యింకొకామె రూఢిగాయనెను. 'ఎబ్బె, యిదివట్టి భ్రమ, చదువుకున్న వాడైతే అట్లాచేయడనీ, చదువుకోని వాడైతే చేస్తాడనీ యనుకోడం పొరబాటు. మా పింతల్లి అల్లుడు బి. ఏ. ప్యాసయినాడు. మేనల్లుడేగాని పరాయివాడు కూడాగాదు. యేమిచేశా డనుకొన్నారు?' అని నెల్లూరు స్టేషనులో మాబండిలో కెక్కిన మరియొక యువతి పలికినది. 'ఏమిచేశాడు? ఏమిచేశాడు?' అని మాబండిలోని స్త్రీలెల్ల రొక్క పెట్టున నడిగిరి. ఆమె మఱొక కథ చెప్పుట కారంభించి

నది. ఒక్క విషయమై ప్రస్తావన వచ్చినదానిపై నూరు వృత్తాంతములు వాకొనుట మనస్త్రీలకున్న నైజమేగదా; ఆమె చెప్పినదిగూడ నొక దీర్ఘకథ. ఇప్పటికే లేఖ కడు దీర్ఘమైనది. వ్రాయుటకునాకు విసువు లేకపోయినను చదువలేక నీ వెక్కడ విసుగు కొందువోయని నాభయము. విరమించు చున్నాను. పై కథకు ముందులేఖను కనుము.

భావపురి
1928 సెప్టెంబరు

మిత్రురాలు,
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు—

నెచ్చెలీ!

గతలేఖ నొకమాఱు స్మరించుకొంటివేని నెల్లూరులో మా పెట్టెలో కెక్కినయొకస్త్రీ తన పినతల్లి కొమార్తెవృత్తాంతమును చెప్పుటయు నాసమాచారమును లేఖావిస్తరభీతిచే నేనప్పటి కాపుటయు నీకు జ్ఞాపకమువచ్చును. ఆమె చెప్పిన వృత్తాంతమిది:—

"మా పినతల్లి కసలు యిష్టములేనేలేదు. మా పినతండ్రియే చెల్లెలితో యోచించి పిల్లనిచ్చి పెండ్లిచేసినాడు. పిల్లవాడప్పుడు స్కూలుఫైనలు తరగతిలో చదువుచున్నాడు. పదునాఱేండ్లున్నవి. "తండ్రి రివిన్యూయిలాకా గొప్పహోదాగల నౌకరీలో నున్నాడు. భూస్థితిగూడా నున్నది. పిల్లవాడు చదువుచున్నాడు; చిన్నవాడు; చెల్లెలికుమారుడు. న్యాయమైన యుక్తమైన మేనరికము. కాబట్టి తండ్రివలె నేదియో గొప్పయుద్యోగము చేయునని గంపెడాశతో మాబాబాయి వారియింటిచుట్టు తిరిగి తిరిగి పిల్లనిచ్చి పెండ్లిజేసినాడు బాహ్యమునకా సంబంధము ఉత్తమోత్తమ మైనదిగానే కన్పడుచున్నది. కానియిటు పిల్లతల్లియైన మాపిన్ని కాసంబంధమెంత సమ్మతముగా నున్నదో, అటుపిల్లవాని తండ్రియైన యాయున్నతోద్యోగికిగూడ అంతసమ్మతముగానే యున్నది. అయితే మా

పిన్ని కిష్టములేకపోవుటకు కారణ మా సంబంధము మంచిది కాదని కాదు, "తండ్రికొడుకుల యిష్టమంతంత మాత్రముగా నుండ పిల్లనంత బలవంతముగా కట్టిపెట్టుటెందులకు? మనకు తగిన సంబంధమేదైన చూడరాదా? మనపిల్ల నిష్టపడిచేసి కొనెడి వారికే యీయరాదా" యని యామె యభిప్రాయము. కాని మాబాబాయి ఆమెమాటను లక్ష్యపెట్టలేదు. 'ఆయన ఒప్పుదల ఎప్పుడట్లాగే ఉంటుంది. పెంకెవాడు. సరసముగా సమాధాన మీయడు. ఆయన స్వభావమది. అంతమాత్రము చేత మనపిల్ల కాపురమున కేమిప్రమాదమని' వియ్యంకుని విషయములోను "పసివాడు, వాడికేమి తెలుస్తుంది; ఇప్పుడు వద్దువద్దంటే మాత్రము మూడుముళ్లు పడ్డతరువాత పిల్లను యేలుకోక వెళ్లగొడ్తాడా యేమిటని" పిల్లవాడి విషయము లోను సమాధానముచెప్పి వివాహము కావించినాడు. పెండ్లి నాడే ఆపిల్లవాని వైఖరి యెడమొగము పెడమొగముగా నున్నది. అది చిన్నతనపు చేష్టయని మనస్సమాధానము చేసికొనినాము. ఏదోవిధముగా పెండ్లియైనది. తరువాత పిల్లను తీసికొని వెళ్ళుట, గృహప్రవేశము చేసికొనుట, మొదలైన తంతులు జరుగనేలేదు.

వివాహమైన ఒకసంవత్సరమునకు మా చెల్లెలు సమర్తాడినది. శాంతినక్షత్రము. శాంతి చేసికొనవలసినదని యెన్ని విధముల తెలియబఱచినను ప్రత్యుత్తరమే లేదు. తుదకు మా పినతండ్రియే స్వయముగావెళ్లి "శాంతిమాటేమని చెల్లెలి

నడుగ, "అన్నయ్యా! నేనేమిచేసేది? వాడు నాఅదుపులోలేడు. వాడికా తండ్రిగారు సహాయము. శాంతేమిటి సింగినాదము చేసుకోకపోతే యేమని యిద్దరు ఒక్కమాటగా పల్కుతున్నారు. ఏమిచేస్తాము? అయిననాటికే అవుతుంది. ఊర్కో" మన్నదట అంతటితో పులిమి పుచ్చుకొని మాబాబాయి యింటికి వచ్చినాడు.

మఱిరెండేండ్లు గడచినవి. పిల్లను తీసికొని వెళ్లెడియత్నమే లేదు. పిల్లవాడప్పుడు ఎఫ్.ఏ. ప్యాసయి బి. ఏ. చదువుచున్నాడు. పిల్లకు పదునైదేండ్లునిండి పదునారవయేడు వగ పడినది. ఈడేరినబిడ్డ నెంతకాలమని యింట నుంచుకొందురు? ఒకవేళ తలిదండ్రులకు భారము లేకపోయినను లోకమునకు భారముగదా. "మీ అమ్మాయిని అత్తవారింటి కంపకుండా వూరుకున్నా రేమండీ" అని నిత్యమడుగు నమ్మలక్కలకు సమాధాన మీయలేక సగము వేసారిపోయినాము. ఏదో ముదుక సామ్యమున్నది వింటిరో, లేదో, కూతురింటికి మఱుగు దొడ్డికి అసహ్యపడుచునైనను పోకతప్పదట. ఆ విధముగానే పిల్లను పోషింపలేని పేదవారివలె మాబాబాయి పిన్ని యిద్దరు కలిసి పిల్లను తీసికొనిపొండి యని చెప్పుటకు, వియ్యాలవారి యింటి కేగినారు, "మీ కోడలిని మీరు తెచ్చుకొను"డని బతిమలాడి చెప్పినారు. "నాపెత్తనములేదు, ఆతండ్రియిష్టము, ఆకొడుకు యిష్టము." అని వియ్యపురాలనివేసినది. "పిల్లవాని నడుగుడు, వానికిష్టమైనచో నాకు యిష్టమే"నని వియ్యంకు

డనినాడు. శీతకాలపు సెలవుదినములగుటచే అప్పుడు అల్లుడు గూడ నక్కడనే యున్నాడట. అతనినిచూచి "ఏమిరానాయనా ఎప్పుడు భార్యను తెచ్చుకుంటావు?" అని మేనమామ ముద్దుగానడుగ "నావద్ద ఆప్రస్తావన చేయవద్దని" గొడ్డలి పెట్టుగా ఒక్కమాట అనివేసినాడట. "అయితే ఆబిడ్డగతేమిరా అన "దైవాన్ని అడగండి నన్నడిగేదెందుకు? నన్నడిగే పెండ్లిచేశారా?" అన్నాడట. అంతటితో వారు నెత్తినోరు మొత్తుకొనుచు, వియ్యంకుని వద్దకుబోయి "అయ్యో! ఈ అన్యాయమేమిటి? మీరైన చెప్పండి వింటాడేమో?" అనియడుగ "వాడు చిన్నవాడుకాడు, వాడిమంచిచెడ్డలు వాడెఱుగును; కాబట్టి వాడికాఁపురపు విషయములో నాకుజోక్యములేదు. వాడియిష్టము. మీ యిష్టము" అన్నాడట. అంతటితో హతాశులై "అలో" యని యేడ్చుచు వారు యింటికివచ్చినారు. నాటినుండి యాతనికి పరిచయులగు వారిచే నయమునను, భయమునను, చనవునను, స్నేహభావమునను దయాపురస్సరముగను, 'ఆపిల్లను దెచ్చుకొమ్మ'ని చెప్పింప 'నాకు వద్దు' అని యొక్కటేమాట.

"కారణమేమి, ఆపిల్లయందేదైన తప్పు కనిపెట్టితివా?"

"లేదు"

"చక్కనిది కాదా?"

"నేను చెప్పలేను"

"లేకపోయిన పునస్సంధాన కట్నమేమైన కావలెనా?"

"వద్దు"

"అయినచో నిరపరాధయగు నాబాలిక నకారణముగా నీవు విడనాడుటకు కారణమేమి?"

"ఏమో నేను చెప్పజాలను. ఆపిల్లయందునాకు భార్యా విషయ కానురాగము కలుగలేదు. కాన వద్దు".

"ఏపాపమెఱుగని యాబిడ్డయందు నీవిట్లు నిర్దయుడ వగుట తప్పుగాదా? నీవైనచో బుద్ధిపుట్టినప్పుడు మఱొక భార్యను పెండ్లాడుదువు. కాని నిరపరాధియగు నాబాలికకక తరణోపాయమే లేదుగదా?"

"లేకపోవచ్చును .అది ఆమె తలిదండ్రుల లోపముకాని నాదికాదు. నా అయిష్టతను నేను నా వివాహకాలమందే సూచించితిని. ఆసంగతిని గమనింపకయే నాకు వారామెను గట్టిపెట్టిరి. కాన యామె సుఖము చెరచిన వారామె తలిదండ్రులేకాని నేనుగాదు. అట్టిజననీజనకుల కడుపున బుట్టినందుల కామె యాదుఃఖ మనుభవింప వలసినదేకాని నేనేమి చేయుదును?"

"తల్లిదండ్రులు స్వతంత్రించి వివాహముచేయుట మన దేశములో ననాదిగ జరుగుచున్న యాంచారము. ఆయాచారము మంచిదికానిచో నీబిడ్డలకు నీవట్లుచేయుట మానుము. కాని యొకతల్లిబిడ్డను నీవీ విధముగా ఆ దురాచారమునకు బలిపెట్టవచ్చునా?"

"వేయిమాటలతో నన్ను విసిగింపవలదు. నాకామె యక్కరలేదు. ముమ్మాటికి కక్కరలేదు." ఎందరెన్ని విధముల నడిగినను ఆతడిచ్చు సమాధానమిది, తండ్రియాతనికి సహాయము.

ఈ విధముగా నెనిమిది వత్సరములు గడచినవి. అతడు బి. ఏ. బి. యల్. పరీక్షనిచ్చి చెన్నపురిలో నొకవత్సరము అప్రెంటిసు చేసి హైకోర్టువకీలు పట్టమునుబడసి స్వపురమునకు వచ్చి వకీలుపని చేయుచున్నాడు. వెనుకటి భార్యవిషయమై జాలి.వారికెందుకు? ఎవరో కర్త మనుష్యులువచ్చి నాలుగు సంచులు కుమ్మరించి పిల్లనిచ్చి పెండ్లిచేసినారు. ఆపిల్ల యేడాదిలోనే కాపురమునకు వచ్చినది. పసి నిమ్మపండువంటి కొమారుడుగూడ కలిగినాడు. అతని సుఖమేమో అతడు చూచికొనినాడు. కాని యీ భార్యవిషయమై మాత్ర మాతనికి యోచనయేలేదు. అతను సుఖముగా నున్నందుకు నేను విచారించుట లేదు. కాని యీ పతిపరిత్యక్త గతియేమి? కాసీపెట్టి కొనిన కాయగూరనైన ఉపయోగ యోగ్యముగా నున్నంతవరకు విసిరి పారవేయముగదా! అట్టిచో అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్య నావిద్యాధికు డెంతసులువుగా పరిత్యజించెనో చూడుడు. ఆ కాయగూరలపాటి గౌరవమున కర్హగాదా? అగ్నిసాక్షిగా వివాహమాడిన కళత్రము! ఇట్టివాడు పెద్దమనిషి చదువరి, పైన న్యాయవాది. స్త్రీలకు ధర్మశాసనముల సాయములేదు. లోక సానుభూతిలేదు. వైవాహిక స్వాతం

త్ర్యము లేదు. బంధువర్గపు తోడ్పాటులేదు. సంఘసహాకారము లేదు. ఇక నేమి చేయును? పురుషుని స్వార్థమునకు బలియై పోవును. మా చెల్లెలని నే నభిమానముతోఁ జెప్పుటలేదు. ఆ బాలిక యెంత యుత్తమురాలనుకొంటిరి? ఆ అమాయకమునకు ఆ సౌమ్య భాషణములకు, ఆ వినయసంపత్తికి, ఆవిద్యాసంపత్తి కామె శ్రీరామచంద్రుని యిల్లాలైన యా సీతమ్మకేసాటి. ఇల్లువదలి యీవలికిరాదు; ఎవరితోడను మాట్లాడదు; ఏ లోకాభిరామాయణములకు బోదు; ప్రపంచపుగొడవే యామె కక్కఱలేదు. ఉన్నప్పుడు పని లేనియప్పుడు గ్రంథము—ఈ రెండే యామె కాలక్షేప సాధనములు. ఆమె యెప్పుడును పెద్దగా యేడ్చినట్లు చూడలేదు. కాని యావిశాల లోలలోచనముల యందు లజ్జాదుఃఖములు స్థిరనివాస మేర్పరచుకొనినట్లామె మ్లానవదనమును తిలకించినవారికి స్ఫుటముగా గన్పట్టుచుం డును. ఆమె సాధారణముగా నవ్వనే నవ్వదు. ఒకవేళ నవ్వి నను చిఱునవ్వే! ఆ నవ్వులోగూడ జీవములేదు. చూడు ఒక స్త్రీ జీవితమొక పురుషునిపై నెట్లు నిర్భరపడియున్నదో! ఒక స్త్రీ ప్రాణముదీసిన నేరముకంటె నొక స్త్రీ సుఖమును, సంతోషమును, ఉత్సాహోల్లాసములను నాశముజేసి జీవన్మృతురాల నుగాఁ జేసిననేరము బలవత్తరమైనది. కాని ప్రథమనేరమున కురిశిక్షవేయుదురు. కాని ద్వితీయనేరమునకు పరిశీలనయేలేదు. ఈ జీవన్మృత్యావస్థకన్న బలవన్మరణమే మేలనిగదా పెక్కు మందిస్త్రీ లే నూతిలోనో గోతిలోనోపడి చచ్చుచుందురు. ఇట్టి మరణములకు పంచాయతీసంఘము లే కడుపునొప్పియో

మూర్ఛయో పిచ్చియో హేతువని నిరూపించినను పతి నిరాదరణమే యదార్థహేతు వనునది బహిరంగ రహస్యమేగదా! కాబట్టి నేనుచెప్పునదేమనగా పెనిమిటి చదువరి కాకపోవుటొక లోపముకాదు. కుంటిగాదు; గ్రుడ్డికాదు; నిరక్షరకుక్షిగాదు; పట్టభద్రుడే. అతడిట్లుచేయుటకు కారణమేమి? బాల్యవివాహ మనుటకంటె వేరేమి యనగలము! అంతియేగాదు, అబలయు ప్రతిక్రియా సామర్థ్యరహితయునగు స్త్రీయందు పురుషునకుగల యుదాసీనతగూడ యిందులకొక ముఖ్యకారణము.

— ఈ మధ్య నీబాల్యవివాహ నిషేధచట్టమునుగూర్చి మాగ్రామముననొక సభజరుగ యీ బిల్లునకు ప్రతికూలముగ మాట్లాడిరట. అంతలో వృద్ధుడగు మాపినతండ్రి సభలో నిలిచి తనకొమార్తె దుఃఖగాథను సంతత కన్నీటిధారలతో నేకరువుపెట్టి "నాయనా, నేనుగూడ పూర్వాచార పరాయణుడనే, ఈ యనుభవమే కాకపోయినచో నేనుగూడ మీకంటె నెక్కువగ నెగిరిపడువాడనే; కాని స్వానుభవము నానోరు నొక్కినది. కాన యేబిల్లుకైన వ్యతిరేకింపుడు గాని వధూవరులకు వైవాహిక బాధ్యతనొసంగెడి యీ బాల్యవివాహ నిషేధ చట్టమునకు మాత్రము ప్రతికూలముగా తీర్మానములు గావించి యాడపిల్లలనోట మట్టిగొట్టకుడు. నూరేండ్లపంట. అంతయు మన దేనని నావలెనే బాధ్యతయంతయు నెత్తిపై వేసుకొని యనుకూలములేని వివాహములు గావించి యల్లాడుటకంటె చిఱకాలము కష్టసుఖద్వంద్వమగు సంసారయాత్ర సాగింపవలసిన

వధూవరులకు కొంచము యుక్తవయస్సు వచ్చినమీదట వారి సమ్మతినిగూడ కనుగొని వివాహములు గావించుట క్షేమకరము. శాస్త్రము లనుకూలముగా నున్నవి. ప్రభుత్వమనుకూలముగానున్నది. యువతీయువకు లనుకూలముగానున్నారు. కాన ఆచారముకొరకు చావబోవుచున్న ముసలితొక్కులము మనము ప్రతికూలముగానుండి చేజేత నాశుపిల్లలనేల నన్యాయము చేయవలెను?" అని నమస్కరించెనట. అంతటితో నా తీర్మానమునకు ప్రతికూలముగానున్న పెద్దలనేకు లనుకూలముగా తలయూచిరట. కాన మనస్త్రీ సంఘక్షేమమును కోరువారమైనచో శారదాబిల్లు నామోదింపక తప్పదు" అనియామె చెప్పెను.

ఆ వృత్తాంతమును వినగనే యంతవఱకు శారదాబిల్లుకు ప్రతికూలముగా వాదింపుచున్న తూర్పుగోదావరి ముసలమ్మ "అవును మగవాడు స్వతంత్రుడు. ఆడది అథవస్థపడి కుంటికిచ్చినా గ్రుడ్డికిచ్చినా ముసలికిచ్చినా రోగికిచ్చినా సహించి కాపురంచేయాలి, కాస్తంత నెపంపెట్టి పెళ్ళాన్ని వదిలపెట్టి మళ్లీ పెండ్లాడితే యేడుస్తూ వూరుకోవాలి మఱి? దీనికి తరణోపాయములేదు. ఉభయులు యిష్టపడి చేసుకుంటే యిలా జరగదనుకుంటాను" అనినది. ఇంతలో మాబండి ఒంగోలు దాటినది. మా బండిలోకి మరికొందరు క్రొత్తస్త్రీ లెక్కిరి. వారిలో నొకామె "అవునండి, ఎటువంటి అవిటివాడికిచ్చినా హర్షముతో ఆమోదింపవలసిందే, కాదంటే లోకంలో తలయెత్తరాని అప్ర

తిష్ఠ. మీరు చెప్పినట్లు వంకలేని బిడ్డనిచ్చి పెండ్లిచేసినప్పుడే విడనాడుటింత సులువైనప్పుడు కుంటిదనీ గ్రుడ్డిదనీ రోగిష్టియనీ అనాకారియనీ వంధ్యయనీ భార్యను వదలినవారెందరో విచారించండి. ఆడదిమాత్రము పుట్టుగ్రుడ్డికిచ్చినా కిమ్మనరాదు. వింటిరోలేదో నాపెనిమిటి పుట్టంధుడు" అనెను. 'అట్లాగా పాపము! అటువంటి పుట్టుగ్రుడ్డి కెట్లాయిచ్చారండీ!"అని అందరమొక్కమారుగా నంటిమి. ఆమె చెప్పసాగినది. ఆ చరిత్ర ముందు వ్రాసెదనులెమ్ము.

భావపురి
1928 నవంబరు

ఇట్లు
శా ర ద.

సౌభాగ్యవతియగు కల్పలతకు—

నెచ్చెలీ!

అయిదేండ్లకు పూర్వ మొకనాడు శారదానికేతన సమాచారమును పత్రికలలో జూచి ఆహా! నేటికిగదా ఆంధ్ర కన్యల తపము ఫలించెనని యానందించి యెప్పుడు గుంటూరు వెళ్ళుదును యెప్పుడు శారదాలయము గాంతునని యుబలాట పడి పడి కొన్నాళ్ళకు గుంటూరు వెళ్లితిని. శారదానికేతన మెక్కడనని మా సోదరుల నడిగితిని. సనాతన ధర్మమండలి వారి పాఠశాలయే శారదానికేతముగా మారెనని వారనిరి. అచ్చటికిపోయి చూచితిని. పాఠశాల సాధారణ ఫక్కినే యుండెను. నికేతనము వారు పత్రికలలో దీర్ఘముగా ప్రచురించిన విద్యావిధాన మేదియు నక్కడ ఆచరణమందు గన్పడ లేదు. నాకు మిక్కిలి కోపమువచ్చెను. "పత్రికలలో గంభీర ప్రకటనలు, చూడబోయిన నేమియు లేక పోవుటలు, దేశ భక్తుల కిది పరిపాటిగా నున్నట్లున్నది. పత్రికలనుగాంచి ధన సహాయము సేయుట పొరబాటు" అని యేవగించుకొని యింటికివచ్చితిని, గాని యిది పుట్టి యెన్నాళ్లో గాలేదు. అప్పుడే యింత పెద్దది కమ్మన్న నెట్లగునను వెనుక చూపే నాకు తగులలేదు.

ఒక సంవత్సరము గడచిన తరువాత మరల నొకమాఱు గుంటూరు వెళ్లితిని. శారదానికేతన మెట్లున్నదని మరల మాసోదరుల బ్రశ్నించితిని. "చక్కగానున్నది. ఒక విశాల సౌధములోనికి మార్చబడినది. చాలమంది బాలికలు గురుకుల వాసినులుగా జేరినారు. ఇపుడు చూచిన సంతృప్తి జెందుదువు" అనిరి. వెంటనే వెళ్ళి చూచితిని. నిజముగా పాఠశాల మాఱిపోయెను. ఆ గురుకుల వాసినులగు బాలికలను, జాతీయములగు నా విద్యాపద్ధతులను చూడగనే నా కెనలేని సంతసమొదవెను. తక్షణమే ఆ విద్యాలయము మీదను ఆ విద్యాలయ ప్రతిష్ఠాపకులమీదను నా కెనలేని భక్తిప్రేమలు కుదురుకొనెను. నాడాదిగ నేనెన్నిమాఱులు గుంటూరు వెళ్ళినను ఆ విద్యాలయమున కొకమాఱు వెళ్లి చూడకరాను. స్త్రీల పాలిటి కది కల్పతరువువంటి ప్రతిష్ఠాపనమనియు, ఎవరు స్త్రీ విద్యాభివృద్ధిని కాంక్షింతురో, ఎవరికి దేశభక్తియు జాతీయతాభిమానమును గలదో అట్టి వారెల్లరా విద్యా ప్రతిష్ఠాపనమును నాదరించి పోషింపవలయుననియు నాతలంపు కాన పలుమాఱులా పాఠశాలను దర్శించి వచ్చుచుందును.

మా సోదరులుండుటచే నాకు గుంటూరు ప్రయాణమేడాదికొకటి రెండుమాఱులు తగులుచుందును. గత మాసాంతమున మరల గుంటూరు వెళ్లితిని. బ్రాడీపేటలో నాకు నీవంటి యాప్తురాలగు స్నేహితురాలుండెను. ఆమెను చూచుటకై వెళ్లితిని, కాని ఆమె యింటలేదు. అప్పటికి

ధాదాపై దుగంటలు దాటినది. కాని నా ప్రేమపాత్రమగు శారదానికేతన మచ్చటికి కనతిదూరముననే యుండుటచే నాయడుగటుపడెనేగాని యింటివైపునకు తిరుగలేదు. చరమ సంధ్యాకాంతులతో పశ్చిమాశ రాగరంజితమై మనోజ్ఞముగ నుండెను. ఆరుబయలునుండి వీచెడు హోరుగాలి చలిచలిగా నుండెను. నేనారైలుకట్ట ప్రక్కనున్న రస్తాదారినిబట్టి వడి వడిగా శారదానికేతమున కేగసాగితిని. నాకు వంటపని యున్నదమ్మా యనియు, నేను పాఠములు చదువుకొనవలసి యున్నది, నికేతనమునకేగి వచ్చునప్పటికి బాగుగా చీకటిపడు నేమో ఎట్లాగత్తా? అనియు, నాతో వచ్చిన మావదినెయు, మా మేనగోడలును తొందరించిరి. వారిమాటలు నా చెవి దూరలేదు. నన్ను వీడిపోలేక వారును నావెంటనేవచ్చిరి. సింహ ద్వారమను నామము సార్థకంబగున ట్లిరువైపుల సింహపు మూర్తులుగల సింహద్వారమున నికేతనములోనికి బ్రవేశించి తిమి. ద్వారముదాటి నాలుగడుగులు లోనికేగగనే నికేతన పాదపములకు నీళ్లువోయుచున్న గురుకుల వాసినులు మాకెదు రైరి. వారిని చూడగనే కణ్వాశ్రమమున చెట్లకు నీళ్లుపోసిన శకుంతలాప్రియంవదలు జ్ఞాపమునకు వచ్చిరి. కాళిదాస మహా కవి యక్షరరూపమున జూపినదానిని నికేతన ప్రతిష్ఠాపకులు ప్రత్యక్షరూపమున జూపుచున్నారుగదాయని లోలోన హర్షిం చుచు లోనికేగ వార్షికోత్సవమునకు సిద్ధపడెడి యత్నములతో నిండి గైసేయనున్న కాంతవలె శారదానికేతనము గన్పట్టెను. చీకటిపడుచున్నను వార్షికోత్సవమునాటికి తయారుకావలె

ననెడి తలంపుతో తదేకదృష్టితో చిత్తరువులను వ్రాయుచున్న ఉపాధ్యాయులతో విద్యార్థినులతోనున్న చిత్రకళా మందిరము నొకమాఱు కన్నారగాంచి పట్టువస్త్రములపై కద్దరువస్త్రములపై సరిగతోడను పట్టుతోడను విచిత్రలతా వితానములఁ జిత్రింపుచున్న కుట్టుతరగతి బాలల నొకమాఱు మోదమున తిలకించి, వార్షికోత్సవపు ఆటపాటలలో పాల్గొన నాయత్తపడుచున్న కన్యకామణుల గాన కౌశలము నొకమాఱు శ్రవణపేయముగా నాలకించి, తరువాత పాకశాలను తదితర ప్రదేశములను చూచి యింటికి మరలితిమి.

ఆ తరువాత నాలుగైదుదినములకు వచ్చెవచ్చె ననుకొనుచున్న వార్షికోత్సవపు దినములువచ్చెను. తొలినాటి (1-12-28) యుదయము నికేతనములో నూతనముగా గట్టబడిన గృహప్రవేశోత్సవము శాస్త్రోక్తముగా జరుపఁబడెనట. దానిని నేను చూడలేదు. ఆ సాయంత్రమువెళ్లి విద్యాలయ బాలికలచే తయారుచేయబడిన కుట్టు, పేము, చిత్రముల ప్రదర్శమునమునుచూచి యొకతాతగారు చెప్పిన హరికథ నొకకొంతవిని యింటికివచ్చితిమి. మఱునాడు వార్షికోత్సవము. ఆ యుత్సవసందర్శన కుతూహలురై యితర గ్రామములనుండి స్త్రీపురుషు లెందరోవచ్చిరి. ఇఁక నూరివారి యుత్సాహ యత్నములు చెప్పనే యక్కఱలేదు. గుంటూరునందలి ప్రతి స్త్రీయును ఆనాడు నిద్రలేచినదిమొదలు శారదానికేతమున కేగెడి యత్నములోనే యుండెనని చెప్పవచ్చును. సభారంభము

మూఁడుగంటలకైనను నొంటిగంటనుండియే స్త్రీపురుషులెల్లరు జట్కాలమీఁదను, ఒంటెద్దుబండ్లమీఁదను, మోటార్కారుల మీఁదను, కాలినడకను, తండోపతండములుగ పోఁజొచ్చిరి. ప్రతివారిని చోటుదొరకదను భయమే పీడించుటచే యెవరికి సాధ్యమైనంత వేగముగా వారు శారదానికేతనమునకు చేరుకొనిరి. మేము వెళ్ళునప్పటికి దాదాపు మూఁడుగంటలు కావచ్చెను. అప్పటికే జనసమూహము విశాలమగు పందిరిని క్రిక్కిరిసియుండెను. మాకంటె ముందువచ్చియుండిన మా చిన్న వదినెగారి సాయమువలన మాకు కొంచెమనుకూలమగు ప్రదేశమే కూర్చుండుటకు దొరికెను. మా తరువాత వచ్చిన వారికి నిలువుజీతమే. కార్యక్రమము సరిగా మూఁడుగంటల కారంభమయ్యెను. హైదరాబాదు వాస్తవ్యులగు ధర్మవీర్ వామన రామచంద్రనాయక్ గారు నాటి సభాధ్యక్షులు. అధ్యక్షుల యుపన్యాసము స్త్రీల యభివృద్ధికిఁ దోడ్పడెడి పెక్కుహితములతో నుండెను. స్త్రీపురుషుల కార్యక్షేత్రములు భిన్నములుగాన స్త్రీపురుషుల విద్యావిధానముగూడ భిన్నమై యుండవలెనని తగుహేతువులతో వారు నిరూపించిరి. మఱియు ప్రేమ, దయ, శ్రద్ధ, ఉత్సాహము, సేవాపరాయణత, స్వార్థత్యాగము మున్నగునవి స్త్రీగుణములనియు, ధైర్యము, శక్తి, పూనిక, వీరత్వము, కష్టపడిపనిచేయు నలవాటు మున్నగునవి పురుషుల గుణములనియు వారు తెల్పిరి. కార్యక్షేత్రములు భిన్నములు కావచ్చును కాని స్త్రీపురుషులెల్లరు జాతిసామ్యమున ఏకమానవజాతికే చెందియున్నారు. కాన

పైయుత్తమగుణములన్నియు మానవజాతి కంతటికిని కావలసినవే. గుణశీలములకు లింగభేదములేదు. స్త్రీగుణమని పురుషుడు దయను విడనాడినచో స్త్రీ మాడిపోవలెను. పురుషగుణమని స్త్రీ పాటుబడుట మానినచో పురుషు డన్నమునకై యలమటింపవలెను. నాయకుగారి నిర్ణయముప్రకారము ధైర్యము, కష్టసహిష్ణుత, పుంలింగమునకు జెందినవి. స్వార్థత్యాగము, సేవాపరాయణత స్త్రీలింగమునకు జెందినవి. కాని ధైర్యములేనిది స్వార్థత్యాగముగాని, కష్టసహిష్ణుత లేనిది సేవాపరాయణతగాని చేయచొప్పడదు. కాన నొకకార్యసాధనకు స్త్రీపురుషుల తోడ్పాటెట్లవసరమో అట్లే యుభయగుణ సమ్మేళనముగూడ నవసరము. ఇట్టి శంకలకు తావిచ్చెడి యంశము లొకటిరెండున్నను మొత్తముమీద అధ్యక్షుల యుపన్యాసము స్త్రీజనాభ్యుదయ కరములగు పెక్కు దివ్యోపదేశములతోగూడి గంభీరభావభరితమై గమనార్హముగ నుండెను. అనంతరము లక్ష్మీనారాయణ పంతులుగారు గతసంవత్సరకార్యనివేదికమును జదివిరి. తరువాత గురుకుల బాలికల యాటపాటలారంభమయ్యెను. తొలుతనొకబాలిక దైవప్రార్థనముచేసెను. తరువాత నిరువురుబాలికలు గానముచేసిరి. జాతీయగీతమునుబాడిరి. తరువాత కొందరుబాలికలు రామభజనచేసిరి. తెలుగు, సంస్కృతము, హిందీ, మూడు భాషలలో నాటకభాగములను ప్రదర్శించిరి. మూడుభాషల యందును వారివాచకము మనోజ్ఞముగనేయుండెను. సంస్కృతమున వారుభాషించునప్పుడు ప్రాచీనఋషికన్యల దలపించిరి.

మూడుగంటలకైనను నొంటిగంటనుండియే స్త్రీపురుషులెల్లరు జట్కాలమీదను, ఒంటెద్దుబండ్లమీదను, మోటారుకారుల మీదను, కాలినడకను, తండోపతండములుగ పోజొచ్చిరి. ప్రతివారిని చోటుదొరకదను భయమే పీడించుటచే నెవరికి సాధ్యమైనంత వేగముగా వారు శారదానికేతనమునకు చేరుకొనిరి. మేము వెళ్ళునప్పటికి దాదాపు మూడుగంటలు కావచ్చెను. అప్పటికే జనసమూహము విశాలమగు పందిరిని క్రిక్కిరిసియుండెను. మాకంటె ముందువచ్చియుండిన మాచిన్న వదినెగారి సాయమువలన మాకు కొంచెమనుకూలమగు ప్రదేశమే కూర్చుండుటకు దొరికెను. మా తరువాత వచ్చిన వారికి నిలువుజీతమే. కార్యక్రమము సరిగా మూడుగంటల కారంభమయ్యెను. హైదరాబాదు వాస్తవ్యులగు ధర్మవీర్ వామన రామచంద్రనాయక్‌గారు నాటి సభాధ్యక్షులు. అధ్యక్షుల యుపన్యాసము స్త్రీల యభివృద్ధికి దోడ్పడెడి పెక్కు హితములతో నుండెను. స్త్రీపురుషుల కార్యక్షేత్రములు భిన్నములుగాన స్త్రీపురుషుల విద్యావిధానముగూడ భిన్నమై యుండవలెనని తగుహేతువులతో వారు నిరూపించిరి. మఱియు ప్రేమ, దయ, శ్రద్ధ, ఉత్సాహము, సేవాపరాయణత, స్వార్థత్యాగము మున్నగునవి స్త్రీగుణములనియు, ధైర్యము, శక్తి, పూనిక, వీరత్వము, కష్టపడిపనిచేయు నలవాటు మున్నగునవి పురుషుల గుణములనియు వారు తెల్పిరి. కార్యక్షేత్రములు భిన్నములు కావచ్చును కాని స్త్రీపురుషులెల్లరు జాతిసామ్యమున ఏకమానవజాతికే చెందియున్నారు. కాన

పైయుత్తమగుణములన్నియు మానవజాతి కంతటికిని కావలసినవే. గుణశీలములకు లింగభేదములేదు. స్త్రీగుణమని పురుషుడు దయను విడనాడినచో స్త్రీ మాడిపోవలెను. పురుషగుణమని స్త్రీ పాటుబడుట మానినచో పురుషు డన్నమునకై యలమటింపవలెను. నాయకొగారి నిర్ణయముప్రకారము ధైర్యము, కష్టసహిష్ణుత, పుంలింగమునకు జెందినవి. స్వార్థత్యాగము, సేవాపరాయణత స్త్రీలింగమునకు జెందినవి. కాని ధైర్యములేనిది స్వార్థత్యాగముగాని, కష్టసహిష్ణుత లేనిది సేవాపరాయణతగాని చేయచొప్పడదు. కాన నొకకార్యసాధనకు స్త్రీపురుషుల తోడ్పాటెట్లవసరమో అట్లే యుభయగుణ సమ్మేళనముగూడ నవసరము. ఇట్టి శంకలకు తావిచ్చెడి యంశము లొకటిరెండున్నను మొత్తముమీద అధ్యక్షుల యుపన్యాసము స్త్రీజనాభ్యుదయ కరములగు పెక్కు దివ్యోపదేశములతోగూడి గంభీరభావభరితమై గమనార్హముగ నుండెను. అనంతరము లక్ష్మీనారాయణ పంతులుగారు గతసంవత్సరకార్యనివేదికమును జదివిరి. తరువాత గురుకుల బాలికల యాటపాటలారంభమయ్యెను. తొలుతనొకబాలిక దైవప్రార్థనముచేసెను. తరువాత నిరువురుబాలికలు గానముచేసిరి. జాతీయగీతమునుబాడిరి. తరువాత కొందరుబాలికలు రామభజనచేసిరి. తెలుగు, సంస్కృతము, హిందీ, మూడుభాషలలో నాటకభాగములను ప్రదర్శించిరి. మూడుభాషల యందును వారివాచకము మనోజ్ఞముగనేయుండెను. సంస్కృతమున వారుభాషించునప్పుడు ప్రాచీనఋషికన్యల దలపించిరి.

హిందీనాటక సంభాషణలో వారు ఉత్తరహిందూదేశపు బాలికలాయనిపించిరి. ఇఁక తెలుఁగువాచకమున వారు కల్తీలేని తెలుఁగువారే. మధురమైనగాత్రము, మృదులమైనపలుకులు, స్ఫుటమైన యుచ్చారణ, ఉచితమైన అభినయము, హారి యాటపాటలకు వన్నెదెచ్చినవి. అందఱిలో మిన్నయనుపించినది భీమరెడ్డి అన్నపూర్ణయను కన్యాకామణి. పరశురామ గర్వభంగములో రాముఁడామె; భీష్మప్రతిజ్ఞలో శాంతనవుఁడామె; రాధపిలుపులో కృష్ణుఁడామె; సంగీతములో నామె; ఆంధ్రప్రశస్తి పద్యముల చదువుటకామె; వేయేల? ఆ బాలిక పెక్కింటిలో బాల్గొని తన విధిని చక్కఁగా నిర్వర్తించి యెల్లర మెప్పును గాంచెను. అన్నింటికంటె రాధపిలుపులో కృష్ణుని వేషముధరించి యా బాలచూపిన హావభావ ప్రకటన మేమని వర్ణింతును? అప్పటి యామె రూపు నాకిప్పటికిని కన్నుల గట్టినట్లున్నది. ఆ చిఱునవ్వుగూడ కృష్ణునివద్దనుండి యెట్లు పుణికి తెచ్చుకొనెనో! ఆమె అభినయ కౌశలమునకు మెచ్చి సభికులలో నొకరాఱు రూప్యము లామెకు ప్రత్యేకబహుమానమిచ్చిరి. తరువాత ప్రేక్షకులు శ్రద్ధతో వినినది పిసినారి భాషణము. సంస్కృతనాటకమున పరశురామపాత్రము ధరించినబాలయే పిసినారివేషముధరించినది. ఈ బాలగూడ మంచి నిపుణమతి. పరశురామపాత్రమునందు కటకుచూపులు బఱపిన యాబాల పిసినారి వేషమున లుబ్ధత్వమును లోటు లేకుండ ప్రదర్శించి ప్రేక్షకుల కడుపుబ్బ నవ్వించినది. బాలికల యాటపాట లెంత మనోజ్ఞముగ నున్నను దానిని వినగల్గు,

చూడగల్గు భాగ్యము కడు సమీపస్థులకేగాని యన్యులకు కలుగుట బహుదుస్తరమయ్యెను. విశాలమైన యాసభాశాల లోని స్తంభములకు "నిశ్శబ్దము" అని వ్రాసి కట్టబడిన యట్టలు మాత్రమే నిశ్శబ్దముగ నుండెనుగాని ప్రజలుమాత్రము నిశ్శబ్దముగలేరు. ఆఘోష సముద్రపుఘోషకన్న పదిరెట్లధికముగ నుండెను. మన ఆడవారి సంగతియడుగఁ బనిలేదు గదా! కుశలప్రశ్నలక్కడ, నగలపరిశీలన ప్రసంగములక్కడ, వంటప్రస్తావనలక్కడ, పెండ్లిముచ్చటలక్కడ. సరి, ఇఁక పిల్లలయేడుపు ఉండనేయున్నది. తల్లులు తమకుతూహలము కొఱకు శిశువులను జనసమ్మర్దములోవేసి నలిపివేయుచుండ వారు రోదింపకెట్లుందురు? కాని స్త్రీలుచేసిన సందడికంటె చదువులకుఁ జేరిన యే యడ్డులేని మగబిడ్డల యల్లరియే యత్యధికముగానుండి యనేకమాఱులు కార్యక్రమమునకు భంగము కలిగించెను. శారదాలయమువారు మొదట నిర్ణయించిన టిక్కెట్లపద్ధతి యూరిలో నలజడికి గారణమయ్యెనేగాని సభలోని యలజడి మాన్పుటకేమాత్రము తోడ్పడలేదు. ఈ ఘోషచూచిన తరువాత ననేకులు టిక్కెట్లు పెట్టిననే బాగుగానుండునేమో యనుకొనిరి. బాలిక లెన్ని దినములనుండియో శ్రమపడి నేర్చినదంతయు జనుల కలకలముచే వ్యర్థమైపోయినప్పుడు నాకెంతయో విచారము గొల్పెను. శ్రమపడి నేర్చినవారికిని నేర్పినవారికిని నెంత మనస్సునొచ్చెనో!

అనంతరము సాహితీ పరీక్షయందు తీర్ణులైన బాలికలకు పట్టములొసంగబడెను. తరువాత బహుమతులుగూడ నొసంగిరి. ఆబహుమతులన్నియు నెవరోవదాన్యు లొసంగినవే. ఆదాతలపేరు గూడ నక్కడచెప్పుచు బహుమానములిచ్చిరి. ఆటపాటలలో మిన్నయైన అన్నపూర్ణమ్మ బహుమతు లందు కొనుటలోగూడ మిన్నయయ్యెను. అధ్యక్షుల అంత్యోపన్యాసముతోడను బాలికల మంగళగీతములతోడను సభ సమాప్తమయ్యెను. నామనం బానందపరిపూర్ణమయ్యెను.

కల్పలతా! అప్పుడు "తొలినాటి నా తలంపులెంత దుష్టమైనవి? ఏసంస్థయైన పుట్టిననాడే పెద్దదిగానుండుమన్న నెట్లుండును? ఇట్టి మహోత్కృష్ట ప్రతిష్ఠాపమునకై దేండ్ల జీవితమొక దీర్ఘకాలమా?" అని నాలో నేనే సిగ్గిలితిని.

మిత్రమా, ఈ విధముగ శారదా గురుకులము నిష్కళంక దేశసేవాపరాయణులుగ నున్నవారి నిరంతర కృషిచే క్రమాభివృద్ధినందుచు ఆంధ్రకన్యల నాహ్వానించుచున్నది. పుత్రికలు విద్యావతులు కావలెనని యభిలషించెడు తలిదండ్రులకిది మంచి సమయము. తమ పుత్రికల శారదాలయమున కంపవచ్చును. స్త్రీ విద్యాభిమానులగు వదాన్యులోకమున కిదిమంచి యదను. తమ విత్తము నీయుత్కృష్ట ప్రతిష్ఠాపనమునకు దానముచేసి యశోవిశాలురు కావచ్చును. ఆంధ్ర మహాజను లాలోచింతురు గాక. నీ కొమార్తెను శారదా గురుకులమున కంపరాదా?

మిత్రురాలు
శారద.

1929 జనవరి

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ,

నీవు వ్రాసిన యుత్తరము లన్నియు నిన్ననే వచ్చి చూచితిని. నీకు జాబులు వ్రాయుటకే నాకు సిగ్గగుచున్నది. ఏమందువా? ఇకనుండి తప్పక వ్రాయుదునని నీకు వాగ్దత్తము సేయుటయు ఆమఱుజాడే నీకు సకాలమున వ్రాయజాలకపోవుటయు పలుమాఱులు తటస్థించుచున్నది. శారదకు, మాటలకు చేతలకు దూరమని నీవు తలంతువేమోయని నాబిడియము. కాని యిది స్వయంకృతాపరాధముకాదు. దక్షిణదేశయాత్ర జేసెడు భాగ్యము నాకింతలో లభించునని నేను స్వప్నమందైన తలంపలేదు. దైవికముగ క్షణములో తటస్థించినది. ఆనాడు నీకు లిఖింపుచున్న లేఖనర్ధాంతరముననే విడిచి తక్షణమే యాత్రకు సన్నద్ధనైతిని. వైకుంఠేకాదశి నాటికి శ్రీరంగమున కేగవలెనని పయనించెడునాటి మాతలంపు కాని చేరలేకపోతిమి. కాన యూరక చెన్నపట్టణమున నాదిన మేలగుపవలెనని కాంచీపురమున కేగితిమి. ఉన్నతోన్నత ప్రాకార గోపురావళుల తోడను విశాలమైన రాచబాటతోడను ఒప్పారు కాంచీపురము పూర్వవైభవమును చాటుచుండెను. కాంచీపురము విష్ణుకంచి, శివకంచియని రెండుభాగములుగా నున్నది. విష్ణుకంచిలో స్వామి వరదరాజులు, ఆయన భార్య లక్ష్మీదేవి.

శివకంచిలో స్వామి ఏకామ్రనాథుడు ఆయన దేవేరి కామాక్షీ దేవి. దశమినాటి రాత్రి ఎనిమిది గంటలకు మేము కంజీవర మేగునప్పటికి ఏకామ్రేశ్వరుని యాలయములో గొప్ప యుత్సవము జరుగుచుండెను. వెంటనే యాస్వామి దర్శనము సేయ నేగితిమి. వెలలేని యాభరణములతో నలంకృతులైన కామాక్షీ ఏకామ్రనాథులు మాకక్కడ ప్రత్యక్షమైరి. ఆదివ్యమూర్తుల కన్నారగాంచి చేతులార నమస్కరించి మన సార సేవించి హృష్టచిత్తులమైతిమి. ఆదేవాలయమందే నాకొక మిత్రురాలు గన్పడెను. ఆమె పుట్టిల్లాయూరని యెఱుగుదును గాని యామె నప్పుడు చూడగల్గుదునని మాత్రము తలంపలేదు. దైవికముగనే యట్టి భాగ్యము గలిగెను. ఆమె మమ్ము ప్రేమతో తన యింటికి దోడ్కొని వెళ్లి సకల సౌకర్యముల గూర్చి సత్కరించెను. 'ఎఱుక పిడికెడు ధనమ'ని సామ్యమందు రిదియే కాబోలునని యనుకొంటిని.

నాడులేచి ప్రాతఃకృత్యములను దీర్చుకొని సర్వతీర్థమను పుష్కరణిలో స్నానముగావించి కచ్ఛపేశ్వర మేకామ్రేశ్వర కామాక్షీ యాలయముల కేగి ఆయాదేవతల దర్శించి ఆనాడూరేగవచ్చిన స్వాములందఱను దర్శించి రెండు గంటలకు విష్ణుకంచికి వెళ్ళితిమి. మేము వెళ్లునప్పటికి వరదరాజస్వామి వారికి తిరుమంజనము (స్నానము) జరుగుచుండెను. బిందెలతో కుమ్మరించెడు పాలధారలు శిరస్సునుండి ధణాధణ పడుచుండ పాలలో మునిగియున్న స్వామిని దర్శించితిమి. అటనుండి అమ్మవారి యాలయములోని కేగుచుండ నొకమూల కొందఱు

జనులు గుంపులుగా కూడియుండుట మాకగుపించెను. అది యేదియో యరయ మేమును నటకేగి చూడ నచ్చట మిద్దెకు వెండి పైడి బల్లులు అంటించబడి యుండెను. ఆబల్లుల క్రిందుగా నొక నిచ్చెనపై నెక్కి చేతితో ముట్టిన వారు తలకొక యణాయును, క్రిందనుండియే యర్చకుడా బల్లులపైకి గుడ్డ నెగురవేయఆగుడ్డ ముట్టినవారొక యర్ధణాయును నీయవలెనట. ఆ బల్లులను తాకి వచ్చినవారికి బల్లిపాటు దోషముండదట. ఆ వినోదమును రెండు నిమిషముల పాటు నిలువబడి చూచితినేగాని నేను అర్ధణాగాని అణాగాని వ్యయపరచుకొన లేదు. అటనుండి అమ్మవారి ఆలయములోని కేగ ఆమెకును స్నానమే జరుగుచుండెను. అయ్యవారి స్నానము చూడ వచ్చునుగాని అమ్మవారి స్నానము చూడరాదట! కాన అమ్మవారి దర్శనము మాకు కాలేదు. ఆనాడు యేకాదశి యగుటవలన నూరేగింపునిమిత్తము మణిమయాభరణములతో నలంకరింపబడిన యుత్సవ విగ్రహములకడనే స్వామిని దేవేరిని గూడ చక్కగా చూచుట కలిగినది.

వరదరాజస్వామివారి యాలయములో దర్శనీయమైన మండప మొకటి యున్నది. ఆ మండపములోని ప్రతి స్తంభము పైనను భారత భాగవత రామాయణాది పౌరాణిక గాధలెల్ల బొమ్మలుగా చెక్కియున్నవి. నల్లరాతితో చెక్కబడిన యాప్రతిమలు సజీవము లట్లెంతయో కౌశలముగ నిర్మింపబడి యున్నవి. పౌరాణిక గాధలేగాక అశ్వారూఢులగు యోధు

లును, శత్రుమర్దనము సేయుచున్న రాజుల ప్రతిమలును అల నాటి యోధులయు, ప్రభులయు నాకృతులను స్పష్టీకరింపుచు నెంతయో నిపుణముగ నిర్మింపఁబడి యున్నవి. ముష్కరులైన తురుష్కులుశిథిలపఱచిన విగ్రహములుగూడ కొన్నియున్నవి. కాని అవి అత్యల్పమని చెప్పవలెను. కాకతీయ ప్రతాపరుద్ర కృష్ణదేవరాయాది ఆంధ్ర రాజన్యులు, యవనసేనా వాహిని దక్షిణ హిందూదేశమును చొరకుండచేసిరి. ఆనాడాంధ్రు లోడ్చిన రక్తమువలననే నేఁడు దక్షిణ హిందూదేశమందైన పురాతనకట్టడములను జూచు భాగ్యము యావద్భారతీయులకు గల్గినది. దేవాలయములను మసీదులుగను హిందువులను మహమ్మదీయులుగను మార్చి ఉత్తర హిందూదేశ మంతయు భీభత్సముగ జేసిన ముష్కరతురుష్కుల యుద్ధతినణచి దక్షిణ హిందూదేశము యవన హస్తగతము కాకుండ కాపాడిన మన యాంధ్ర వీరుల పరాక్రమాతిశయము సంస్తవనీయమైనది. ఆంధ్రులిందులకు గర్వించవలసినదే. కాంచీపురము చాల కాలము పల్లవరాజధానియై యుండుటచే పల్లవరాజులు కట్టించిన దేవాలయములు పెక్కులున్నవి. పల్లవరాజులు శివ భక్తులు. కాన శివకంచియందలి దేవాలయములన్నియు దాదాపుగా వారు కట్టించినవే. వరదరాజస్వామివారి ఆలయము కృష్ణదేవరాయలు కట్టించెనని యక్కడివారు చెప్పిరి కాని అది యెంతవఱకు నిజమో! మేము తరువాత చూచిన క్షేత్రము చిదంబరము. అచ్చటి స్వామి నటరాజు. ఆయన దేవేరి శివకామసుందరి. నటరాజస్వామికి ఆరుద్రనక్షత్రమునకు

గొప్ప యుత్సవము జరుగును. మేము వెళ్లునప్పటికి ఆరుద్ర దర్శనము రెండు దినములు మాత్రమే యుండెను. కాన పరిషజ్జనముచే పురము క్రిక్కిరిసి యుండెను. నటరాజస్వామి శ్రీమంతులగు నాటుకోటి సెట్లకు యిష్టదైవమగుటచేగాబోలు శ్రీమంతుడుగనే యున్నాడు. స్వామికి గల యాభరణము లన్నియు రత్నాభరణములే. వాహనములన్నియు బంగారు వాహనములే. ఒక్క వాహనములేగాదు. దేవాలయపు పై కప్పేమి, ధ్వజస్తంభమేమి, అంతయు బంగారు మయము. నాడు వానబాధ యధికముగా నున్నను జనసమ్మర్దముగా నున్నను నటరాజస్వామిని బాగుగనే దర్శించితిమి. కాని చిదంబర రహస్యమును మాత్రము చూడలేదు. ఒక సాల గ్రామమునందు కర్పూర హారతిచేసి చూడ నటరాజస్వామి యగపడునట. దానిని ఉత్సవము మూడుదినములు చూపరట. కాన మేము చూడలేదు. అటనుండి కుంభకోణమున కేగితిమి. అచటి స్వామి కుంభేశ్వరుడు. ఆయనభార్య మంగళాంబ. చిదంబరములోనే కావేరి పాయయగు కొల్లడమున్నది. కాన అచ్చటినుండియే పచ్చని పైరులు ఫలవృక్షములు చక్కగా కన్పడజొచ్చినవి. దానికంటె చక్కగా నున్నది కుంభకోణము. కుంభకోణము కావేరీతీరమగుటచే పచ్చని తోటలతోడను చక్కని జలప్రవాహములతోడను శుభ్రజల ప్రపూర్ణములగు పుష్కరిణులతోడను చూడ సొంపుగానున్నది. కుంభేశ్వ రాలయమేగాక సారంగపాణి, దండపాణి, రామస్వామి మున్నగు యితర దేవాలయములు గూడ చాల యున్నవి. అక్కడనుండి

తంజావూరు వెళ్లితిమి. తంజావూరు చారిత్రక ప్రసిద్ధమైన నగరము. చోళరాజులకు రాజధాని. అచ్చటి ప్రసిద్ధమైన బృహదీశ్వరాలయము చోళరాజులు కట్టించినదే. బృహదీశ్వరాలయపు గోపురమువంటి గోపురము మఱి యెచ్చటనులేదు. దాని నీడ భూమిపై పడదట. అది శిల్పశాస్త్రజ్ఞుల నైపుణి యని యచ్చటి వారందురు. ఆ గోపురపు ప్రశస్తినివిని విదేశీయులు గూడ దానిని చూడ వత్తురట. ఆ యాలయములోని నందిగూడ చాల యద్భుతముగా నున్నది. ఆ దేవాలయపు గోపురముమీదను మండప స్తంభములమీదను ఉన్న ప్రతిమలు చిత్తరువులు ప్రాచీనుల శిల్పకళానిపుణతను చాటుచున్నవి. ఆ దేవాలయమేగాక తంజావూరిలో చూడదగిన విశేషములు మఱికొన్ని యున్నవి. అందు ముఖ్యమైనవి పూర్వరాజుల కోటలు, రాజమందిరములు, వారి ఆయుధములు, వాహనములు, వారి చిత్తరువులు మున్నగునవి. వానినెల్ల మేము చూచితిమి. తిరుమలరాయునిదర్బారుమందిర మెంతయో రమణీయముగ నుండి నిన్న నేడు నిర్మించినట్లు క్రొంగ్రొత్తగ నున్నది. తిరుమలనాయుని శిలాప్రతిమగూడనందు గలదు. తిరుమలనాయుని చిత్తరువులేగాక మహారాష్ట్ర ప్రభువుల చిత్తరువులనేక మందు గాంచితిమి. తంజావూరు మహారాష్ట్ర పాలన కెప్పుడు వశమైనదో జ్ఞాపకములేదు. ఆ విషయము తెలిసికొను నిమిత్తము చరిత్రను జదువ నుద్యమించుచున్నాను. ఇంతియేగాక తంజావూరు కోటలో మఱియొక చూడదగిన మందిర మున్నది. అది సరస్వతీమహల్ అను పేరుగల ప్రాచ్యలిఖిత

పుస్తక భాండాగారము. ఈ గ్రంథాలయమున అసంఖ్యాక తాళపత్ర గ్రంథము లుండుటచే కవులకు, పండితులకు చారిత్రక పరిశోధకులకు నిది పెన్నిధిగా నున్నది. అచ్చట కొంద ఉద్యోగులుండి శిథిల గ్రంథములకు ప్రతులు వ్రాయుచున్నారు. మఱికొంద ఱేకాంతమున గూర్చుండి ప్రాచీనగ్రంథ శోధనము గావించుచున్నారు. వారు బహుశః గ్రంథపరిశీలనకై గ్రామాంతరములనుండి వచ్చినవారై యుండనోపు. ఈ విధముగ సరస్వతీమహాలు ఖిలములై జీర్ణములై పోయిన పూర్వ రాజ చరిత్రములను కవి పండిత జీవితములను నెఱుకపరచు భారతీయులకు ముఖ్యముగా దక్షిణహిందూ దేశీయులకు నమూల్య ప్రయోజనము గలిగించుచున్నది. తంజావూరు పాలకులలో మన తెలుగువారు కూడ నుండుటచే ఆనాడు వారువ్రాయించిన గ్రంథములు శాసనములు మున్నగునవి మన ఆంధ్రులచరిత్రము నెఱుగుట కెక్కువగాఁ దోడ్పడుచున్నవి. మిత్రమా! తంజావూరియందు మన ఆంధ్రులుచూచి సంతోషింప వలసిన విశేషములు పెక్కులున్నను దురదృష్టవశమున ఆనాడు వానయధికముగా నుండుటచే తనివిదీర చూడజాలక పోతిమని తెల్పుటకు చింతిల్లుచున్నాను. అటనుండి మధురకు వెళ్లితిమి. మధుర ప్రాచీన నగరము. పాండ్యరాజులకు రాజధాని. మధురలోని మీనాక్షీ దేవ్యాలయము సుప్రసిద్ధమైనది. అచ్చట దేవికే ప్రసిద్ధి యెక్కువకాన మీనాక్షి సుందరేశ్వరుని భార్యయనరు. మీనాక్షీ దేవ్యాలయ మొక మహానగరమువలె నున్నది. ఆ యాలయ పుణ్యస్థలమున లేని వస్తువులేదు.

పువ్వులు, పండ్లు, బొమ్మలు, పటములు, నగలు, వస్త్రములు, పాత్రములు, పరికరములు మున్నగు సమస్తవస్తు దుకాణము లందే యున్నవి. గుడ్డ తీసుకొనిన వారావలకుబోయి కుట్టించు కొనవలసిన బాధలేకుండ నచ్చటనున్న కుట్టుయంత్రములకు లెక్కలేవు. కాని అవి అన్నియు చేతియంత్రములు. కాలితో త్రొక్కెడి కుట్టుయంత్రము లాయూర నరుదుగానున్నవి, యేలనో? చెన్నరాజధానిలో చెన్నపురి తరువాత మధురయే గొప్పపట్టణము కాన నీటికొళాయీలు, విద్యుద్దీపములు, మోటారుకారులు మున్నగు నాగరికపు పరికరములచే పట్ట ణము కలకల లాడుచుండును. మీనాక్షీ ఆలయముగూడ విద్యుద్దీపములతో ధగధగమని ప్రకాశించుచుండును. మీనాక్షీ దేవికిగూడ సంపదకు కొదువలేదు. విలువైన రత్నాభరణము లును పసిడివాహనములును బహుళముగనున్నవి. అయినను మూలవిగ్రహము దర్పములేక సౌమ్యముగనుండును. శుక్ర వారమునాటిరాత్రి యామె దర్శనమే దుర్లభము. కాని దేవి కృపవల్ల మాకానాడుకూడ యామె చక్కగనే దర్శన మొసంగెను.

మధురలోగూడ నొక రాజమందిరమున్నది. అదిధర్మా నాయుడు కట్టించినదట. తంజావూరి రాజైన తిరుమలనాయు డును మధురరాజైన ధర్మానాయుడును మామయల్లుండ్రట. తంజావూరి రాజమందిరములకంటె వేయిరెట్లధిక శిల్పకళా

నిపుణతను ప్రకటింపుచున్నది మధురరాజమందిరము. పదు నాఱుఅంగుళుల చుట్టుకొలతగల పెద్దపెద్ద స్తంభములుగల యీ రాజమందిరమందుగల శిల్పచాతుర్య మేమిచెప్పుదును? లతావితానములేమి? పుష్పమంజరులేమి, పక్షిజాతములేమి? మనుష్య ప్రతిమలేమి!! ప్రతిశిల్పము యథాతథముగ నచ్చొత్తి నట్లుండెను. కల్యాణమండపమని యొకభాగము చూపిరి. అచ్చట పనితన మరయుటకు రెండుకన్నులు చాలవనిపించినది. దానికంటె రమణీయముగానున్నది శయ్యామందిరాంతర్భాగము. ఆయద్భుత శిల్పకళాభవన మరయుటచే విస్మయమును సంతసమును గలుగుటయేగాక నధికమగు విషాదముగూడ గలిగినది. అట్టియద్భుత శిల్పకళాసౌందర్యమున కునికిపట్టులైన యున్నతోన్నత గోపురప్రాకార హర్మ్యావళుల నిర్మించిన యాశిల్పులిప్పుడేరీ! ఆప్రభువులిప్పుడేరీ! ఎట్టికళలు నశించినవి? ఎట్టికళాకుశలు రస్తమించినారు! ఎట్టిరాజ్యములు రూపరినవి! ఎట్టిరాజులు దివంగతులైనారు! భూతవృత్తాంతమును వర్తమానముతో బోల్చిచూచిన, మానసము దుఃఖసంతప్తమై నేత్రము లశ్రుసంసిక్తము లగునుగదా! అలనాడు రాజదర్బారులచే పూజితంబైన యాశిల్పకళామందిర మిప్పుడు దొరతనమువారి కచ్చేరీల కాశ్రయమైయున్నది. ఆదివ్యమందిరము కట్టుటకు ముప్పదైదు వత్సరములు పట్టెనట! సొమ్మెంత వ్యయమయ్యెనో!

మధురలో మనస్త్రీలు మోజుపడి కొనుక్కొనెడి వంట సామానులు పిండివంటల పనిముట్లు అత్యధికముగా గలవు. రంగులద్దకమునకిక మధురఖ్యాతి సుప్రసిద్ధమేగదా.

అచటినుండి రామేశ్వరమున కేగితిమి. రామేశ్వరమొక చిన్నగ్రామము. పాడిపంటల సౌభాగ్య మేమూలను గానరాదు. ఇసుకతిప్పలు, తాటిచెట్లు, మొగలిపొదలు, నాగజెముళ్లుగలిగి నాజన్మస్థానమగు బాపట్లయెట్లుండునో అదియు నట్లేయున్నది. దక్షిణదేశపు దేవాలయము లన్నిటివలెనే రామేశ్వరపు ఆలయముగూడ గొప్పదేకాని పనితనమేమియు నంతగా గానరాదు. రామనాథపురపు రాజుల విగ్రహములును భక్తులవిగ్రహములును నచ్చటచ్చటనున్నవి.

ఒక్కదేవాలయపు ఆవరణయందే చతుర్వింశతి (24) తీర్థములున్నవి. అవిగాక ఊరివెలుపలగా లక్ష్మణతీర్థమను మఱియొక తీర్థమున్నది. రామేశ్వరము వెళ్ళినవారు మొట్టమొదట లక్ష్మణతీర్థమందు స్నానముచేసి ప్రాయశ్చిత్తాదులు గావించుకొనిన వెనుకనే యాత్రార్హత గలుగును. మేమును అట్లేచేసితిమి. తరువాత ధనుష్కోటికి వెళ్లితిమి. ధనుష్కోటికి రామేశ్వరమునుండి రైలుమీద వెళ్ళవలెను. ధనుష్కోటి వద్ద సముద్రుడు నిస్తరంగుడై యుండును, రత్నాకర మహోదధియను నుభయసాగర సంగమమని చెప్పుదురు. కాని ఆయుభయసాగర సంగమ మెచ్చటనో నాకు కానరాలేదు. అక్కడ యాత్రికులెల్లరు నూతనవస్త్రధారులై స్నానము గావింతురు.

అచ్చట స్నానముచేసివచ్చి రైలులోనెక్కి పియర్ అను స్థానమునకు వెళ్లితిమి. అచ్చట విదేశమునుండి వచ్చుయాత్రికులను స్టీమరులోనుండి రైలులో కెక్కించుకొనుటకు రైలు, వంతెన మీదుగా స్టీమరువద్దకేగును. సముద్రమచ్చట అగాధముగానున్నది. కాన తరంగము లుత్తుంగముగా వచ్చుచుండెను. మేమాప్రదేశమున కేగునప్పటికి దాదాపు పదునొకండు గంటలగుటచే నాపట్టపగటి యెండలో నీలమేఘశ్యామల కాంతులతో సాగరజలము రమణీయమై కన్పట్టుచుండెను. స్వచ్ఛమగు ధవళకాంతులీనెడు ఫేనములతోగూడి యువ్వెత్తుగ దూకెడి యాతరంగముల పోటుచూచుటకు విస్మయ జనకముగ నుండుటయేగాక భయంకరముగగూడ నుండెను. రైలునిలిచిన గంటసేపు మాకా సాగరభంగములను యోధులునడచినట్లు బారుబారులై చనుదెంచు ఫేనమాలికలను చూచుటకే సరిపోయెను. ఈలోపుగ తోలుపెట్టెలు, పరుపుచుట్టలు, కాఫీ థెర్మాసులు,టిఫిన్ క్యారియరులు మొదలగు నాగరికపు ప్రయాణ వస్తువులతోను హ్యాటు, బూటు, సూటు, కంటియద్దములు, చేతికఱ్ఱలు మున్నగు అలంకారములతోడను స్వదేశీయులు విదేశీయులునగు నాగరికులెందఱో మాబండిలోనికెక్కిరి. అంత మాబండికదిలెను.

ధనుష్కోటినుండి వచ్చినవెనుకనే యెవరైనను దేవాలయములో నభిషేకములు అర్చనలు మున్నగునవి చేయవలెను. మేమును అట్లేచేసితిమి. దక్షిణదేశపు దేవాలయములన్నిటను

పూజాపురస్కారము లన్నిటికిని టిక్కెట్లు, టిక్కెట్టులేక రైలు లోనికెక్కనీయరో, నాటకమునకెట్లు రానీయరో, ప్రదర్శన ములనెట్లు చూడనీయరో, అట్లే టికెట్ లేక దేవాలయము లోనికిగూడ రానీయరు. సమస్తహైందవులును సాధారణముగా దర్శించి పూజించి పరితృప్తినందవలసిన దేవాలయములు ఆధునికనాగరికమర్యాదలనుబట్టి ప్రదర్శనములవంటి శాలలుగామారి పోయినవి. అనగా సంపత్తిగలవారికే స్వామిదర్శనమన్నమాట. రుసుములేక స్వామి నిర్మాల్యపు పూరేకైన లభింపదు. స్వామి దర్శనము కేవలమీ టికెట్‌తోడనేకాదు. లంచపంచము లిచ్చుటకుగూడ పాల్పడవలెను. ఇన్ని పాట్లుపడినమీదట స్వామి దర్శనము. దక్షిణదేశముననేగాని యిట్టియనుచితపద్ధతులుఉత్తర హిందూస్థానమున లేవనిచెప్పుదురు. సుప్రసిద్ధమైన కాశీక్షేత్రమున విశ్వేశ్వరుని ప్రతివారును స్వయముగాతాకి పూజింపవచ్చునట. దక్షిణదేశ దేవాలయములయందు పైవిధముగా నిర్బంధములును ప్రజాపీడయు పేదలనిరసనమును మిక్కుటముగా నుండుటచే స్వామిసాన్నిధ్యమున జనులకు నిజముగా కలుగవలసిన ఆస్తిక్యభావము శూన్యమగుచున్నది: పైపెచ్చు అచ్చటి అక్రమములు పీడలు దౌర్జన్యములు చూచుటచే మనస్సునందొకవిధమగు కల్లోలమును, అసహ్యతాభావమును గూడ గలుగుచున్నది. సగుణోపాసన పామరజనులు తరించుటకై యవసరమని కొందఱు వాదింతురు. అదినిజమేనని యొక విధముగా నంగీకరించినను దేవతామందిరములలో నుండవలసినంత పవిత్రతయు, శాంతిశ్రద్ధలును లేమింజేసి నేటి హిందూ

దేవాలయములు ఏ కొలదిమంది జనులజీవనోపాధికో సాధనము లగుచున్నవేకాని జనసముదాయమునకు జ్ఞానభక్తివైరాగ్యము లను ప్రసాదించు పవిత్రస్థానములుగా నుండుటలేదు. దక్షిణ దేశపు దేవాలయములకు పూర్వరాజదత్త సంపత్తి యధికముగా గలదు. మఱియు పూర్వమువలె నడువవలసిన బాధలేకుండా యేర్పడిన నేటిప్రయాణసౌకర్యములవలనగూడ పూర్వముకంటె యాత్రికు లనేకరెట్లధికముగా వచ్చుచున్నారు. ఇందువలనగూడ వదేస్థానములరాబడి యధికమైనది. కాన ఘోరమైనటిక్కెట్ల విధానము దేవస్థానములందు తొలగించిన బాగుగానుండును. స్వామికర్పించెడు దక్షిణలు జనుల భక్తిశ్రద్ధలనుబట్టియు పేద భాగ్యములనుబట్టియు యథాశక్తిగ నుండవలెనుగాని నిర్బంధ ముగా నుండుటయనుచితము. ఇందువలన పేదలెక్కువగ శ్రమ పడుచున్నారు. దాదాపొక సంవత్సరముక్రిందట నేనొక ప్రసిద్ధ దేవాలయమున కేగితిని. అచ్చటికి వ్యాధిచే బాధపడుచున్న యొకపేదరాలేతెంచెను. అణామూడుపైసలిచ్చినగాని యచ్చట కర్పూరహారతి సేయరని యామె తెలిసికొని యాడబ్బులను కొబ్బరికాయయు కర్పూరమును దీసికొని దేవాయమున కేతెంచెను. కాని అణాటిక్కెట్టు కొనుక్కొనివగాని లోనికి బోవుటకు వలనుపడదని ద్వారరక్షకు లామెను లోనికిబోనీయక నడ్డగించిరి. ఆమె పేదరాలనని వారినెన్నియోవిధముల ప్రార్థిం చెను. కాని వారువిడువలేదు. కాన ఆమె తనవద్దడబ్బులలోని యణాపెట్టి టిక్కెట్టు కొనుక్కొని లోని కేతెంచెను. అణా వ్యయమైపోవుటచే నామెవద్ద కానీమాత్రమేయుండెను. కాన

ఆ కాలణాతో కర్పూరహారతిచేయుటకు అర్చకుడు నిరాకరించెను. "పేదరాలనునాయనా! అణా ద్వారంవద్ద తీసుకున్నారు నాయనా! నాలుగేండ్లనుంచీ రోగంతో తీసుకుంటూ ఈస్వామి దర్శనముచేస్తే రోగంపోతుందని గంపెడాశతో ఎంతో దూరాన్నుంచి వచ్చానునాయనా! ఈకానిడబ్బుతీసుకొనికొంచెం కర్పూరహారతిచెయ్యిస్వామీ, పేదరాలికిచేస్తే నీకు పుణ్యం ఉంటుందిస్వామీ" అనియాస్త్రీ యర్చకుని నెంతయోదీనముగ వేడుకొనెను. "డబ్బు లేకుండా యీగుళ్లోకి యేందుకువచ్చావు. ఊరికే కర్పూరహారతి చేయడానికి నీవుపెట్టిన నౌకరులెవ్వరూ లేరు. ఫో!ఫో!"అని యర్చకుడు రూక్షవీక్షణుడై కఠినముగా పలికెను. వారు అర్చకులుగా నుండకున్నచో నింతకంటె దయాశీలురుగా నుండెడివారేమో! ఆసందర్భమును పరికించుచు కొంతసేపు నేనచటనే నిలువబడితిని. ఆయర్చకుని మనస్సుకరుగ లేదు. కర్పూరహారతిచేయక ఆస్త్రీకిసంతుష్టికలుగునట్లుగ లేదు. అప్పుడాయర్చకునితో "ఆడబ్బులు నేనిస్తాను. ఆమెకు కర్పూర హారతిచేయండి" అని నేనంటిని. ఆయర్చకునకు నామీాదగూడ కోపమువచ్చెను. "మీాకెందుకు మీారువెళ్లండి నేను చేసేది లేదు." అని తీవ్రముగా బలికెను. "ఎందుకుచేయరు, మీాకు కావలసినది డబ్బులేగదా ఆడబ్బులెవరిస్తేమీాకేమి? చేయండి" అని నేనంటిని. అర్చకునితీవ్రత చప్పునచల్లారెను. ఐదుకానుల కొఱకు పేదరాలిపై తానుచేసిన దౌర్జన్యమునకు అతనిలో అతనికే సిగ్గుగలిగినది. అప్పుడాతడు నెమ్మదైనపలుకులతో 'నేనేదోచేస్తా. మీారు అమ్మణ్ణి గుళ్లోకివెళ్లండి అమ్మా'అనెను.

ఇఁక నెందులకని నే నీవలకువచ్చివేసితిని. ఆవల నేను అమ్మణ్ణి
గుడియందుండగా కర్పూరహారతిచేసినాడని ఆస్త్రీవచ్చి నాతో
చెప్పెను. ఈవిధమున దేవతలు నేడు దౌర్జన్యపరులగు మానవుల
చేతిలో జిక్కి భక్తజన సులభులు గాకున్నారు. నేను స్వామి
దర్శనము కావలెనన్నచో నెట్రిటోపీలో, యూనిఫారండ్రస్సులో
కావలెను. లేదా ఐశ్వర్యసమృద్ధియైన నుండవలెను.
ఈరెండును లేనివారిగతి పై పేదరాలిగతియే. రామేశ్వరము
నుండి ప్రతివారును తప్పక తెచ్చుకొనునవి గవ్వలు. రామేశ్వ
రమునందుతప్ప మరెచ్చటను గవ్వలు శంఖములు దొరకవు.
అచ్చటగూడ గవ్వలంగళ్ళైదారుకంటె నెక్కువగలేవు. ఆయం
గళ్ళచుట్టును వివిధదేశపు స్త్రీలెట్లు మూగియుందురో ఆచోద్య
మును చూచి తీరవలెను. ఆడవారి బేరమగుటచేతను, ఏవిధ
ముగానైనను తీసికొనక మానరను విశ్వాసముచేతను గవ్వ
లతిప్రియముగ నమ్ముదురు. ఎనిమిది యాటగవ్వల తుదిధర
నాలుగణాలు. అధికవెలగానున్నను అయిదులు, పదులు,
రూకలుపెట్టి ప్రతిస్త్రీయును గవ్వలుతీసికొని వెళ్ళుచునే యుం
డును. రామేశ్వరము వెళ్ళెదమనిన గవ్వలు తెచ్చిపెట్టుడను
టయు, వెళ్ళివచ్చితిమనిన గవ్వలుతెచ్చినారాయని యడుగు
టయు మనదేశమందు పరిపాటియైనమాట, కాని యీగవ్వల
వలనగల ప్రయోజనమేమి? జూదమువంటి ఆటను ఆడి విలువ
లేనికాలమును వ్యర్థముచేసికొనుటయేగదా. నేడు స్త్రీలు దేశ
హితార్థము చేయవలసినకార్యములు నేర్చుకొనవలసిన విద్యలు
లలితకళలు ఎన్నియోయుండ నీగవ్వలాటలాడ నెవ్వ

రిచ్చగింతురు? నాకు దానిపై బొత్తిగా మోజులేదు. అయినను యాత్రాచిహ్నముగా కొన్నిగవ్వలు కొనక నాకును తప్పినది కాదు. తాటియాకులతో సొగసుగా నల్లబడిన బుట్టలు పెట్టెలు గూడ నచ్చట విరివిగాదొరకును. గవ్వలు పటములుకొనిన వా రా బుట్టలనుగూడకొని వాని నాబుట్టలలోపెట్టుకొని యిండ్లకు తెచ్చుకొందురు.

రామేశ్వరమునందు గంధమాదనపర్వతమను పేరుతో నొకయిసుక తిప్పయున్నది. దానిపై రాతితో మలిచిన రామ పాదచిహ్నములుగల చిన్నఆలయ మొకటిగలదు. దాని పై కెక్కినచో నడుమ బిళ్ళవలె రామేశ్వరపు లంకయు దాని చుట్టును భూపురంధ్రీమణితాల్చిన యింద్రనీలముల మొలనూలు వగిది సాగరమును, మనోహరముగా గన్పట్టును. అదిచూడ దగిన దృశ్యమే. అటనుండి మేము క్రిందికి వచ్చుచుండ ఎనుబ దేండ్లుదాటిన వృద్ధురాలును నామెతో మఱియిద్దఱును మా కెదురైరి. ఆవృద్ధురాలు మిక్కిలి దుర్బలముగానుండి కన్నులు తేలిపోవుచుండ మిక్కిలి ఆయాసపడుచు నడుచుచుండెను. ఆకృతులనుబట్టి వారు ఉత్తరహిందూస్థానమువారని తెలియు చున్నను ఏప్రాంతమువారో తెలిసికొనవలయుననెడి కుతూహల ముతో "మీదే దేశ" మంటిని. "నేపాళదేశ" మని యా వృద్ధురాలనెను. నాకు మహాశ్చర్యమయ్యెను. ఎక్కడి శీతన గము! ఎక్కడిసేతువు! నిండు వార్ధక్యమున నావృద్ధురాలి నావిధముగా నీడ్చుకొని వచ్చిన మతవిశ్వాసము పుణ్యాకాంక్ష

అత్యద్భుతములుగదా! ఆకృతులలో భేదమున్నను, ఆచారములలో మార్పులున్నను, భాషలలో భిన్నత్వములున్నను, వేషములో వ్యత్యాసమున్నను, ఆసేతుశీతనగ పర్యంతముగల యావద్భారతీయుల నైక్యపఱచుచున్న దేది? మత సూత్రమే గదా!! మతము మానవునకు ప్రాణముకంటె నుత్కృష్టమైనది.

కల్పలతా! వ్రాయవలసిన విషయములు పెక్కులున్నను లేఖా విస్తరభీతి లేఖినిని వెనుకకీడ్చుచున్నది. ఇప్పటికే లేఖ పరిమితిని మించినది. కాన నింకొక్కమాటతో ముగించెదను. మిత్రమా! మేమీ విధముగా హిందూదేశపు సుప్రసిద్ధక్షేత్రములలో నొక్కటైన రామేశ్వర క్షేత్రమందు ద్వాదశదినములు గడపి పర్వతవర్ధనీ రామలింగేశ్వరుల పలుమాఱు సేవించి అనంతపద్మనాభస్వామిని దర్శింప కుతూహలము గలుగుటచే నచ్చటికేగుటకై రామేశ్వరమునుండి మధురకువచ్చి అక్కడ నుండి ట్రివేండ్రము వెళ్లుబండి నెక్కితిమి. ట్రివేండ్రము వెళ్లుచు మార్గ మధ్యమున మేముచూచిన మొదటిక్షేత్రము తెంకాశికి సమీపముననున్న కుర్తాళం. ప్రకృతి శోభావిభాసితంబై నేత్రపర్వంబైన యారమణీయ ప్రదేశమును గూర్చి ముందు వ్రాసెదను.

భావపురి
1929 ఏప్రియల్

మిత్తురాలు,
శారద.

## సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

కుర్తాళం వెళ్ళుటకై మేము తెంకాశిలోదిగి పురముదెస చూడగనే ఆపురమంతయు నొకే తోటవలె గన్పట్టెను. అట నుండి బండిచేసుకొని అచ్చటికి మూడునాల్గు మైళ్లదూరములోనున్న కుర్తాళమునకు బయలుదేరితిమి. మార్గమధ్యమంతయు ఫలవృక్షములతోడను నీటికయ్యలతోడను నొప్పి తెంకాశీనుండి కుర్తాళం వఱకొకే యుద్యానవనములో వెడలినట్లుండెను. అపుడు మట్టమధ్యాహ్నమై సూర్యుడు తీక్ష్ణముగా నెండగాయుచున్నను మాబాటల కిరుప్రక్కలనున్న నెడతెగని వృక్షపంక్తుల ఛాయలచే మే మెండకన్నెఱుగని శుద్ధాంత జనముల భాతినైతిమి. కుర్తాళమునందే ప్రసిద్ధిజెందిన మౌనస్వాములవారి మఠమున్నది. మఠము నిర్మించిన ప్రదేశము బహురమణీయమైనది. ఆమఠపుభవనమునంటి యొకచక్కని తియ్యనీటి జలధార అహర్నిశలు దొనదొనమని ప్రవహించుచుండును. మఱియు చుట్టును పుష్పోద్యానములును, జలప్రవాహములును, గోష్ఠశాలలును, పరిజన గృహములును గలిగి స్వాములవారిమఠము మఠముగానుండక శ్రీమంతుల భవనమువలె నుండెను. ఆమఠముయొక్క సౌందర్యమును సౌకర్యములను గాంచినవారి కామఠము రాగవిరాగముల సమ్మేళనముగా

గన్పట్టును. పరివ్రాజక సామాన్యమగు సాత్వికతకంటె రాజ సమే యచ్చట హెచ్చుగా గనుపించును. ఆమఠములోని యొకానొక గృహమునందు మేము విడిసి వంటజేసికొని భుజించితిమి.

మఱునాడు ప్రాతఃకాలముననే లేచి హారిభి యను జల ధారయందు స్నానముసేయ నేగితిమి. ఈస్నానము నిమిత్తమే యాత్రికు లక్కడ కేతెంతురు. ఈజలపాతము మేము విడిసిన మఠమునకు రెండుమూడు ఫర్లాంగులకంటె నెక్కువదూరము లేదు. ఆ గ్రామవాసులెల్లరును దినదిన మాజలపాతము కడనే స్నానముచేయుదురు. హారిభి యనెడు జలధార యొకకొండపై నుండి యహర్నిశలు క్రిందపడుచుండును. అచ్చటినుండియే పడమటి కనుమ లారంభమైనవని చెప్పవచ్చును. ఆజలధార మేము చూచునప్పటికి ఒకటిరెండు గజముల ప్రదేశమును మాత్రమే యాక్రమించి పడుచుండెను. కాని గ్రీష్మఋతువులో నాజలధార చాలవెడల్పు నాక్రమించి భయముగొల్పునట్లు భూమిపై పడుచుండునట. ఆజలధార పడునంత ప్రదేశమును నునుపుగానుండెను. గాని తక్కిన పర్వతభాగమంతయు పచ్చని లతాద్రుమాదులచేతను కుసుమ కోరకములచేతను మనోజ్ఞమై యుండెను. అప్పుడే సూర్యుడుదయించుచుండెను. ఆ యుదయభానుని శ్వేతకిరణములు లతావిద్రుమాలంకృతమగు పర్వతపంక్తులమీద బర్వ నాప్రదేశమెల్ల నపరంజికాంతు లీనుచుండెను. ఆకొండలపైనుండి దొరలిదొరలి దూకుచున్న

జలధార యాలేయెండ ప్రసారముచే పసిమిజెంది బంగారునీరును గ్రుమ్మరించుచున్నట్లుండెను. అప్పటి యాప్రదేశపు సౌంద ర్యము వర్ణనాతీతము.

ఆజలధారయందు స్నానముచేయుటకు మొదట మాకు చాలభయముగొల్పెను. కాని స్నానార్థ మేగినవారమెంతసేపా వేడుక నరయుచు నిలువబడుదుము? స్నానము చేయువారు జారిపడకుండ పట్టుకొనుటకై యక్కడ నినుపకడ్డీలుగూడ నున్నవి. ఆకడ్డీలను పట్టుకొనియు మేము ఆజలధారయొక్క చిందులకే జడిసితిమి కొంతసేపు. చిన్నధారల కడలితిమి కొంత సేపు. ఇటుల క్రమక్రమముగా సమీపించి ఆపెద్దధారపాటుకు వెఱచి మొదట నడుమిచ్చితిమి, తదుపరి తలయొగ్గితిమి. ఆనీటి మోదులకు మొదట నాగజాలక పోతిమి. తరువాత విడువ జాలక పోతిమి. ఆరంభమున నచ్చట స్నానముచేయుటకెంత భయముగొల్పెనో అంత్యమున దానిని విడిచివచ్చుట కంత విచారము గొల్పెను. ఆజలధారయొక్కనీరే పెక్కుపాయలుగా చీలి యూరినంతనుచుట్టి పాఱుచున్నది. స్వాములవారి మఠము చుట్టును ప్రవహించుచున్నదిగూడ నదియే. చల్లదనమునకును మాధుర్యమునకును నాజలము సాటిలేనిదని చెప్పనగును. ఆ జలధారకు సమీపముననే కుర్తాళేశ్వరుని ఆలయమున్నది. ఆ యాలయములోనికిపోయిస్వామినిసేవించిమాబసకువచ్చి వెంటనే వంటజేసికొని భోజనాదులు గావించుకొని జనార్దనమను పుణ్య క్షేత్రమున కేగుటకై రైల్వేస్టేషనుకు వచ్చితిమి. సరిగా పది

రెండు గంటలకు మేమెక్కు రైలువచ్చెను. దానిపై నెక్కిపోవుచుండ మారైలుబాట కిరుప్రక్కలను కొబ్బరితోటలును పోకతోటలును అరటితోటలును పనసతోటలును తమలపాకులతోటలును కనులపండువుగా గన్పట్టుచుండెను. పడమటి కనుమలు మాకొకప్పుడు దవ్వుగను నొకప్పుడు దగ్గరగను చూపట్టుచుండెను. ఒక్కొక్కస్టేషను గడచినకొలది మాకు తమిళులదర్శన మరుదై మళయాళీలు తఱచుగా గనుపింపజొచ్చిరి. విదునగరమను స్టేషనున కేగునప్పటికి మాబండిపూర్తిగా మళయాళీల మయమయ్యెను. విదునగరమొక జంక్షను. అచ్చటనే మాబండిలో దీపములు వెలిగించిరి. అప్పటికింకను రెండుగంటలైన కాలేదు. ఎండ తీక్ష్ణముగానేయున్నది. పట్టపగటివేళ దీపములు పెట్టుటచేత మారైలు పర్వత సొరంగములలో జొరబడ బోవుచున్నదని గ్రహించితిమి. మేము తలచినట్లుగా వెంటనే మారైలొక పర్వత సొరంగములో జొచ్చెను. కొన్నినిముసములపాటు అంతయు నంధకార బంధురంబయ్యెను. ఊపిరి సలుపక నుక్కిరిబిక్కిరైతిమి. ఇంతలో వెలుగు కంటబడెను. సొరంగముదాటితిమి. బ్రతుకు జీవుడా యనుకొంటిమి. అది మొదలు మాకిరుదెసల పర్వతపంక్తులును చఱియలును లోయలును గుహలును నెత్తములును సెలయేటి కయ్యలును భీకరారణ్యములును కనుపింప జొచ్చినవి.

సాధారణముగా మనప్రాంతములలో కొండలనిన వట్టి రాతి గుట్టలని యర్థము. వానిపై పచ్చని మొక్కలేయురుదు.

కాని కల్పలతా! ఆపడమటికనుమల భాగ్యమేమని చెప్పుదును? సమస్తపాదపములు, నఖిలలతావితానములు, సర్వగుల్మములు వానిసొత్తు. వికసించిన పుష్పగుచ్ఛములతో, విరియఁగ్రమ్మిన యాకుజొంపములతో, నాపర్వతములపై నున్న లతాద్రుమావళు లెంతరమణీయముగ నున్న వనుకొంటివి? కుంకుమపు రాసులుపోసి నట్లొకచోటను, పసుపుకుప్పలుపోసినట్లొకచోటను, నీలాంబరము గప్పినట్లొకచోటను, వెల్లమునుంగు వేసికొని నట్లొక చోటను, వివిధవర్ణపత్రపుష్ప విరాజితంబై యాకనుమయం దలి ప్రతివృక్షమును ప్రతివల్లరియు సొంపు నింపుచుండెను. అచ్చటవీచెడు వాయువుగూడ మాలతీచంపకవకుళాదికుసుమ సౌరభములనేగాక మన కపరిచితములగు పుష్పపరిమళముల నెన్నిటినో గొనివచ్చి ఘ్రాణేంద్రియ పరితృప్తి గలిగింపుచు హాయిహాయి యనిపించుచుండెను. కొండలపైనుండి పడెడి సెలయేళ్ళు చఱియలలోబడి చిన్నచిన్నవాకలై దొనదొనమని ధ్వనిసేయుచు ప్రవహించుచుండెను. ఆప్రవాహముల కొడ్డుననే యున్న వెదురుచెట్లు నీటిలోనికివంగి ప్ర వా హ వే గ ము న కుయ్యాల లూగుచు బొయ్యిమని బోలుధ్వనిసేయుచుండెను. వివిధములగు జలపక్షు లానీటివాకలలో విహరించుచు కలకల మని మంజులధ్వని జేయుచుండెను. రమ్యమైన ఆకనుమమార్గ మున మాపొగబండి పర్వతసారంగములలో జొచ్చుచు నెత్తు ముల కెగఁబ్రాకుచు లోయలలోనికి దిగుచు సెలయేళ్ళదాటుచు బో అని బొబ్బలిడుచు పాముప్రాకినట్లు మెలికలు మెలికలు దిరుగుచు పోసాగెను. కల్పలతా! అంతవఱకు సుప్రసిద్ధమైన

దక్షిణదేశమున పెక్కు దేవాలయములను దేవతలను దర్శించి హర్షించితిమి. కాని అవి అన్నియు మానవుని బుద్ధివైశద్యమునే విశదీకరించెనుగాని భగవన్మహిమను తేటపరుపవయ్యె. నిజమగు భగవన్మహిమను పడమటి కనుమలయందే గంటిమి. ప్రకృతియందు పరమాత్మని గనెడు బ్రహ్మవేత్తల కీప్రకృతి దృశ్యమెంత యాత్మానందమును గూర్చునోగాని మూఢుల కే జ్ఞానోదయమును గలిగించునట్లున్న దాకనుమలసొంపు. ఉన్నతములగు నాపర్వతశృంగములను గాంచినప్పుడు భగవంతుని యౌన్నత్యమును, ఆకొండలపై నుండి భూమిపై కుఱికి జలజల బాఱు సెలయేళ్ళను గనినప్పు డాపరమేశ్వరుని దయాపరత్వమును, చిత్రవిచిత్ర పత్రపుష్పఫలభరితపాదపావళుల గాంచినప్పుడు జగదీశ్వరుని సృష్టికళానిపుణత్వమును, కలకలమని మంజులధ్వనిసేయు ఖగగణంబుల కూజితంబు లాలించినప్పుడు విశ్వకర్తయొక్క మృదుమధురమనోజ్ఞవాక్కును,స్ఫురించి యొడలు పులకించుచుండెను. విశ్వగర్భుని స్వరూపసాక్షాత్కారము నిజముగా మాకక్కడనే గోచరమయ్యెనని చెప్పవచ్చును. భగవంతుని మహావిభూతి కాకనుమలు నిదర్శనములు. సర్వేశ్వరుని సర్వాంతర్యామిత్వమున కవి తార్కాణలు. కల్పలతా! వేయి మాటలేల? అచ్చటి సృష్టిసౌందర్యము అనుభవైకవేద్యమే గాని వర్ణనాతీతము.

ఈ విధముగా ఆప్రకృతి సౌందర్యమును చూడంజూడ మనం బానందనిమగ్నమగుచుండ కొండనెత్తములపై నాకుటెంట్లు

గట్టుకొనికాపురముసేయుచుకొండలోయలలో సేద్యముసేయుచు పంటలబండించుకొనుచున్న ఆటవికుల నచ్చటచ్చట గాంచి అక్కజపడుచుండ క్రమముగా పర్వతములు దూరమయ్యెను. ఆ పర్వతప్రాంతములగాంచిన వృక్షజాతులుగాని లతానికుంజములుగాని ఇక గన్పింపవయ్యె. గ్రామపరిసరముల నుండెడి పోక టెంకాయతోపులు కనుపింపజొచ్చెను. అంతటితో పర్వతములు దూరమైనవని నిశ్చయించుకొంటిమి. ఇట్లు మఱికొంచెము దూరముపోవ తెల్లనియిసుకతిప్పలును నాగజెముళ్లును జీడిమామిడిచెట్లును సరుగుతోటలును గాన్పించెను. ఇదియేమి? సాగరతీరమునకు వచ్చినట్లున్నామే! అని యాశ్చర్యముతో ననుకొనుచుండ నొక గొప్పస్టేషను వచ్చెను. అచ్చట మెండలో దొరలు, దొరసానులు, తదితర ఉన్నతోద్యోగులు మా బండ్లలోనుండి దిగిరి; ఎక్కిరి. ఆ స్టేషను ఏదియో యని పరికింప ప్రసిద్ధసాగరతీర పట్టణమగు "క్విలన్" అని తెలిసెను. కేరళదేశమంతయు నారికేళవృక్షమయముగదా! వారి యిండ్లును, వాకిండ్లును, తిండ్లును, గృహోపకరణములును, వ్యాపారములును వేయేల వారి జీవితమంతయు కొబ్బరిచెట్లతోనే యున్నది. కాన "క్విలను" దాటినది మొదలుకొని మాకు త్రోవపొడుగునను కొబ్బరిడిప్పలను నీటిలో నానవేయుచున్నవారును, నానిన డిప్పలనుండి పీచును దీయుచున్నవారును, తీసిన పీచును త్రాళ్ళుగా పేనుచున్నవారును, కొబ్బరియాకులతో నిండ్లను దడులను గట్టుకొనుచున్నవారును, చాపలను బుట్టలను నల్లు

కొనుచున్నవారును, చిప్పలలోనుండి కొబ్బరి నెండలో నార వేయుచున్నవారును, నారవేసిన కొబ్బరిని బస్తాల కెత్తుచున్న వారును, బస్తాల కెత్తినదానిని కాటాలోవేసి తూచుచున్న వారును, కొబ్బరితీసిన వట్టిచిప్పలను గంపలలోబోసి వంట చెఱుకుగానుపయోగించుకొనుటకై తీసికొనిపోవుచున్నవారును, కానవైరి. ఇంతలో వర్కాలి యను స్టేషను వచ్చెను. జనార్దన మచ్చటికి మూడుమైళ్ళున్నది. మేమచ్చట దిగగనే ఎదురుగా నున్న కస్టమ్సుఆఫీసులో మా సామానులు పరీక్షించిరి. అచ్చ టనే బ్రిటిషునాణెములిచ్చి తిరువాన్కూరుప్రభుత్వమువారి నాణెములను గొంటిమి. అచ్చట వాడుకలో నెక్కువగాగల నాణెము చక్రము. చక్రము రమారమి మన యేడుపైసలకు సమానమగు నాణెము. అరచక్రము, కాలుచక్రము, కాష్ అనునవి గూడ గలవు. కాష్ అనగా చక్రములో పదునాఱవ వంతుగల కడుచిన్ననాణెము. మన అర్థ,పావలా, బేడలనుబోలు వెండినాణెములు గూడ కలవు. కాని చక్రప్రచారమే యెక్కువ. మేము జనార్దన మేగునప్పటికి దాదాపు ఏడుగంటలయ్యెను. అప్పు డొకసత్రములో దిగి వంటచేసికొనుటకై యొకచక్ర మిచ్చి కొబ్బరిపెంకులను కొని తెచ్చుకొని వంటజేసికొని భుజించితిమి.

మఱునా డుదయమే లేచి ప్రాతఃకృత్యముల నిర్వర్తించుకొని సముద్రస్నానమునకై వెళ్ళితిమి. సముద్ర మచ్చటకు సమీపముననే గలదు. పెక్కుచోట్ల సముద్రమును జూచితిమి.

స్నానములు చేసితిమి. కాని జనార్దనములో సముద్రునకుగల భయంకరతరంగము లెచ్చటను గనలేదు. ఆయలలను చూచుటకే భయముగొల్పుచుండ స్నాన మెట్లు చేయగలమని చాల భయము కలిగెను. కాని యెట్లెట్లో మూడు మునుకలువైచి యీవల బడితిమి.

సాధారణముగా కొండలున్నచోట సముద్రముండదు. సముద్రమున్నచోట కొండలుండవు. కాని జనార్దనములో సముద్రముప్రక్కనే కొండయున్నది. కాన ఫేనయుతములైన యుత్తుంగతరంగము లతివేగమునవచ్చి యాకొండకు డీకొని పరాఙ్ముఖములై పోవుచుండును. సముద్రపు టొడ్డునగల యాకొండనుండి యొకచిన్న జలధార స్రవించుచుండును. ఆజలధారకు బ్రహ్మతీర్థ మనిపేరు. సముద్రస్నానము చేసిన తరువాత ఆజలధారయొద్ద స్నానముచేసితిమి. అది, బ్రహ్మ సత్రయాగముచేసిన ప్రదేశమట. మున్నొకప్పుడు బ్రహ్మ, ముక్కోటిదేవతలకు నిరతాన్నదానము సేయుచు సత్రయాగము చేయుచు తన యన్నదానమునకు తానే సాటియనియు మఱియొక డిట్టి సత్రయాగము గావింపజాలడనియు గర్వముతో తలంచెనట. శ్రీమహావిష్ణువా వృత్తాంతమెఱిగి బాలవటుడై చనుదెంచి యన్నపురాసులెల్ల ఆహారించి బ్రహ్మచే నన్నము లేదనిపించి యాతనిని వీతగర్వునిగాఁ జేసెనట. ఆబాలవటుడే యచ్చటి జనార్దనస్వామి యని చెప్పుదురు.

జనార్దనస్వామివారి ఆలయ మొక చిన్నగుట్టపై నున్నది. జనార్దనుడు బాలుడుగనే యున్నాడు. ఆస్వామి కాపాదమస్తకము మంచిగంధము లేపనము చేయుదురు. కాన స్వామి దర్శనమున కేగినవారికి మంచిగంధపుటుండ లిత్తురు. మఱియు నీరుమజ్జిగ తీర్థ మిత్తురు. మేము స్వామిదర్శనమున కేగునప్పటికి స్వామిమేన చందన ముంచుచుండిరి. నల్లని స్వామివిగ్రహముపై పచ్చని శ్రీచందనలేపనము చేయుటచే చక్కని యాకృతిగల బాలునివలె స్వామియాకృతి యాకర్షణీయముగా నుండెను. తమిళదేశమున ననల్ప శిల్పకళావిరాజితములగు నుత్తుంగోన్నత గోపురప్రాకారాలయములను గాంచి వచ్చినమాకు జనార్దన స్వామివారి ఆలయమును చూడగనే మహాశ్చర్యమయ్యెను. కేరళదేశపు దేవాలయముల కట్టుబడియే వేరు. జనార్దనాలయము గుండ్రముగ పొట్టిగ నున్నది. ద్రవిడదేశపు దేవాలయములలో సర్వభక్తులైనవారు గర్భగుడికేగుటే దుస్తరము. పట్టపగలే కటికచీకటి. కన్నులుండియు నుపయోగపడవు. కునుకుచున్న దీపము లొకటియో రెండో యుండినను నవి యొసగెడు వెలుగు వలని యుపయోగముకంటె నీడవలని అపాయమే ఎక్కువ. గడపలతోడను గట్లతోడను హెచ్చుతగ్గులుగానుండెడి ప్రదేశమును క్రొత్తవారు గుర్తింపలేక పడుచుందురు. కాని జనార్దనస్వామివారి ఆలయము చక్కని విశాలమైన బయలునకు నట్టనడుమనున్నది. స్వామి దర్శనమునకై చీకటిలో త్రొక్కుడులాడనక్కఱలేదు. ఎంతదూరమునుండియైనను చక్కగా దర్శింపవచ్చును. దేవాలయకుడ్యములేమి ప్రాకారకుడ్యములేమి యెట్టిపనితనమును లేక నును

పుగా పలకలుతీర్చి యున్నవి. ఆదేశపు దేవాలయములవలెనే యచ్చటి స్త్రీలుకూడ నిరస్తభూషలు. మళయాళస్త్రీలు సాధారణముగా నగలు ధరింపరు. రంగువస్త్రములను కట్టరు. అయినను విలక్షణమైన ఆకృతియు దీర్ఘములైన శిరోజములును వారికి సహజముగనే లభించి వారిని రూపవతులనుగా జేసినవి. దానికితోడు శుభ్రమైన ధవళవస్త్రధారణము వారి సౌందర్యము నినుమడింపజేసెనని చెప్పనగును. మళయాళ స్త్రీల వస్త్ర ధారణముకూడ మన కక్కజముగనే యుండును. అచ్చట స్త్రీ పురుషులొకే విధముగా వస్త్రముల ధరింతురు. తూర్పునకు (గంజాము విశాఖపట్టణ ప్రాంతములకు) పోయినకొలది స్త్రీల కట్టుబట్ట తొమ్మిదిమూరలే. అటనుండి క్రమముగా దక్షిణము నకు వచ్చినకొలది స్త్రీలచీరలొక్కొక్కమూర పెరిగి పూర్తిగా దక్షిణమునకు వచ్చునప్పటికి యిరువదిమూరలగును. కాని కేరళస్త్రీల కట్టుబట్ట పురుషుని కట్టుబట్టవోలె నాలుమూరలే. ఆధోవతిని వారు నడిమికిమడిచి దాక్షిణాత్యపురుషులవలెగూడ కట్టుగా కట్టుకొని దానిపై నొక చిన్నతుండుగుడ్డను వల్లెవాటుగా భుజముపై వేసికొని యొకకొంగును మొలలో దోపుకొందురు. రవికనుమాలుగా నటచేతులచొక్కా వేసికొందురు. ఈ పై తుండును వారు బయటికి వచ్చునప్పుడు మాత్రమే యుప యోగింతురని తోచెడిని. ఊర్ధ్వభాగమును కప్పుటకు వారంతగా ప్రయత్నింపరు. పైట లేకపోవుట వారి కొకయాక్షేపణీయ విషయముగాదు. మేమువిడిసిన సత్రమునకు ప్రక్కగానున్న కోనేరులో దేవకన్యలనుబోలిన యువతులు కొందఱు చిన్న

తుండ్లను నడుములకుకట్టుకొని దీర్ఘములైన వినీలశిరోజములను విరియబోసికొని యథేచ్ఛముగా స్నానముచేయుచుండిరి. పైట వేసికొననందులకు వారేమాత్రము బిడియపడుటలేదు. కాన వారి కావిషయమై యంతగా పట్టుదలలేదని యనుకొంటిమి. తమిళకేరళ రాష్ట్రములు సన్నిహితములైనను తమిళస్త్రీలకును కేరళస్త్రీలకును బహువ్యత్యాసమున్నది. తమిళస్త్రీలు తెల్ల చీరలుకట్టరు. మళయాళస్త్రీలు రంగువస్త్రములను ధరింపరు. తమిళస్త్రీలు సాధారణముగా కొప్పుపెట్టుకొందురు. లేదా జడ వేసికొనియెదరు. కేరళకాంతలు చక్కగా జారుముడి వైచు కొందురు. తమిళస్త్రీల కర్ణాభరణములు బహుబాధాకరము లైనవి. మఱియు నందచందములేని మొఱటుదిమ్మలు. ఆదిమ్మ లను వారు గుత్తులుగాజేర్చి చెవులకు వ్రేలాడవేసికొందురు. ఆనగల భారముచేత వారిచెవితమ్మెలు రబ్బరుత్రాడులవలె సాగిసాగి భుజములనంటుచుండును. ముందెప్పుడో పసిడి సొమ్ములు పెట్టుకొనుటకై వారు తమ కొమార్తెలకు పసితన మునసే చెవులుకుట్టి కంచుమెట్టెలను సీసపుమెట్టెలను రెండు మూడు గుదిగ్రుచ్చి చెవులకుతగిలింతురు. ఆ లోహభారముచేత బాలికల లేతతమ్మెలు సాగి యూగులాడుచుండును. అనాగ రకమును నత్యంతబాధాకరమును నైన నాయలంకారము జూడంజూడ తమిళదేశమున బాలికయైపుట్టుట పాతకహేతు వనిపించినది. మళయాళస్త్రీలకట్టి కర్ణాభరణములులేవు. ఒకా నొకరికున్నను సాధారణముగా చిన్నపాటి చెవికమ్మమాత్రమె. తమిళస్త్రీలు పొగాకునుజేర్చి యధికముగా వక్కాకు నములు

చుండును. కాన వారి పెదవులును దంతములును నెత్తుని గార గట్టి అసహ్యముగానుండును. మఱియు వారు కూర్చున్న చోటెల్ల నెత్తునియుమ్ములతో నశౌచపఱతురు. కేరళ స్త్రీలకట్టి దురభ్యాసమున్నట్లు కానము. కావున సహజమైన దంత ధవళిమయు నధరరక్తిమయు వారి వదనారవిందములకు చెలువు గూర్చుచుండును. వేయేల, తమిళమళయాళ స్త్రీల యాకార ములే భిన్నములు. తమిళ స్త్రీలు అవయవములు పొందిక లేక హెచ్చుతగ్గులుగానుండి అనాకారలుగా గాన్పింతురు. కేరళ స్త్రీలు చక్కని యవయవస్ఫూర్తిగలిగి విశాలములును ప్రసన్న ములునునైనముఖారవిందములతో రూపవతులుగా గాన్పింతురు. దక్షిణ హిందూదేశమున గల ద్రవిడకర్ణాటాంధ్ర కేరళాది దేశపు స్త్రీలలోకెల్ల కేరళ స్త్రీలే చక్కనివారని చెప్పుదురు. వారిని చూచుటతోడనే ఆమాటనిజమని ఋజువయ్యెను.

అన్యప్రసంగములకు బోయి ప్రస్తుతాంశమునకు దూర మైతిమి. సఖీ! మేమట్లు జనార్దనస్వామిని సేవించి మాబస కేతెంచి భోజనాదులు గావించుకొని వెంటనే స్టేషనునకువచ్చి అనంతశయమున కేగు రైలునెక్కితిమి. మనము అనంతశయన మను దానినే అచ్చటివారు తిరువనంతపురమనియు ట్రివేంద్ర మనియు అందురు. తిరువనంతపురము తిరువాన్కూరు రాజ్య మునకు ముఖ్యపట్టణము. అచ్చటనే సుప్రసిద్ధమైన అనంత పద్మనాభస్వామివారి ఆలయముగలదు. మేము రైలుదిగి యూరిలోనికివెళ్ళి సత్రములో మా మూటముల్లెలు పెట్టుకొని

వెంటనే స్వామిదర్శనమునకేగితిమి. ఆనాడు మకరసంక్రాంతి. దేవాలయములో గొప్పయుత్సవము. కాన నితరగ్రామముల నుండి చాలమంది యాత్రికులు వచ్చియుండిరి. కాన స్వామి దర్శనము కాదనియే యనుకొంటిని. కాని యచ్చట నొకమేలు గలదు. వచ్చినజనులందఱిని నొక్కమూఁలుగా నాలయము లోనికి విడువరు. స్వామిదర్శనము చేయించుట కాలయములో నొకదుబాసియుండెను. ఆయన యేదేశమువారితో నా దేశపు భాషాడి స్వామిదర్శనముచేయించును. ఆ దుబాసి సాయము తోనే మేము స్వామిదర్శనముచేసితిమి. అనంతపద్మనాభస్వామి కడుపెద్దస్వామి. శ్రీరంగములోని రంగనాయకులవలె అనంత పద్మనాభస్వామిగూడ శయనించియుండును. కాని రంగశాయి కంటె అనంతుడు రెట్టింపుండును. గర్భాలయమునకు తలయొద్ద నొకటియు, నాభియొద్దనొకటియు, పాదములయొద్ద నొకటియు మూఁడుద్వారములుగలవు. ఈమూఁడు ద్వారములలో దర్శించిన గాని స్వామివారి సంపూర్ణాకృతి యగుపించదు. పద్మనాభాల యము చాలగొప్పది. కాని యెంచదగిన శిల్పకళలేదు. దేవాలయముచుట్టును దీపములుంచుటకు దగిన ప్రమిదలతో కొయ్యలమర్పబడియున్నవి. అవి లక్షదీపములట. ఆఱుమాస ములకొకసారి లక్షదీపములు వెలిగింతురట. దానినే దీపోత్సవ మందురు. మేము వెళ్ళిననాడు (సంక్రాంతి) దీపోత్సవమే. దానిని చూచుటకే యాత్రికులధికముగా వచ్చియుండిరి. ఆకాశదీప మనెడి యెత్తైనదీపమును వెలిగించినవెనుక తక్కిన దీపములన్ని

యు వెలిగింతురట. ఆసమయమున దేవాలయావరణ మంతయు దేదీప్యమానములగు దీపమాలికలతోనొప్పి యపరనక్షత్ర మండలమువలె విరాజిల్లునట. దురదృష్టవశమున నాకానాడాదీపో త్సవమునుచూచుట సంభవింపలేదు. కాని మావాళ్లందఱు చూచివచ్చిరి. ఆ దేవాలయమునందు మఱియొక యెంచదగిన విశేషమేమన ఆ ఆలయమందేగల స్వామివారి యన్నసత్రములో నిరతాన్నదానము జరుగుచుండును. ఎన్నిమాఱులు తినినను ఎన్నిదినములున్నను నదియేమని యడుగువారులేరు. కాన పెక్కుమంది బ్రాహ్మణబాలు రాయన్నసత్రములో భుజించి చదువుకొనుచుందురట. అచ్చటవండెడి అన్నమంతయు స్వామికి నివేదనచేసి ప్రజలకు పెట్టుచుందురు. అయితే ఆ భోజనము మనము చేయలేము. చారునీళ్లు, జారుపప్పు, మెత్తని అన్నము, నేయి, పూజ్యమైన ఆభోజనమును దాక్షిణాత్యులేగాని మన తెలుగువారు తినజాలరు. నేయి, పచ్చడులు లేని భోజన మాంధ్రులకు పస్తుతో తుల్యముగదా!

మఱియొక విశేషమేమన తిరువాన్కూరు రాజ్యమునకు పద్మనాభస్వామివారే ప్రభువు. కావుననే నాణెములపై స్వామి చిహ్నములగు శంఖచక్రములు ముద్రింపబడి యుండును. పద్మనాభస్వామి తిరువాన్కూరు సంస్థానమునకు ప్రభువైన కారణమేమన, ఒకమారు తిరువాన్కూరు రాజ్యము అప్పుల పాలయ్యెనట. ఆఋణమునుండి విముక్తిగాంచుటకు ప్రభువునొద్ద ధనములేకపోయెను. పద్మనాభస్వామికి చాలసొత్తుగలదు. ఆ

సొమ్మును వినియోగించుకొనిన సంస్థానము ఋణములనుండి విముక్తినందును. కాని దేవునిసొమ్మును స్వోపయోగమునకు వినియోగించుకొనుట దోషముగదా! కాన మహారాజు తన రాజ్యమును స్వామికి వ్రాసియిచ్చి స్వామిసొమ్ముతో ఋణ విమోచనము గావించుకొనెనట. నాటనుండి అనంతపద్మనాభ స్వామి తిరువాన్కూరు రాజ్యప్రభువుగాను రాజాతని ప్రతి నిధిగానుండి పాలకకర్తగా వ్యవహరింపబడుచున్నాడట.

మఱునాడాలయములో పూజార్చనాదులు గావించు కొని సాయంత్రము పురములోని పణ్యస్థలములు వగైరా దర్శించితిమి. తిరువనంతపురము తిరువాన్కూరు రాజ్యమునకు ముఖ్యపట్టణమైనను నీటికొళాయీలు విద్యుద్దీపములు మొద లైన నాగరికపులక్షణము లేమియు లేవు. గృహములు బారులు తీర్చి యింటిప్రక్కయిల్లుగానుండక ఒక్కొక్కయిల్లు పెద్దపెద్ద పోకటెంకాయతోటలనడుమ మేలిముసుంగుచాటు మొలతవలె దృశ్యాదృశ్యముగానుండును. కాన పట్టణమంత సొగసైనదిగా కనుపించదు. తిరువాన్కూరు రాజ్యములో స్త్రీవిద్య యధిక ముగానున్నది. విద్యాంగమంత్రిగా నున్నదిగూడ నొకస్త్రీయే యని వింటిమి. ఆడమళయాళమనిన అచ్చట పురుషులుండ రనియు స్త్రీలు పైటవేసుకొనరనియు అక్కడ అంతయు స్త్రీ యధికారమనియు మనవారు ఏదేదో విపరీతముగా జెప్పు కొనెడివారు. అట్టి విపరీత మేదియు లేదు. కాని అచ్చట స్త్రీ వారసత్వ మెక్కువ. రాజ్యాధికారములుగూడ కొమార్తె

పుత్రునకు వచ్చునేకాని కౌమారుని కౌమారునకు రావు. వారును రైకలు పైటలు వేసికొనుచున్నారు. కాన విడ్డూర ముగా చెప్పుకొనదగిన సంగతులులేవు. ఏమైన విపరీతాచార ములు పూర్వమున్నను ఆధునికవిద్యానాగరికత లారాష్ట్రములో గూడ ప్రవేశించెను గాన వారిలో చాలమార్పు గలిగియుండ వచ్చును.

మఱునాడుదయమే లేచి కన్యాకుమారికి మోటారుబస్సులో ప్రయాణమైతిమి. మేము కన్యాకుమారికి చేరునప్పటికి దాదా పుగా ఒంటిగంట యయ్యెను. అచ్చటనున్న చక్కని గవర్న మెంటు సత్రములో దిగి వంటజేసి భోజనాదులు గావించుకొని విశ్రమించితిమి. మేముదిగిన సత్రము సముద్రమున కతిసమీప ముగా నుండెను. మేము ప్రయత్నముచేయకనే గదిలో వాకిలిలో దొడ్డిలో వంటయింటిలో నెక్కడనిలిచినను నీలమేఘ శ్యామలమై తనరారెడి యపారపారావారము నేత్రానందకర ముగా కనుపించుచుండెను. ఆసాయంత్రము మూరుగంటలకు దేవాలయమున కేగితిమి. కన్యక గావున దేవి చిన్న యాకృ తిలో చూడ ముచ్చటగా నుండెను. మఱియు బాలికాసహజ మైన పరికిణీ (పావడా) చొక్కా వేయబడి మేలైన యలంకా రాదులను గలిగి దేవి ఆకర్షణీయగా నుండెను. దేవిని దర్శింప నేగినవారికి దేవి మేనినుండి తీసిన పసుపును పువ్వులను ఇత్తురు. పిల్లలకు మరమరాలు పెట్టుదురు. మఱునాడు ప్రాతఃకాలము ననే లేచి సాగరాదితీర్థములలో స్నానము సేయ నేగితిమి. సాగ

రము దేవ్యాలయము నానుకొనియే యున్నది. ఆలయపు వెనుక నుండి సముద్రములోనికి మెట్లున్నవి. అచ్చట స్నానముచేసితిమి. జనార్ధనమునందు కొండ, సముద్రపుటొడ్డుననుండ కన్యాకుమారి యందు కొండ, సముద్రములోనికే యున్నట్లున్నది. ఆ పెద్దపెద్ద కొండరాళ్లకు సాగరతరంగములు రివ్వురివ్వున వచ్చి ఢీకొని ఫేన యుతమైన నీటితో వానిని మాటిమాటికి మజ్జనముగావించుట కడుమనోహరముగా జూపట్టుచుండును. ఎటుజూచిన పారము లేని పారావారము నడుమ రాకపోకలకు బాటవేసికొనినట్లు భూభాగపుచీలిక దానియగ్రమున కన్యాకుమారి ఆలయము, హిందూదేశపు దక్షిణదిశ ఆ ఆలయముతో సరి. కన్యాకుమారి ఆలయము కడుపురాతనమైనదిగాఁ దోచుచున్నది. బహిర్భాగ మంతయు చాలవఱకు శిథిలమై యున్నది. ఆలయపుకట్టుబడి మళయాళదేశపు సాంప్రదాయముగనే యున్నది. కన్యాకుమారి గ్రామముగూడ చాలచిన్నది. పటాటోపముతోఁగూడిన నగర రాజములలో నివసించువారిచ్చట నివసించుటన్న రసాతలము నకు విసరివేయబడినట్లు తలంతురు. సముద్రస్నానము వగైరా చేసినవెనుక దేవీదర్శనముచేసి వెంటనే బస్సుపై బయలుదేరి తిమి. మార్గమధ్యమున కన్యాకుమారికి నాలుగుమైళ్లదూరములో శుచీంద్ర మనెడి మఱియొక పుణ్యక్షేత్రము గలదు. ఆ పూ టచ్చట దిగితిమి. శుచీంద్రాలయము బహుగొప్పది. దేవాల యపు కట్టుబడి మధుర రామేశ్వరమాది దేవాలయములవలె ద్రావిడసాంప్రదాయముగా నున్నది. ఉన్నతమైన ప్రాకార గోపురములు వానిపై శిల్పములు గలవు. దారులోపాదికము

లచే చేయబడిన రంగురంగుల వాహనములు గూడ గలవు. రంగులతో వేయబడిన బొమ్మలు గోడలపై నేవంకజూచినను డాబుగా గన్పట్టినవి. తిరువాన్కూరురాజ్యములోని ప్రతి ఆలయము ప్రత్యేకలక్షణములతో నొకేనిర్మాణపుపక్కిలో నుండ ఆరాజ్యములోనిదేయగు నీయాలయము ద్రావిడాలయముల పగిది నుండుటేలనో తెలియదు. శుచీంద్రములో స్వామిని దర్శించిన వెనుకనే సత్రములోనికి వచ్చి వంటజేసికొని భుజించితిమి. వెంటనే బయలుదేరి నాగర్కోయిల మీదుగా తిరునల్వేలి వెళ్లవలె ననెడి యుద్దేశముతో బస్సుకొఱకు ఎదురుజూచుచు సత్రపువాకిట గూర్చుంటిమి. ఇంతలో యెవరో కార్డులు చేత బట్టుకొని సత్రపుటరుగులపై వచ్చి కూర్చుండిరి. అవి అచ్చముగ మనకార్డులవలెనే యుండెను. కాని మనవి మాత్రము కావు. అవి తిరువాన్కూరురాజ్యపుకార్డులు. వానివెల కడు స్వల్పము. చక్రమునకు మూడు కార్డులు. అనగా ఒక్కొక్కదాని వెల యించుమించు రెండు దమ్మిడీలు. ఆకార్డులారాజ్యమునందు మాత్రమే చలామణీ యగును. బ్రిటీషుయిండియాకు వ్రాయవలెనన్నచో మనకార్డులనే యుపయోగించవలెను. స్వతంత్రరాజ్యములోని సౌకర్యములట్టివి. చూడుము! ఎంత చౌకగా నమ్ముచున్నారో! ఐరోపాసంగ్రామసందర్భమున మన గవర్నమెంటువారికి ధనలోప మేర్పడి కానీకార్డును అర్ధణాచేసినారు. యుద్ధము ముగిసి ఎంతకాలమో అయినది. ప్రభుత్వము పూడుకొనినది. కాని కార్డుధర అట్లేయున్నది. ప్రజాసౌకర్యముకన్న ప్రభుత్వకోశమును నిండించుకొనుటయే యుత్కృష్టముగా

దలంచెడి ప్రభుత్వములో ప్రజల కింతకంటె సౌకర్య మెట్లు గలుగును? ఇందువలన పేదజను లనుభవించుచున్న కష్ట మనంతము. అయితే ప్రభుత్వమువారది గుర్తించుటలేదు. ఈ సందర్భమున నొక చిన్న స్వానుభవము జ్ఞాపకమునకు వచ్చు చున్నది. పూర్వము మాయింట్లో ఒక పనిమనిషి యుండెడిది. ఆమనిషి నన్నొక ఉత్తరము వ్రాసిపెట్టుమని యొక తెల్లకాగిత మును తెచ్చి నాకిచ్చెను. కవరేదీ అని నే నంటిని. "కవరక్కర్లేదు. కవరుమీద వ్రాస్తే మా ఉత్తరాలు చేరవు. బంట్రోతులు పాతేస్తారు. నటుపేటుత్తరమైతే చేరుద్ది" అనినది. అణాకు రెండణాలు యిచ్చుకోవలసి వస్తుందిగా అన్నాను. "అవును ఆళ్లకు మేమేశినా మా కాళ్లేశినా మాఉత్తరాలు యింతే. రెండణాలు ఇచ్చుకుండేదే. పూరబం మాపిల్లగాడు పుట్టక మునుపు అణాయిచ్చి ఉత్తరం తీసుకొనేవాళ్లం. ఇప్పుడు బేడ యిచ్చి తీసుకుంటున్నాము" అనినది. ఉత్తరమువ్రాసి యిచ్చితిని. రెండుమూడుదినములకు చిరునామాదారుడు ఊళ్లో లేడని ఆ ఉత్తరము తిరిగివచ్చెను. నట్ పేటుత్తర మైనందులకు రెండణాలు అది మరల తిరిగివచ్చినందులకొక అణా మూడు అణాలు వసూలుచేసినాడు పోస్టుజవాను. ఆడబ్బులు దగ్గర లేక చెంబు తాకట్టుపెట్టి మూడు అణాలు యిచ్చినానని ఆదాసీది నాతో చెప్పి మొత్తుకొనెను. పోస్టలురేట్లు పెరిగి నందువలన పాపము పేదజను లెంత గోడుపడుచున్నారని నాకు మహావిచారము గలిగెను. శ్రీమంతులకు లక్ష్యములేక పోవచ్చును. కాని దినమునకు నాలుగణాలు కూలి తెచ్చుకొని

జీవించెడు పేదసంసారములో రెండణాలు ఉత్తరమునకు చెల్లింపవలె నన్నచో నెంతకష్టమో చెప్పవలెనా? పోష్టలురేట్లవలన వచ్చెడి అధికాదాయములో చాలాభాగ మీకష్టజీవులకు చెందునదే. తక్కిన తపాలా రేట్లెట్లున్నను సర్వజనోపయోగకరమగు కార్డు కవరుల ధర లెప్పటిరేట్లకు మార్చుట ప్రజాహితము గోరెడి ప్రభుత్వమువారి కనీసధర్మము. కాని ఈ వత్సరము గూడ ప్రభుత్వమువారు తపాలారేట్లను తగ్గించుటకు నిరాకరించిరిగదా! కల్పలతా! యాత్రావిషయములు దెల్పుటలో తపాలారేట్ల గొడవయేమిటని నవ్వుచుంటివా? ప్రస్తావవశమున వచ్చెను గాని ప్రస్తుతాంశ మది గాదని యెఱుగక పోలేదు. మే మంతట మోటారుబండి నెక్కి నాగరుకోయిలకు వచ్చి అచ్చటినుండి వేఱొకబస్సుమీద తిరునల్వేలికి వెళ్లితిమి. అప్పటికి దాదాపు రాత్రి పదిన్నరగంట లయ్యెను. ఇన్నివందల మైళ్లు రైలుప్రయాణము గావించితిమి కాని త్రివేంద్రమునుండి కన్యాకుమారికి అచ్చటినుండి తిరునల్వేలివఱకు చేసిన కొద్దిపాటి మోటారుబస్సు ప్రయాణములో మేముపడిన శ్రమలో వీసమైన రైలుప్రయాణమువలన పొందలేదని దృఢముగా జెప్పవచ్చును. ఆమోటారుకారు డ్రైవరులయు కండక్టరులయు దురాశలును, దుస్తంత్రములును, దౌర్జన్యములును, నగౌరవక్రియలును, జన్మమున్నంతవఱకు మఱువరానివి. మొదటచెప్పెడు లెక్క బల్లకు అయిదుగురు ఆఱుగురు అని. పురబాహ్యమునకు పోగనే ఆ అయిదుగురిలెక్క పదుగురుగా మాఱును. వీరు డబ్బిచ్చి శ్రమపడెడి దురదృష్టపు ప్రయాణికులు. ఇంక పోలీసు

వారున్నారు. వారు బస్సుఅధికారులకు గురుదేవులు. వారు ఎక్కడ ఏసమయములో ఎంతయిరుకులో ఎక్కెదమనినను చెప్పిన బస్సు ఆపి యెక్కించుకొనవలసినదే. ఇక మోటారు బండ్లవారి కేమిభయము? పోలీసువారి కొక్కరికి విధేయతజూపి తమవారినిగా జేసికొనినచో ఇంక నెందరియెడ అవిధేయత జూపినను భయములేదుగదా!

తిరునల్వేలి తామ్రపర్ణీతీరము. ఆ నదీస్నానార్థమే మే మచ్చట కేగితిమి. అచ్చటి సత్రము అసహ్యముగా నున్నది. ఎట్లెట్లో ముక్కుమూసికొని ఆరాత్రి అచ్చట నిలిచితిమి. తెల్లవారి తామ్రపర్ణిలో స్నానముచేసి వచ్చి భోజనాదులుగావించుకొంటిమి, అనంతర మొకజట్కాబండి కుదుర్చుకొని ఊరిలోని దేవాలయములను విపణివీధులను చూడనేగితిమి. తిరునల్వేలి లోని శివాలయము చాలగొప్పదే. కాని అచ్చటి శిల్పములు మాత్రము చూడదగినవికావు. ఇన్ని ప్రసిద్ధదేవాలయములను గాంచితిమి కాని ఆతిరునల్వేలిపట్టణములోని దేవాలయములో గల యవినీతికరమగు బొమ్మలు మాత్రము మరెచ్చటనులేవు. ఆసాయంత్రమే బయలుదేరి మధురకు వెళ్లితిమి. అచట నొక దినముండి యటనుండి శ్రీరంగక్షేత్రమున కేగితిమి. తిరుచునాపల్లినుండియే మాకు వైష్ణవులు తరుచుగా గనుపింపజొచ్చిరి. ఇక శ్రీరంగమున కేగ నెచటజూచినను వారే. రంగని ఆలయము సప్తప్రాకార విరాజితమే గాని యింపుసొంపులేదు. శిల్పము గూడ స్వల్పమే.

శ్రీరంగము సుప్రసిద్ధక్షేత్రమే గాని అచ్చట మేలైన సత్రమేలేదు. దాని కొక కారణము గూడ గలదు. ఆపురిమున గల వైష్ణవతిరుమాళిగల (ఇండ్లు) లో చాలవఱకు సత్రతుల్యములే. యాత్రికుల నీయేజంట్లు మద్రాసులోనే పట్టుకొందురు. మాబసలలోదిగిన సకల సౌకర్యములను గలిగింతుమని నమ్మబల్కి తీసికొనిపోవుదురు. కాని చాతుర్వర్ణములవారిని అసంఖ్యాకముగా తమగృహములలో నిలుపుకొనుటచేత నిజముగా ఏజంట్ల యిండ్లలో సౌకర్యముగానుండుటగూడ కష్టమే. మఱియు నాయేజంట్లను తృప్తిపఱచుట గూడ సామాన్యవిషయముగాదు. మొదట యాత్రికులను పిలుచుకొనిపోవునప్పుడు తృణము మహామేరువుగా గ్రహింతుమని చెప్పుదురు. కాని వారిబసలో దిగినవెనుక మహామేరువునొసంగినను తృణీకరించి ఇంకను గావలెనని పీడింతురు. యాత్రలకేగెడివారు ఇట్టి యేజంట్ల చేతిలోబడుట నిజముగా నొకవిధమైన పారతంత్ర్యమేర్పఱచుకొనుటయని చెప్పనొప్పును. ధార్మికచింతచేగాక వారికి సొమ్ముముట్టునిమిత్తము దానధర్మాదులు యాత్రికులు చేయవలసియుండును. దానధర్మాదులు చేయుటకు ఇష్టము లేకపోయినను, శక్తిలేకపోయినను వారు విడువరు; మగవారికే యేజంట్లచే నీపాట్లు తప్పవు. ఇక ఒంటరిగా వచ్చిన స్త్రీల స్థితి యెట్లుండునో వేఱచెప్పనేల? సఖీ! ఇదియొక శ్రీరంగపు సమాచారముగాదు. నేజూచిన యాత్రాస్థలములందంతటను ఏజంట్లయొద్ద నిట్టి ప్రజాపీడయే గోచరించినది. శ్రీరంగములో

బసచేయుటకు వసతియైన సత్రములేక మేము చాలశ్రమపడి తిమి. ఇది యీక్షేత్రమునకు గొప్పకొఱతయనియు, స్వతంత్ర ముగా యాత్రజేసికొన తలంచెడువారికి గొప్పయిబ్బందియనియు చెప్పక తప్పదు. మేము శ్రీరంగములో మూడు పూటలు మాత్రమే యుంటిమి. రెండుమాఱులు శ్రీరంగశాయిని దర్శించి తిమి. పూజార్చనాదులు గావించితిమి. తిరుమణి తిరుచూర్ణ ములు గొంటిమి. ఆదేవుని ఆలయమందే దేవునిప్రసాదమని అరిసె,జంతిక, మున్నగు భక్ష్యములు, పెరుగన్నము,పులిహోర, పొంగలి, మున్నగుఅన్నపుముద్దలను వైష్ణవస్వాములువిక్రయించు చుండిరి. అదియైన యేబుట్టలోనో తట్టలోనో బెట్టుకొనికాదు. నలుగురును నడిచెడి వట్టిరాతిబండలమీద వేసికొని యమ్ము చుండిరి. దైవసంబంధముగా నది యెంత పూజ్యతమమైన ప్రసాదమైనను పారిశుద్ధవిషయముగా జూచితిమేని అది యెంత మాత్రము పరిగ్రహింప దగినదికాదు.

శ్రీరంగమునందు కావేరి రెండుపాయలుగా చీలి రంగని ఆలయమును చుట్టిపాఱుచున్నది. తల్లి బాహులమధ్య నొదిగి నిలిచిన తనయునివలె ఆ యుభయకావేరీమధ్యనున్నాడు రంగశాయి. అచ్చటికి సమీపముననే జంబుకేశ్వరమను పుణ్య క్షేత్రముగలదు. సాయంత్రపువేళ నచ్చటికేగి స్వామినిదర్శించి తిమి. ఆస్వామిపేరుకూడ జంబుకేశ్వరుడే.ఆయనదేవేరి అఖిలాండే శ్వరి. జంబుకేశ్వరాలయము గూడ చాలగొప్పదే గాని బహి ర్భాగమంతయు శిథిలమగుటచే మరలకట్టుచున్నారు.

శ్రీరంగమునుండి తిరుచనాపల్లి వెళ్ళి యచ్చట కొండ మీఁదగల మాతృభూతేశ్వరుని దర్శింపనెంచితిమి. కాని కారణాంతరములచే నచ్చటి కేగుట సంభవింపలేదు. కాన చెన్నపురి వచ్చితిమి. ఒకపెట్టె నెక్కించుటకైన సుకరముగాని యిరుకుదారులతో ప్రయాణికులకు మహాశ్రమయనిపించెడి దక్షిణయిండియారైలు కంపెనీవారి రైలుపెట్టెలబాధ తప్పెను. ఇంతటితో మాదక్షిణదేశపుయాత్ర ముగిసెనని చెప్పవచ్చును. కాని యీ యాత్రాచరిత్రమును ముగింపనున్న సమయమున చెన్నపురిలో మేము బసచేసిన గృహమును గూర్చి గూడ తెలుపకున్నచో సమగ్ర మనిపించుకొనజాలదు. మేము వెళ్ళునప్పుడును వచ్చునప్పుడును గూడ మద్రాసులో గృహలక్ష్మి పత్రికాధిపతుల యింటనే బసచేసితిమి. విశేషపరిచయము గలవారము కాకపోయినను వారి గృహమున మాకు గల్గిన ఆదర సత్కారము లపూర్వములు. మేమేగాదు వారి పరిచయ భాగ్యముగల వారెల్లరు వారిచే నిటులనే యాదరింపబడుదురని వింటిమి. కాన వారి గృహమున కితరములైన నాగరికపు నామధేయము లిచ్చుటకంటె ఉత్తమమైన "అతిథిమందిరము" అని చెప్పుట సమంజసముగా నుండును. కల్పలతా! సెలవు."

భావపురి
జూన్ 1929

మిత్రురాలు
శారద.

సౌభాగ్యవతి కల్పలతకు:—

నెచ్చెలీ!

నీవువ్రాసిన జాబుచేరినది. నేనుగూడ నీవలెనే స్త్రీ నాటకరంగప్రవేశమును గూర్చియే అహర్నిశలు యోచించు చున్నాను. అయినను ఈనాటకసమస్య మనకు గానిపని. ఆడువారమా, పాడువారమా, యంటివేల?- స్త్రీయుద్యమ మనిన తరువాత అది స్త్రీజాతికంతయు సంబంధించినదే. ఏల యన నేను ఈయుద్యమమువలన కలుగబోయెడి లాభ నష్టములు, మానావమానములు, కీర్త్యపకీర్తులు, స్త్రీజాతి కంతయు జెందును. ఏనాడో కైకచేసిన యకార్యమును, చిత్రాంగిచేసిన దుష్కృత్యమును కారణముగా "అబ్బా! ఆడవాళ్లెంత గట్టివాళ్ళు. ఎంతకైనా సాహసులే" అనువాదు స్త్రీజాతికంతయు చుట్టుకొనినది!

మ॥ నరకద్వారము సాహసాకరము పుణ్యస్వర్గవిఘ్నంబు దు
స్తరమాయాశతపేటి దంభనిధి దోషస్థాన మప్రత్యయో
త్కరను క్షేత్రము కాలకూట మమృతాకారంబు స్త్రీయంత్రమున్
ధర నెవ్వాఁడు సృజించె బూరుషగళోద్బంధక్రియాపాశమున్.

అని భర్తృహరి స్త్రీని హృదయభేదకముగా దూషించి నాఁడు. భక్తిజ్ఞానవైరాగ్యవిషయములలో కృషిచేయువారు స్త్రీని ఎంతపేలవముగా నిరసింపవలెనో అంతనిరసింపు

చుందురు. దేవవేశ్యలైననేమి మర్త్యవేశ్యలైననేమి; వేశ్యజాతి మూలకముగా స్త్రీసంఘమునకు చెందిన యపఖ్యాతి అపారము, కాని యీజాతిని సృష్టించినవారును పురుషులే, దూషింపుచున్నవారును పురుషులే. కాన వీని నన్నింటిని బాగుగా గుర్తించి నూతనోద్యమమునకు చేయూత నిచ్చుటో నిరసించుటో యనెడు బాధ్యత ప్రతిస్త్రీపైనున్నది. ఇది మనదిగాదని యూరకొనుట మనజాతి సౌభాగ్యమును నష్టపఱచుకొనుట. మఱియు దీనివలన గలిగెడు మంచిచెడ్డలు స్త్రీలవే కాబట్టి పురుషులకంటె స్త్రీలే ఈవిషయమును పూర్ణముగా విచారించి కర్తవ్యమును నిర్ణయించుకొనవలసినవారై యున్నారు.

రసపోషణకే, భావపుష్టికే, కళాభివృద్ధికే, స్త్రీనాటకరంగములో ప్రవేశించిన తరువాత మోటారుబస్సులయందును, రైలుబండ్లయందును, ఒదిగి కూర్చున్నట్లును, విధిలేక తల వంచుకొని ఆపత్కాలమందు డాక్టరుగారికి చేయిచూపించినట్లును, చిన్ననాడు తప్పని సరిగా బడిలో పంతులుగారియొద్ద చదువుకొనినట్లును, సభామధ్యమున తనకిష్టమైన విషయమును గూర్చి ఒడలు వణుకుచునో మాటలు తడబడుచునో నాల్గు ముక్కలు చెప్పినట్లును, నాటకరంగములో చరించుటకు వీలు లేదు. లజ్జావతియగు స్త్రీ, నాటకరంగమధ్యమున పరపురుషుడని యాంగికాభినయమున నాతనితో సమముగ జరించుట కే కొంచెము వెనుదీసినను నాటకకళ అధ్వాన్నమైపోవును. హంగు

చెఱచినయెడల స్త్రీ రంగమున కెక్కిన ప్రయోజనమేమి? నవరసముల పోషించి హావభావప్రకటనమునందు లోటులేకుండ ప్రదర్శించి నాటకములలో స్త్రీ ప్రవేశింప కుండుటవలన గలిగెడి గొప్పలోటును తొలగించి నాటకకళను మహోన్నతస్థితికి దెచ్చుటకే గదా స్త్రీ, నటకురాలు కావలసివచ్చినది? కాని స్త్రీ, రంగమున కెక్కినతరువాత, మడిలేని పిన్నపెద్దలు సంచరించెడిచోట మడిగట్టుకొనిన ముసలమ్మ యొదిగియొదిగి నడచినట్లు, ఎడయెడగానుండుటకు వలనుపడదు. కలిసి చరించుట స్త్రీలకర్హము గాదు. అయినను నాటకకళాభివృద్ధికొఱకు స్త్రీల నేల బలవంతముగా నాకర్షింపవలెనో నాకు తోచకున్నది. రాముడుగాని తా నచ్చముగ రాముడుగను, సీతగానితా నచ్చముగ సీతగను, నటించి వేషధారి ప్రేక్షకుల నానందింపజేయుటయే నాటకము. తాము సీతారాములముగామని నటకులకు దెలియును, ప్రేక్షకులకును దెలియును. అట్టిచో సీతవేషమును స్త్రీ వేసినను నొకటే పురుషుఁడు వేసినను నొకటే. పురుషుఁడు స్త్రీగా నటించిన నందు కొంత సామర్థ్యప్రకటన ముండునేమోగాని స్త్రీ నటించినచో నందద్భుత మేముండును? స్త్రీయైన మాత్రమున పలుభావములు ప్రకటించుటలో కౌశలము వలదా? యనిన నదియు నిజమేకాని పురుషుఁడే యిన్నిభావములు ప్రదర్శించిన మఱియు నధికకుశలతయనిపించుకొనునుగదా! శీలము మనుష్యునిబట్టి యుండునుగాని వృత్తినిబట్టియుండదని కొందఱనుచున్నారు. కాని సీతవంటి శీలవతి నాటకరంగములో సీతవేషమును ధరించు ననుకొనుము. ఆదర్శపాత్రమగు సీతశీలమును ప్రతిస్త్రీయును తన

జీవితమునందనుష్ఠేయముగా నుంచుకొనదగినదికదా. హనుమంతుఁడు సీతను తనమూపున నిడుకొని శ్రీరామచంద్రుని కడకు గొంపోవుదునని సీతతోఁ జెప్పినప్పుడు పరపురుషునంటనని సీతచెప్పినది. ఉత్తమమైన యాసతీధర్మము ననుష్ఠించెడు యా సీత వేషధారిణి,నాటకరంగములో నెట్లు చరించును? నాకు దుర్జ్ఞేయముగా నున్నది. అదిసరే. భాగవతములు నాటకములు మున్నగు నీకాలక్షేపము లెందులకుఁ బుట్టినవి? ఇంచుక యోచింతము. ప్రజలలో నీతిని పెంపొందించుటకును, దేశానురక్తిని గలిగించుటకును మతాసక్తిని బుట్టించుటకును దైవభక్తిని వ్యాపింపఁజేయుటకును, జనులను గూటమిగాఁ జేర్చి కాలక్షేపములు జరుపుట మనదేశములో ననాదిగా నడచుచున్న యాచారము. ఇవి సామన్యముగా పామరజనుల ప్రబోధము కొఱకే యేర్పడినవి. వీనిలో మొదటిమెట్టు కథలు చెప్పుకొనుట. కథ నీతికరమైనదియు కథకులు వచోనైపుణిగలవారును నైనచో ఆటపాటలు, మద్దెల తాళములు, బహుపాత్రలు లేకపోయినను, వినువారి మనస్సు నట్టె యాకర్షించి చిత్రప్రతిమలుగాఁ జేయవచ్చును. వీనిలో శ్రోతలు కథలోని పాత్రలను మానసికముగా సృష్టించుకొందురు. వీనిలోనున్న యేకాగ్రత మేళతాళడంబరములలో నుండెడి కాలక్షేపములలో నుండదు. తల్లివద్ద నేకాగ్రచిత్తముతో నిట్టి కథల నాలకించియే మహారాష్ట్రచక్రవర్తియైన శివాజీ, యంతటి శూరుఁడైనాఁడు. వీనికి కొంచెము పైమెట్టు గొల్లసుద్దులు, తందానపదములు మున్నగునవి. వీనిని వినువారు ముఖ్యముగా జాన

పదులు. ఈ పదములు వట్టి పాడిమాటలు కాకపోయినను తత్తుల్యములగు కొంచెము రాగముతోగూడిన పదములు. వీనికి కొంచెమూత ఏకతంత్రీసాధనమగు తంబూరయు కొమ్ము, తిత్తి, మున్నగునవియు. పూర్వము జనసామాన్యములో మతము, యుద్ధము, మున్నగు వానినిగూర్చి ప్రబోధము కలిగించ వలసి నప్పుడు పరవశచిత్తులగు వారిచే నుద్రేకముగా చదువబడెడి యీ పదములు బహూపయోగకరముగ నుండెడివి. ఇప్పటికిని బొబ్బిలికథ, పల్నాటి వీరచరిత్రము, మున్నగు వీరచరితములు పాడబడునపుడు జానపదులలో గల్గెడి యుత్సాహ మద్భుతము. వీనికి పై మెట్టు తోలుబొమ్మలాటలు. జనులలో నాగరికత యభివృద్ధియైన కొలది యీకాలక్షేపముల యభివృద్ధియు పలు తెఱగులుగా నుండజొచ్చినది. ఉపనిషత్కాలమున మానసిక ముగానున్న యేకేశ్వరోపాసన, కాలక్రమమున ఆడంబరము లతోగూడిన ప్రతిమార్చనగా మాఱి మనుజుని పతనమునకు కారణమైనట్లు ఈకాలక్షేపముల వృద్ధియు మన పతనమునకే దారిచూపినది. కథలను గేయములను వినునప్పు డాయాకథల లోని యుత్తమపాత్రలకు మానసికముగా రూపకల్పన గావించు కొని వాని సత్యశీలసామర్థ్యములను గుర్తించి . వానిని తమ జీవితములం దనుష్ఠేయముగా నుంచుకొనుటకు శ్రోతల కవకాశ ముండెడిది. కాని తోలుబొమ్మలాటలలో ప్రసిద్ధవ్యక్తులకు కృత్రిమరూపములు కల్పించుటచే చిత్తైకాగ్రత నశించినది. తోలుబొమ్మలాటతోనే రంగస్థలమున తెఱయెత్తబడినది.

వాయిద్యపరికరములుగూడ నధికమైనవి. గాత్రమాధుర్యము నకు ప్రాముఖ్యత ఈయబడినది. కాన కథలకు కళాసాంకర్యము గల్గినది, ఈతోలుబొమ్మలాటలయందేనని చెప్పవచ్చును. కాని మన భరతఖండమునందలి ప్రసిద్ధేతిహాసములగు రామాయణ భారతాది యుద్ధగ్రంథములయందలి శూరభక్తానీకముల చరిత్ర ములను బొమ్మలద్వారాసుబోధముగావించి పామరజనులలో నీతిప్రబోధము గావించుటయే యీతోలుబొమ్మలాటల లక్ష్య ముగూడ నై యుండెను. కాని యచేతనములగు తోలుబొమ్మల నాడించి సచేతనపు తోలుబొమ్మలగు జనసామాన్యము నానం దింపజేయుట యనునది కాలక్రమమున నాగరికులకు మోటుగా తోచినది. కాన తామే ఆయాపాత్రముల ధరించి నటించుట యుక్తముగా భావించినారు. అవియే భాగవతములు. తోలు బొమ్మలాటవఱకు మనుజుఁడు మొగమునకు రంగుపూసికొని రంగమున కెక్కలేదు. మఱియు తోలుబొమ్మలాటవఱకు నీకథల నడుపువారు సామాన్యముగా శూద్రులే యైయుండిరి. ప్రాయికముగా వీరి గురువులు బ్రాహ్మణులై యుండినను నలు వురిలో నాడెడివారు మాత్రము బ్రాహ్మణేతరులే. బ్రాహ్మణే తరులలో నిట్టియాటపాటల కాలక్షేపములు జరుగుచుండ బ్రాహ్మణు లూరుకొనలేదు. పురాణపఠనము హరికథలు మున్నగునవి వారి కాలక్షేపములుగా నుండెడివి. అయితే వారి కాలక్షేపములకు వీరును వీరికాలక్షేపములకు వారును పోకుండి రని భావనకాదు. వాని ఆధిపత్యము లాయాజాతులవారు మాత్రమే చేయుచుండిరని యర్థము. అయితే భాగవతములలో

అన్ని జాతులవారును పాల్గొనిరి. బ్రాహ్మణభాగవతులు—వీరే కూచిపూడి భాగవతులు. గొల్లభాగవతులు, ఏనాదిభాగవతులు, మాలభాగవతులను పేరులతో వేర్వేఱు కులములవారు భాగవతముల నాడుచుండుట యిప్పటికిని కందుము. నాట్యకళా బ్రహ్మయగు భరతాచార్యునకు పూజ్యత ఈ భాగవతముల యందే కల్గినది. మఱియు హావభావముల కాధిక్యతయు, శృంగారమునకు ప్రాముఖ్యతయు, కృష్ణచారిత్రమునకు ప్రాధాన్యతయు, నీతికి న్యూనతయు నీభాగవతముల కాలముననే గల్గెను. కాని యొకమేలు, వీధిభాగవతముల వఱకు వీని వ్యయము జనసామాన్యమునకు తగిలెడిదికాదు. గ్రామములో పెద్దలైనవారేనలుగురైదుగురో దానివ్యయమును భరించి ప్రజాసామాన్యమున కాయాటను సందర్శించుభాగ్యమును ధారాగతము చేసెడివారు. వాని తరువాతివే నాటకములు. ఈనాటకములలో గూడ వీధినాటకములని యొక్కటే తెఱతో వీధులలోనాడునవి కలవుకానివాని ప్రచారము స్వల్పము. ఇప్పటి నాటకములనగా వానికొక ప్రత్యేకమందిరముండును. రంగానుకూలములైన పరికరము లధికము. నేపథ్యాడంబర మెక్కువ. నృత్యగీతాభినయములకు ప్రాముఖ్యత యధికము. మఱియు ప్రతిచూపరియు కొంతమూల్యమును తన స్థితినిబట్టి యిచ్చుకొనవలయుట వీనిలో ముఖ్యవిషయము. టిక్కెట్లపద్ధతితో గూడిన నాటకములు ధనికులను పేదలను విడదీసినవి. కాన భాగవతములు నాటకములు మున్నగు కాలక్షేపములు జరుపుట ప్రజాప్రబోధమునకనెడి యాదర్శమును నాటకములు

చెఱిచినవి. నాటకములు శ్రీమంతులగు నాగరికుల కానంద మును గూర్పవచ్చును, కాని ప్రజాసామాన్యమునకు వీని ప్రయోజనములేదు. ఒకవేళ యేపాటకపు జనుఁడైనను పావలా, అర్ధా, చెల్లించి నాటకమునకు వెళ్ళియుండినచో త్రాగుబోతైనవాఁడు, యింటిలోనిభార్యాబిడ్డలగోడు జూడక కల్లంగడికి వెళ్లినట్లే నాటకముల చూడవచ్చిన కూలివాఁడు కూడ ఇంటిలో మఱుపూట గంజి కాధారములేకుండజేసి నాటకసందర్శనమనెడి దుర్వ్యసనపిసాస దీర్చుకొనుటకు వచ్చి యుండెననుట స్పష్టము. కాన ధనికులకే నాటకములు. వీరి యానందమునకు పురుషవేషధారులు చాలలేదు. కాన స్త్రీలనుగూడ రమ్మనుచున్నారు.

ఇటీవల కొంతకాలమునుండియు నాటకకళ విషయమై మనయాంధ్రదేశమునందు ప్రచారము జరుగుచున్నది. సమర్థులైన నటకులు కొందఱు బయలుదేరి బహుమానములు, బిరుదులు, పొందుచున్నారు. ఈకళాభివృద్ధికై గ్రంథములు కొన్ని ప్రకటింపఁబడినవి. పత్రికలుగూడ స్థాపింపఁబడినట్లు జ్ఞాపకము. కాని ఈప్రచారమంతయు పురుషులలోనే జరుగుచున్నది. స్త్రీలుగూడ నాటకరంగములో పాల్గొనకుండుట లోపమను సంగతిని కళావిదులు నిన్నమొన్నటివఱకు గుర్తింపలేదు. బహుశఃయిది ఈవత్సరమే దేశములో ప్రవేశించిన నవ్యమారుతము. ఇది పశ్చిమవాయువని కొందరన కాదు, కాదిది

ప్రాచ్యమారుతమే యని కొందఱనుచున్నారు. ఇది యేగాలి యైననేమి మనహిందూస్త్రీ మనస్తత్వముల కిదిసరిపడునా లేదా? యనునదియే యోచింపవలసిన యంశము. వేశ్యాజాతి స్వర్గలోకములోనున్నది. మర్త్యలోకములో నున్నది. పాతాళ లోకములోనున్నది. చతుర్యుగములకు సంబంధించిన శ్రుతి స్మృతిపురాణేతిహాసములలో వీరి ప్రస్తావనగలదు. కాన నిది అతిపురాతనమైన తూర్పు వాయువు అని చెప్పుటకు సందే హములేదు. అయిన నేమి? నీతిభ్రష్టమైన యీజాతిధర్మ మును కూకటివేళ్ళతో గూడ పెల్లగించుటకు దేశహితైకాభి లాషులెల్లరు తీవ్రముగా యత్నించుచున్నారుగదా. అట్లె ఈ నాటకరంగ ప్రవేశోద్యమముగూడ ప్రాచ్యమైననేమి, ప్రతీచ్య మైననేమి, ప్రాక్తనమైననేమి అధునాతనమైననేమి? సతీశ్రేయ మునకు భంగకరమైనచో నది నిర్మూలింపఁజేయుట స్త్రీల కర్తవ్యము. మనయింటిదీపమని ముద్దుపెట్టుకొననగునా?

కల్పలతా,

"లోకోభిన్నరుచి" యన్నట్లు జనులతలపులు బహు విధములు. నీతిలక్ష్యము కొందరికి, కళాప్రియత్వము కొంద ఱికి, కనులపండువు కొందఱికి, ఎవరి యుద్దేశము కాదనినను వారి కావేశమే యెత్తుకొనివచ్చును, కాని ఆలోచింపవలసిన విషయముల కావేశముచెందిన లాభములేదు. కాన ఒక ప్పుడు శీలమునకై యాత్మార్పణము గావించి యశోవిశాల

మైన భారతమహిళ నేడు నాటకకళకు బలియై తన పూర్వో న్నత్యమును చెఱుచుకొనుట యుత్కృష్టమా, నాటకకళకు లోపముకల్గిన గల్గుగాక తన శీలమునే ప్రాధాన్యముగా బెట్టు కొని నాటకరంగములకు వెలిగానుండుట యుత్కృష్టమా, స్త్రీలును స్త్రీసంఘాభ్యుదయపరులగు పురుషవరేణ్యులును యోచింతురు గాక.

దూకుదూకుమనువారేగాని తోడు దూకువారుండరు. స్త్రీ లిందు పాల్గొనుటవలన దేశ మభివృద్ధిజెందుననియు, నాట్యకళ పెంపొందుననియు, స్త్రీ పురుషులు యోగ్యులై యున్నచో వా రెంత కలిసి మెలసియున్నను ప్రమాదము లేదనియు, కళాభిమానులగువారు తమ యుద్యమవిస్తారము నకై పలుతెఱగుల సమాధానములు చెప్పి స్త్రీల నాకర్షింప వచ్చును. కాని నాటకములాడు స్త్రీలనుగాంచి లఘుభావ మున పలుగాకిమూకలాడు ప్రల్లదముల నాప వీరితరమా?

మహాత్మునివంటి యుత్తమోత్తమ పురుషవరేణ్యునిచే నడుపబడుచున్న సబర్మతీ సత్యాగ్రహాశ్రమమును బోలు నిష్ఠురనియమవిధానములుగల సంస్థయందే స్త్రీ పురుషులలో లోపములు గననయ్యెనని మహాత్ముడు వలవల విలపించినాడు. శీలభంగభయముచేతనే స్త్రీ పురుషులు కలిసి పనిచేసెడు ఫ్యాక్టోరీ విధానమును మహాత్మునివంటి ప్రాజ్ఞులు నిరసింపు చున్నారు. అట్టిచో నిక నాటకరంగములా స్త్రీల మర్యాదను చెక్కు చెదరకుండ రక్షింపునవి?

పూర్వము మన దేశమున స్త్రీలు నాటకములలో పాల్గొనినట్లు కానము. ఉండిరని చూపఁబడుచున్న వారు దేవవేశ్యలైన అప్సరసలేగాని సంసారిణులుగారు. మన శాస్త్ర మహోదధియందు బాల్యవివాహవాదులకును ప్రౌఢవివాహ వాదులకును నుదాహరణములుగా జూపదగిన శ్లోకరత్నములు లభించినట్లే ఒకవేళ వెదకినచో నీ విషయమునగూడ యుభయ వాదులకును నుదాహరణ శ్లోకరత్నములు కొదువలేక దొరక వచ్చును. వేషధారణము గృహస్థ నిషిద్ధకర్మమని శాస్త్ర దృష్టాంతములు పెక్కులుగలవు. వానినెల్ల నిక్కడ వాకొనుట అనవసరము. ముంజేతి కంకణమున కద్దమెందులకు? స్త్రీ నాటకరంగ ప్రవేశముయొక్క ఫలితములు సాధారణ విషయ ములను బట్టియే కరతలామలకమగుచుండ ప్రాచీనోదాహరణ ములకొఱకు ప్రాకులాడుటేల? కల్పలతా! నాటకకళనుగూర్చి సందర్భమునుబట్టి యింతగా విమర్శించుటచే నాటకకళ యనిన నాకు ద్వేషమని భావింపకుము. స్త్రీల ప్రవేశమునుగూర్చియే నా కభిప్రాయభేదముగాని కళాకోవిదులగు పురుషవరేణ్యు లీ నాట్యకళోద్ధరణకై విశేషముగా పాటుపడి మన యాంధ్రదేశ మును నీ విషయమునగూడ తీసిపోనిదానినిగాఁ జేసేరేని నాకు పరమసంతోషము. కాని యే స్త్రీజనాభ్యుదయచింత స్త్రీ జనప్రయోజనకరములగు నుదారసంస్కరణములకు నన్ను సుముఖురాలనుగాఁ జేయుచున్నదో ఆ మహనీయచింతయే నన్నీ యుద్యమమునకు వ్యతిరేకాభిప్రాయనుగా చేయు

చున్నది. దీర్ఘముగా నాలోచించిన పిదపనే నే నీ నిశ్చయము నకు వచ్చితిని. అది నా కళానభిజ్ఞతయు ఛాందసముననని యేరైన నధిక్షేపించినను నదియు నాకొక యలంకారమే యనుకొందును.

భావపురి
1929 జూలై

మిత్రురాలు,
శారద.

సౌభాగ్యవతి కల్పలతకు—

నెచ్చెలీ!

చూచితిని, సమదర్శినీగర్భశుక్తిముక్తాఫలమగు ఉగాది సంచికను చూచితిని. చక్కని కాగితములతో ముచ్చటైన అచ్చుతో రమ్యములైన చిత్తరువులతో మనోహరములైన భావగీతావళులతో దివ్యములైన వ్యాసములతో సంచిక రమణీయమై యొప్పారుచున్నది. ఆఱేండ్లు నిరాఘాటముగా చెన్నరాజధానీప్రజాయత్తశాఖల బాలించిన ప్రతిభాశాలియగు నా సచివశేఖరుని రాజలాంఛనాలంకృతంబగు త్రివర్ణముఖ చిత్రము నిజముగా నాసంచిక కపూర్వశోభనే గూర్చుచున్నది. రాజకీయసాంఘికార్థిక సారస్వతానేక విషయములనుగూర్చి వ్రాయబడిన ప్రసిద్ధవ్యాసములు పునఃపునః పఠనీయములై తనరారుచున్నవి. అందందు తనరారుచున్న పద్యమాల లాసంచికా బాలకు మణిహారములే! సందియములేదు. కాని యెట్టి చక్కదనాలచుక్కకైన ఇంచుకంతలోప ముండకపోదు. విధాతృసృష్టిలోనే యిట్టిలోటు సర్వసాధారణముగా కనిపించుచుండును. ఇఁక మానవసృష్టియందుండుటలో వింతయేమున్నది? పాశ్చాత్యస్త్రీలనుగూర్చి వ్రాయఁబడిన వ్యాస మాసంచికలోఁ జేరుట నిజముగా నాసంచిక కొకకళంకమనియే చెప్పవచ్చును. అయినను నీ విషయమై యాసంచిక నిర్వాహకులనుగాని యావ్యాసకర్తనుగాని యనవలసిన పనిలేదు. వారి పత్రికానామమే వారి

మతమును నిరూపింపుచున్నది. కాన సమదర్శన భావముతో నావ్యాసము నందుకొనిరి. ఇక వ్యాసకర్త విషయమా? ఆ సోదరునను పాశ్చాత్యస్త్రీలనుగూర్చి తెలిసినంత మాత్ర దేశ స్త్రీలనుగూర్చి తెలియదు. పాపము తెలిసియుండినచో అంత అసభ్యముగను నంతపేలవముగను వ్రాసియుంపరు. దానికేమి? ప్రమాదోధీమతామపి. ధీమంతులకుగూడ నొక్కొక్కప్పుడు పొరబాటు కలుగుచుండును. కాని ఆకథలేమి? మాణిక్యము వంటి సంచికలో మసి చుక్కలుపెట్టినట్లున్నవే? కల్పలతా! ఆకథలను జదువగనే నాకు మితిలేని విచార మొదవినది. ఏమి ప్రయోజనము గోరి యాపట్టభద్రు లిట్టి చెట్టకథలను వ్రాసిరో నేనిప్పటికిని ఊహింపలేకున్నాను.

మానవులు సహజముగా కథాప్రియులు. పాలుత్రాగు పసిబిడ్డగూడ చీమకథనో చేపకథనో చెప్పమొదలిడితిమేని యేడ్పుమాని ఊంకొట్టును. ఈ పసితనమునాటి కథాప్రియత్వము మనుజులకు వార్ధక్యము వచ్చినను సడలదు. పత్రికా పాఠకులైనవారిలోగూడ సారస్వతవిషయములనిన విసుగుకొనెడి వారును, చారిత్రకవృత్తాంతమనిన తలకంటగించుకొనెడి వారును, ప్రపంచవార్తలనిన వలదనెడి వారును, మత విషయములనిన మాకెందు కనెడువారును, భావగీతావళులనిన నేవపడెడువారును, కలరుగాని కథలనిన చెవి గోసికొనని వారుండరు. ప్రతినెలయు మాయిరుగు పొరుగు అమ్మలక్కలు "ఏమండీ, గృహలక్ష్మివచ్చిందా? భారతి వచ్చిందా? ఏం కథ

లున్నాయి. ఒకమారు చూపరూ.”అని కథలకొఱకే భారతీ గృహలక్ష్ముల క్షేమసమాచారము లడుగుచుందురు. ఆపత్రిక లలోని యొకటి రెండుకథలు చదివినచో వారి చదువు పూర్తి యైనట్లే. ఇఁక వానిలో వివిధవిషయములను గూర్చి కూర్చిన విజ్ఞానమంతయు వారి దృష్టిలో వట్టిచెత్త. చదువగనే యర్థ మయ్యెడివిని చదివినంతనే యానందమును గూర్చెడివిని కథలు. కాన అన్నివిషయములకంటె కథలనిన ప్రజలకెక్కువమక్కువ. ఈవిధముగా పండితపామరవివక్షతయు, బాలవృద్ధభేదమును లేక యెల్లరియామోదమును బడసెడి కథలెంత ప్రశస్తములై యుండవలెను? అది యేమిపాపమోగాని ఆధునికకథావాఙ్మయ మట్టి ప్రశస్తతను గోల్పోయియుండుటకు కడుంగడు విచారము గొల్పుచున్నది. ఒకమారు మాఅన్నగారితో మాట్లాడుచుం డగా మాటల సందర్భమున “కథలు యెట్లా ఉండాలె?”అని నేను మాసోదరునడిగితిని.“తన వాళ్లను నలుగురిని దగ్గరకూచో పెట్టుకొని చదివేటట్లుండాలె” అని ఆయన అనెను. అంటే? అన్నాను నేను. మగవాడు తన తల్లికి, కొమార్తెకు, తోబుట్టువుకు, భార్యకును; ఆడుది, తన తండ్రికి, సోదరునకు, పెనిమిటికి, పుత్రునకును, చదివి వినిపించుటకు అర్హమైనదిగా ఉండాలె. కథలేగాదు చిత్తరువులుగూడ అట్లే ఉండాలె అని ఆయన యనెను. నాకు హితోపదేశము చేయుటకై మాసోదరుడావాక్యము లనకపోయినను, ఆమాటలు గురుమంత్రమువలె నామనస్సున శాశ్వతముగా నాటిపోయినవి. ఏదేనియొక కథ వ్రాయ దొరకొనినచో భావగర్భితమైన యావాక్యము

నాకు మాటిమాటికి స్ఫురణకు వచ్చుచు అంధకారపథమున దీపకళికవోలెతోచి నాకర్తవ్యతాపథమును నిరూపింపుచుండును. ఇతరకథలను చదివినప్పుడు గూడ ఆకథలు పైవాక్యమునకు సరిపడియున్నవాయని యోచించుట నాకు పరిపాటి. సమదర్శినీ సంచికలోని కథలను జదివిగూడ నేనిట్టులనేయోచించితిని. రెడ్డిరంగమ్మ యెడ్డెతనపుగాథను జదివి అసభ్యము, అసాధారణము అని మనస్సున చీకాకుపడి, సావిత్రి యను చల్లనిపేరుగాంచి యీకథయైన మనశ్శాంతి నీయకపోదని కుతూహలముతో జదివితిని. మొదటికథకంటె నధ్వాన్నముగ నున్నదీ కథ. "మాప్రణయగాథ" సరేసరి. అన్నిటికంటె గొడవగానున్నది అమ్మడు గొడవ. సమదర్శినీపత్రికాధిపతులు తమ సమదర్శకత్వమును తేటపఱచుటకై హితాహితములను గమనింపక యిట్టి కథలకు తావొసంగి రనుకొందము. కాని వ్రాసినవారివి యెందులకు వ్రాసిరి? ఆకథలు తల్లి, బిడ్డకు చదివి వినిపింప దగినవికావు. బిడ్డ తండ్రికి చదివి వినిపింప దగినవికావు. సోదరుడు తోబుట్టువు నాకథలను జదువుమని చెప్ప సాహసింపజాలడు. స్నేహితుడు ఒకస్నేహితునిముంద నాకథలను సిగ్గువిడిచి చదువజాలడు. తుదకు అగ్నిసాక్షిగా పెండ్లాడిన ఆలుమగలు కాదుగదా కూరిమికిగూడిన స్త్రీపురుషులైన ఆకథలను జదివి మోదింపజాలరు. సావిత్రివంటి, రెడ్డిరంగమ్మవంటి, పనికిమాలిన స్త్రీలెచ్చటైన నున్నచో వారిని గూర్చి బహిరంగముగా జెప్పుకొనుటకే యోగ్యులైన వారు పూర్వము జడియువారు. మనసున తలపరాని వాక్కున నుచ్చ

రింపరాని యట్టి వృత్తాంతము లిప్పుడు విద్యాధికుల లేఖనీ సన్మానమునందుచు రమణీయకథలై పత్రికలలో పాత్రములలో నెక్కుచున్నవి. ఆహా! కాలమహిమ!

కథ అచ్చుపడి దేశములో ప్రవేశించిన తరువాత అవివాహితయైన బాలిక చదువును. అన్నెపున్నెము లెఱుగని బాలవితంతువు చదువును. పత్యనురక్తయగు నిల్లాలు చదువును. వైరాగ్యోదయమైన వృద్ధురాలు చదువును. అట్లే పురుషులలో గూడ విద్యార్థులు మున్నగు పలురకములవారు చదువుదురు. అందఱుచదువుట కర్హమైనదిగా నుండవలయుట కథారచయితల ముఖ్యధర్మమై యున్నది. కథకులే గాక కథకురాండ్రుగూడ యిట్టి కథలను వ్రాయ సాహసించుచున్నారు. దైవము వీరికి మంచి త్రోవను చూపుగాక.

కల్పలతా! యోచింప, యోచింప, భావకవులనబడెడి వారేదియో యొక ఆడపేరు బట్టుకొని 'ప్రేయసీ! ప్రేయసీ' యని యల్లాడుటయు, కథకులైన వారు 'ప్రేమప్రేమ' యనుచు స్త్రీలనుగూర్చి యిట్టి విపరీతపు అసమంజసపు గాథలల్లుటయు, జూడ ఆంధ్రభాష దురదృష్టమో ఆంధ్రస్త్రీల దురదృష్టమో యోచింపలేకున్నాను.

భావపురి
ఆగస్టు 1929

ఇట్లు
శారద.

సౌభాగ్యవతి కల్పలతకు—

నెచ్చెలీ!

నీవు వ్రాసిన జాబు చూచితిని. అందు నీవు "ఇటీవల జరుగుచున్న ప్రతిసభలోను పురుషులకు గౌరవబిరుదు లొసంగుచు స్త్రీల కొక్కరికైన నీయక ఆంధ్రమహాజనులు స్త్రీలను చిన్నచూపు చూచుచున్నారు. చూచితివా? బిరుదు లందుకొనదగిన విదుషీరత్నము లాంధ్ర స్త్రీలలో లేకనా? లేక స్త్రీల యెడగల నిరసనభావమా? ఏది దీనికి కారణము? ఇప్పటి పురుషులకు స్త్రీలయందు గౌరవభావ మేర్పడుచున్నదని నీవు వాదింతువుగాని నేను నమ్మను" అని నీవు వ్రాసిన వాక్యములు నా కెన్నిమాఱులు తలంచిన అన్నిమాఱు లత్యధికముగా నవ్వు వచ్చుచున్నది. నీకుగూడ బిరుదులపిచ్చి యున్నదా యేమి? నంద్యాలసభలకు పూర్వ మొకపత్రికలో చదివితిని లెమ్ము. ఇంతకుపూర్వ మిచ్చిన బిరుదులన్నియు బ్రాహ్మణులకే చెందినవి. ఈమాఱు బ్రాహ్మణేతరులకుగూడ నొకబిరుదు నిచ్చుట యవసరమని అందు వ్రాయబడినది. అదిచూచి అర్హతానర్హతలను పరికింపవలసిన వాటికి బ్రాహ్మణ బ్రాహ్మణేతరభేదములు తీయబడుచున్న వేమని విచారించితిని. ఇప్పుడు నీవు స్త్రీ పురుష భేదములను గొని వచ్చితివి. బిరుదులపై మోహముగలవారు స్త్రీలలోగూడ నున్నారని నీ యుత్తరముచూచి ఆశ్చర్యముతో ననుకొంటిని.

కాని విచారించిచూడ నా ఆశ్చర్యము పొరబాటే! ఏలనం దువా? ఈ బిరుదులు మన దేశమునకు క్రొత్తలుగావు. రాజులకు, రాణులకు, మంత్రులకు, సేనాపతులకు, కవులకు, గాయకులకు, పండితులకు, మల్లులకు, శిల్పులకు వేయేల ప్రజ్ఞాచణులైనవారి కెల్లరకు కడుదీర్ఘములైన బిరుదావళులున్నట్లు ప్రాచీన శిలాశాసనములును, గ్రంథములును చాటుచున్నవి. ముఖ్యముగా సుప్రసిద్ధులగు మన ప్రాచీనకవివరేణ్యులలో బిరుదుపదములు లేనివారే లేరు. ఆదికవియైన నన్నయభట్టు వాగనుశాసనుడను బిరుదుపొందెను. ఆరణ్యపర్వశేషపూరణము గావించిన యెఱ్ఱనార్యునకు ప్రబంధ పరమేశ్వరుడను బిరుదుగలదు. తక్కుంగల భారతమును రచియించిన తిక్కయజ్వ కవిబ్రహ్మ యని వినుతిబొందెను. మనుచరిత్ర కావ్యకర్తయైన అల్లసాని పెద్దన ఆంధ్రకవితాపితామహుండను బిరుదము నందెను. రమణీయమంజులకవిత కధినాథుండైన శ్రీనాథుండు కవిసార్వభౌముండను బిరుదును బడసెను. ఇంక కృష్ణదేవరాయాది రాజేంద్రులకును, తిమ్మరుసు మున్నగు మంత్రిసత్తములకును, తదితర రాజకీయోద్యోగులకునుగల బిరుదావళులకు లెక్కయేలేదు. ఇప్పటికిని మన దేశమునందలి సంస్థానాధిపతుల పేరులు చూచిన మన పూర్వులకు బిరుదావళులపై మోహ మెంతగానుండెడిదో విశదమగును.

అలనాటినుండియు మనవారికి ఉండిన బిరుదులపై వాంఛ నేడును మనవారిని వీడదుగదా! ఈ బిరుదులు పలు

విధములు. పాండిత్యమునకు మెచ్చి ఈయబడెడివి కొన్ని. ప్రజ్ఞకు సంతసించి యిచ్చెడివి కొన్ని. ఈ బిరుదములను కొన్నిటిని ప్రజలొసంగుదురు. కొన్నిటిని యేవేని విద్యాపీఠములో జాతీయసంస్థలో పరిషత్తులో నొసంగును.

మన దేశమం దసహాయోద్యమము బయలువెడలిన తరువాత దేశీయులు బహిష్కరింపవలసినవాటిలో ప్రభుత్వపు బిరుదములుగూడ నొకటిగాఁ జేర్పబడినవి. అప్పటినుండి ప్రభుత్వబిరుదముల పలుకుబడి చాలవఱకు సన్నగిల్లినది. మఱియు వానిపై నొకవిధమగు నిరసనభావముగూడ నేర్పడినది. నిరాకరణోద్యమము విస్తరించియున్న యాదినములలో పలువురు పూర్వదత్తబిరుదములను విసర్జించి ప్రజల పొగడ్తల బడసిరి. "బిరుదుపదవులను బురదలొ దిగబడి" దేశమును దాస్యములో ముంచకుడని జాతీయాత్మగల కవులు గానము చేసిరి. ఈవిధముగా దొరతనపు సన్నదులపై మోహము జనులకు తొలగింపఁబడినను బిరుదులపై మోహముమాత్రము జనులకు పూర్తిగా వదలలేదు. దొరతనమువారి రావు సాహెబు, రావు, రాయ, దివాన్‌బహద్దూర్, సర్ ఇత్యాది బిరుదులపై పోటీకి వచ్చినవో యనినట్లు దేశభక్త, దేశబంధు, దేశోద్ధారక మున్నగు బిరుదులు దేశసేవపరాయణుల పూజ్యనామములకు తగిలించి పిలుచుట అసహాయోద్యమ కాలము నుండి పరిపాటిగానున్నది. దేశపూజ్యులైనవారికి నిండు ప్రేమతో ప్రజలొసంగెడి దేశభక్తాది బిరుదములు మాన్య

ములేమైనను వీని అధికృతయేమో నాకు గోచరించుటలేదు. మహాకవియైన రవీంద్రనాథటాగోరుగారికి సర్ బిరుద మీయ బడినప్పు డా మహాపురుషు డనెనట. ఏమని? "సర్ రవీంద్ర నాథటాగోరు అనుటకంటె నా దేశీయులు 'రవిబాబు' అను టయే నా కెక్కువ ప్రీతికరము" అని. కాన మహనీయులగు వారికి వారి నామాక్షరములే వేయి బిరుదులపెట్టు. ఎంత గొప్ప బిరుదమైన, వారి నామాక్షరములతో జేరినప్పుడే గదా రాణించును? అయినను స్త్రీలకుగాని పురుషులకుగాని యీ బిరుదులవలన గలుగబోయెడి ప్రయోజనమేమి? మునుపే గౌరవనీయులగువారి కీ బిరుదములవలన గౌరవ మినుమడింప బోదు. గౌరవహీనులగువారి కీ బిరుదులవలన గౌరవము కలుగను కలుగదు. మన ఆంధ్రమహాసభవారు గౌరవనీయు లగువారి కీ గౌరవబిరుదములీయ టారంభించినది కీ॥ శే॥ దుగ్గి రాల గోపాలకృష్ణయ్యగారికి ఆంధ్రరత్న బిరుద మొసంగుటతో నని జ్ఞాపకము. నాటినుండి యేటేట నొకరికో యిద్దరికో యీ బిరుదములు చదివించుచునేయున్నారు. అన్నిటి కేమిగాని శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారికి దేశోద్ధారక బిరుద మీయబడినదని పత్రికలలో చదివినప్పుడు నిజముగా నాకు నవ్వే వచ్చినది. పత్రికల మూలకముగా, ఉపన్యాస ముల మూలకముగా, వితరణలమూలకముగా శ్రీపంతులు గారు దేశమునకు చేయుచున్న సేవ అమూల్యము. వారి సేవానిరతి అసదృశము: వారి దేశభక్తి యనుపమానము: వారి దానశీలత యసామాన్యము: వారి సౌజన్యకారుణ్యాదు

లనన్యములు. సర్వతోముఖముగా ఆంధ్రప్రపంచమునకు వారు చేయుచున్న యుపకృతి పారములేనిది. అట్టివారిని బిరుదులు లేకనే ఆంధ్రప్రపంచము గుర్తించుచున్నది; పూజించుచున్నది; గౌరవించుచున్నది. ఇట్లు మునుపే ప్రజల మన్ననల చూరగొన్న యీ మహనీయునకు మహాసభ "దేశోద్ధారక" బిరుద మొసంగుట సూర్యునకు దివిటీదానము చేసినట్లున్నది. ఇందు వలన పంతులుగారికి ఇనుమడించెడి గౌరవములేదు. చేకూరెడి లాభములేదు. కాని అసాధారణమగు వారి దాతృత్వమునకు మహాసభవారొకకొలమాన మేర్పరచినట్లైనది. సర్వతోముఖమగు వారి కృషి కొకముఖ మేర్పరచినట్లైనది. అపరిమితమగు వారి దేశసేవకు పరిమితి నేర్పఱచినట్లైనది. అంతియ దాని లాభము.

ఈ యేడాంధ్రమహాసభవారు నల్వురకు బిరుదము లొసంగిరి. వారు నల్వురను ఉత్తమోత్తములైన యీ సామర్థ్యచిహ్నములు పడయదగిన మహాపురుషులే యనుటకు సందియములేదు. కాని ఆ బిరుదులందుటవలన నా మహనీయులకు ప్రయోజనము లేకపోగా ఆంధ్రమహాసభవారీ బిరుదులొసంగు పద్ధతిని గమనించి మన దేశమునందు కుప్పలు తిప్పలుగా జరుగుచుండెడి కులసభలును తదితర క్షుద్రసభలును చెలరేగి సాధారణులకెల్ల తలయొక బిరుదును నొసంగి ఈ మహనీయుల గొప్పతనమును క్రిందుపఱచునేమోనని భయ

మగుచున్నది. ఇప్పటికే కవి, గాయక, నటక లోకమున నిట్టి బిరుదావళు లసంఖ్యాకములుగానుండుట సాధారణముగా జూచుచున్నాము. వారి కాబిరుదము లే సన్మానసభలోనైన నీయబడినవో లేక తమకుఁదామె తెచ్చుకొనినవో దైవమున కెఱుక. అయితే అట్టి బిరుదములను తగిలించుకొనుటచే వారి కార్థికముగా కొంతలాభ ముండవచ్చును. కాని దేశభక్త దేశోద్ధారకాది దేశసేవపరాయణుల కీ బిరుదములతో నేమి ప్రయోజనము? వారి దేశసేవయే వారి కెనలేని సామర్థ్య చిహ్నము. మఱియు వయోవృద్ధులగు వారి కిట్టి సన్మానములు సల్పుట కొంతకు గొంత లగ్గు. కాని చిఱుతప్రాయము వారికి బిరుదులిచ్చుట యోచనలేని సేఁత. బౌద్ధ వాఙ్మయ బ్రహ్మ పిన్నవయస్కులని వింటిమి. బుద్ధపురాణము వారి గ్రంథములలో మొట్టమొదటిది. వా రింకను పెక్కు యుద్గ్రంథముల రచియింపవచ్చును. అలవాటుపడినచేయి యూరకుండునా? చిఱుతవయస్సునఁనే బౌద్ధమతమును మథించిన యా విన్నాణి ఱేపు వేఱొక మతమునుగూర్చి యాంధ్రలోకమునకు విశదీకరింపవచ్చును. ఆ నా డాంధ్రమహాసభవారు ఆయా మతముల వాఙ్మయబ్రహ్మయని మరల వేఱొక బిరుద మిత్తురా? అటులనే విజయనగర సంగీతసారస్వతాది సభలవారు గూడ మఱల మఱికొందఱికి బిరుదులిచ్చిరి కాబోలు. అవి స్త్రీలకు లేవని నీకేల వలపోత? దీనివలన నారీలోకమునకు కలిగెడు లాభమేమి? స్త్రీలు విద్యావతులును సుగుణవతులును, సేవాపరాయణలునునైనచో బిరుదులు లేకనే ప్రపం

చము వారిని సన్మానించును. ప్రతిఫలరహితమైన ఉపకృతి, ప్రతిఫలరహితమైన వదాన్యత, యుత్తమోత్తమములు. మనుజులు కీర్తికాములగుటగూడ యొకలోపమే. కోరకయే మేఘుడు వర్షించినట్లు, వేడకయే పవనుడు వీచినట్లు, ప్రార్థింపకయే సూర్యుడు వేడివెల్గుల ప్రసాదించినట్లు జనులు స్వధర్మనిరతులు కావలెను. కృషికి ప్రతిఫలము కోరుట యుత్తమగుణము కాజాలదు. ప్రతిఫలాకాంక్షలేని సేవాపరాయణులను లోకమే గుర్తించి మన్నించును. బాలగంగాధరతిలకునకు లోకమాన్య బిరుదము నేసభవా రొసంగిరి? మోహనదాసు కరంచందుగాంధికి మహాత్మ బిరుద మేసన్మానసభ యొసంగెను? కాన మహనీయులకు అల్పసంఖ్యాకులకూటములు మాత్రమేయగు సభలలో బిరుదులు సమర్పింపబడ నక్కఱలేదు. అవి తమకుఁ దామైవలచి వారిని జెందును.

ఏ యుద్దేశముచేతనో మన ఆంధ్రదేశమునందలి సమావేశములు, కొన్నివత్సరములనుండి దేశములో పెద్ద పెద్దలకు సన్నదులొసంగుట సాగించినవి. ప్రమాదమో బుద్ధిపూర్వకమో అందు స్త్రీలుమాత్ర మింతవఱకు చేరలేదు. అందులకు నాకు సంతోషమే యగుచున్నది.

ఈ బిరుదులపై పిచ్చి మనకే గాదు నాగరకరాజ్యములని పేరొందిన పశ్చిమఖండములోగూడ బిరుదులపై వ్యామోహ మధికముగానేయున్నది. ఈ బిరుదులు బడయుటకై వారు పలుపాట్లు పడుదురట. ఈ సందర్భమున నేటి

బ్రిటిషుకార్మిక రాజ్యాంగమున మంత్రియై ప్రభుపదమును బడసిన సిడ్నీవెబ్బు దొరగారి యిల్లాలైన సిడ్నీవెబ్బుసతి నిరీహ సంస్తవనీయముగానున్నది. పెనిమిటి ప్రభువైనప్పు డామె ప్రభ్వి కావలెను గదా? కాని ఆమె యాపదముపై నేమాత్రము మోహముజూపక యిట్లనెనట—"ప్రజాహృదయమున మాప్రతిష్ఠ సిడ్నీవెబ్బు అను నామము చేతనే ఆరూఢమై నెలకొన్నది. కావున కలకాలమువఱకు నేను ఆ నామముచేతనే వ్యవహరింపబడుటకు ప్రియముపడుదును." కల్పలతా! ఆగష్టు మాసపు 'గృహలక్ష్మి'లో నే నీ వృత్తాంతమును జూచినప్పుడు పరమానందముజెంది నీ వ్యామోహాత బాపుట కిది మంచి మందు అనుకొంటిని. సిడ్నీవెబ్బుసతి నిర్లిప్తత మన ఆంధ్ర మహిళామణుల కాదర్శకమగు గాక!

ఇట్లు
మిత్రురాలు,
శారద.

భావపురి
సెప్టెంబరు 1929

సౌభాగ్యవతియగు కల్పలతకు—

నెచ్చెలీ !

నాజీవము ధర్మము. నామతము నీతి. నా లక్ష్యము సతీశ్రేయము. ఈమాటని సమర్థించుటకే నేను చేతకలము బూనితిని. ఎప్పు డీయాశయత్రయము ననుష్ఠింపజాలకపోదునో ఆనాడు నావ్రాఁతకోఁతలు కట్టిపెట్టుదును. న్యాయమునకు నేను కేలుమోడ్తును. నిష్పాక్షికతకు నేను శిరమువంచుదును. నాకొకరు హితులులేరు. ఒకరహితులులేరు. యుక్తాయుక్తవిచక్షణలేక మతమును నిరసించెడు దురాచారులు నా కెట్లహితులో మతముపేరిట ప్రజలను పీడించెడి దుండగీండ్రును నాకట్లే అహితులు. సాంఘికధర్మముల విచ్ఛిత్తిఁ జేయనెంచెడి దుష్ప్రారంభులు నాకెట్లమిత్రులో, సాంఘికరక్షణావ్యాజమున జనులనలయించెడివారుగూడ నాకట్లేఅమిత్రులు. నిష్కారణముగా భార్యను దుఃఖపెట్టెడి దుర్జనుడు నాకెట్లు కోపకారణుఁడో, భర్త నల్లాడబెట్టెడి దుశ్చరితయు నాకట్లే శత్రురాలు. అభము శుభము నెఱుగని పసిబాలయగు కోడలిని కోడంట్రికముపెట్టెడి అత్త నాకెట్టి శత్రువో, అత్తపొత్తుగిట్టని గయ్యాళియు నాకట్లే పగతురాలు. దేశములోని సదుద్యమముల నిర్మూలింప యత్నించెడి దుశ్శీలురు నాకెట్టి పగతురో, దురుద్యమముల వ్యాపింపఁజేయువారును నాకట్లే పగతురు, దూషణభూషణతిరస్కారములు శరీరమునకు గాని యాత్మకు

లేవను వేదాంతుల నానుడిని యొకవిధముగా విమర్శకులు గూడ నాదర్శముగా గొనవలసియుండును. పుర్రె కొకబుద్ధి జిహ్వ కొకరుచి. ఒక అభిప్రాయము మనము సరికాదనినపుడు దానిని సరియనువారును కుప్పలుతిప్పలుగా నుండనేయుందురు. అయితే ప్రకృతిభేదమునుబట్టి ఆ అవునుకాదనుటలో నొకరి పదప్రయోగము కటువుగను నొకరి పదప్రయోగము మృదుల ముగను నుండును. అంతమాత్రముననే మనము కించనొంద వలసిన పనిలేదు. అహింసాసత్యములు మహాత్ముని ఆదర్శ ములు. ప్రాచ్యప్రతీచ్యసమ్మేళనము రవీంద్రుని లక్ష్యము. ఈ ఆదర్శముల నంగీకరించినవారు వారిని కొండంతగ పొగడు చుండ అంగీకరింపనివారు తీవ్రముగ తెగడుచుందురు. అయితే ఆ మహాపురుషులకు నిందాస్తుతులయెడ నొక్కటే అద్వైతము. తమ కర్తవ్యములను సాధించుకొనుటే వారి ఆశయము. మహా త్ముడు ఒకప్పు డేమనెనో తెలియునా? "లోకములో ఒకే మానవు డున్నంతవఱకు నాసత్యసిద్ధాంతమును బోధింపుచునే యుందును. నాఖద్దరు మంత్రము నుపదేశింపుచునే యుందును" అని. ఖద్దరుద్యమము ఎంతెంతటి మహాపురుషుల నిశిత విమర్శనమునకు గుఱియైనది! అందులకని మహాత్ముఁడెన్నడై నను నిరుత్సాహము జెందెనా? తన సంకల్పము విడనాడెనా? అటులనే స్త్రీలనాటకరంగప్రవేశమునుగూర్చి యొకమాఱు దీర్ఘ ముగా యోచించి అనుచితమైనదని మనస్ఫూర్తిగా నిశ్చయిం చిన వెనుక పెద్దపెద్ద లెల్లరు దీనికనుకూలముగా నున్నారనియు, ప్రసిద్ధపత్రికాధిపతులెల్లరు దీనికి చేయూత నిచ్చుచున్నారనియు

నేనిప్పు డెట్లామోదింతును. అది నామనస్సాక్షికి వ్యతిరేకము గాదా? కాయేన మనసా వాచా నేనిప్పటికిని దానికి వ్యతిరేకనే.

'సాధన' పత్రికనుండి యుద్ధృతమైన నానాటకరంగ విమర్శనాలేఖపై విమర్శనముగల భాగమును నేను 'గృహలక్ష్మి'లో చూడకపోలేదు. చూచితిని. అది నాసరియైన అభిప్రాయమునకు విమర్శనమైనచో దానికి నాసమాధానమనగత్యము. ఏలనందువా ఎందరో స్త్రీలు నాటకకళాప్రవేశమును సమర్థించుచు వ్రాయుచున్నారు. వారిలో వీరొకరనియూరుకొనియుందును. కాని నాలేఖకు కొన్ని అపార్థములు తీయబడినవి. అవి నాకు కొంచెము మనస్తాపకారణములుగనే యున్నవి. ఆవ్యాసము చూచినది మొదలు స్త్రీల వ్యాసములను విమర్శించునప్పుడే తగుమర్యాద జూపగల సరళభాష నుపయోగింప జాలనివారు స్త్రీలు వేసిన వేషము నేమాత్రపు సరళభావముతోఁ జూడగలరని సందియమగుచున్నది. నాలేఖ నామూలాగ్రముగా జదివిన నక్షరాన్యులకెల్ల నేను స్త్రీల నాటకధారణావిషయమున ప్రతికూలనని స్పష్టముగా విశదమగుచున్నది. అట్టిచో స్త్రీవేషమువేసి రంగస్థలమున బాగుగా నెగురుటకు వీలులేదని నేను దుఃఖింపుచుంటిననియు, అట్టి నాదుఃఖము అర్థములేదనియు సాధనపత్రిక యెట్లూహించి వ్రాసెనో నాకు తోపకున్నది. ఒకచో శారదమ్మగారనియు, నొకచో శారదమ్మయనియు వ్రాసిన మాత్రమున మనకు

లోపములేదు. కాని అది స్త్రీలయెడ వారికిగల యగౌరవ భావమునకు నిదర్శనము కాగలదు. మఱియు అవియేగాదు. విషయము చక్కగా గ్రహింపకయే చేసినవిమర్శనలం దింకను పెక్కులున్నవి. లేఖావిస్తరభీతిచే వానినెల్ల యిందు వివరింపక విడిచితిని. ఏమైన సరియే అర్థముచేసికొను సామర్థ్యమున్నప్పుడే చదువవలయును. వివరింపగల సామర్థ్యమున్నప్పుడే వ్రాయ వలయును. ఈరెండింటికిని చాలనివారూరక అపార్థములను దీసి రచయితల నగౌరవపఱచెడి కటుపదములతో వ్రాయుట కంటె మిన్నకుండుట మేలు.

ఎవరెన్ని విధముల సమర్థించినను నాట్యకళ యభివృద్ధి జెందునేమోకాని గౌరవస్థానమునకు వచ్చుటమాత్ర మింతలో నయ్యెడిదికాదు. ఈకళకు గౌరవము ముందుకలిగినదిలేదు. ఇఁక ముందు కలుగబోయెడిది గూడ సందేహమే. శైలూష వృత్తిచే జీవించువారు పూర్వమన్ని కులముల వారిచేతను బహిష్కరింపఁబడియే యుండిరి. కులస్థులు వారితో సంబంధ బాంధవ్యముల కొప్పకుండుటయేగాక వారితో పంక్తిభోజన ముల కంగీకరింపకుండిరి. రాజదత్తాగ్రహారములు వారికి చెంద కుండునట్లు రాజులు శాసనములు వ్రాసిరి. పగటివేషములు వేయునట్టియు, భాగవతము లాడునట్టియు, బ్రాహ్మణులకు మా యిండ్లలో విడిగా భోజనము పెట్టువారమని యిటీవల మా తల్లిగారు చెప్పినప్పుడు నాకెంతయో ఆశ్చర్యమయ్యెను. ఆధు నికనాగరికతామహిమచే సాంఘికవ్యవస్థలు శిథిలమైన యిక్కా

లమున అట్టి బాధలు నటకులకు లేక పోవచ్చును. లేకుండుట గూడ సంతోషకరమే. అయినను నాటకకళ కింకను గణ్యత లేదని మాత్రము చెప్పక తప్పదు. పాత్రధారులైన పురుషుల విషయమే యిట్లుండ స్త్రీపాత్రధారులు ప్రజల మన్ననలందుట కెంత కాలము పట్టునో దురూహ్యము. అయినను ఈచర్చ లన్నియు పనిలేని పనులు. ఎవరి యిష్టము ప్రకారము వారుండుట కీదినములలో నొకరి నిరోధమేమియు లేదు. ఎవరి పెండ్లాము బిడ్డలు వారి స్వాధీనము. కనుక ఈవినోద్యమము నామోదించువారు ఇతర స్త్రీల నీపనిసేయ పురిగొల్పుటకంటె తమ కుటుంబము వారితోడనే యీసంస్కరణము నారంభించిన నెంతయు సమంజసముగా నుండును. అట్టివారి నెవరును కాదనరు. ఒకవేళ నావంటి చేదస్తులెవరైన కాదనినను వారికి కలుగు కొదువలేదు. ఏదైనను రంగములోనికి దిగిన గాని రంగుబయట పడదు. తడిసిగాని గుడిసెకట్టరు. త్రాగి గాని తూగరని సామెతగదా! కాన అనుభవముచేతగాని దీని మంచి చెడుగులు తెలియవు.

భావపురి
1929 నవంబరు

ఇట్లు
శారద.

## సౌభాగ్యవతికల్పలతకు:—

నెచ్చెలీ!

బహుకాలమునకు నీకు మన ఆంధ్రమహిళాసభను కన్నారజూచి తెలుపగలుగు భాగ్యమబ్బినందులకు సంతసమగు చున్నది.

నిజముగా ఈ నవంబరునెల మొదటివారము మన ఆంధ్రులకు జాతీయపర్వవారమని చెప్పనొప్పును. అహో! ఎన్నిసభలు! ఎందఱుజనులు! ఏమికోలాహలము! ఎంతయుత్సాహము! వర్ణనాతీతముగదా! కల్పలతా! అమ్మహోత్సవము చూచిన తరువాత నిజముగా నక్కడి కేగుటయు, కనుటయు, వినుటయు మహాభాగ్యమే యనుకొంటిని.

మేము బెజవాడలో ౨-౧౧-౨౯ తేదీని రైలుదిగు నప్పటికి స్త్రీలిరువురు మాకెదురుపడి యొక కరపత్రమొసగి తామేర్పాటుచేసిన బసకు రావలసినదని యాహ్వానించిరి. మాకీయూరబంధువులు గలరు. కాన వారియింటికేగి సభకు హాజరు కాగలమని వాక్రుచ్చితిమి. వారు సరేయని విడిచి పుచ్చిరి. తరువాత వారొసంగిన కరపత్రమును చూచితిమి. మఱునాడు ప్రత్యూషముననే మహిళాసభ ప్రారంభమని యందుండెను. ఆహ్వానసంఘమువారు సభలవిషయమై స్థిరమగు తేదీని ప్రచురింపరైరి. ఎట్లు వెళ్లుదునని తహతహలాడి

యెప్పుడు జరిగినదప్పుడే చూడవచ్చునని తేదీ తెలియకనే నేను బెజవాడ వెళ్లితిని. మఱునాడే సభ. నే నేకొంచెమాలస్యము చేసినను మహిళాసభను గాంచెడి భాగ్యము గల్గెడిది కాదు. చాలామంది కట్టి యాశాభంగముకూడ గల్గెను.

ఆరేయి గడచెను. ఉదయమేలేచి ప్రాతఃకృత్యముల నిర్వర్తించుకొని దాదాపు ఎనిమిదిన్నర గంటలవేళ మహిళా సభ జరిగెడి దుర్గావిలాసమున కేగితిమి. అక్కడ సభల సందడేమియు కాన్పింపలేదు. ఆ పెద్దహాలులో కొద్దిమంది స్త్రీలు ఒకమూలకుప్పగా గూర్చుండియుండిరి. "తొమ్మిదిగంటలు కావచ్చినది. సభానిర్వాహకురాండ్రేరి? ఆహ్వానసంఘాధ్యక్షురాలెక్కడ? అధ్యక్షురాలు వచ్చెనా? యని అక్కడివారి నడిగితిని. "అధ్యక్షురాలిని తోడ్కొనివచ్చుటకు స్టేషనుకు వెళ్లినారు. కూర్చోండి. వస్తారు" అని అక్కడ నున్నవారనిరి. సరేనని నేనును మాబంధుస్త్రీలును కూర్చుంటిమి. తొమ్మిదయ్యెను పదియయ్యెను పదునొకండయ్యెను. జాడలేదు!! సభలకై వచ్చి కృష్ణాస్నానమున కేగినవారును, కనకదుర్గను జూడనేగినవారును, పురుషుల సభలో జరిగెడిపతాకోత్సవమునుజూడనేగినవారును, యుస్సురస్సురనుచు రాసాగిరి. ఇంకను విషయనిర్ణయసభ కొఱకు కూర్చుండుట అనవసరమే గాదు దుర్భరమే యనిపించెను. చల్లగా నింటికి వెళ్లిపోతిమి. దాదాపు పదిరెండుగంటల వేళ ముత్తులక్ష్మిరెడ్డిగా రరుదెంచిరనియు విషయ నిర్ణయముల విషయమై సమాలోచన జరిగెననియు వింటిని.

మధ్యాహ్న కార్యక్రమము ఒంటిగంటకని ప్రకటనలో నుండుటచే నించుమించుగా మరల ఆవేళకు దుర్గావిలాసమున కరిగితిమి. కాని అప్పుడును సభలసందడి కాన్పింపలేదు. కొద్దిగా పురస్త్రీలు మాత్రము వచ్చుచుండిరి. ఈపూటగూడ సభ యెప్పుడు జరుగునో యనుకొంటిమి. దాదాపు రెండుగంటల వేళ సన్మానసంఘాధ్యక్షురాలును, సభాధ్యక్షురాలును సభ కరుదెంచిరి. అంత స్త్రీల సభకై ప్రత్యేకముగా నిర్మింపబడిన విశాలమగు పందిరిలో చేరితిమి. ఇతర పురములనుండి యరు దెంచిన స్త్రీల సందడియేగాని పుర స్త్రీలరాక కొలదిగా నుండెను.

విజయవాడ నాకు చిరపరిచితమైన పురము. ఆ పురస్త్రీలు సిగనిండ పువ్వులు దుఱుముకొని యొడలినిండ నగలుపెట్టుకొని వన్నెవన్నెల విలువచీరలను ధరించి ప్రతి చిన్న హరికథకును, ప్రతి భజనసమాజమునకును తండోపతండము లుగ వచ్చుట నే నెఱుంగుదును. ముఖ్యముగా నేదైన ప్రసిద్ధ నాటకఖేలన మనినచో పురుషులుకూర్చుండు ప్రదేశముకంటె స్త్రీలుకూర్చుండెడితావు క్రిక్కిరిసిపోవుట బెజవాడ నెఱిగిన వారికి క్రొత్తగాదు. కాని మహిళాసభపై వారేలనో శీతకన్ను వేసిరి. వివిధప్రదేశములనుండి పెక్కుమంది విదుషీమణు లరు దెంచి తమయూర గుమికూడి స్త్రీలకు సంబంధించిన పెక్కు విషయములను గూర్చి చర్చించుచుండగా వానిని చూచుట

కై నరాని పురస్త్రీల యుదాసీనత యనుచితమును, నక్కఱజ
మును అనిపించెను.

అధ్యక్షురాం(డ్రు సభ కరుదెంచిన తరువాత సభా
ప్రారంభమున కాలస్యము జరుగలేదు. శారదానికేతనపు
బాలికల సుమధురమైన దైవప్రార్థనతోడను, భరతమాతృస్త
వముతోడను, రాట్నగానముతోడను, సభ ప్రారంభమయ్యెను.
తదుపరి అధ్యక్షురాలి యెన్నికతంతునడపి శ్రీమతి ముత్తులక్ష్మి
రెడ్డిగారిని యగ్రాసన మెక్కించిరి. తరువాత నొక విదుషీ
మణి అచ్చొత్తిన స్వాగతపద్యములను మనోహరముగ జది
వెను. అప్పుడే కళావంతులు, శ్రీ॥ ముత్తులక్ష్మమ్మగారు తమ
సంఘమునకు గావించిన యమూల్యోపకారమునకు కృతజ్ఞతా
సూచకముగా స్వాగతపత్రమును సమర్పించిరి. అనంతరము
ఆహ్వానసంఘాధ్యక్షురాలగు తుర్లపాటి రాజేశ్వరమ్మగారు
విషయగర్భితమైన తమ మహోపన్యాసమును జదివిరి. తరువాత
అధ్యక్షురాలగు డాక్టరు ముత్తులక్ష్మిరెడ్డిగారి యాంగ్లోపన్యాస
మున కాంధ్రానువాదము వేఱొక నారీమణిచే చదువబడెను.
మఱియు వారిరువురి యుపన్యాసములును పుస్తకరూపమున
ప్రచురితములై సభలో పంచిపెట్టబడెను. మొత్తము మీద
రెండుపన్యాసములు స్త్రీలకు సంబంధించిన పెక్కువిషయము
లతోగూడి భావగర్భితములుగా నుండెను.

తదుపరి తీర్మానము లారంభమయ్యెను. మొట్టమొదటిదే
శారదాబిల్లు శాసనమైనందులకు మహిళాసభవారు తమ

యామోదమును తెల్పెడి తీర్మానము. పూర్వాచారపరులకు హృదయశల్యమును, సంస్కర్తలకును, దేశహితైకాభిలాషుల కును, స్త్రీజనాభ్యుదయ చింతనాపరులకునునానందకరమునునగు నా తీర్మానము నెగ్గినవెనుక ఖద్దరు, హిందీ, స్త్రీపునర్వివాహ ములు, స్త్రీ వారసత్వములు, గౌరుగారి వయోనిర్ణయశాసనము, సంపూర్ణ స్వాతంత్ర్యము, అస్పృశ్యత యనెడి పెక్కు విషయ ములనుగూర్చి తీర్మానములు చేయబడెను. అగ్రజాతులను కంపితగాత్రులను గావించెడి అస్పృశ్యతా విషయిక తీర్మానము సభలో చర్చకువచ్చునప్పటికి సాయంత్రము మూఁడుగంటలు దాఁటెను. "మాలవాండ్ల నేవిధముగా దరిజేర్చుకొందు మను వారి ఆలాపములును, ఇండ్లకు వెడలవలసినవారి సందడియు నేకమై సభలో కలకలము మెండయ్యెను. ఇదే సమయములో సభలో పాల్గొనుట కవకాశము చిక్కనివారి కసంతృప్తిమెండై యొకచోనలిగి కూర్చుండి వియ్యపురాలి సాధింపులు సాగించిరి. ఇట్టిస్థితిలో సభను సాంతముగా సాగించి ముగించుటకు సాధ్య ముగాక మఱునాడు సభను మూఁడుగంటలకు వాయిదావేసి ముగించిరి.

మఱునాడు కొంచెమాలస్యముగా నేను సభకేగియుం డుటచే నేను వెళ్ళునప్పటికే సభ ప్రారంభమైయుండెను. గత దినపు మహిళాసభ తరువాయియెట్లు సమాప్తము చేయబడెనో నాకు తెలియదు. నేడు తీర్మానములు లేక యెవరికి వారు తమ యభిమాన విషయములనుగూర్చి ప్రసంగింపనగునని

వా(క్రుచ్చిరి. స్త్రీవిద్య, కీ. శే. మాగంటి అన్నపూర్ణాదేవి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, స్త్రీల నాటకరంగప్రవేశ మాదిగా గల పలు విషయములనుగూర్చి పలువురు ప్రసంగించిరి. గత దినము అస్పృశ్యతా తీర్మానమువలె ఆనాడు స్త్రీల నాటకరంగ ప్రవేశము వివాదకారణమయ్యెను. స్త్రీలలో సమాన స్వాతంత్ర్యమునకు హక్కులకును పోరాడెడి నాగరిక స్త్రీలుగూడ నాటకరంగప్రవేశమునకు ప్రతికూలత దెలిపిరి. ఒక్కగానొక్క విదుషీమణియే నాటకరంగప్రవేశము వాంఛనీయ మనెను. స్త్రీలకా వాక్యమువినుటకే దుస్సహ మనిపించెను. సభలో కలకల మారంభమయ్యెను. వారిని సమాధానపెట్టుటకు కొంతసమయము కావలసివచ్చెను. తరువాత నొకరిద్ద రుపన్యసించిన వెనుక అగ్రాసనాధిపురాలు అంత్యోపన్యాసము నొసగి సభ ముగింపు చేసెను. సభ జరిగిన రెండుదినములును అగ్రాసనాధిపురాలగు ముత్తులక్ష్మి రెడ్డిగారి సౌమ్యప్రవర్తనము, సహనము ప్రశంసనీయమై యుండెను. ఆంధ్ర స్త్రీల కామె (క్రొత్తయైనను చిరపరిచితురాలగు మిత్రురాలివలె నందఱితో నుల్లాసముగా మాట్లాడుచు సహనముతో వినుడని స్త్రీలను హెచ్చరించుచుండెను. వచ్చియు రానితెలుగు మాటలలో స్త్రీలతో నామె గావించిన సంభాషణలు హెచ్చరికలు తన దేశీయులగు స్త్రీల యెడ ఆమెకుగల యత్యంత గౌరవమును తేటపఱచినవి. సభ ముగిసిన వెనుక మేము ప్రదర్శనశాల కరిగితిమి. ప్రదర్శనము చాలచిన్నది. ఖద్దరులో పలురకముల రంగువస్త్రములు, సన్ననూలు వస్త్రములు, జరీ, పట్టు, ఉన్నివస్త్రములు, వానితో

తయారుచేయబడిన చేతి రుమాళ్లు, శాలువలు, బిడ్డలచొక్కా యలు, పెక్కులందుండెను. గాంధిగారు వడకిననూలు, తదిత రులు వడకిన సన్న నూలు, వివిధరకముల రాట్నములు, ప్రదర్శిం పబడి యుండెను. శారదానికేతనపు బాలికలయొక్కయు తదిత రచిత్రకారులయొక్కయు చిత్తరువులుగూడ నందు గలవు. ప్రదర్శనద్వారమున కెట్టయెదుట మహాత్మాగాంధిగారి సంపూర్ణ తైలవర్ణ చిత్రపటము ఆకర్షణీయముగ నుంచబడెను.

ఆప్రదర్శనశాలావరణములోనే ఖద్దరువస్త్రములు, పుస్తక ములు, ఔషధములు, పేమువస్తువులు నాదిగాగలవి విక్రయించు నంగడులుంచబడి యుండెను. ఇంచుమించుగా వానినెల్ల తిల కించితిమి. ఖద్దరు వస్త్రములు బేరముచేసితిమి. వస్త్రములలో సీతానగరము సత్యాగ్రహాశ్రమము వారియంగడియందును, సి. వెంకటరంగము శ్రేష్ఠివారి యంగడియందును వెలలు సరస ముగా నున్నటుల దోచెను. తునివారి విక్రయశాల యన్ని విక్రయశాలలకంటె పెద్దదై పలురకముల వస్త్రములకు నిల యమై యాకర్షణీయముగా నుండెను. వారి విక్రయశాలలో లేనిగుడ్డలేదు. విదేశవస్త్రధారులను గూడ మోహింపజేసెడి గుడ్డలందుగలవు. భీమవరమువారి అంగడి తుండుగుడ్డలకు ప్రశస్తమనిపించుకొనెను. మేమందందు రెవికల గుడ్డలు,తుండ్లు, శాలువలు, కొంటిమి. ఒకమూల నొక స్త్రీ సన్నని నూలు వడుకుట కనువైన యేకులను, తయారుచేయుట గాంచితిమి. మఱియొకచో పోరంకి శ్రీరామరాజుగారు నూతనముగా స్థాపిం

చిన వేముపరిశ్రమాలయపు అంగడి పూలపుటికలు, తముల పాకుల పళ్లెరములు, బిడ్డల ఉయ్యాలలు, పెట్టెలు మున్నగు వానితో నొప్పి జనుల నధికముగా నాకర్షించుచుండెను. ఇన్నిటి మధ్య శారదానికేతనమువారి చిన్నయంగడి పెద్దస్వాగతపట మును గట్టుకొని నికేతనపు బాలికల రచనాకౌశలమునకును, ఉన్నవదంపతుల కార్యదీక్షకును నిదర్శనమై తనరారుచుండెను. వీని నన్నిటిని చూచునప్పటికే ప్రొద్దుక్రుంకెను. ఆసాయంత్రమే స్త్రీలకబ్బులో శ్రీ ముత్తులక్ష్మమ్మాళ్ గారికి సన్మానపత్రము సమర్పింపబడుచుండెననియు చాలమంది స్త్రీలక్కడ కరిగిరనియు తెలిసెను. కాని వ్యవధి లేకుండుటచే మేమటకరుగలేదు.

మూడవనాడు అనగా 5-11-29 తేదీని రామమోహన గ్రంథాలయభవనములో స్త్రీల బహిరంగసభయని ప్రకటన పత్రికలు పంచిపెట్టబడెను. దాదాపు మూడుగంటలవేళ ఆ మందిరమున కరిగితిమి. పురస్త్రీలు కొందరప్పటికే యట కరుదెంచి కూర్చుండియుండిరి. కాని ఆసభకు నిర్వాహకురాం డ్రెవరో యేర్పాటుచేసిన వారెవరో కనుపింపలేదు. గత రెండు దినముల సభలకు కర్తృత్వము వహించిన వారేవ రాసభకు హాజరుకాలేదు. ఇదియేమి ఆశ్చర్యమని యోచించుచుండగా ఇదివారికి సంబంధించినది కాదనియు, పట్టణకాంగ్రెసు సంఘము వారి యేర్పాటనియు కొందఱు చెప్పిరి. ఓహో! అనుకొని ఎవరైన నాయకురాండ్రరుదెంచెదరేమో మఱికొంచెముసేపు చూచి పోవుదముగాక యని మేముగూడ కూర్చుంటిమి.

పిలుపు తలపులు లేనియాసభామందిరములో కాపరిలేని గొఱ్ఱెల వలె స్త్రీలు నలువైపుల తిరుగుచుండిరి. కొంతసేపటికి ఉన్నవ లక్ష్మీబాయమ్మ గారరుదెంచిరి. తరువాత బత్తుల కామాక్షమ్మ, వేదాంతము కమలాదేవి, గుమ్మిడదల దుర్గాబాయమ్మ, యామినీపూర్ణతిలకమ్మ గార్లరుదెంచిరి. పేరంటమునకు బోయినచోట యింటి యజమానురాలు లేకపోయినచో తానే పసుపుకుంకుమ లుంచుకొని తాంబూలము తెచ్చుకొనిన చందమున లక్ష్మీబాయమ్మగారు పెద్దఱికము వహించి యెవరో ఒక బొమ్మను అగ్రాసనాధిపురాలుగా నెన్నుకొని సభను ప్రారంభించిరి. అధ్యక్షురాలు 'స్త్రీలు స్వదేశీవస్తువులు' అను విషయమునుగూర్చి చెప్పెను. తరువాత లక్ష్మీబాయమ్మ గారు ప్రస్తుత రాజకీయ పరిస్థితులనుగూర్చి మాట్లాడుచు శారదా చట్టమునుగూర్చి యించుక కదలించి విడిచెను. తదుపరి రాష్ట్రభాషనుగూర్చి ప్రసంగించిన గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారును, కాంగ్రెసు విషయమై మాట్లాడిన కమలాదేవి గారును, స్వాతంత్ర్యము విషయమై యుపన్యసించిన యామినీ పూర్ణతిలకమ్మగారును, మతవిషయమై యుపన్యాస మొసంగిన బత్తుల కామాక్షమ్మగారును శారదాచట్టమును విడువక తమ ప్రసంగములలో యామోదమును వెల్లడించిరి. ఉపన్యాసకర్త్రి లొకరివెంట నొకరు శారదా చట్టమునుగూర్చి ప్రస్తావించుటచే ప్రబలమగు నీసంస్కరణమునకు మిన్ను విఱిగి మీఁద బడ్డటులై మునుపే కలవరచిత్తులై యున్న పూర్వాచారపరాయణులగు వృద్ధస్త్రీలు సహనము గోల్పోయిరి. సభలో గల గల మాట

లాడ దొడంగిరి. అందఱొకమారుగ నేల మాట్లాడెదరు మీరు గూడ శారదాశాసనముపై మీఅభిప్రాయము తెలుపుడనిన వినిపించుకొనరు. తాము అఱచుటమానరు! ఒకటేరొద. ఆనాఁడు మన స్త్రీల అశిక్షితవ్యవహారము బాగుగా విశద మయ్యెను. వైద్యుని ఔషధమున కొప్పుకొనిన తరువాత ఆతఁ డొసగిన చేదుమందుగాని వెగటుమందుగాని ఘాటు మందుగాని విసుగుకొనక వర్జింపక యెట్లు పుచ్చుకొందుమో అటులనే సభలకేగెడు వారుగూడ హితాహితములగు విషయ ములను వినుటకు తగుసహనమును ఓపికను కలిగియుండుటవిధి. పలువిషయములను చర్చించెడు సభలకేగి మాచెవి కింపైన మాటలనే చెప్పుఁడు లేకున్న నల్లరిచేయుదుమనుట యసభ్య లక్షణము. కాని పురుషుల సభలలోనే యిట్టి సభానీతి భగ్న మగుచుండుట మనము నిత్యము వినుచున్నమాటయే. ఇఁక ప్రపంచజ్ఞానములేని మనసంగతి చెప్పవలసినదేమి? శారదా చట్టమునుగూర్చి యూరక యుబుసుపోక వాదోపవాదములు చేసికొనుటయేగాని దాన ప్రయోజనమేమి? అది రాజశాస నము. అనుకూలురకును ప్రతికూలురకును తప్పదు. ఇది యుపన్యాసకురాండ్రు తెచ్చిపెట్టినదికాదు. వృద్ధాంగనలు దులుపుకొనినపోదు. కాని సభాప్రేక్షకురాం డ్రావిషయమై యోచింపరైరి. అది ఆయుపన్యాసకురాండ్రే తెచ్చినటుల భ్రమపడి కంగారుపడిరి. ఇచ్చవచ్చినటుల సభలో కేకలు పెట్టిరి. అంతటితోఁ బోక వీధి పొడుగునను నోటికితాళముతీసి పారలుసాచిరి.

సోదరీ! నా కీకల్లోలము చూచుటకు చాలకష్టమని పించెను. "మన స్త్రీలలో విద్య యెప్పుడు పెంపొందును? ప్రపంచజ్ఞాన మెప్పు డలవడును? సహన మెప్పు డొదవును? తమ దేశసౌభాగ్యమునుగూర్చి జాతిసౌభాగ్యమునుగూర్చి ఎప్పుడు తెలిసికొందురు?" అను మహావిచారముతో మందిరమువీడి వెలుపలికి వచ్చుచుంటిని. ఇంతలో ద్వారముకడ నొకబాలుడు నిలువబడి మన 'గృహలక్ష్మి' పత్రికను చేతి కందించెను. ఆపత్రికను చూచినతోడనే "నేనింటింట ప్రవేశించుట చేతనే మీ మాంద్యము తొలగగలదు" అని యా సంచిక మౌనముతో జబాబిచ్చుచున్న దాయనుకొంటిని.

ఇంతియేగాదు. కల్పలతా! వీథిలో నేగోడపై చూచి నను గృహలక్ష్మికరపత్రములే. తెనాలిస్టేషను చేరినది మొదలు మనగృహలక్ష్మి పెక్కుమంది స్త్రీపురుషుల హస్తభూషణమై యలరారుటగన నాకెంతయో ముదంబు గొల్పెను. నిరంతర పత్రికాపఠనమే మనకు జ్ఞానప్రదాయిని కావలెను. మఱియు సభలు నిర్ణీత సమయముల వేళతప్పక జరుపుకొనుటయు సహనము వీడక సభలోని యుపన్యాసముల నాలించుటయు మన స్త్రీలు నేర్చుకొనవలసిన ముఖ్యాంశములుగా నాకాసభలు గనుటవలన తోచెను.

భావపురి
డిసెంబరు 1929

మిత్రురాలు,
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

ధర్మవరము లక్ష్మీదేవమ్మగారికి జబాబీయవైతివేమని నీవు వ్రాసిన ఉత్తరమును చూచితిని. నే నామె కీదినమే జాబు వ్రాసితిని. ఆజబా బిందుతో పంపుచున్నాను. కనుము.

సోదరీ! స్త్రీల నాటకరంగనిషేధమునుగూర్చి నేను వ్రాసిన లేఖకు నీవు వ్రాసిన ప్రత్యుత్తరము రెండు మూడు మారులు జాగ్రత్తగా జదివితిని. అందలి తత్త్వమును గ్రహించుటకు వివేకసాధనమూ, అలిప్తబుద్ధియు, నవసరమని నీవు వ్రాసితివిగాని యీ రెండిటికంటె ముఖ్యావసరముగా గన్పడినది విసుగెరుగని యోపిక. పై శీర్షిక చూచి నాకేగదా యీ ప్రత్యుత్తరమని చదివితినిగాని దాదాపు నాల్గుపుటలు చదివినగాని నాటకరంగప్రస్తావన రాకపోవుటచే యిది నాకుగాదేమో నని పలుమారులు తలంచిన సమయములుగూడ కలవు. కాని కడవటకు జదువ నాకేనని నిశ్చయమైనది. దయచేసి నీ వా శీర్షికయందు నాపేరు తగిలించకపోయినచో విషయముకంటె యుపోద్ఘాతమే పెద్దదిగానున్న యావ్యాసమును చదువకనే విడిచియుందును. చదివినతరువాతగూడ జబాబీయదగిన విశేషాంశములేమియు నందు గానరాకపోయినను, యావద్భారతీయులచేతను, నాదర్శకుడగు మానవోత్తముఁడుగను,

పూజ్యనీయుడగు ప్రభువుగను, సతతస్మరణీయుడగు దైవము గను సంభావింపబడుచున్న శ్రీరామచంద్రుని గుణశీలములు నిందింపబడుటచేతను, భారతగాథ దూష్యమనుటచేతను, మన దేశమునం దిప్పు డమలునందున్న వైవాహికపద్ధతిచే మన స్త్రీలందఱు పరపురుషసంపర్కము చేయుచున్నవారే అనుట చేతను, నేను నీకు జబాబిచ్చు నవసరముగల్గినది. సోదరీ! నేను నీవంటి తత్వజ్ఞానము గలదానను గాకపోయినను నా సామాన్యబుద్ధికిఁదోచిన చందమున జబాబొసంగిన నా సాహస మునకు క్షమించి చదువఁగోరెదను.

ప్రపంచమునందలి ప్రతి మనుజుఁడును నేదియో మత మునకు జెందియుండుటయు, నా మతమునుగూర్చి తనకు తెలి సినను తెలియకపోయినను దానియం దభిమానగౌరవములు గలిగియుండుటయు లోకసాధారణము. అయితే మా మత గ్రంథమైన భగవద్గీతయందు మా కధికగౌరవమనిన యన్య మత గ్రంథములైన కొరాను, బైబిలులను నిరసించుటగాదు. ప్రతిమతమును సత్యధర్మాశ్రయమైయేయున్నది. నిజమైన హిందువులకు పరమతసహనము ఉత్తమలక్షణము. అట్టి వారికి ప్రతిమతమును పూజ్యమేయగును. మతమననేమి? స్వేచ్ఛాసహజమైన మానవుల వర్తనమును ఒకనీతికి ఒకధర్మమునకు ఒకసత్యమునకు ఒకసాంప్రదాయమునకు బద్ధ పఱచునదే మతము. విధినియమములులేని మత మెందును లేదు. ఏమతము నవలంబించినను నామతనియమములు మాన

వుని స్వేచ్ఛ నరికట్టకమానవు. ప్రతిమనుష్యుడును నేదేని మతమునకు జెందియుండుట విధినిషేధములులేని తన వృత్తిని యొక కట్టుబాటునకు బద్ధపఱచుకొనుటకే. "యోగ్యమూ, సాధ్యమూ, ఆవశ్యకమూ, హితకరమూ అయినటువంటి నూతనరీతిని నడచుట కేమతముగాని మార్గమునివ్వదు." తాత్కాలికానందమునుగూర్చెడి ప్రతివిషయమును మనుష్యులకు హితకరముగనే యుండవచ్చును. కాని జీవితముయొక్క యంగాంగమందునూ హితకరమునకు ద్రోవయొసంగుట కే మతముగాని యంగీకరింపదు.

జ్ఞానము జగన్మాన్యమగుట వాస్తవమే. అయినను నదియు నీతిసత్యములకు నిబద్ధమైనప్పుడే జగన్మాన్యతబడయును. మనుజుని జీవితవికాసమునకు దోడ్పడి యుచ్చస్థితికి గొనిపోవునది మాత్రమే నిష్కళంకజ్ఞానము. కాని మనుష్యుని విపరీత స్వేచ్ఛాజ్ఞానముయొక్క నిదర్శనము కాజాలదు.

జ్ఞానులు తత్వజ్ఞులునైనవారు శ్రీరాముని జీవితమును దోషకలితమనుట కిదియే మొదలు. మన హైందవపురాణేతిహాసములలో నుత్తమము, నాదర్శమునునగు నితిహాస మేదైనగలదనినచో నది శ్రీరాముని చరిత్రమే యని చెప్పక తప్పదు.

'రాముఁడు దుష్టుడు. ఆయన జీవితములో మోసము, కౌర్యము కానబడునేకాని విశేషసద్గుణము కనుపించుటలే'దని, నీవు వ్రాసితివి. రాముడు ధర్మజీవి. సత్యము, ధర్మము, నీతి

త్యాగము ఈ నాల్గుసూత్రములయొక్క సారమే రాముఁడు. రాముఁడు సీతను పరిత్యజించుట స్థూలదృష్టితో గనిన నింద్యముగనే గోచరించును. కాని రాముని జీవితవిశేషముల నామూలాగ్రముగా గమనించినవారి కందు క్రౌర్యమేమియు లేదు. ఆతఁడు తన జీవితమంతటను నిట్టిత్యాగము లెన్నియో గావించెను. పట్టాభిషేకము వనవాసముగా మారినపుడును, భరతుఁడేవచ్చి పాదాక్రాంతుఁడై రాజ్యమును స్వీకరింపుమని కోరినప్పుడును, రాముడు చూపిన త్యాగము నిరుపమానమైనది. తండ్రిని సత్యవాక్యనిరతునిగా జేయుటయు, తాను పితృవాక్యపరిపాలనాధర్మము నకలంకముగా నెఱపుకొనుటయు ఆనాటి యాతని త్యాగమునకు కారణములు. రాముఁడే క్రౌర్యచిత్తుఁడు, మోసగాఁడునైనచో నట్టిత్యాగము గావించి యుండునా? అప్పటికి రాముని పలుకుబడి యెట్లున్నది? రాజు, ప్రజలు, మంత్రులు, బంధులు, మిత్రులు, అందఱు ఆయన పట్టు. రాముడే క్రూరుడైనచో ఆనా డెట్టి బీభత్సము జరిగి యుండవలెను. ఔరంగజేబువలె తండ్రిని చెఱలోనిడి తమ్ముల వధించి గద్దెయెక్కెడివాఁడు కాఁడా? కాని సాధులోకగణ్యుఁడగు శ్రీరామచంద్రు డెట్టి నిగ్రహము చూపెను! పరమాశ్చర్యముగదా! ఇఁక సీతాపరిత్యాగవిషయమున విచారింతము. రాముఁడు

యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే.

అనగా శ్రేష్ఠుడు దేనినాచరించునో దానినే ప్రమాణముగా గొని లోకము వారి ననుకరించునని దాని తాత్పర్యము. కాన శ్రేష్ఠుఁడైనవాడు, లోకమున కాదర్శపురుషుఁడైనవాడు లోపరహితుడుగా నుండవలెను. కాన స్వార్థమును చంపుకొని లోకహితము గమనింపవలెనని రాముని ఆదర్శము. ప్రజల కోర్కెలదీర్చుట, ప్రజల యభిప్రాయము ప్రకారము నడుచుకొనుట, ప్రజలను కన్నబిడ్డలవలె బ్రోచుట యివి తన పరిపాలనాధర్మములుగా బెట్టుకొనినాఁడు రాముఁడు. ఆ ధర్మమును నిలుపుకొనుటకే ప్రజల యిచ్ఛానుసారముగా సీతను పరిత్యజించెను. ఈవిషయమున నాతడు పరతంత్రుఁడు, ప్రజాభీష్టానువర్తి. కాన నీసందర్భమున మనము గుర్తింపవలసినది సూక్ష్మతరమైన యాతని ధర్మలక్ష్యముగాని బాహ్యక్రియగాదు. అంతమాత్రముచే రాముఁడు క్రౌర్యవృత్తిగలవాడనుట పాడిగాదు. రామునకు సీతయం దపారమైన ప్రేమగలదు. గౌరవముగలదు. విశ్వాసముగలదు. ఇందులకు నిదర్శన మాతఁ డేకపత్నీవ్రతుఁడై యుండి యశ్వమేధాదియాగ సమయంబులలోగూడ స్వర్ణసీతతో యజ్ఞతంతును నడుపుకొనుటవలననే తెల్లమగుచున్నది. రాముఁడు గావించిన యిట్టి కృత్యమునకు సీత కాతనిపై యభియోగము నడుపగల హక్కుగలదనియంటివి. నిజమే కావచ్చును. ఇక్కాలపు సీతయనగా మీ నాటకపు సీతయైనచో నట్టిపనిని తప్పక చేసెడిదే! కాని కృతయుగపు సీత యట్టిదికాదు. పెనిమిటి ధర్మ

తత్పరత యామెకును దెలియును. సత్యముకొఱకు, ధర్మము కొఱకు, ప్రజాహితముకొఱకు నా సర్వస్వము నర్పించెదనని యాతఁ డెన్నిమారులో పలికియుండెను కాన ఆతని ధర్మాచరణము నెఱిగియుండిన ధార్మికురాలగు సీత పెనిమిటిపై ఏమని వ్యాజ్యము నడపును? కావుననే యామె పెనిమిటిని పల్లెత్తి యొక్కమాట నలేదు. నిరపరాధయయ్యు, పామర జనుల సంతుష్టికొఱకును, పెనిమిటి ధర్మమును నిలుపుటకొఱకును దుర్భరమైన యాకష్టములను సహనముతో భరించెను.

రాముడు సీతనే గాదు, ఆబాల్యమునుండియు దన్నన వరతము సేవించిన లక్ష్మణునిగూడ నట్టులే త్యజించెను. ఆ నాఁడుగాదు, ఈనాఁడు మహాత్మాగాంధి తన జీవితచరిత్రలో నేమివ్రాసెనో కనుము.

"ఈ శోధనమున నేను నా ప్రియతమవస్తువులగూడ విడనాడగలను. మఱియు నే నీ శోధనయజ్ఞమున నా శరీరమునుగూడ హోమముచేయ సంసిద్ధుఁడను."

సోదరీ! మహాత్ముల ధర్మలక్ష్యమట్టిది. అందుకు వారిని దుర్మార్గులని నిందించుట తగదు. ఇఁక మహాభారతమునుగూర్చి. ప్రద్వేషిణి పెనిమిటియగు దీర్ఘతముఁడు పుట్టంధుఁడు, వృద్ధు. అట్టివానిని నేను భరింపజాలననియు, నెక్కడకైన పొమ్మనియు ప్రద్వేషిణి చెప్పినది. ప్రద్వేషిణి చిన్నది గాదు. గౌతమాదులైన పుత్రులను బడసిన యిల్లాలు. అట్టిది అంధత్వముచేతను, వార్ధక్యముచేతను నసమర్థుడై యున్న

భర్తను లేచిపొమ్మనెను. నిస్సహాయుడగు నా చీ కేమి చేయును? పాపము! కోపముపట్టలేక శపించెను. అందులకు కోపించి ప్రద్వేషిణి యాతనిని కట్టెలతో కట్టగట్టించి కొమారులచే గంగలో త్రోయించినది. ఇం దధికాపరాధ మెవరిది? దీర్ఘతమునిదా? ప్రద్వేషిణిదా? సోదరీ! ఇట్టి నారీరత్నమును సమర్థింపబూనుట నీ వాదమునకు బలము కాజాలదు. మహాభారతములోని యీ చిన్నయుపకథ భారతమంతయు దూష్యమని దూషించుటకు జాలినంత బలవత్ప్రమాణమును కాదు.

ద్రౌపదిని పందెమిడుట యక్రమమే. కాని యందును ధర్మసూక్ష్మత లేకపోలేదు. అందు కొంత యొప్పిదమే లేకున్న భీమార్జును లప్పుడే తిరుగబడియుందురు. ఇంతకును వారి యపూర్వత్యాగము, కష్టసహిష్ణుత, ధర్మబద్ధత, వినీతవర్తనమే లేకున్న వారు మనకు స్మరణీయులే కాకపోవుదురుగదా! అయినను గుణదోషవిచారణ లేక అందలి కథయంతయు సత్యమనియు అనుకరణీయమనియు నేను చెప్పలేదు. చెప్పను. ప్రస్తుత సాంఘికజీవనమున దూష్యములని నిందింపబడెడి యధర్మములెన్నియో అందు ధర్మములుగా నిరూపింపబడి యున్నవి. అవియెల్ల మన మాచరింపదగునని వాదించెడి వెఱ్ఱి నాకులేదు. మహాభారతమున నుత్తమపాత్ర లెన్నియో గలవు. వారి చరిత్రములు మనము పఠించి మన నిత్యజీవితమునకు సాధనములుగాగొని ధర్మమును సత్యమును నీతిని వికాసపఱచుకొనుటలో దోషమేమి? అభిమన్యునివంటి వీర

కుమారుని చరిత, కర్ణునివంటి దానశూరుని గాథ, గాంధారి వంటి మహాసాధ్వి చరిత్రము, భీష్మునివంటి సత్యవ్రతుని వృత్తాంతము, ద్రౌపదివంటి స్త్రీరత్నముయొక్క ధర్మపరిజ్ఞానము, బుద్ధికౌశలము, గృహనిర్వాహకత్వచాతుర్యము దెల్పెడి వృత్తములు మన కాదర్శపాత్రములు కాకేలపోవును? మఱియు మన కాదర్శపాత్రములగు సావిత్రివంటి మహాసాధ్వీమణుల చరిత్రము లెన్నియో యందుపకథలుగా చేరియున్నవి. సోదరీ! భారతభాగవత రామాయణాది పురాణేతిహాసములు నింద్యములని నిషేధించినచో మీ నాటకకళాపోషణకైన కథలేవి? బహుసాంఘికములు, చారిత్రకములునని మీ యుద్దేశమేమో! ఆ విధముగా చూచినను రామదాసు నాటకమాడినచో నాతని యుపాస్యదైవము రాముడు. మీరాబాయియాడినచో నామె దేవుఁడు కృష్ణుడు. మరల అక్కడగూడ పురాణపురుషులే ప్రత్యక్షము. ఎంత నింద్యములని దూషించినను ఆ పురాణేతిహాసములు విడనాడినచో మనకాడుటకు, పాడుటకు, చెప్పుకొనుటకు వేఱు తెన్నే లేదు. తొలుత యెంత తీవ్రముగ నిరసించినను పురాణగ్రంథముల సహాయమును, జ్ఞానముచే తగినంతమాత్రము అవశ్యముగ తీసుకొనుటకు అభ్యంతరము లేదని, నీవును ఒప్పుకొనక తప్పినదికాదు. ఇఁక నిదియే తగునని చెప్పిన నాపై నిశితవిమర్శన లెందుకు?

శివాజీవంటి మహాశూరుని తయారుజేయుటకు జిజీబాయి పురాణగ్రంథములనే ఆశ్రయించినమాట వాస్తవము.

ఆమాట శివాజీ చరిత్రమునందే గలదు. కాని ఆధునిక శివాజీల యుత్పత్తికి నీవు చూపెడి నవరీతులేమో ఆధునిక స్త్రీల వలన నికవెలుగవలసియున్నది.

కళావంతులనియు, వేశ్యలనియు పిలువబడెడి యొకతెగ వారాంధ్రదేశమున గలరు. నృత్యగీతాభినయాదులు వారి కుల వృత్తి. అవివాహితలగు నా స్త్రీలు పురుషులసన్నిధిని నృత్యగీతాదుల ప్రవర్తింప జేయుటచేత వారిలో నీతిభంగదోష మేర్పడినది. నీ నోటీవ్యాసమునందిదియు నీవంగీకరించితివి. దీని కాసంఘీయు లిప్పుడు పొందుచున్న విచార మింతయంతగాదు. నృత్యగీతాదులు మానివైచి వివాహములు చేసికొని తొల్లిటి నైచ్యమును తొలగించుకొని సాటి స్త్రీలోకములో సమానత్వమును బడయుటకై వారిప్పుడు మహాకృషి చేయుచున్నారు. తొల్లి నాట్యాభినయములలో పాల్గొనిన వారిస్థితి కన్నులార గాంచుచు మరల కులస్త్రీల నీయగాధకూపమున బడద్రోయ నెంచుటయు, దానికి నీవంటి విదుషీమణులు చేయూతనిచ్చుటయు శ్రేయస్కరముగాదు.

శ్రీరవీంద్రనాథటాగోరుగారును, హరీంద్రనాథచటోపాధ్యాయులును తమ స్త్రీలను రంగభూమికి తెచ్చిరని వ్రాసితివి. అందుల కాప్రాంతీయులెంతకుందుచున్నదియు ఈమధ్య చెన్నపురిలో జరిగిన సనాతనధర్మసభకేతెంచిన యొక బెంగాలీబాబు స్త్రీలను రంగభూమికితెచ్చి పాడుచేయుచున్నారని చెప్పి విచారించెను. కంటివా? కాన ఈయుద్యమమున కారాష్ట్రీయు

లైన యెక్కువ ఆమోదమును తెలుపుటలేదు. హిందూప్రేమ సంఘమువారాడిన నాటకమును చూచి మహాత్ముడు మోదించె నని వ్రాసితివి? సరియే. కాని ఇన్ని పాశ్చాత్యసాంప్రదాయ ములతో ఇన్ని అంగరంగవైభవములతో స్త్రీపురుషులు రంగ భూమిని అభినయించుటను గూర్చి వారి ప్రత్యేకాభిప్రాయము నడిగి తెలిసికొంటిరా? గట్టిగా ఆయన అభిప్రాయము కోరినచో మహాత్ముడెప్పుడును అనుకూలాభిప్రాయమియ్యడనియే నా యభిప్రాయము. అయినను మహాత్ము డంగీకరించినను యెల్ల రంగీకరింపవలెనని సిద్ధాంతమా!

నాటకమనిన కేవలము శృంగారమనియే నాభావన కాదు. అందు నవరసము లాలికింపబడునని నేనెఱుగుదును. ఏరసమైనను నేవిలాసమైనను నాటకమనిన కపటసంసారము వంటిదనియు, అందొకచో శయ్యాగృహము, ఒకచో కొలువు కూటము, ఒకచో ఉద్యానవనము, ఒకచో యుద్ధము, ఒకచో శ్మశానము రంగస్థలములుగా నుండుననియు నాకు దెలియును. ఇట్టి భిన్నసమావేశముల కాస్పదమగు రంగస్థలమునందు స్త్రీ పురుషుల కలయిక కులాంగనలకు సమంజసమును గౌరవాస్పద మును గాదు. ఈసందర్భమున సోదరీ, నీవు గావించిన హిం దూవైవాహికప్రస్తావన మిక్కిలి యసమంజసముగా నున్నది. ఎప్పుడు బాలిక కొక పురుషునితో వివాహము చేయబడునో అతడే తనవాడనియు తదన్యులు పరులనియు, విశేషించి సోదర తుల్యులనియు భావించి యాతని యందే లగ్నచిత్తలగుట

మన హిందూకుటుంబములయందు సాంప్రదాయముగానున్నది. పెనిమిటి యెంత దుర్మార్గుడైనను నేఁతని దానినే యనుకొనును గాని ఆతడయోగ్యుడని పరపురుషవాంఛ కలిగియుండు టను నది దుర్జాతిలక్షణము. ఉత్తమురాలగు నేహైందవకుటుంబి నియు నట్టి తలంపుకలిగియుండదు. మన హిందూకుటుంబము లలో అందును బ్రాహ్మణకుటుంబములలో పతినివరించి పెండ్లా డెడి పద్ధతియింతవఱకు లేదుగదా. తలిదండ్రులు పరిణయము చేసిన వరునియందే యనురక్తలగుట వధువుల ధర్మముగా నున్నది. శారదాచట్టమువలన మునుముందీ వైవాహికపద్ధతి మార్పునొందునేమోకాని యిప్పటిపద్ధతి స్వయంవరము కాదు. అట్టిచో అట్టి వివాహము లన్నియు నక్రమము లనియు నట్టి వారు పరపురుష సంపర్కము చేసినవారనియు నిర్ధారించుట సాహసము. తలిదండ్రు లెవనికొసంగిన వానినే పరదైవముగా నెంచి ప్రేమించి గౌరవించెడి హిందూస్త్రీలయెడ చిత్తమొకనికి శరీరమొకనికి యొసగుచున్నారని నీవు వ్రాసినవ్రాత మిక్కిలి యనుచితముగా నున్నది. ఇట్టి యూహ హైందవకుటుంబినుల యెడ తలపరాని విషయము. అట్లు భావించినచో మన బ్రాహ్మణ స్త్రీలలో వరించి వివాహమాడిన వారెవరు? అందఱము మన జననీజనకులచే నొకరికి దానము చేయ బడిన వారమే. కాన నీమతమే నిజమగుచో మనము, మన తల్లులు, సోదరీమణులు, పుత్రికలు, వేయేల మన భారత మహిళ లెల్లరు చెడ్డవారే యనవలసివచ్చును. సోదరీ! మన వివాహసంస్కారమునందు లోపములున్నచో సంస్కరింప

నగునుగాని నీనాటకరంగ ప్రవేశోద్యమసమర్థనముకొఱకు స్త్రీలనెల్లర కట్టగట్టి యిట్టి హేయమగు నిందకు గుఱిసేయుట కడుంగడు సాహసమే గాక యక్రమమనియు బల్కి సాహసించినందుకు క్షమింపకోరెదను.

నాటకరంగమున స్త్రీలుచేరుటచే చెడిపోవుదురని నందులకు ఇప్పుడు బాగుగా నున్నవారెవ్వరు? వరించి పెండ్లాడని వాని యందు ప్రేమ యెట్లుకుదురును? కాన యిప్పుడు మన స్త్రీలు చేయునది యంతయు పరపురుషసహవాసమేయని వాదింపదగునా? పతిచే పలుబాధలు పడుచున్నను ఆతనినే దేవునిగా భావించి బూజించుచున్నవారును, పతి విగతజీవుడుగా సర్వము వర్జించి పీరవైరాగ్యము సలుపుచున్నవారును నైన మన భారత మహిళల హృదయమెఱుగక నీవు వ్రాసిన వాక్యములు వారి మానసము నెంత నొవ్వచేయునోగదా?

జ్ఞానముచే మనస్సును పరిపక్వము చేసికొనిన వారికి పరపురుష సాన్నిధ్యభీతి లేదని వ్రాసితివి. మంచిది. నీవు సుశిక్షితలనుగా జేసిన కులీనస్త్రీ లట్టివారే గావచ్చును. కాని వారితో నభినయింపవచ్చిన పురుషులుగూడ నట్టివారు కావలెనుగదా. సరి. యత్నముమీద వారినిగూడ మంచి వారినే సంపాదించెద రనుకొందము. కాని చూడవచ్చిన వారుగూడ బ్రహ్మజ్ఞానులు కావలెనుగదా. లేకున్న వారిచే నైన హేళనలు తప్పవుగదా. సోదరీ! ఏవేషభాషలు లేక బడికివెళ్ళి చదువుకొనివచ్చు కన్యలకే యిక్కాలమున మగ

వారిచే మాటలు తప్పకున్నపుడు నాటకము లాడెడి కులీన స్త్రీ లెత్తెఱగున మాటలు పడకుందురో నాకు దోఁచలేదు. హిందీ ప్రేమసంఘమువారాడిన నాటకములకు ఇష్టములేనివారు గూడ వచ్చిరని సంతసముతో దెల్పితివి. అవును ఇష్టము లేనివారే యధికముగా వచ్చెదరు. కాని ఆవచ్చుట ఆక్షేపించుటకేగాని ఆమోదించుటకు గాదుసుమా! సోదరీ! మనదేశము న పురుషులింకను స్త్రీలవ్యక్తిత్వమును స్వాతంత్ర్యమును ఆమోదించుట కలవాటుపడలేదు. స్త్రీలయందుగల సీరసభావము తొలఁగలేదు. వారి యాటపాటలను గౌరవముతో సమానముతో చూచుట నేర్చుకొనలేదు. కాన వారి చిత్తవృత్తులు మార్పు నొందనిది స్త్రీలు రంగభూములెక్కుట యుక్తము కాదు. కాన నీవును కళాభివృద్ధిచింత నటుంచి మన స్త్రీల పురోభివృద్ధినే చిత్తమునందధికముగా నెంచి స్త్రీల యశోహానికరములగు నిట్టి యుద్యమములకు చేయూతనీయవలదని ప్రార్థన. ఇది నాయొక్కతె ప్రార్థనయేగాదు. మన స్త్రీలలో అధిక సంఖ్యాకు లిటులనే కోరుచున్నారు. ఇటీవల బెజవాడకు వెళ్లి నప్పుడు నేను చాలమంది విద్యావతులతో ఈవిషయమై మాట్లాడితిని. మహాసభలో ప్రస్తావించితిని. అత్యధికసంఖ్యాకు లీయుద్యమమునకెట్టులు ప్రతికూలమున నుండిరో నీవుగూడ వచ్చినచో చక్కగా చూచియుందువు.

ఒక గొప్ప స్త్రీవిద్యాసంస్థనడుపుచున్న యొక నారీమణి స్త్రీల నాటకరంగ ప్రవేశమునుగూర్చి ప్రసంగింపుచు ఇట్టు లనెను. "రామదాసు వేషమును రాఘవాచార్యులుగారు

వేస్తేబాగుంటుంది. వారివేషధారణమనిన జనులు అధికసంఖ్యాకులు వస్తురు. డబ్బుబాగావచ్చును. కానవారిని మావిద్యాసంసస్సహాయార్థ మొక్క ప్రదర్శనమును కోరితె బాగుండు నను కొంటిని. కాని వారి యిప్పటి స్త్రీల నాటకరంగప్రవేశయత్నమును జూచి సాయము చేయమంటే ఏఆడదాన్నైనా తనతో ఆడజాతికి పట్టుకరమ్మంటారేమో! అట్లా తీసుకరమ్మంటే ఎవతెను తీసుకవచ్చేది? ఏఅమ్మనైనా నీవు వస్తావా? అని అడిగితే నీవే ఆడరాదా? అంటుందేమోనని భయం. మఱీస్నీ రాఘవాచార్యులుగారు రామదాసుపాత్రను ధరించినచో రామచంద్రారెడ్డిగారు కబీరు పాత్రమును ధరించినగాని బాగుండదు. స్త్రీలెక్కిన రంగభూమి నెక్కనని యీయన వ్రతము. స్త్రీలు స్త్రీపాత్రము ధరించినగాని నాటకమాడనని ఆయనపట్టు. ఈ సంగతి సందర్భములు చూచి వారిసహాయమును కోరుట మానుకున్నాను.''

సోదరీ! స్త్రీల భీతి యిట్టులున్నది. మఱియు నొక మనవి. నీప్రత్యుత్తరమం దెల్లెడలను నేను జ్ఞానిని, తత్వజ్ఞురాలను, నాబుద్ధి యసాధారణమైనది యను నాత్మస్తుతియు మీరు వివేకరహితులు, అజ్ఞానులు, దురభిమానులు, అల్పబుద్ధు లనుపరనిందయు గోచరించుచున్నది. జ్ఞానులును విశేషించి తత్వజ్ఞులునునైన వారిట్టివిముందుగా త్రుంచివేసికొనదగినది యని తెలిసికొనగోరెదను.

**భావపురి**
జనవరి 1930

మిత్రురాలు
శా ర ద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ !

ఏమి పెండ్లిండ్లు ! ఏమి ఊరేగింపులు ! ఏమి కోలాహలము ! అన్నివస్తువులకు ధరలు లేచిపోయినవి. గుడ్డల దుకాణములలో సరకు ఝూడాఅయినది. మార్కెటులో కూరలు శూన్యము. మాసినగుడ్డలతో మాగిపోతూన్నామని మొత్తుకొనుచున్నా చాకలివాండ్రు లగ్గసరి అని గుడ్డలుతుకుట మానుకొని పల్లకీమోతలతో పరువులెత్తుచున్నారు. ఇక భజంత్రీల గడబిడ-సరేసరి. చంకనుండెడి పొదులు వంకెనువేసి తాళములతో మునిగితేలుచున్నారు. వంటలవారి, పురోహిత బ్రాహ్మణులవారి ఆర్జన, అడావిడి చెప్పనక్కరలేదు. కానిమ్ము ఎన్నాళ్లీరొద. దీనితర్వాత వీరందరికి సుఖసుప్తియే గదా ! మేళతాళము లింకా కొంతకాలము జీవించియున్నను పల్లకీలకు మాత్రము పూర్తిగా సెలవే. ఇంక పెండ్లిండ్లకు వెళ్లివచ్చెడి పేరంటాండ్రకు బొత్తిగా తీరుబడిలేదు. ఇల్లుమఱచిపోయినారంటే సందేహములేదు. పెండ్లి, జోడుపెండ్లిండ్లు, పెండ్లిపై పెండ్లి, పెండ్లిలోపెండ్లి, కార్తిక మార్గశిర మాసములలో రైలువారికి రాబడి ముక్కాలు ముప్వీసము ఈ పెండ్లివారి నుండియే! మదరాసు దక్షిణ మహారట్టారైల్వే కంపెనీవారు క్రిష్టమసుదినములలో కన్న యీ లగ్గసరిలో ఈపెండ్లి ప్రయాణికులకు తక్కువచార్జీలు యేర్పాటుచేసిన ప్రజలకు చాల ఉప

కారముచేసిరని కీర్తింపబడెడి వారే; కాని వారాపుణ్యమునకు పాలుపడలేదు.

అయితే యీ పెండ్లిండ్లప్రళయములో నాకు తగిలిన పేరంట మొకపెండ్లిదేకాని యీ పెండ్లిండ్లసందడివలన నేను పొందినంత శ్రమ, నిద్రనష్టము మఱియొకరు పొందియుండరు. ఏమందురా? గొప్పరాజవీధిలో మాయిల్లు; మఱియు రాజబాట నానుకొనియే మాయింటి గోడ. చలికి వెఱచి, చూచుటకు విసిగి ఇంటిలో దట్టమైన దుప్పటి ముసుగుపెట్టుకొని పడుకొనినను ఆ యెడతెగని యూరేగింపుల మంగళతూర్యరవములు చెవులలో దూరకుండ నేమి చేయగలను? కాన పెండ్లిండ్లు విరివిగా జరిగిన మార్గశీర్ష మాసమంతయు సుఖదమైన సుప్తి నెఱుగను. క్రిందటి వారములో ఒకనాటిరాత్రి ఓపిక పట్టుకొని వచ్చిన యూరేగింపు నెల్ల చూడవలెనని సంకల్పించుకొంటిని. నా పంతము చెల్లలేదు. అఱగంటలో అయిదూరేగింపులు వచ్చెను. ఒక ఊరేగింపుచూచి లోనికివచ్చి మంచముపై మేనువాల్చితినో లేదో మరల నింకొక పెండ్లివారి యూరేగింపులోని పెద్దబూరగల బూరటింపు చెవులు చిల్లులు పడజేసెడిది. మరల దానిని చూచివచ్చునప్పటికి కింకొకదాని బం, భం, బూ, బూ, అను ధ్వనులు వినవచ్చెడివి. ఎంతచూడగల వేడుకలైనను ఒకటి రెండయిన ముచ్చటగాని రేయెల్ల నదియే రొదయైన విసుగే కాకుండ అసహ్యముగూడ గలుగుట ఆశ్చర్యమా! ఇంక చూడజాలనని పంతము విడిచి పడుకొం

టిని. కాని విరామ మెఱుగని మేళతాళములవలన నిద్రకుమాత్ర మవకాశము లేకపోయినది. ఆ ఒక్కనాడేగాదు. మార్గశీర్ష మంతయు నిట్టి జాగారములతోడనే గడచినది. అమావాస్య వచ్చినది. "నే డమావాస్య. రాబోవునది శూన్యమాసము. ఇక మేళతాళముల గొడవ యుండదు; ఈనాడైన సుఖముగా నిద్రింత"మని పడుకొంటిని; కాని ఆ రాత్రి కూడా నాగాలేదు. ఒక వూరేగింపురానే వచ్చినది. ఆ పిల్ల మూడేండ్లు నిండియు నిండని పసికూన. కట్టుకొనిన క్రొత్తపరికిణి యెత్తియెత్తి దులుపుకొనుచు, తొడుగుకొనిన పట్టుచొక్కాను పట్టిపట్టి చూచుకొనుచు బొమ్మల పెండ్లిండ్లలోని బొమ్మవలె కూర్చున్నది. పెండ్లికొడుకొక పదేండ్లవాడు. నిద్రచే తూగుచున్నాడు. మతిమాలిన తలిదండ్రులు తమపై వైచిన సంసారభారము నా బాలదంపతులెఱుగరుగదా! బహుశః యీ వైవాహికోత్సవము గూడ వారికి జ్ఞాపకముండదు. కాని యీ తంతులవలన కలుగబోయెడి కష్టనష్టములకు మాత్రము వారు బాధ్యులు. అకటా! ఎట్టి ఘోరతరాన్యాయము. తలచిన మనస్సు క్షోభజెందుచున్నది. దానితరువాత మఱినాలుగుదినముల కొకయూరేగింపు వచ్చుచున్నది. ఆ వధూవరు లిరువురు సరిగా యెనిమిదేండ్లవారు. పిల్లవాడు నల్లమొఖమల్ లాగు, కోటు, వేసికొనియున్నాడు. పిల్లకొక పెద్దచీర చుట్టబెట్టి పొదలకమ్మవలె కూర్చుండ బెట్టినారు. ఆ బాలిక యీ చీరలోబడి చిక్కములో పిట్టవలె కొట్టుకొనుచున్నది. గాన్నున్న శాసనమువలని భయముచే సనాతనధర్మపరులలో కొంతసంస్కారము కలిగినది.

ఏమన తిథిదోషములు, వారపు పట్టింపులు, శూన్యము, మౌఢ్యమాదిగాగల నిషేధములు ఈయేటి పెండ్లిండ్లలో కానరావు. ఆపద్ధర్మముగా ఈసంస్కారమునకు శాస్త్ర మొప్పినదట. పాపము మన శాస్త్రములు చాలమంచివి. ఎవరి కేవీలుగావలెననినను దాని కనుగుణ్యమగు నుదాహరణశ్లోక మును జూపి పూర్వాచారపరాయణుల రక్షించును. ఆ కల్ప వృక్షము ప్రాపున వారుచేయని సాహసములేదు. పసిబాలలకు పరిణయములు చేసిరి. కసుగందులను గూర్చుండబెట్టి గర్భా ధానమంత్రములను వల్లెవేయించిరి. పానుపు వేయించిరి. మిథున విడియము లిప్పించిరి. బొమ్మ నప్పగింపజేసిరి. ఇట్టివివాహము లొకటియా? రెండా? మాసములలో నుత్తమమైన యీ శుక్ల సంవత్సర మార్గశిరమాస మంతయు నిట్టి శిశువివాహములతో కళంకితమై పోయినది. మన మంగళాద్రి నృసింహుడేమి, తిరుపతి వేంకటేశ్వరుడేమి, సింహాద్రియప్పన్నయేమి యీ మాసములో తమ సన్నిధానమున నెన్ని శిశుకల్యాణములు జరిపించిరో లెక్కలేదు. రాళ్లుదేవుళ్లయిన రాసులు మ్రింగవా యని వేమనయోగీంద్రుడు సందేహించినట్లుగనే యీ శిశు వివాహములలో దేవుళ్లు రాళ్లయినారు. లేకున్న ఆయాస్వా ములవారల సన్నిధానమున తల్లిదండ్రు లిట్టి యక్రమ వివాహ జరుప గలిగియుందురా?

కల్పలతా! నాకీపెండ్లిండ్ల గడబిడచూచిన మనవారి మౌఢ్యమునకు మహాశ్చర్యమగుచున్నది. చేజిక్కిన పసిబిడ్డలకు

వివాహములు చేసినంత మాత్రమున శారదాచట్టమునుండి వీరెట్లు రక్షింపబడిరి? ఇక సృష్టి ఆగిపోవునా? ఆడుపిల్లలు పుట్టరా? పెండ్లిండ్లుకావా? అయ్యో? ఎంత చేదస్తులు. 'మన మీపిల్లలకు వివాహము చేసినమాత్రమున నేమైనది? ఎట్లు కావలసిన దట్లగు' నని వీరేల స్థిమితహృదయులు కాగూడదు? పాపము! తమ తమ ఆతురతకొలది పసిబిడ్డలగొంతులు కోయుచున్నారుగదా! కల్పలతా! ఏస్త్రీల యభ్యుదయము కొఱకై యీ శారదాచట్టము సృష్టింపబడినదో ఆస్త్రీల నీ రెండుమూడు మాసములలో జరిగిన యక్రమపు వివాహముల క్లేశ మర్ధశతాబ్దము పీడించును. ఇప్పు డవిమర్శకముగా పెండ్లి చేయబడిన యీ బాలదంపతులు పెద్దవారైన వెనుక అప్పుడు జరుగుచున్న ప్రౌఢవివాహముల గని కుతూహలమతులై తమ దాంపత్యములను చిందఱవందఱ చేసికొనినచో నప్పు డీ పరమశ్రోత్రియులగు తలిదండ్రులేమి చేయుదురో? నేడు నవనాగరికులు సైతము 'కూడునా, కూడదా' యని శంకించుచున్న 'డైవోర్సుచట్టము'ను ఆనా డీశ్రోత్రియసంఘమువారే ఆడుబిడ్డల ఘోష చూడలేక ఆహ్వానింపవలసి వచ్చునేమో గదా? దేశకాలపాత్రములను గుర్తింపక తొందరపడుట యెందును లాభకారిగాదు. నేడు శిశువివాహములకు సహాయభూతులై శారదా చట్టమునకు వ్యతిరేకప్రచారము గావించుచున్న శ్రోత్రియంమన్యు లీవిషయమును గమనింపకుండుట విచారకరమే గాదు ముందున కపాయకరముగూడ నగును సుమా.

కాని విశ్వరక్షకుడైన పరమేశ్వరుని ఈ శిశువధూవరుల కెట్టి బాలారిష్టములు కలుగకుండ రక్షింపుమని ప్రార్థించుట కంటె మనమిక నిప్పుడేమిచేయగలము ?

భావపురి
5—2—30

మిత్రురాలు
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

అవును నేనుగూడ నదియే విషయమై యోచింపుచున్నాను. విచారించిచూడ ఈ పెండ్లిండ్లరద్దుచట్టము నామోదించుటలో నామోదింపకుండుటలోఁగూడ ఇబ్బందులే కనుపడుచున్నవి. ఇది శారదాచట్టమువలె సులభముగా నామోదింప దగినదికాదు. దీని నామోదించితిమా భారతమహిళల నిరుపమానశీలముచే సముపార్జితమైన జగద్వందిత కీర్తికి కళంకమొదవెడు పరిస్థితు లేర్పడవచ్చును. మఱియు అవమానము, క్లేశము, చింత, మున్నగు కష్టములకు స్త్రీ గుఱికావలసి వచ్చును. కాదంటిమా? నిర్హేతుకముగా భర్తృపరిత్యాగినులైన స్త్రీల దుర్గతికి తరణోపాయము దోఁచకున్నది. కాన ఈ విడాకులచట్ట మొకవంక స్త్రీలకు ఆత్మహత్యాకరముగను మరియొకవంక ప్రాణదానకరముగను కనుపించు చున్నది. దీని నింకను నిదానించి విచారించ నగును.

ఒక రొకరు మంచి పనిని చేయుచున్నచో వారితో సరిదూఁగుటకు మనము యత్నించుట తప్పుగాదు. కాని చెడుగునకు గూడఁ బోటీబడుట యుక్తమనిపించుకొనునా? పురుషులు భార్యను పరిత్యజించుట యనుచితకృత్యమని మనమిప్పుడు భావింపుచున్నాము. భావనమేగాదు. అందులకు వారిని కఠిన

ముగా నిందింపుచున్నాము. వారినట్లు మనము దూషింపుచు మనముగూడ నదియేపని కవకాశమును గోరుట సమంజస మగునా ?

కల్పలతా! దాంపత్యముయొక్క పరమార్థము మహోత్కృష్టమైనది. దానియొక్క లక్ష్యము కేవలము భోగభాగ్యాల సతగాదు. కాన దాంపత్యధర్మమును కేవలము భౌతికదృష్టితోఁ జూచి విషయతృప్తియే పరమావధిగానెంచి పెండ్లిపై పెండ్లి గోరుట ప్రశస్తమగు యోచనకాదు.

ఒక పార్శ్వమునకు వ్యాధిసోకినచో దానిని నివారించుటకు రెండవపార్శ్వమునకు గూడ నా వ్యాధిని ప్రాకించుట వ్యాధి నివారణకు మార్గముగాదు. ఒకవంక పురుషు డొనరింపుచున్న దారాపరిత్యాగము అనుచితము నక్రమము సంఘవిచ్ఛిత్తికి కారణము పాపభూయిష్టమునై హిందూసంఘసౌష్టవమున కెనలేని యపకృతిగావింపుచున్నది. నేడు స్త్రీలకు గూడ నట్టి యవకాశ మొసగినచో నాలోపము నివారణమగు నని భావింపరాదు. బహుశః యిబ్బందియగును.

మానవజన్మ మెప్పుడును లోపరహితముగాదు. ఎంత మంచివారియందును నేదియో యొక లోపముండితీరును. అట్టిచో నెంతయన్యోన్యానురాగముగల సతీపతులయందైనను నెప్పుడోయొకప్పు డేదియోయొకప్పు డభిప్రాయ భేదములు గలిగి తీరును. అంతమాత్రమునకే ఆడుది మగనిని, మగవాడు పెండ్లమును మార్చుకొనుచో నిక నాసంసారములో సారస్య

మేమున్నది? ఒకవేళ వాదసౌకర్యార్థమై విడాకులు పుచ్చుకొందు రేయనుకొందము. అటులైనను వీరి కష్టము నివారణ గాదు. ఏలనందువా మరల క్రొత్తగా కట్టుకొన్న ఆలుమగలలో మాత్రము పొరపొచ్చెములు పుట్టవని కంట్రాక్టేమున్నది? కాన కల్పలతా! ఇట్టి గంగాశంతనుల సమయములతో దాంపత్యజీవనము నిర్విఘ్నముగా చెల్లదు. తమదాంపత్య జీవితమును సుఖమయముగాను, ఒడిదుడుకులు లేకుండునట్లును జరుపుకొనదలంచుచో స్త్రీపురుషు లిరువురు పరస్పరవిశ్వాసప్రేమలు గలిగి సౌహార్దముతో నొకరిలోపముల నొకరు సైరణతో సవరించుకొని జీవితమును నడుపుకొనుటయే యుత్తమమార్గము. మఱియు విడాకులచట్టముచే మన సంఘము నెదుర్కొనబోవు మఱియొక కష్టముగూడ అపుడాలోచనీయము. మన దేశమున స్త్రీలకు సవతిబిడ్డల యెడగల ఈర్ష్య సామాన్యమైనదిగాదు. ఇందువలన బాలబాలికలు పడుచున్న యిడుమలును సామాన్యమైనవిగావు. సవతిబిడ్డలను చూచి సహింపలేక స్త్రీలు కొందఱు విషప్రయోగాది దుష్కృత్యములకుగూడ వెనుదీయకుండుట మన మనేక సమయములలో వినుచున్నాము. నేడు విడాకుల చట్టము నామోదించినచో బిడ్డలకు సవతితండ్రులుగూడ వచ్చెదరు. ఒక పురుషుని యదుపాజ్ఞలకు లోబడియున్న స్త్రీయొక్క మాత్సర్యమే సవతిబిడ్డలయెడ నధికతమమైయుండగా స్వతంత్రుడగు మగవాడు సవతిసంతానము నెడల నింతకంటె నీర్ష్యాళుపగుటకు నవకాశము గలదు గదా. కావున విడాకులచట్టముచే బిడ్డల సుఖస్థితి కష్టభూయిష్ట

మగును. మఱి ఆలుమగల సంసారమో నూతి ఒడ్డు బిడ్డ చంద మున నెప్పటి ఒప్పుడు ప్రమాదకరమై యుండును. ఇక నట్టి సంసారములో స్థాయియెక్కడ? సుఖమేది? ప్రేమ కవకాశ మెచ్చట? అన్నియు మృగ్యము. గట్టిగ మాట్లాడిన భార్య లేచిపోవునేమో ననెడిభయము మగవానికిని మగడులేచిపోవు నేమో ననెడి భయమాడుదానికిని కలుగుచుండ నిట్టి పిఱికి తనపు కాపురమెన్నాళ్లుసాగును. ఇట్టి దంపతులు ఏమాత్రపు సౌఖ్యమనుభవింతురు, కాన విడాకులచట్టముచే హైందవ సంసారములకు విపరీతపరిస్థితి యేర్పడుట ఒకవిధముగా యోచింప నిక్కువమనేతలంపు గలుగుచున్నది. కాని మిత్రమా! నేనిట్లు వ్రాయుటచేత తన కత్తి కెదురుకత్తిలేక భార్యయెడ నిరంకుశముగను నిర్దాక్షిణ్యముగను ప్రవర్తించెడి పురుషుల చెయిదములను నేను గుర్తింపలేదనిగాని, సమర్థింపుచున్నానని గాని భావింపకుము. తోటకూరలోని పురుగువలె స్త్రీ బహు నీచముగా పురుషులచే విసరివేయబడుచున్నదని నాకు తెలి యకపోలేదు. ఇందువలన మన స్త్రీలలో పెక్కురు ఆజన్మ దుఃఖముతో కుమిలిపోవుచున్నారనియు నేనెఱుగుదును. ఈవిష యము ప్రస్తావించునపుడు మన బంధుమిత్రులలోని స్త్రీలలో భర్తచే పరిత్యజింపఁబడినవారి నిర్వికారాకృతి నామనోవీధిని పొడకట్టుచున్నది. ఆ అభాగిను లెట్టి యపరాధముచేసినవారును కారు. వారి తలిదండ్రులు పుష్కలముగా ధన మీయజాలక పోవుటయో, వారు రూపవతులుకాకపోవుటయో, వారు విద్యాభిరతిగలవారగుటయో, వంధ్యలగుటయో, రోగగ్రస్త

లగుటయో ఇవియే వారిని పరిత్యజించుటకు కారణములు. ఇందు వారు గావించిన నేరమేమియులేదు. అయినను వారు నిరాక్షిణ్యముగా భర్తలచే విడనాడబడి జీవచ్ఛవములవలె పుట్టినింట బడియున్నారు. నిజముగా నిట్టి క్రూరకర్మము తలంచినప్పుడు డైవోర్సుచట్టము నిప్పటి కిప్పుడు పుట్టిన బాగుండుననినంత మనస్సు భగ్గురుమనును. కాని మన ఆర్య సాంప్రదాయ ధర్మమునుబట్టియు, కుటుంబజీవితముయొక్క శాంతి నాశించియు, సంతానమునకు కలుగబోయెడి యుప ద్రవము నాలోచించియు నించుక వెనుక ముందులరయుట యవసరమగుచున్నది. కాన ప్రత్యేక పరిస్థితులలో అనగా బాలిక గర్భాదానము కానట్టిదియు లేదా సంతానము లేనట్టి దియునై యుండి భర్త షండుడు, పిచ్చివాడు, కుష్ఠురోగి, దేశాంతరగతుడునైనచో నట్టి బాలికకు పునర్వివాహ మొనర్ప నగును. ఇదియే యాజ్ఞవల్క్యస్మృతియం దుదాహృతమైన ధర్మసూత్రము. ఇట్టి స్థితియందే స్త్రీకి పునర్వివాహార్హత నొసంగనగునని నాయభిప్రాయము. దీని కొప్పదేని జీవత్కళత్రు నకు వివాహాధికారము శాసనరీత్యా నిషేధింపబడవలెను; కాని యెట్టి మినహాయింపులులేక విడాకులచట్టము నామోదిం చుట మాత్రము ఉచితమార్గము కాదు. నేనిట్లు వ్రాయుటచే విడాకులచట్టము వచ్చినంతమాత్రముననే దంపతులెల్లరు కుప్పలు తిప్పలుగా త్రెంపి ముడులు పెట్టుకొందురా, ఏమి నీ పిచ్చి యూహాయని నీవు నవ్వెదవేమో. కాదు. కాదు! అట్టి విషమ స్థితి భారతదేశమున కింతలోరాదు. కాని త్రికరణములయందు

వాక్క్రియలకంటె మనస్సునకే ప్రాధాన్య మెక్కువగదా. ఆమోదము మానసికకార్యము. ఇందే మన సదసద్వివేకము వెల్లడికావలెను. నేడు భారతస్త్రీలు శైవోర్పుచట్టము నామోదించినారనినచో ఆచరింపకపోయినను నామోదించినట్లే గదా? అందువలననే, భూతకాలమును పరిశీలించుము. భవిష్యము నాలోచించుము. వర్తమానము గుర్తింపుమని నిన్ను హెచ్చరించుట.

భావపురి
15—4—30

మిత్రురాలు
శారద.

## సౌభాగ్యవతి కల్పలతకు:—

నెచ్చెలీ! ఆసేతుశీతనగపర్యంతమైన మన భారతావనియందంతట స్వరాజ్యోద్యమ మొక్కవిధముగా విజృంభించి దిగ్భ్రమ గలుగజేయుచున్నది. దేశనాయకులెల్లరు బందీకృతులైనారు. తుదకు మహాత్ముఁడుగూడ ప్రభుత్వవశగతుఁడైనాఁడు. అయినను భయములేదు; విచారములేదు. తల్లి, బిడ్డ నాశీర్వదించి చెఱసాల కంపుచున్నది. భార్య, భర్తను బందీకృతుడవుగమ్మని బహూకరించి వీడ్కొలుపుచున్నది. అహో! ఎందుల కీయుత్సాహము? చెఱసాల దివ్యభవనమా? చెఱసాలభోజనము దివ్యభోజనమా? కాదే! అయినను కష్టానుభవములకై వీరి కింత కుతూహలమేల? ఎందుల కీజనసముదాయమున కీయుద్యమముపై నింతప్రీతి? సత్యము, త్యాగము, అహింస యనెడి సూత్రత్రయముచే నిర్మితమైన ఈమహోద్యమమునకు మహాపవిత్రుఁడును, సాధుమూర్తియునగు శ్రీ మహాత్మాగాంధి తండ్రియు నడుపువాడునగుటయే యీ యుద్యమమున కింతపూజ్యతయు, వ్యాప్తియు గల్గుటకు కారణము.

లోక మెప్పుడును సంపదను లెక్కసేయదు. అధికారమును మన్నింపదు. బలమును గణింపదు. పాండిత్యప్రకర్షను చూడదు. సత్యమునే లక్షించును. త్యాగమునే హర్షించును. అహింసనే గౌరవించును. లోకైకపూజ్యుడగు మహాత్ముని

యం దీనుగుణములెల్ల విరాజిల్లుచుండుటచేతనే అఖిలప్రపంచ మాతని పూజించుచున్నది. ప్రేమించుచున్నది. ఆహా! ఇట్టి మహనీయవ్యక్తి పరమపావనమైన మన భారతదేశమున నుదయించుటయు, ఈ పూజ్యచరితునకు మనము సమకాలికుల మగుటయు నాతని సత్యాగ్రహ అహింసాత్మకమగు ధార్మికోద్యమమును కన్నులార గాంచగల్గుటయు నిజముగా మన భాగ్యమే.

శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామియుగేయుగే
యదాయదాహి ధర్మస్యగ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం.

'ఏకాలమున ధర్మమునకు హానికలుగునో, అధర్మమునకు వృద్ధికలుగునో యప్పుడెల్ల నేను వచ్చుచున్నాను' అను శ్రీ గీతావచనప్రకారము శ్రీ మహాత్ముడు ఉదయించి యున్నాడు. తల్లి, దుర్భరమగు గర్భక్లేశము ననుభవించుట వలననే పున్నమచంద్రునివంటి కుమారుని బడయగలిగినట్లు మన దేశము పరాధీనతాదిక్లేశము లనుభవించుటవలననే యిట్టి మహాపురుషుని గాంచగల్గెను. పేదల బ్రోచుట, దీనుల రక్షించుట, పరాధీనుల బంధవిముక్తులను గావించుట ఎప్పుడును సజ్జనుల కర్తవ్యము. నేడు లోకైకపూజ్యుడగు మహాత్ముడు గూడ నిజదేశపు దుస్థితిగని దుఃఖార్తుడై ఇట్టి మహాకార్యమును పూనుకొనినాడు. ఈ మహాపర్వసమయమున నా మహాత్ముని యుద్యమములో జేరి కార్యపరతంత్రులైనవారు

ధన్యులు. వానరయూధములు రామకార్యమున పాల్గొని పావనమైనట్లు నేడు మహాత్ముని యుద్యమమున పాల్గొనినవా రెల్లరు పునీతులగుదురు. నేటి యీ ధార్మికయుద్ధము బాహు బలమునకు సంబంధించినదిగాదు. శస్త్రాస్త్రములతో గూడి నదికాదు. కేవలము ప్రభుత్వముతో పోరాడుటే దీని లక్ష్యము కాదు. దయాసత్యశౌచవిహీనమై విదేశవ్యామోహవల్లరులం దగిలి ఆత్మగౌరవమును గోల్పోయి కర్తవ్యములు మఱచి యున్న భారతజాతికి చిత్తసంస్కారముగావించి కర్తవ్యపరా యణులఁజేయుటయే నేటి మహాత్ముని శాంతిసమరముయొక్క పరమార్థము. ఈ ధార్మికసమరములో భారతదేశమునం దుద యించిన యేవ్యక్తియు చేరకయుండుటకు వీలులేదు. ఎవరు దీనికి దూరులగుదురో వారు ధర్మమునకు దూరులు; సత్యము నకు దూరులు; పరమాత్మునకే దూరులు!! కల్పలతా! ఇట్టి సత్సమయమునగూడ ఆత్మోపలబ్ధిని బడయజాలనివారు, నిజ ముగా సర్వదూరులగుట నిక్కముగదా! అయితే ఇందు మన స్త్రీల కర్తవ్యమేమి? అది యిపుడు మనము యోచింపవలసిన మాట. కాని దీని కింతగా యోచించవలసిన పని ఏమి? రాముని వెనువెంట తరలిన సీతాసాధ్వీమణి చందమున ననవర తము మహాత్ముని యడుగుజాడల నడచుచు పుత్రులును, భర్తయుగూడ బందీకృతులైనను నిరుత్సాహమనునది లేక చింతయనునది యెఱుగక దాదాపు అరువదేండ్లు సమీపించి నను వ్యగ్రోత్సాహముతో కార్యరంగమున నిలిచి పని చేయు చున్న బాబుజీప్రియపత్ని కస్తూరిబాయియే, మన స్త్రీల

కాదర్శము. మహాత్ముడు చెఱసాలకేగునపుడు భార్య కేమి చెప్పుదురని యడుగ "నే నేమియుచెప్ప నక్కఱలేదు. ఆమె చాల ధీరురాలు" అనెనట. నేడు భారతనారీమణులెల్ల రట్టి ధీరురాండ్రు కావలెను. జిలుగువస్త్రములందును, నాగరికపు పరికరములందును, భోగద్రవ్యములందును మోహమును విడనాడుకొనవలెను. ఆత్మసమర్పణమునకు భారతసాధ్వి, పేరు మోసినది. కష్టసహిష్ణుత నామెకు నేర్పవలసిన పనిలేదు. త్యాగశీలత నామె వల్లెవేసినపాఠమే. ఆమెకు కావలసినదెల్ల స్వాతంత్ర్యము. భారతదేశము బ్రిటిషుప్రభుత్వవశగతమై యున్నట్లు భారతసాధ్వి పురుషహస్తగతయై యున్నది. ఆ పిడికిలి సడలెనా భారతమహిళ సామర్థ్యజ్యోతియొక్క యుజ్వల కాంతి దృగ్గోచరమగును. అదిగో! అపుడే కనుము. భర్తల యొక్క ఆజ్ఞచే స్వతంత్రతనుబడసి కార్యక్షేత్రమున ప్రవేశించిన భారతమహిళామతల్లుల యుజ్వలనామము లెట్లు పునః పునఃపఠనీయములై తనరారుచున్నవో! ఆంధ్రదేశమున లక్ష్మీబాయమ్మ, మద్రాసు రాజధానీనగరమున దుర్గాబాయమ్మ, గుజరాతిరాజ్యమున కస్తూరిబాయి, బొంబాయియందు కమలాదేవి ఛటోపాధ్యాయినీసరోజినీదేవులు, సంయుక్తరాష్ట్రములలో నెహ్రూకుటుంబపు అత్తకోడండ్రు యెట్లు కార్యశూరురాండ్రై విరాజిల్లుచున్నారో!

దుర్గాబాయమ్మగారిని నేను గత నవంబరునెలలో జరిగిన ఆంధ్రమహిళాసభలో గాంచితిని. వయసు పాతికేండ్ల

లోపు. మనిషి కొంచెము కుఱుచ. ఆకృతిలో ఇంచుక బొద్దు. మేఘగంభీరనినదమువంటి కంఠస్వరము. సుప్రసన్నాననములోని యుజ్వలతను గాంచి రక్తరేఖాంచితమైన ఆమె నేత్రయుగళిలో యామె ధైర్యగాంభీర్యముల నేనప్పుడే చదివితిని. ఆమె రెండుపన్యాసములీయ వింటిని. రెండిఁటియందును నామె శౌర్యరస ముట్టిపడునట్టులే భాషించెను. అబ్బో! అపరఝాన్సీ రాజ్ఞి యనిపించుచున్నదే యనుకొంటిని. తదుపరి ఆంధ్రరాష్ట్రసభలో "భారతదేశ మెన్నఁడును నొరులయాచించి యెఱుగదు. స్వాతంత్ర్యమునుగూడ యాచించదు. నిజప్రజ్ఞచేతనే బడయు"నని యామె పల్కిన పల్కులు మా అన్నగారు నాకెఱిగించిరి. అప్పుడు నేనిచ్చిన నామధేయ మీామెకు తగును అనుకొంటిని. నేనిట్లు తలఁచిన కొలదిమాసములకే శ్రీ దుర్గాబాయమ్మసోదరి రాజధానీనగరనాయకత్వమువహించి ధార్మికసమరము నడుపుటజూడ ఆశ్చర్యమగుచున్నది. సోదరికి జయమగుగాక! ధీరురాలగు దుర్గాబాయమ్మ నాయకత్వము వహించినది. అవకాశముగల చేడియ లందు పాల్గొని యుద్యమము సాగించుచున్నారు. తదితర పల్లీపట్టణములందెల్ల యీా యుద్యమ మిట్లే సాగుచున్నది. దీనిని సాగించుచున్న సోదరీమణుల కార్యదీక్ష సంస్తవనీయమైనది. వారి కార్యపరతచే పేదలపెన్నిధియైన ఉప్పుగల్లు బంధవిమోచనమును బడయునేని, దుష్టమైన మద్యపాన మడుగంటునేని, ఉప్పుగల్లుకు కొఱవైన దరిద్రులును త్రాగుబోతులగు భర్తలవలన సంసార

ములు గుల్లయైపోవ తిన తిండి, కట్ట బట్ట లేకఅల్లాడు పేద కుటుంబినులును వారికి జే జే లర్పింతురు.

ఇంక నేకారణముచేనైన నీ ధార్మికోద్యమములోఁజేరి సేవచేయజాలని సాధ్వుల కర్తవ్యమేమియో విచారింతము. ఏధర్మమునకైనను నేసత్యమునకైనను మనము నిష్కాపట్యముగా నర్పించవలసినది అంతఃకరణము. అంతఃకరణమే దాని కీయబడదేని కన్నులు చూచుగాక! చెవులు వినుగాక! జిహ్వలు పలుకుగాక! చేయి చేయునుగాక! దానిలో సారస్యములేదు. నిర్మలాంతఃకరణమే దాని కర్పితమయ్యెనేని నిపయన్నియు నిబద్ధమైనను నాధర్మమునకు హానిలేదు. ఆసత్యమునకు చెఱుపులేదు. కాన మహాత్ముని ధార్మికోద్యమమును మనము మనస్ఫూర్తిగా నంగీకరించితిమేని యెవ్విధమునవైన తోడ్పడగల్గుదుము. చంద్రుని కొక నూలుపోగన్న సామ్య ముండనేయున్నది గదా. అది కేవలము సామెతయేగాదు. అఖిలభారతీయ హృదయాకాశము షోడశకలాపరిపూర్ణుడై వెలయుచున్న మహాత్మాగాంధీచంద్రుడుగూడ ఆ నూలుపోగునే కోరుచున్నాడు. రాట్నమువలననో తకిలీవలననో ఆ నూలుపోగునైన సాధించి మహాత్ముని కర్పించమేని, యానూలుచే నేయబడిన వస్త్రముల ధరించమేని మనజన్మమే వ్యర్థము. కల్పలతా! నీవు రాట్నముపెట్టితివా లేకతకిలీ నభ్యసించుచుంటివా? నా

అభిప్రాయమైనచో రెంటిని నేర్చుకొనుటయే కర్తవ్యము. ఏది వీలైనపుడు దానిచే నూలునుదీయవచ్చును. నూలే మన ఆర్థికదాస్యవిమోచనమునకు పరమౌషధము.

భావపురి
15—5—30

మిత్రురాలు
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు—

నెచ్చెలీ!

నీవు వ్రాసిన దీర్ఘలేఖ చేరినది. నీకు జాబు వ్రాయని కారణము నీపై కోపమువచ్చియుగాదు; నీపై ప్రేమ తొలగియుగాదు; నాకు సోమరితనము బలిసియుగాదు; నీవు నాజాబున కెదురుజూచుచుందువనియు, వ్రాయకున్న నిష్ఠుర వాక్యబాణహతిచే నన్ను నొప్పింతువనియు నేను మాటి మాటికి తలంచుచునేయున్నాను. నేర మొప్పికొని శిక్షకు సిద్ధపడియున్న అపరాధనే గనుక నీమందలింపులు నాకు వింతగా నుండలేదు. కాని నీవు వేసిన ప్రశ్నాపరంపరలకిక సమాధాన మిచ్చుటకు యత్నింతును.

“ప్రస్తుత ఉద్యమకారణమున సకలవ్యవహారములు కట్టుబడిపోయి మనుజులు సోమరులై పోవుచున్నారు. నీకు గూడ అదే వచ్చిన”దంటివి. నీ వీవిషయమున చాలపొరబడి నావు. ఎందువల్లననగా నేను నీకు జాబువ్రాయుటకైన కాల మును వెచ్చింపక ఈమాసమంతయు తదేకదీక్షగా నూలువడికి తిని. ఈ గ్రీష్మఋతువంతయు నిదేవిధముగాం సాగించినచో రెండు కడుచక్కని వడుకునూలుచీరలను నేయించుకొందును. వ్యర్థములైన లేఖారచనములను కట్టిపెట్టి యిట్టికార్యదీక్ష నవ లంబించుట సోమరితనమా స్వధర్మానుష్ఠానమా? ఇది నా

యొక్క దానిమాటయేగాదు. దేశమంతట నిట్టులే వ్యర్థముగా కాలము బుచ్చువారిచే నూలు తీయబడుచున్నది. విద్యార్థినులు, సామాన్యజనులు, ఉన్నతోద్యోగులు, పాటకపుజనులు వేయేల స్త్రీలు, పురుషులు, బాలబాలికలిదేవిధముగా నూలు వడుకుచున్నారు. వ్యర్థప్రసంగములచేతను నిరుపయోగసంచారములచేతను వ్యర్థమైయుండెడి మానవశక్తి నిజముగా నీఋతువులోనే కొంచెములో కొంచెమైన సద్వినియోగపడినదని చెప్పవచ్చును. ఈవిధముగా భారతీయుల సహజమగు సోమరితనమించుక విచ్చిపోయియుండ దీనినే సోమరితన మనుట నాకాశ్చర్యమగుచున్నది. "మనదేశమున ప్రతివత్సర మీవేసవిలో ఎన్ని రాజకీయసభలు, ఎన్ని సారస్వతసభలు, ఎన్ని కళాపరిషత్తులు, ఎన్ని సాంఘికసమావేశములు, ఎన్ని వినోదప్రదర్శనములు. అబ్బా! లెక్కయున్నదా? అసంఖ్యాకముగా జరుగుచుండెడివి! అవియన్నియు నడుగంటినవి సరిగదా సాధారణముగా జరిగెడి సినీమాలు, సర్కసులు, నాటకములుగూడ లేకుండపోయినవి. తుట్టతుదకు మన యుష్ణమండలములనుండి యేటేట ఆరోగ్యమునకో, ఆనందమునకో, అధికారప్రాపకమునకో నీలగిరి, బెంగుళూరు ప్రాంతముల కేగెడి విద్యార్థినులుయాత్రలు గూడ మానుకున్నారు. ఇట్లు సర్వముకట్టువడిపోయి దేశము నిర్జనారణ్యమువలె చూపట్టుచున్నది. కాబట్టి ఈ మహోద్యమము దేశమునకు శుభస్థితిని చేకూర్చలేదు సరిగదా విశేషించి ఉపద్రవస్థితికి గొనిపోయిన"దని వ్రాసితివి. కల్పలతా! దేశమంతయు నొకేశిక్షాస్థానమై దేశీయులెల్ల రొకే

నేరస్థులై చెఱసాలలే స్వీయగృహంబులై యెల్లరొక్కవిధముగా గాసిలుచుండ నిపుడు వేడుకలకు, వినోదములకు, కథలకు, కబురులకు, వేసవియాత్రలకు అవకాశమెక్కడ? నేడు భారతదేశమందంతటు నెచ్చటనైనకనుము. కద్దుకపడా, చరఖా అవాజ్. ఒక్కటే దృశ్యము. దేశమునకు కావలసినదది. మహాత్ముడు కోరుచున్నదది. ప్రజలు చేయవలసినదది. ఇది ప్రజల కనీసధర్మము, ఉడుతభక్తి. దేశహితైకపరాయణులగు మహనీయులు సల్పుచున్న మహాత్యాగముతోగూడిన కార్యవారాశియందిది బిందుమాత్రము; అయితే బ్రహ్మాండముయొక్క నిర్మాణము పరమాణువులయొక్క సంయోగము చేతనేగదా?

"మనభారతదేశమునందు స్త్రీలలో త్రాగుడు లేదుగదా. కాన మద్యనిషేధప్రచారమునందు స్త్రీ లేల జోక్యము గల్గించుకొనవలెను? ఇది మిక్కిలి యసమంజసముగా నున్నది." యని నీవువేసినప్రశ్న నీవడిగిన పలువిధప్రశ్నలలోకెల్ల నద్భుతముగా నున్నది. మనదేశమునందు స్త్రీలలో త్రాగుడులేదను మాట వాస్తవమే. ఎక్కడైన నూటికి కోటికి ఒక్కస్త్రీ త్రాగుడు మఱిగిన దున్నను అదినిషేధప్రచారము చేయతగినంత విశేష విషయముగాదు. కాని స్త్రీ పురుషుల చేరికచే కుటుంబ మేర్పడుచున్నది. అందు సంపాదించుకొనివచ్చి కుటుంబమును పోషింపవలసిన పురుషుఁడు, తన సంపాదనయందు నిత్యము త్రాగుడుకొఱకు కొంతవ్యయపరచుచున్నచో ఆనష్టము స్త్రీది

కాదా? అట్లుగాక పురుషుడు తనసొమ్ము నెట్టిదుర్వ్యయము చేయక జాగ్రత్తపెట్టుచుండినచో దానిలాభము స్త్రీదిగాదా! స్త్రీ పురుషుల చేరికచే నేర్పడిన కుటుంబమునందు స్త్రీచేసిన వ్యయము పురుషుని, పురుషుఁడుచేసినవ్యయము స్త్రీని బాధింపకుండుటెట్లు? అదియట్లుండ మద్యమువంటి దుష్పదార్థ సేవనముచేగల్గు హాని కేవల మార్థికమునకే సంబంధించినది గాదు. త్రాగుడు సర్వవిధభ్రష్టతకు కారణము. ఏస్త్రీయైనను భర్తచే నధికముగా బాధింపబడుచున్నదనుచో నామె త్రాగుబోతువానిభార్యయే యనుట నిక్కము. కావున స్త్రీ స్వయముగా త్రాగకపోయినను మద్యనిషేధయత్న మామెకు గాని పనియనుటకు వీలులేదు. మిత్రమా! దుర్భరమగు ఎట్టి పన్నులకైన నోర్వవచ్చును. విదేశవస్త్రములనైన హర్షింపవచ్చును. కాని శరీరపోషణ కేమాత్ర మవసరములేనిదియు, నైతికముగా విశేష హానిని గల్గించునదియు, దుర్భరదారిద్ర్యకారణమును నగు త్రాగుడుమాత్రము వాంఛింపదగినదికాదు. విదేశవస్తువులవల్లగాని, పన్నులవల్లగాని మనుష్యునకు గల్గెడిహాని ధనలోపము మాత్రమే; కాని మధుపానరతిచే మానవుల మనుష్యత్వమే నశించిపోవును. మధుసేవకుల కుటుంబములు నరకసమములు. ఇట్లు వ్రాయుటచే విదేశవస్తువులనుగాని, అధికమగు పన్నులనుగాని హర్షించుచున్నానని భ్రమపడుచుంటివేమో? అదిగాదు. జలగలు రక్తమును పీల్చినచందమున నిరంతరము భారతీయుల ద్రవ్యమును పీల్చివేయుచున్న విదేశపుసరుకులును,

వేదభారతీయులు భరింపజాలని యధికపు పన్నులును నెంతతగ్గిన భారతదేశమునకంత శ్రేయము; కాని త్రాగుడుకును వీనికిని పోల్చినచో వీనికంటె త్రాగుడువలని నష్టమే యధికతమమని రూపించుటకే యట్లుపల్కితిని.

త్రాగుబోతువానిభార్య కూలివాని పెండ్లామగుగాక, జమీందారునిఇల్లాలగుగాక ఆమెదుఃఖము వివరింపరానిది. ఇంక నామె సంతానవతియేయగునేని నా దుస్థితి వర్ణించుటకే శక్యముగాదు. ఈసందర్భమున ఒకవృత్తాంతము జ్ఞాపకము వచ్చుచున్నది. అది యిప్పట్టున వివరించుట అప్రస్తుతప్రశంస కాదనుకొందును. ఇప్పటికి కొన్నియేండ్లయినది—ఒకనాడు నేనొక త్రాగుబోతుకథను నా ప్రియస్నేహితురాండ్రలో నొకామెకు చదివి వినిపించుట తటస్థించెను. ఆమె ఆకథను చదువుమని కోరుటచేతనే నేను చదువుటకు పూనుకొంటిని. నేను చదువుచుంటిని. ఆమె వినుచుండెను. ఆకథలో త్రాగుబోతు భర్తవలన నాతనిపత్ని పడెడిబాధలు, వినినకొలది నామిత్రురాలివదనము వివర్ణమై మ్లానమైపోవుచుండెను. ఆకథా సందర్భములు మిక్కిలి జాలికరముగానుండి నాకు చదువుటకుగూడ నోరాడకుండునంతటి దుఃఖమును గల్గించుచుండుటచే కథానాయకియందలి కనికరముచేతనే నామిత్రురాలట్లు విచారపడుచుండెననుకొంటిని. కథలో మితిమించిన పెనిమిటిత్రాగుడుచే నాకుటుంబిని నిర్ధనురాలగుటయు, అవ్యక్తులగు నామెబిడ్డలది గావలయు నిదిగావలయునని తల్లిని పీడించుటయు, ఆమె వారి

వాంఛితము నీడేర్పజాలక దుఃఖించుటయు గలభాగమువచ్చెను. మిక్కిలి జాలిగొలుపు నాపట్టును దుఃఖావరోధముచే నడివడిగా జదువజాలక ఆపి, ఆపి చదువుచున్న నేనొకమా అకస్మాత్తుగా తలయెత్తి నామిత్రురాలివంక చూచితిని. ఏమి చెప్పుదు నప్పటి దృశ్యము? నామిత్రురాలి కన్నవనుండి సంతతధారగా బాష్పములు స్రవించుచుండెను. ఆకన్నీటిధారలు చూడగనే నాగుండెలవిసిపోయెను. అంతనేను నామిత్రురాలితో "రుక్మిణీ! ఇదేమి ఇట్లాఏడుస్తున్నావు? కల్పితగాథలు సత్యములని భావించుచున్నావా ఏమి? ఎబ్బే ఏడ్పుమానూ; కథచదవడం మానివేస్తా"నంటిని "నిత్యము అనుభవములోనున్న కష్టములు, దుఃఖములు నీవు చదువుట మానివేస్తేమాత్రము తొలుగుతాయా? కథ ఆపవద్దు. శారదా! చదువుము. చదువుము." అని నామిత్రురాలు దుఃఖగద్గదికంబగు స్వరముతో బల్కెను. నాచే మిక్కిలి యదృష్టశాలినియని భావింపఁబడుచున్న నా మిత్రురాలి జీవితమింత దుఃఖభాజనమైనదని యాకస్మికముగా దెలియుటచే నేను నివ్వెఱ జెందితిని. నేనెప్పుడును ఊహింపని యొక రహస్యము నాపుస్తకమట్లువిచిత్రముగా బయటపెట్టెను. నాకిక కథ చదువుటకు బుద్ధిపుట్టలేదు. చేతిలోని పాత్రమును క్రిందవేసి నామిత్రురాలి నోదార్చుచు "రుక్మిణీ! నీపెనిమిటి కిట్టి దురభ్యాసమున్నదా? ఒకనాడును చెప్పకపోతివి!" అంటిని. "ఏ మొగముపెట్టుకొని చెప్పను? బి. యే. చదువుచుండగానే సారాదేవత మాయిల్లు నాక్రమించినది. ఆనాటి నుండి యీనాటివఱకు ఆసారాదేవతవలన నేను పడుచున్న

క్లేశములకు మితిలేదు. నేనొక్కదానినైతే ఎట్లాగో తినో, తినకో ఏడుస్తును. కడుపులో కాళ్లుముడిచిపెట్టుకొని పడుకో కుండా పిల్లలు నల్గురు; తెల్లవారిలేచినదిమొదలు యెన్నివిధ ముల తంటాలు! ఇంటికర్చునిమిత్తము నాచేతిలోకొక్కొక్క రూక రాలుటకెంతయో శ్రమ. కాని ఆసీమ సారాయములు సడీచప్పుడు లేకుండా వందలకొలది రూప్యములను కబళించి వేస్తుంటాయి. సొగసైన మాగదులలో అందమైన బిరడాలతో మా బీరువల నలంకరించే ఆ నిర్జీవపు సీసాలలో తమ్ము కొన్న యజమానునేగాక కుటుంబాలు కుటుంబాలు కూల్చివేసే అద్భుతశక్తివున్నది. శారదా! నీవాకథ చదువుటచే నాకథయే నాకు జ్ఞాపకమువచ్చి యింత దుఃఖమువచ్చినది. ఏమిచేయను? ఆపుకోలేకపోయినాను" అని నామిత్రురాలు మరల నధికముగా విలపించెను. కల్పలతా! నామిత్రురాలు పేదరాలుగాదు. గొప్పయింటిబిడ్డ; మంచివిద్యావతి. ఆమె యొడలిపై విలువగల నగలున్నవి. ఆమె కట్టుకున్నది బెంగుళూరుపట్టుచీర. ఆమెపెని మిటి విద్యాధికుడు. ఉన్నతోద్యోగి. పైకిచూచువారి కామె గొప్పయదృష్టశాలినివలెనే కాన్పించును. అయిననేమి? భర్త యలవాటుపడియున్న సీమసారాయము లామె నెంతపరితప్త మానసనుగా జేయుచున్నవో కనుము.

త్రాగుబోతుదనముచే శ్రీమంతులైనవారి స్థితియే యిట్లుండ ఇక పేదకుటుంబినుల నిది యెంతదుఃఖపెట్టుచున్నదో చెప్పవలసినదేమి? పేదవారల పూరిగుడిసెల నొకపరిచూడుము.

ఎప్పుడును ఆడుదానికంటె మగవానికి కూలియెక్కువ. అయితే ఆడుదానికూలి యింటికి జేరినట్లు మగవానికూలి చేరదు. అది ముక్కాలు మువ్వీసము కల్లంగడికే. ఒక్క ఆడుదాని కూలి కుటుంబపోషణకు చాలదు. మగవానికూలి కల్లుపాలవును. అట్టిచో ప్రొద్దున ప్రాచిమొగాన పాటుకు వెళ్లి చేతిబిడ్డను చెట్టు కొమ్మకుగట్టిన గుడ్డఉయ్యాలలో పడవేసి యెడపిల్లలను కంచెల వెంబడి కట్టలవెంబడి తిరుగవిడిచి పగలెల్ల కష్టపడిన ఆపేదరాలి క్షోభ యెట్లుండునో చెప్పవలెనా? అది యటుండ ఆ చాలియు చాలని గంజియైన త్రాగుదుమని నమ్మకములేదు. తప్పతాగిన ఆధూర్తుడు అకస్మాత్తుగావచ్చి యింటిమీదపడి ఆగమునకు దొరకొనును. పెండ్లామును చావమోదును. బిడ్డలను జావ మోదును. కూటికుండలు బోర్లదోయును. ఇంక ఆనోటి కడ్డ దిడ్డములులేవు. వినరానిబూతులు. అట్లు ఇంటికిరాకపోయినా? కంచెలోనో కంపలోనో పడినాడనియో, రోడ్డుమీద దొర్లు చుండగా కానిస్టేబులు స్టేషనుకు యీడ్చుకొనిపోయినాడనియో కబురు. వానికొఱకు మరల పెండ్లాముపరుగు. ఏతాయియైన నేమి పండ్లూడగొట్టుకొనుట కన్నట్టుగా సంసారములోని శాంతిని చెఱచుట కేయల్లరియైనను నొక్కటేగదా?

మిత్రమా! సాయంత్రపువేళ పేదవారి గుడిసెల దెసకేగి చూచితిమా ఇప్పగిది మద్యదేవతకు బలియై క్షోభి ల్లెడి సంసారములెన్నియో హృదయవిదారకముగా గననగును.

అంతదూరముపోనేల? మాపనిమనిషిమగఁడును, దొడ్డినూడ్చుదాని మగడును ఇద్దఱు త్రాగుబోతులే. తమభర్తల దుర్వృత్తినిగూర్చి దినదినము వారు పెట్టెడిఘోష విన శక్యముగాదు. వాళ్లు చెప్పి చెప్పి, యేడ్చి యేడ్చి తుదకు తమనెలజీతము తమమగమనిషికి మాత్రమీయవద్దని చెప్పుచుందురు. అటులనేయని నేనెన్నఁడును వాళ్లభర్తల పరముగా జీతమీయను. కల్పలతా! త్రాగుడు పేదస్త్రీలను, ధనికస్త్రీలనుగూడ నిన్నివిధములు హింసించుచుండ నిషేధప్రచారము స్త్రీల కావశ్యకములేదని యెట్లుచెప్పనగును? మిత్రమా! నిజముగా త్రాగుబోతులు త్రాగుచున్నది భార్య, బిడ్డల రక్తముగాని మద్యముగాదు. దొరతనమువారి మహౌదార్యమువలనగాని మహాత్ములైనవారి నిరంతరకృషివలనగాని మద్యమును నిషేధించుభాగ్యము మన భారతదేశమునకు గల్గెనేని మన స్త్రీల పుణ్యము ఫలించినదనియే చెప్పవలయును.

గతవత్సరము దొరతనమువారు మన చెన్నరాజధానియందు కొన్నిలక్ష (నాల్గులక్షలని జ్ఞాపకము) లొసగి మద్యనిషేధక ప్రచారకసంఘములు నెలకొల్పినపుడు త్రాగుబోతుపతులచే వెతలబడుసతుల యాపదలు తీఱెడిభాగ్యము లభించెనని యెంతయోసంతసించితిని. అయితే ఆ కెంపరెన్సుకమిటీ లింకను జీవించియుండగనే అదే ప్రచారమునకు పూనుకొనిన అసంఖ్యాక భారతీయ నరనారీమణులు చెఱసాలలలో ముఱుగుచున్నారు. పరస్పర విరుద్ధమైన యీకార్యమునకు హేతు

వశ్యముగానున్నది. దొరతనమువారికి మద్యపాన మిష్టమా? అయితే ఆ టెంపరెన్సుకమిటీల కర్థమేమి? మద్యనిషేధ మిష్టమా? అయితే ఇంతమంది దేశభక్తులు కారాగృహ నిబద్ధులు కానేల? మద్యనిషేధమును బోధించినందులకై యింతమంది దేశభక్తులు నిబద్ధులగుటజూడ "మద్యనిషేధ మునకేర్పఱచిన టెంపరెన్సుకమిటీలు మీ కండ్లనీరుదుడుచు టకై యేర్పడినవేగాని నిజమైనప్రచారమునకుగాదు. మీ నైతికవిచ్ఛిత్తితో మాకుపనిలేదు. మీ సంఘక్షీణతను మేము పరికింపము. మీ దారిద్ర్యస్థితితో మాకు సంబంధములేదు. మీ దేహారోగ్యముతో మాకు నిమిత్తములేదు. మీ పెండ్లాము బిడ్డల ఘోషతో మా కగత్యములేదు. మాకుకావలసినది డబ్బు. డబ్బు డబ్బు. మద్యనిషేధమున కంగీకరించి మా కోట్ల కొలదిధనమును కోల్పోవజాలము." అని ప్రభుత్వము ఖండిత ముగా చెప్పుచున్నట్లున్నది. ప్రజల నింతబలవంతపఱచి త్రాగిం చినను యీ మద్యపానమువలన మనుష్యున కే కొంచెమైన ప్రయోజనము గలదా? ఆకలితీరునా? ఆరోగ్యవర్ధకమా? తుదకు జిహ్వకైన నిఫురూర్చునా? ఏదియులేదు. త్రాగు బోతుకు మనస్సు నిలుకడలేదు. మాట నిలుకడలేదు. శరీర ములో సత్వములేదు. నైతికముగా, సాంఘికముగా, ఆర్థిక ముగా, శారీరకముగా వాడు భ్రష్టుఁడై పోవును. వానితో బాటు వానిభార్యయు బిడ్డలునుగూడ వివిధకష్టములకుగుఱియై దురపిల్లుదురు. సారాదేవత ప్రవేశించినయింట ఆనందమునకు తావులేదు. సుఖమునకు తావులేదు. పెద్దమ్మయొక్క ప్రభా

వము శల్యావశిష్టులగు నాయింటివారి ముఖములమీదను, సర్వ శూన్యమైన యాయింటియందలి నలుమూలలను పొడకట్టుచుం డును. కల్పలతా! ఈసందర్భమున 'ఆరోగ్యప్రకాశిక'లో సారాదేవత పలికినపలుకులు ఎంతయు వినదగినవిగానున్నవి. అందిటున్నది:—

"ప్రపంచమున మనుష్యులను చంపుటలో అనగా హత్యనేరముచేయుటలో నన్నుమించినవారు మఱెవ్వరును లేరు.

ప్రపంచమున నిదివరకుజరిగిన యుద్ధము లన్నిటిలోను చంపబడినవారిమొత్తము సంఖ్యకంటె నాచే చంపబడినవారి మొత్తము సంఖ్యయే మిక్కిలి హెచ్చుగానుండును.

నేను మనుష్యులను పశువులక్రింద మార్చితిని. నేను కోట్లకొలదికుటుంబముల సౌఖ్యమును రూపుమాపి కష్టములనే అనుభవించునటుల చేసితిని. కోట్లకొలదిమనుష్యుల అధోగతికి కొనిపోవునట్టి దారిని సరిచేయుచుందును.

నేను బలవంతులను బలహీనులనుగా చేయుదును. బలహీనులను అంతమొందించెదను. నేనిదివరకు ఎన్నికోట్ల మందినో పాడుచేసితిని. ఇంకను ఎన్నికోట్లమందినో పాడు చేయుటకు ప్రయత్నించెదను. నాపేరే సారాదేవత."

మిత్రమా! 'ఆరోగ్యప్రకాశిక'లో ప్రచురింపబడిన గిబ్బనుదొరగారి యీమహావాక్యములను చదివినప్పుడు "ప్రపంచములో నాచే దుఃఖింపబడినంతమంది పతివ్రతలు, మరి

దేనిచేతను దుఃఖపడలేదు." అనువాక్యమునుగూడ చేర్చిన బాగుండుననుకొంటిని. కల్పలతా! అది సత్యముగదా? పరమేశ్వరానుగ్రహమువలన మద్యనిషేధప్రచారము మనదేశమున శీఘ్రకాలములో ఫలించుగాక! మనస్త్రీల దుఃఖములు నివారణమగుగాక! యని వాంఛించెదను. కల్పలతా! ఇప్పటికిని మద్యనిషేధప్రచారముతో స్త్రీలకు సంబంధము లేదనియే తలంతువా?

భానపురి
ఆగస్టు 1930

మిత్రురాలు,
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

నీవు వ్రాసినట్లు శారదాచట్టమునకు సవరణనుపపాదించుట యనుచిత కార్యమనుటకు సందియములేదు. శారదాచట్టము త్వరపడి చేయబడినది కాదు. దాదాపు రెండు వత్సరముల దీర్ఘకాలము దేశీయులచే చక్కగా యోచింపబడినది. ప్రజాభిప్రాయమును కనుగొనుటకై యేర్పడిన ఉపసంఘమువారు దేశమంతటను పర్యటనమొనర్చి నానావిధముల విచారణ యొనర్చిరి. పెక్కుమందికడ సాక్ష్యములను గైకొనిరి. డాక్టరుల యభిప్రాయములను తెలిసికొనిరి. పండితుల యభిప్రాయములను తెలిసికొనిరి. స్త్రీల యభిప్రాయములను తెలిసికొనిరి. న్యాయమూర్తుల యభిప్రాయములను తెలిసికొనిరి. ఈవిధముగా ప్రత్యేకవ్యక్తుల యభిప్రాయములనేగాక వేర్వేరు సంఘములపక్షమునను సంస్థలపక్షమునను గూడ విచారణయొనర్చి తెలిసికొననిరి. ఇన్నివిధముల విచారించిన వెనుకనే యుపసంఘమువారు బాలికల వివాహవయస్సు పదునాలుగేండ్లుగానుండుట యుక్తమని నిర్ణయించిరి. తదుపరి యుచితమైన ఈతీర్మానము సామ్రాజ్యశాసనసభవారిచే ఆమోదింపబడెను. దానికి ప్రభుత్వమువారును తోడ్పడిరి. రాజకీయకారణములచే ప్రసిద్ధప్రజాప్రతినిధులెల్లరు రాజీనామాలు పెట్టుటవలన ప్రస్తుత సామ్రాజ్యసభ యాకలుతీసిన కోడివలెనున్నది; కాని శారదా

బిల్లు శాసనముచేయబడునా డిట్లు లేదు. పటేలు మహాశయు డధ్యక్షుడుగను, నెహ్రూ మాళవ్యా వంటి నాయకమణులు సభ్యులుగనుండ ప్రభుత్వమువారును ప్రజాప్రతినిధులును మిక్కిలి సఖ్యతతో చేసిన శాసనము శారదాశాసనము. ఆశాసన మైన అప్పటికప్పుడే ప్రజల నెత్తిపై పెట్టలేదు. దాదాపైదు మాసములకు తరువాత నమలులోనికి వచ్చునట్లు నిశ్చయింప బడెను. ఆ అయిదుమాసముల గడువులో శాసనము రద్దుచేయ నెంచుచో సభ్యుల కవకాశము లేకపోలేదు. కాని ఆ అయిదు మాసములు శాసన ప్రతికూలు రెక్కడైన కునికిపాట్లు పడు చుండిరో లేక విపరీతముగాజరిగిన వివాహములలో విందులే గుడుచుచుండిరో తెలియదు. శారదాచట్ట మమలులోనికి వచ్చులోపల పూర్వాచారపరాయణుల ప్రేరణచే దేశీయులు గావించిన యనుచితవివాహములకు లెక్కలేదు. ఒక్క మచిలీ పట్టణమునందే 900 వివాహములు జరిగినట్లు లెక్కింపబడెను. ఇక యావద్భారతదేశమునందును ఎన్నిలక్షల వివాహములు జరిగెనో వివరింపం దరముగాదు. దేశీయులెల్ల రా విధముగా కన్నులు తెఱువనివారును, పిడికిళ్లు విప్పనివారును, మాటలు రానివారును, నడకలు నేరనివారును అయిన కసుగందులకు గంగవెఱ్ఱులెత్తినట్లు పెండ్లిండ్లుచేయుచుండ నేడు సవరణ నామో దింప సాహసించిన శాసనసభ్యులలో నొక్కరైన 'దేశీయు లారా! భయములేదు. శారదాచట్టము రూపుమాపెద'మని చెప్పకపోయిరి. నాడుతోడ్పడి నేడు తాటస్థ్యమువహించిన ప్రభుత్వమువారైన సవరణ కవకాశముగలదని సూచింపరైరి.

అతిబాల్యవివాహము లా విధముగా ననిరోధకముగా ననంఖ్యా కముగా జరిగిపోయిన పిమ్మట, అభము శుభము నెఱుగని పసిపాపల కంఠములకు పూర్తిగా నురులు వేయబడిన పిమ్మట, ప్రజానురాగము బడసిన ప్రజాప్రతినిధులెల్లరు శాసనసభలు వీడివచ్చిన పిమ్మట, గడువుకాలము గడచిపోయి శారదాచట్ట మమలులోనికివచ్చి మూడుమాసములైన పిమ్మట యిప్పుడా సవరణ ? ఆ సవరణమైన యెట్టిది ? సివిలు కోర్టుద్వారా సర్టిఫి కెట్టు పొందినవారికి చట్టములో పొందుపరుపబడిన వయస్సు లకు లోపుగనే తమ బిడ్డలకు వివాహము చేయుటకు సురపత్ సింగుగారి సవరణ అవకాశ మొసంగుచున్నది. అయితే ఇక శారదాచట్ట మెందులకు ? బాల్యవివాహములను చేయ నెంచు వారెల్ల కోర్టులో దరఖాస్తుపెట్టి సర్టిఫికెట్టును పొంది తమ పిల్లల కెప్పటియట్లు వివాహముజేయుదురు. ఆక్షేపణలేనివా రొకరి సలహా లేకయే తమ కొమార్తెలకు ప్రౌఢవివాహము లను చేయుచున్నారు. ఇకనేమున్నది ? శారదాచట్టము బ్రతికి యుండియు చచ్చిన చందమగును. సర్టిఫికెట్టును బడయుట కేదైన కొంచెము ఫీజుగూడ నున్నచో కోర్టువారి కదిగూడ నొక ఆదాయకారణము గావచ్చును. వానిలో నేదైన తకరరు వచ్చినచో లాయరులకుగూడ నొకింత సంపాదనాహేతువు కావచ్చును. కల్పలతా! శారదాచట్టము జీవచ్ఛవముగా నుండి చేయుపని యింతియేగాదు; మఱియొక ముఖ్యమైన నష్టమును గలదు. దేశములో శారదాచట్టమునకు ప్రతికూలురుగానున్న వారు రెండు విధములుగానుండిరి. వారిలో నొకరు పదునాలు

గేండ్ల వివాహములు శాస్త్రవిరుద్ధములని వాదించు పూర్వాచారపరాయణులు; వేఱొకరు యుక్తవయస్సు వచ్చిన బాలికలకు వివాహముచేయుటకు మనస్ఫూర్తిగా నిష్టముండియు మన వైవాహిక హక్కును ప్రభుత్వపరముచేయుట గూడదను లౌక్యులు. చట్టమున కనుకూలురగు సంస్కర్తల చిత్తములందు గూడ నీ వివాహాధికారమును గోల్పోవుటనునది గొప్ప సమస్యగానే యుండెను. కాని దేశములో బాల్యవివాహములవలని యనర్థకములు నానాటికి మెండగుటయు, ఎన్నివిధముల ప్రబోధించినను ప్రజాసామాన్యము తమపూర్వాచారమును వీడజాలకుండుటయు గని స్త్రీల పురోభివృద్ధి నాశించు కొందఱు మహాశయులు ప్రభుత్వమువారి వలననైన నీ బాల్యవివాహములు నిరోధింపబడిన జాలునని తమ హక్కును కోల్పోవుట కొడబడిరి. అయితే యీ సవరణయె నెగ్గనేని దేశమున కింతకంటె అనర్థకమును దేశీయుల కింతకంటె యవమానమును వేఱొండు లేదు. ఏలననగా ఎప్పుడు మన బాలికల వివాహమును చేసికొనుటకు కోర్టువారి సర్టిఫికెట్టును బడయు టగత్యమైనదో అప్పుడే మన వివాహముల హక్కును ప్రభుత్వమువారి పరము చేసినట్లైనది. అయితే శారదాచట్టమును సృష్టించుటయొక్క యుద్దేశము బాల్యవివాహములను నిషేధించుటకే గదా. బాల్యవివాహములను చేసికొనువారికి ప్రభుత్వమువా రుత్తరువు నొసంగినచో శారదాచట్టముయొక్క ప్రయోజన మేమున్నది? కాన కలిగియున్న అధికారమును కోల్పోవుటయు, కలుగవల

సిన ప్రయోజనము కలుగకపోవుటయు సురపత్ సింగుగారి సవరణయొక్క ఫలితములుగా నేర్పడగలవు. కావున మిత్రమా! స్త్రీ జనాభ్యుదయచింతతో జేయబడిన శారదాచట్టము యథా రూపమున నమలులోనికైన రావలెను. లేదా అసలే రూపు మాసిపోవనైన పోవలెను; కాని సురపత్ సింగుగారి సవరణను మాత్రము దేశీయు లెంతమాత్ర మామోదింపగూడదు. అప్పటికప్పుడే శారదాచట్టమును రూపుచెడజేయ నెంచిన సింగుగారి సవరణకు ప్రజాభిప్రాయమును కనుగొనుటయును మఱియొక సవరణతో యమర్పనుదొరగా రిరచుక యద్దుపరిరి. కాన ప్రజాభిప్రాయమునకై విడువబడిన ఈ సవరణను అనర్థక హేతువని పూర్తిగా నిరసించి దేశీయులు శారదాచట్టము యెడల తమకుగల సమ్మతిని తమ నిశ్చితాభిప్రాయము ద్వారా మరల నొకపరి దృఢపఱుపవలెను. ముఖ్యముగా నిది స్త్రీలకు సంబంధించినది గావున స్త్రీలెల్ల రీ సవరణవిషయమై తీవ్రప్రాతికూల్యమును జూపదగును. గృహలక్ష్మియు నిందులకు దోడ్పడవలెనని నా కోరిక.

మన చెన్నపురి మహిళాసంఘమువా రప్పుడే యీ సవరణవలని ప్రమాదమును గుర్తించి నిరసనసభ జరిపినట్లు పత్రికలలో జదివితిని. ఇది యెంతయు శుభావహము. ఇటులనే భారతదేశమంతట నీ సవరణకు తీవ్రప్రాతికూల్యమెదురొ్కనును గాకయని యాశించెదను.

కల్పలతా! ఈసమయమున దేశీయు లుపేక్షించిన దేశ మునకు మేలుగాక కీడునే చేసినవారగుదురనుట నిక్కము. భవిష్య మెట్లున్నదో?

భావపురి
సెప్టంబరు 1930

మిత్రురాలు,
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు—

నెచ్చెలీ!

నీవువ్రాసిన ఉత్తరములన్నియుచేరినవి. కాని రెండు మాసములనుండియు నీవు లెక్కలేనన్ని లేఖల లిఖించుచున్నను నీకొక్క జాబునైన వ్రాయజాలనందులకు నాకు చాలవిచార మగుచున్నది. ఏమిచేయుదును? ఇంటిలో ఒంటరిదాననైనాను. కలముపట్టుటకంటె గరిటెపట్టుట అవసరమైన పనిగానున్నది. దానికితోడిది శీతకాలపుప్రొద్దు. ప్రొద్దుకు ముద్దకుసరి. ఇక నేను నీకు ఉత్తరమెప్పుడు వ్రాయుదును? అందువలననే తెల్లవాఱుజాముననైన వ్రాయుదుమని వాకిలిలో సంక్రాంతి దాసరి వచ్చి 'హరో, రంగ హరి, కస్తూరిరంగ, కావేటిరంగ' అని కేకలుపెట్టగా మెలకువవచ్చి లేచి ఆతనికి పిడుకెడుబియ్యము వేసివచ్చి కలముకాగితము చేతబట్టుకొని దీపము ముందరవచ్చి కూర్చున్నాను. అయిననేమి? కలముసాగునా? అదిగో! "అమ్మా! వాకిట్లో నీళ్ళుచల్లడమైంది; ముగ్గులుపెట్టుకోం" డని పనిమనిషి అఱచుచున్నది.

ఈ ధనుర్మాసములో మనకిది యొకపెద్దపని. పగలు పదిరెండుగంటలు ఫెళ్లునవెలిగే సూర్యభవానుఁడు జీతమాలస్యమైన కూలివానివలె పదిగంటలకాలమైనను పగలుచూపక పరుగెత్తిపోవుచుండగా ఇందులో ఒకగంట తనక్రిందకు లాగుకొనును సంక్రాంతిముగ్గు. పోనిమ్మా ఆలస్యమగునని యీ

మ్రుగ్గువేయుట మానుదుమనినను మనస్సొప్పదు. ఈ దినములలో ఒకరినిమించిన రంగవల్లి నొకర మిడినగాని మనకు సంతోషముండదు. మఱియు నిన్న వేసిన మ్రుగ్గు నేడు వేయుటయు లజ్జాకరమే. కావున దినమున కొక్కటి. మనకళావైదగ్ధ్యమును ప్రకటించుట కీ ధనుర్మాస మొకయుత్సాహకరమైనమాసము. దేవతలకు దక్షిణాయనము రాత్రికాలమనియు, ఉత్తరాయణము పగటికాలమనియు, అం దీధనుర్మాస ముషఃకాలమనియు, కావున దేవతాప్రీతికరమగు నీయుషఃకాలమున రమణీయరంగవల్లులచే మన ప్రాంగణముల నలంకరింపవలెననియు పెద్దలు చెప్పుదురు. మనకళానిపుణతను జూపుట కిదిమంచి యదనగుటచే దేవతలకేగాక మనస్త్రీలకును నిది ప్రీతికరమగు మాసమేయగుచున్నది.

మనకంటె ప్రీతికరము మనబాలికలకు. వారి గొబ్బిళులులేకున్న మనరంగవల్లులు చిన్నబోవా? కాన వారు మనకంటె కార్యనిమగ్నలై ఒకచో ఆవుపేడ, ఒకచో పెద్దగుమ్మడిపూవులు, బంతిపూవులు తెచ్చి గొబ్బిళ్లుచేసి వానిని పసుపు, కుంకుమలచేతను పుష్పాదులచేతను నలంకరించి ముంగిళ్ళనిడువఱకు వారికి సంతుష్టిలేదు. నిన్నప్రొద్దున నేను మావాకిలిలో మ్రుగ్గులు పెట్టుచుంటిని. అప్పటి కింకను బాగుగా తెల్లవాఱలేదు. దశదిశలను మంచు దట్టముగా కప్పియున్నది. చేతులు కొంగర్లుపోవుచు మ్రుగ్గు సాగుటలేదు. చలికి దవడలు దగ్గఱకు పడుచున్నవి. ఆసమయములో ఇద్దఱుబాలికలు నామ్రుగ్గునకు

దగ్గఱగా నిల్చున్నారు. వారిలో ఒకబాలకు యేడేండ్లు వేఱొక దాని కైదేండ్లున్నట్లున్నవి. పెద్దదానిచేతిలో పేడపళ్లిక, చిన్న పిల్లచేతిలో పూలపుటిక ఉన్నవి. కాని పేడబుట్టలో పేడలేదు; పూలబుట్టలో పూలులేవు. వారి చిన్నిముఖములు మఱింత చిన్నబోయిఉన్నవి. "పేడా, పూలూ తెచ్చుకోక యిట్లా నిలబడ్డారే?"మని నేను వారిని అడిగితిని. "పోయివచ్చాము దొరక లేదు" అని ఆబాలికలు చిన్నబుచ్చుకొని పలికిరి. వారిని చూచుటకు నాకు జాలివేసెను. ఆవుపేడయు పువ్వులును దొరకకపోవుటచే వారెంతో యుత్సాహభంగము పొందినట్లు గానుపించిరి. వారికన్నుల నీరొక్కటి తక్కువగాని వారిమోమంతగా ముడుచుకొనిపోయినది. మా కెదుటవీధిలోనున్న ఒకయిల్లుచూపి "వారింట చాలఆవులున్నవే, మీకు పేడెందుకు దొరకలేదు ?" అని వారిని మరల నేనడిగితిని. "ఆయింటి ముసలమ్మ చాలాచీకటి ఉండగానే లేచి లాంతరుపెట్టి పేడంతా వెదకి తట్టలోవేసి దాచిపెట్టిందట. మేముపోతే "అంతాయెవరో యెత్తుకొనిపోయినారు పొమ్మన్నది"అన్నారు ఆబాలికలు. "అయితే మీ అమ్మను పంపకపోయినారా? పెద్దవాళ్లువస్తే ఇచ్చేదేమో?" అన్నాను నేను. "మాఅమ్మ ముగ్గులుపెట్టుతున్నది" అన్నారాబాలికలు. అవును, అమ్మకు దగినపని అమ్మకు, బిడ్డలకుదగినపని బిడ్డలకు. ఆమె రంగవల్లులులేకున్న వీరి గొబ్బిళ్లకు శోభలేదు, వీరిగొబ్బిళ్లులేకున్న ఆమె రంగవల్లులకు రక్తిలేదు అనుకొంటిని. పేడదాచిన ముసలమ్మ పిసినారితనమునకు నాకు అసహ్యముగలిగినది. మాచిన్నతనములో

గూడ మేమిటులనే గొబ్బిళుల కావుపేడ దొరకనినాడు ఆశా భంగమునొందిన దినములు నాకు జ్ఞాపకమువచ్చినవి. ఈ పసిబిడ్డ లీ చలిలో మంచులో గొబ్బిళ్లమీది ఆసక్తిచేత వచ్చి నందులకైన పట్టెడుగోమయ మివ్వవచ్చునే! ఈ మాసము గడచిపోయిన వెనుక నీపసిబాలలు మనయిండ్లకు రమ్మనినను వత్తురా? ఈ నెలదినములు బాలికల కావుపేడ వదలివేయ రాదా? అనుకొని మాపనిమనిషి శుద్ధికై తెచ్చిన ఆవుపేడ వారికిచ్చి మాదొడ్డిలోనున్న యేపిచ్చిపూలో నాలుగు పుణికి యిచ్చి వారిని పంపివేసితిని. అప్పుడా బాలికలు గొప్ప పెన్నిధి లభించినట్లుబ్బుచు తమయింటికి వెళ్లినారు.

ఈ బాలికలు గొబ్బిళులు పెట్టుగొనుటనిన నాకు మిక్కిలి సంతసముగానుండును. మఱియు వీరు సందెగొబ్బి పెట్టుకొని గొబ్బితట్టుచుండుట చూచుట, నాకు మిక్కిలి సంతోషకరము. ఒక్క గొబ్బిపండుగ మన బాలికలకు పెక్కువిషయములలో పరిజ్ఞానముగలిగించును. బద్ధకములేక తెల్లవాఱుజామున నే లేచుట, వాకిలి పరిశుభ్రపఱచుకొనుట అట్లుండ పుష్పపత్రాదులతో పరిచయము, మతసంబంధమగు పూజాపునస్కారములతో పరిచయము, ముగ్గులతో పరిచయము, ఆటతో పరిచయము, పాటతో పరిచయము ఈ విధముగా లలితకళలలో ప్రథమపాఠములు బాలికలు గొబ్బిపండుగలలో నేర్చుకొందురు. ఆతరువాత పెద్దపండుగ మూడు దినములు బాలికలు పెట్టుకొనెడి రకరకముల బొమ్మలసా

మానులు మున్నగునవిగూడ వారికి కళాప్రవీణతయందభినివేశ మొసగునవే.

మిత్రమా! ధనుర్మాసములో బాలికలకే యింత తీరని పనియైయుండ నిక మనస్త్రీలసంగతి చెప్పవలయునా? వేకటితో ఓకిరించుకొనుచు తొలకరిలో పుట్టినింటికేగినతొయ్యలి ప్రకృతి లక్ష్మి సుఖప్రసూతయైగంపెడుకొడుకులను గంపెడుకూతుండ్రను వెంటనిడుకొని చేమంతిపూవులజడతో, బంతిపూలహారములతో పూచినతంగెడువలె కలకలలాడుచు నింటికివచ్చెను. కోడలింత వైభవముతో నేటికేడాదికి సరిపోవుసారెచీరలుగట్టుకొని యింటికి వచ్చుచుండ ప్రవాసివలె మనము ముడిచిపెట్టుకొని కూర్చుండిన బాగుగానుండునా? ధనధాన్యసమృద్ధయైవచ్చెడి యాప్రకృతి, విడియుట కనురూపముగా మన గృహము లుండవలదా? 'ప్రాతగోడకు పూతచక్కనా, కోతిరూపికి వ్రాతచక్కనా' అనిగదా సామ్యము. ఇంటికిపాదట్టు దులిపించి, గోడలకు సున్నము పూయించి మండిగములకు పసుపుకుంకుమలు, ద్వార ములకు తోరణాంబులు, ప్రాంగణములలో రంగవల్లులు, నిడి గృహలక్ష్మి నలంకరించుకొనవలదా? ఈ పనులన్నియు నెలఅ వేఅవలయునన్నిన రెండుకాళ్ళొకచోనిడి కూర్చుండుటకు వీలగునా? పనియెంత యెక్కువైననేమి? పనిముద్దు భాగ్యము ముద్దుగదా? అయినను సోమరులమై మనము బాపుకొనున దేమున్నది? హిస్టీరియాలువచ్చి అల్లాడటమేగదా? గాన సర్వా వయవములు పాటనముజెందునట్లు ప్రతిస్త్రీయు తన గృహకృ త్యములను తాను నిర్వర్తించుకొనుటయే మంచిది.

కాని పనులకు దగినట్టుగా మనకు ప్రొద్దుతక్కువగూడ నిప్పుడే. ఇంచుమించుగా రెండుగడియలప్రొద్దెక్కినగాని సూర్య భగవానుడు మంచుతెఱలు చించుకొని బయటకు రానేరాడు. వచ్చినప్పుడైన నించుకసేపు నిలువబడనే నిలువబడడు. ఆనిలిచిన కాస్సేపైన చుఱుకైన యెండ నీయడు, "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేన్మోక్షమిచ్ఛే జ్జనార్దనాత్" అన్నట్టుగా మన కాయురారోగ్యములను బ్రసాదించు ఆదిత్యు డిట్లు జడుడై మందుడై తూర్పుమూలగాబుట్టి దక్షిణపుమూలగా నడ్డత్రోవనుబడి యతివేగముగా బశ్చిమాద్రికి బరువులెత్తుచుండ మనకు అహములెట్లు సన్నముగాకుండును? తేవు శిశిరుడువచ్చి పండుటాకు లూడగొట్టినట్టులే సూర్యునిబద్ధకమునుగూడ నూడగొట్టినగాని ఆయనకు మనకునుగూడ చుఱుకురాదు. అంత వఱకింతే. కల్పలతా! నాకీసూర్యుని శీఘ్రగమనంబు గనిన

"పొడుపుఁగొండమీదఁ బొడుచుట మొదలుగా
బరువువెట్టి యినుడు పశ్చిమాద్రి
మఱుఁగుఁజొచ్చెఁగాక మసలినఁ జలిచేతఁ
జిక్కెఁ జిక్కెననఁగఁ జిక్కకున్నె?"

అని సూర్యుడు తానుగూడ చలివాతబడుదునని పరువులెత్తుచున్నాడను శ్రీమద్భాగవతములోని పద్యము జ్ఞాపకము వచ్చి నవ్వుకొనుచుందును. శుభప్రదమైన ఉత్తరాయణ పుణ్యకాలమువచ్చినగాని మన కీపనులవడిదుడుకు లడగవు.

సంక్రాంతియనునది మనకొక సామాన్యమగు పండుగయేగాక గొప్ప ఆరోగ్యోత్సవమనికూడ చెప్పవచ్చును.

కల్పలతా! బుద్ధిశాలురగు మనపెద్దల భావనాశక్తి యద్భుతము. కావుననే మతవిధులను నారోగ్యవిధులను మేళవించి యనుల్లంఘనీయములుగా జేసియున్నారు. ఏలననగా మనవారికి ఆరోగ్యవిధులయందుకంటె మతవిధులయందు భక్తి యెక్కువ. కావున నీధనుర్మాసములో జరిపెడు శౌచవిధులెల్ల మనకు దేవపితృపూజలతో మిళితమై మనలను తప్పక నిర్వర్తించునట్లు నిబద్ధించుచున్నవి. కాని నిజమున కివియన్నియు మన ఆరోగ్యమునకే. చూడుము. ఈశీతకట్టు దినములు మనకు మిక్కిలి జబ్బుదినములు. దాదాపు కార్తీకమాసమువఱకు వానలుకురిసి నేలయంతయు తడిగానుండును. సూర్యకిరణ ప్రసార మల్పముగానుండుటచే నీకాలములో వాతావరణముగూడ అర్ద్రతగానుండును. నేలతడిగానుండుట, వాయువులు శీతలములై యుండుట, ఎండలు తీక్ష్ణముగా లేకుండుట మున్నగుకారణములచే పుడమిపైనుండెడి పెక్కు కశ్మలపదార్థములు తడిసి క్రుళ్లి సాంక్రామికవ్యాధుల కుత్పత్తిహేతువులగు సూక్ష్మజీవులు పెక్కు లుద్భవిల్లి ప్రజలను వ్యాధిపీడితులను గావించుచుండును. కావుననే యీదినములలో స్వర్గద్వారములు తెఱచి యుండునని మనవారనుచుందురు. ఎప్పుడు దేశమున వ్యాధులు చెలరేగియుండునో అప్పుడు స్వర్గద్వారము తెఱచియున్నట్లే గదా! కావున బద్ధకములేక ఒడలువంచి పనిచేయుటయు, మనగృహములును గృహావరణములును పరిశుభ్రపఱచుకొనుటయు, రోగకారణములగు సూక్ష్మజీవులు నశించునట్లు ఆవుపేడతో కలయంపిజల్లి ఘాటైనసున్నముతో రంగవల్లు లిడు

కొనుటయు మనకు విధిగానేర్పడినది. అప్పుడువేసిన ఆవుపేడ కస్తూరికి తుల్యమని ఆయుర్వేదజ్ఞులమతము. కాన గోమయము తోడిపని మనకీదినముల నధికముగా కల్పించియున్నారు. ఈవిధముగా నీధనుర్మాసము మన ఆరోగ్యముకొఱకే పిన్న పెద్దలనెల్లర నిటు కార్యపరతంత్రులనుగా జేయుచున్నది.

అయినను ఈపనుల బాధ ఇకనెన్నిదినములో లేదు లెమ్ము. పండుగ పదిదినములలోనికి వచ్చినది. ఈనెల పదునాల్గవతేదీ యందు సూర్యుడు మకరరాశియందు ప్రవేశించును. అదియే ఉత్తరాయణారంభము. అదియే పుణ్యకాలము. ఎప్పుడు సూర్యు డుత్తరాయణగతుడగునో అప్పుడే ఆమార్తాండుని కిరణజాలంబులు తీక్ష్ణతగాంచును. ఆలోకబాంధవుని తేజఃకిరణ ప్రసరణచే చరాచరాత్మకంబగు విశాలవిశ్వంబెల్ల నవశక్తిని బడసి తేజోవంతమై విరాజిల్లును. మిత్రమా! ఈపుణ్యకాలము నందు మనమేగాక అన్నిమతములవారును, అన్నితెగలవారును, అన్నిదేశములవారును నీపండుగలజేసికొనుట గమనింపదగిన విషయము. క్రైస్తవుల కీదినములలో సంవత్సరాది. బ్రాహ్మల కీదినముల బ్రహ్మోత్సవము. మహమ్మదీయులకు గూడ నివి పండుగదినములే.

ఇక మన హిందువులపండుగవిశేషములు చెప్పనక్కఱయేలేదు. పసిబిడ్డలకు భోగిపండ్లు. ఆపైవారికి బొమ్మలు పెట్టుకొనుట. వారికంటె వయస్సున పెద్దయగు యువతులకు సావిత్రీగౌరీవ్రతము. నైష్ఠికులగువారికి స్నానదానతర్పణా

దులు. గృహస్థులు క్రొత్తకోడండ్రను, కూతుండ్రను తెచ్చుకొనుట. కాపులకు కోడిపందెములు. వైష్ణవాలయములలో ఉదయపూజలు. వేయేల, ఐహికాముష్మిక లాభంబులను శారీరమానసికాత్మీయసౌఖ్యంబులను నుత్తరాయణపుణ్యకాలమొనగూర్చుచున్నది. ఈశ్వరానుగ్రహంబున ప్రజలు శీతవాతాది క్లేశంబులనుండి విముక్తులైనారు. ధనధాన్యంబులింటికిఁ జేరినవి. చూడిపశువులెల్ల పాడిపశువులై పాలుపెరుగులు కొల్లలుగావించినవి. ఇల్లువాకిండ్లు చక్కగానలంకరించుకొనినారు. నిన్నమొన్నటివఱకు కోతవేతలకుఁబోయి కూలిగింజలు పుష్కలముగా సేకరించుకొనియుండుటచే కూలినాలిజనములకుగూడ నీపండుగ కడుపునిండినపండుగ. కాన ఈపండుగదినములలో మృష్టాన్న మారగించనివారే యుండరు.

నెచ్చెలీ! నీవును పతిసంతానయుతవై రమణీయమును మహోత్సాహదాయకమును నగు నీజాతీయారోగ్యోత్సవానందమును పరిపూర్ణముగా ననుభవించెదవు గాకయని మనఃపూర్వకముగ వాంఛించుచున్నాను.

భావపురి
1-1-31

ఇట్లు
శారద.

శారద లేఖల మొదటి సంపుట మిది, సంపూర్ణము.

Printed At the Lodhra Press, Egmore, Madras.

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 7 | 8 | శ్రి | శ్రీ |
| 20 | 18 | అమె | ఆమె |
| 21 | 20 | బంధకముగా | బంధకములుగా |
| 32 | 8 | మా చెల్లియు | ......... |
| ,, | 9 | బానిసీలమై | బానిసినై |
| ,, | 10 | పడితిమి | పడితిని |
| 33 | 23 | ఇల్లె | ఇల్లే |
| 34 | 13 | చెల్లెలున్నది | అక్కయున్నది |
| 35 | 9 | దెవియని | దెలియని |
| ,, | 23 | తలిదంద్రులు | తలిదండ్రులు |
| 41 | 10 | అగ | సగ |
| 55 | 7 | కన్యాకామణి | కన్యకామణి |
| 57 | 17 | విద్యాపతులు | విద్యావతులు |
| 64 | 10 | నెఱుకపఱచు | నెఱుకపఱచుచు |
| ,, | 23 | పుణ్యాస్థలమున | పణ్యాస్థలమున |
| 66 | 16 | వృంతాంతము | వృత్తాంతము |
| 69 | 15 | వచ్చుసట | వచ్చునట |
| 70 | 9 | వదేస్థానము | దేవస్థానము |
| ,, | 18 | దేవాయము | దేవాలయము |
| 80 | 13 | నప్పుడు | నప్పుడా |
| ,, | 14 | నప్పుడు | నప్పుడా |
| 95 | 5 | రక | కర |
| 103 | 13 | సామన్యము | సామాన్యము |
| 122 | 24 | నేవాపరాయణలు | సేవాపరాయణలు |
| 123 | 11 | నభ | సభ |
| 148 | 10 | బహు | బహుశా |
| 154 | 7 | ఆడజాతికి | ఆడటానికి |
| 155 | 9 | తాళములతో | మేళతాళములతో |
| 156 | 19 | నప్పటికి | నప్పటి |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| ,, | 22 | రౌద్రమైద | రౌద్రమైన |
| 158 | 20 | వివాహ | వివాహములు |
| 159 | 11 | పుర్ధశకాబ్దము | మర్ధశతాబ్దము |
| 161 | 10 | త్రీ | స్త్రీ |
| ,, | 20 | భావనమే | భావనయే |
| 164 | 3 | ఒప్పుడు | కప్పుడు |
| 165 | 4 | నిరాక్షిణ్యము | నిర్దాక్షిణ్యము |
| 168 | 12 | నృజామ్యహ్యం | సృజామ్యహమ్ |
| 169 | 11 | దార్మికసమరము | ధార్మికసమరము |
| ,, | 24 | బాబుజీ | బాపూజీ |
| 171 | 3 | కంఠస్వఠము | కంఠస్వరము [నందు |
| 172 | 16 | హృదయాకాశము | హృదయాకాశము |
| 175 | 19 | యాత్రలుగూడ | గూడయాత్రలు |
| 176 | 2 | చెఱసాలలే స్వీయ గృహంబులై | స్వీయగృహంబులే చెఱసాలలై |
| 178 | 8 | నాదుస్థితి | యాదుస్థితి |
| 180 | 16 | బెంగళూరు | బెంగుళూరు |
| 182 | 7 | వాళ్ల | వారి |
| 184 | 6 | అందిటున్నది | అందిట్లున్నది |
| 186 | 15 | కొననిరి | కొనిరి |
| 187 | 4 | ప్రజాపతినిధులు | ప్రజాప్రతినిధులు |
| ,, | 5 | మిల్కిలి | మిక్కిలి |
| 194 | 9 | ఆపుపేద | ఆవుపేడ |
| ,, | 20 | ఆవును | అవును |
| 200 | 9 | ఇళ్లువాకిండ్లు | ఇండ్లువాకిండ్లు |

64-వ పుట 22-వ పంక్తిలో (మీనాక్షి సుందరేశ్వరుని భార్య యనరు) అనుచోట (మీనాక్షి పెనిమిటి సుందరేశ్వరుడందురు గాని సుందరేశ్వరుని భార్య మీనాక్షి యనరు). అని యుండవలయును.